

ఆధునిక యుగంలో

కులవృత్తులు

G-117

.05.5
ఇసివి-ఆఫు
74730

సి.పి.

ک

ఆధునిక యుగంలో కులవ్యవస్థ


సి. వి.

ప్రగతి సాహితి
విజయవాడ

ప్రథమ ముద్రణ :
1982 జూన్

Acc. No. 22058
2
30

వెల : 8.00



బైండింగ్ :
శ్రీ దీనదయాళు బైండింగ్ వర్క్స్
విజయవాడ-2

ముద్రణ :
సప్తగిరి ప్రింటర్స్
విజయవాడ-2

విషయసూచిక

	తొలి పలుకు	5
1.	గాంధి - అంబేడ్కర్	57
2.	వివిధ మతాల్లో కులవ్యవస్థ	67
3.	అస్పృశ్యత	78
4.	దక్షిణ భారతంలో కులవ్యవస్థ	87
5.	ఉత్తర భారతంలో కులవ్యవస్థ	95
6.	రిజర్వేషన్లు	127
7.	మతం మార్పిడి	160
8.	కుల నిర్మూలన	176

తొలిపలుకు

"మనం సృష్టించుకొన్న గూటిలో చాలాకాలం పాటు మనం జీవించాం. ఇందుకు అనేక అంశాలు దోహదం జేశాయి. ఉదాహరణకి- కులవ్యవస్థ పుట్టుకా, దాని తీవ్రతా, పునాలిట వినాశకారిగా తయారైంది. ఈ కులవ్యవస్థ అవతరించిననాడు, అది ఏ రూపంలో వుండేదో నాకు తెలియదు. కాని అన్ని కులాలూ చిన్నచిన్న గూళ్ళను సృష్టించాయి. వాటిలో ఇండియా వొక బ్రహ్మాండమైన గూడు," అని పండిట్ నెహ్రూ అన్నాడు.

"We have lived for long in a shell of our own. Many things helped to bring this about. The growth and intensification of the caste system, for instance, has been a total abomination. I do not know what it was like when it originated, but all the castes created smaller shells and the larger shell was India itself." (Nehru)

ప్రాచీన భారతంలో ప్రతి వర్ణమూ వొక వృత్తికి కట్టుబడి వుండడమే వర్ణవ్యవస్థలోని మూలతత్వం. వర్ణమనేది - ప్రధానంగా ప్రాచీన సంఘంలోని శ్రమవిభజనను సూచిస్తుంది. ఈ విధమైన సాంఘిక శ్రమ

విభజన, ఆసియాలోనూ ఈజిప్ట్ - చైనా - మధ్యాసియా ప్రాంతాలకి చెందిన ప్రాచీన సమాజాల్లోనూ వుండేదని మార్క్స్ చెప్పాడు. అయితే, ఈ పద్ధతిలో భారతదేశం మరింత ముందుకుపోయి, ఏ దేశానికీ లేని కుల వ్యవస్థని సృష్టించగల్గింది. ఇదే మన భారతదేశ ప్రత్యేకత! ఇదే మన ఇండియా విశిష్టత!

I

వాస్తవానికి కులవ్యవస్థ మనదేశంలోని అన్ని రాష్ట్రాల్లో వొకే విధంగా లేదు. ఉదాహరణకి - కేరళలో అమల్లోవున్న కులవ్యవస్థలో వైరుధ్యాలు లేవు. "ఇండియాలోని కులవ్యవస్థ, సమాజంలోని వర్గవిభజనను మరుగుపరుస్తుంది. ఈ విధంగా మరుగుపరచబడినందువల్ల, ఎన్నో చిక్కులు సృష్టించబడుతోన్నాయి. దానిని సమాజ వొకానొక లక్షణమైన వర్గపీడన, వర్ణ అసమానత్వంలో గర్భీకరించి పుంచి. వేదాలూ, వాటి తర్వాత రచింపబడిన ధర్మశాస్త్ర గ్రంథాలూ, ఈ వర్గ పీడనను సమర్థించాయి" అని ఇ.యం.యస్. నంబూద్రిపాద్ అన్నాడు.

"The Institution of Caste in India conceals the essence of class division in society. This concealment does create complications. The essence of class oppression characteristic of slave society was hidden behind caste inequality which, in its turn, was sanctified by the authority of the vedic and post - vidic scriptures." (E.M.S. Namboodiripad - Castes classes and parties in Modern Political Development - Social Scientist - 1977 November)

మూడు స్తంభాల భవనం

తరతరాలుగా వొకకులం వొకేవృత్తిని పట్టుకవేలాడ్డమే, కుల వ్యవస్థలోని సారాంశం. ఈ వ్యవస్థ నియమాల ప్రకారం, ఒక కులానికి

చెందిన రాతముత్తాతలు ఏ పులవృత్తిని చేశారో, తాను గూడా అదేవృత్తిని చేసి తీరాలి. అంచేత, టెక్నలాజికల్ ప్రగతికి అత్యవసరమైన మార్పు, ఈ పులవృత్తిలో చాలాపు శూన్యం. పులం మారదు గాబట్టి, పులవృత్తి నైతం మారదు; మార్పుచెందానికి వీల్లేదు. అది ధర్మవిరుద్ధం, దైవద్రోహం. పాపకార్యం! సరాసరి నరకానికి దోవతీసే మార్గం. అంచేత, ఇండియాలోని సంఘనిర్మాణమూ, ఈ నిర్మాణానికి చెందిన కులమూ, మౌలికంగా పుతమూ - దేవుడూ - పరలోకమూ- పాపపుణ్యాలపై ప్రధానంగా ఆధార పడినవే.

ప్రాచీన భారత సమాజంలో, కులంతోపాటు గ్రామీణవ్యవస్థ - ఉమ్మడి కుటుంబమూ- అనే మరో రెండు గూడా వున్నాయి. ముచ్చటైన ఈ మూడు స్తంభాలపై పున సంఘ నిర్మాణ భవనం నిల్చి వుంది. ఈ భవనంపై నిల్చిన ఈ సాంఘిక వ్యవస్థను సర్వనాశనం జేసినప్పుడే భారతీయ సమాజం విప్లవాత్మకంగా పరిణామం చెందడానికి అవకాశ ముంచని నంబూద్రిపాద్ స్పష్టంగా చెప్పాడు :

"The series of revolutions through which mediaeval Europe transformed tiself in to modern Europe could not take place in India because of the rigidities which were the joint product of the three institutions of caste, Village community and the joint family. A complete destruction of this centuries - old pattern of social organisation, was the essential prerequisite for the revolutionary transformation of Indian society. This however, was precluded because the three institutions were too deeprooted to be undermined."

(ఇ. యం. యస్. నంబూద్రిపాద్ - పై వ్యాసం)

II

రామాయణం లోని శంబుక వధ:

కులవ్యవస్థపై తిరుగుబాట్లు

వర్ణవ్యవస్థపై, ప్రాచీన కాలంలో తిరుగుబాట్లు జరిగాయి. వీటిలో కొన్ని చరిత్రకు అందలేదు. మరికొన్ని రామాయణ - భారతాల్లాంటి ఇతిహాసాల్లో జాగ్రత్తగా భద్రపరచ బడ్డాయి. రామాయణం లోని "శంబుక వధ", ప్రధానంగా వర్ణ వ్యవస్థపై జరిపిన తిరుగుబాటు తప్ప మరొకటి కాదు. రాముడు శూద్రశంబుకుని శిరాన్ని దయా దాక్షిణ్యాలేకంటా అమాంతం నరికివేశాడు. ఈ కుట్రకి ప్రధానంగా నాయకత్వం వహించింది-అయోధ్యలోని బ్రాహ్మణ పురోహితులేననేది రామాయణం ద్వారానే స్పష్టమవుతోంది. నరికింది రాముడే అయినా, నరికించింది మాత్రం బ్రాహ్మలే.

ఈ విధంగా వర్ణవ్యవస్థపై జరిగిన తిరుగుబాట్లను, నాటి పాలక వర్గాలు అత్యంత అమానుషంగా, మరణ దండనల్తో, శిరచ్ఛేదనల్తో కిరాతకంగా అణిచివేశారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం రామాయణమే! మను-పరాశర-నారద- బోధాయన- ఆపస్తంబుడు లాంటి స్మృతి కర్తలు, తమ తమ స్మృతుల్లో శూద్ర బానిసల తిరుగుబాటులోని ప్రళయాన్ని గూర్చి అదే పనిగా హెచ్చరించారు. వర్ణధర్మం ఉల్లంఘించబడి వర్ణ సంకరం జరిగినప్పుడు, అత్యంత క్రూరంగా చట్టాన్ని అమలు చేయాలని వారు తమ ధర్మశాస్త్రాల్లో పదేపదే హెచ్చరించారు! వేలాది సంవత్సరాల పర్యంతం చేసిన ఈ హెచ్చరికలతో, ధర్మశాస్త్ర గ్రంధాల్లో రాసిన అత్యంత నీచమైన రాతలతో, మానవత్వాన్ని నిస్సిగ్గుగా మంట గలిపే నియమ నిబంధనల్తో, మరణ దండనల భయోత్పా

తంతో, అగ్రవర్ణాలకి సంక్రమించిన అమేయమైన ఆర్థిక వనరుల్తో, ఈ పవిత్ర భారతదేశం ఏ దశకు చేరుకున్నదంటే, నేటికీ హరిజనుడు తనకన్న అగ్రవర్ణాలకి చెందిన వాని వొట్ట పుంచి బట్టలు వేసుకోకూడదనే మహోన్నత దశకి చేరుకుంది! ఈదశ - పరమ పవిత్ర భారతావని యొక్క మహోజ్వల ఆధ్యాత్మిక పొన్నత్యానికి ఎదురులేని నిదర్శనంగాదా?! అంతదాకా యెందుకు? ఉత్తర భారతంలో- ప్రత్యేకంగా ఉత్తరప్రదేశ్‌కి చెందిన గ్రామంలో వొక హరిజన కుటుంబం నేతిలో పూరీయి వేయించుకొంటే, అగ్రవర్ణాలకి జెందిన తాహార్లు- తుపాకులూ లాఠీల్తో నేటికీ ఆ కుటుంబంపై దాడి జేస్తారు!

III

మధ్యయుగాల్లో కులవ్యవస్థపై పోరాటం

12 వ శతాబ్దం నాటి దక్షిణ భారతంలో, పోటెత్తిన సంక్రాల్లా శైవ-వైష్ణవాల పేరిట రెండు మహోద్యమాలు ప్రారంభమయ్యాయి. దేశాన్ని ఉప్పెనలా ఊపివేసిన ఈ ఉద్యమాలు, అపారమైన జనక్షయానికీ భయంకరమైన మతకలహాలకీ దారి తీశాయి.

దక్షిణ భారతంలో వ్యాప్తిలో కొచ్చిన వైష్ణవమతం, కులభేదాన్ని నిరసించినట్లు కన్పిస్తోంది. క్రీ.శ. 500 నుంచి 900 సంవత్సరాల వరకూ ఆళ్వారులనే పేరిట ప్రచారమైన పన్నెండుగురు వైష్ణవభక్తులు (పన్నిద్ద రాళ్వారులు) విష్ణుభక్తిని ప్రచారంజేసి, అనేక ప్రబంధాలు రచించారు. ఈ ఆళ్వారులు కులభేదాల్ని నైతం తీవ్రంగా నిరసించారు.

క్రీ.శ. 1017 లో జన్మించిన రామానుజాచార్యులు వైష్ణవమతాన్ని ప్రచారం చేశాడు. ఈతడు కుళోత్తుంగచోళుని కాలంలో నివసించాడు. కుల నిర్మూలనకు పాటుపడకపోయినా ఈతడు కులభేదాల్ని మాత్రం బాహాటంగా ఖండించాడు. పరమ రహస్యంగా వుంచవలసిన "తిరుమంత్ర"న్ని, శ్రీరంగ దేవాలయ గోపురం పైకెక్కి "అష్టాది" వర్ణాలవారికీ వినిపించేట్లు బిగ్గరగా బయటికి చదివాడు. తద్వారా ఈ మంత్రాన్ని ఉపదేశించిన గురువు- తిరుకుట్టినంబి యొక్క ఆగ్రహానికీ- గురుభిక్షాకర నేరానికీ రామానుజుడు పాల్పడ్డాడు. గురు భిక్షాకరం- పాపకారణమైనా, మంత్రాన్ని తెలుసుకొన్నవారు దాని వల్ల మోక్షం పొందుతారని యీతడు చెప్పాడు.

వైష్ణవమతాన్ని అన్ని కులాలవారూ స్వీకరించ దొచ్చునని రామానుజుడు బోధించాడు. కర్నాటకలోని మేల్కోటేలో వాక వైష్ణవ దేవాలయాన్ని స్థాపించి, ఏడాది కొకసారి హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించాడు. 120 సంవత్సరాలు జీవించిన యీతడు క్రీ.శ. 1137 లో మరణించాడు.

రామానుజుడు మరణించిన అనంతరం, 13 వ శతాబ్దానికి చెందిన వైష్ణవుల్లో వడగలై (ఉత్తరాది) తెంగలై (దక్షిణాది) అనే శాఖలు ఏర్పడ్డాయి. వడగలై శాఖవారు సంస్కృతభాషకి ప్రాధాన్యమిచ్చి, కుల భేదాల్ని సమర్థించారు. ఈ శాఖకి చెందిన ముఖ్యుడు- వేదాంతదేశికుడు. తెంగలై శాఖకి చెందినవారు, దేవాలయంలోని పూజలన్నీ తమిళభాషలోనే చేస్తారు. వీరు మాత్రం కులభేదాల్ని ఖండించారు. ఈ శాఖ ప్రారంభకుడు పిళ్ళై లోకాచార్యులు. యీ తెంగలై శాఖవారినే వీరవైష్ణవులని కూడా పిలుస్తారు.

మాల కన్నమదాసు మనవైన సుతుడుగా వీరవైష్ణవ మొచ్చెరా

క్రీ.శ. 1176 ప్రాంతంలో పల్నాటి యుద్ధం జరిగింది. పల్నాటి యుద్ధం నాటికే, తెలుగుదేశంలో వీరవైష్ణవం బాగా పాతుకపోయింది. నాటి సమాజంలో వేళ్ళూనిన ఈ వీరవైష్ణవం, బ్రహ్మనాయుడులాంటి సంఘసంస్కర్తల్ని సృష్టించింది. పల్నాటి రాజ్యం యొక్క మహా మంత్రియైన బ్రహ్మనాయుడు కులభేదాల్ని పరిమార్చడానికి "చాపకూటి"ని (సహపంక్తి భోజనాల్ని) ఆనాడే ప్రవేశపెట్టాడు. అష్టాది వర్ణాలవాళ్ళూ వాళ్ళే చాపపై కూర్చుని భోంచేయడాన్ని చాపకూడు అని పిలుస్తారు. మాల కన్నమదాసు పంటి పంచముని తన సొంత కొడుకుగా భావించి పెంచి పెద్దజేసిన బ్రహ్మనాయుడు, యీతనిని పల్నాటి రాజ్య ప్రధాన సేనానిగా నియమించాడు. పల్నాటి వీరులు కులభేదాల్ని ఏ మాత్రం పాటించకుండా అంతా కలిసి భోజనం చేశారని, శ్రీనాథ మహాకవి రచించిన "పల్నాటి వీర చరిత్ర"లో స్పష్టంగా రాయబడింది. చాపకూటి పేరిట ప్రవేశపెట్టిన ఈ సంఘ సంస్కరణల వల్ల, బ్రహ్మనాయుడు పల్నాడులో ప్రజారంజకుడయ్యాడు. అందుచేతనే, నేటికీ యీయన్ని "పల్నాటి విష్ణువు"గా అక్కడి ప్రజలు కొలుస్తుంటారు. బ్రాహ్మలు మొదలుకొని మాలలవరకూ వున్న అన్నికులాల స్త్రీలనీ బ్రహ్మనాయుడు వివాహమాడినట్లూ, వెలమ-కమ్మరి - కుమ్మరి - వడ్ల- మాలమాదిగలు యిత్యాది కులాలవారంతా పల్నాటి యుద్ధరంగంలో. వీరవైష్ణవ సాంప్రదాయం ప్రకారం బాగా పంక్తిలో "చాపకూడు" తిన్నట్లూ, మనకు పల్నాటి వీరచరిత్ర ద్వారా తెలుస్తోంది. బ్రహ్మనాయుడి ప్రత్యర్థియైన నాయకీ నాగమ్మ శైవమతాభిమాని. ఈమె కులభేదాల్ని బాహాటంగా సమర్థించింది. విచిత్రమైన విషయ

మేపుంచే - తెలుగుదేశంలోని శైవులు కులభేదాల్ని సమర్థించగా, కన్నడ దేశంలోని బసవయ్య శిష్యులైన- వీరశైవులు కులభేదాల్ని నిరసించారు! ప్రాచీన భారతంలోని బౌద్ధ - జైన మతోద్యమాలవలె, మధ్యయుగాల్లోని వీరశైవ - వీరవైష్ణవ - మతోద్యమాలు సైతం, తిరుగుబాటుదార్లనీ అణగారిన కులాలవారినీ అధిక సంఖ్యలో ఆకర్షించాయి.

రామానందుడు

రామానుజుడు ప్రచారం జేసిన వైష్ణవమతం, ఆయన అనంతరం నింబార్క (11 వ శతాబ్దం), వల్లభాచార్యుల (15 వ శతాబ్దం) చేతుల్లో రాధాకృష్ణ పూజపేరిట అత్యంత వికృతమైన రూపంచ్చి, తాగుడూ ముండల ముతాకోరు తనానికి దోవ తీసింది. అయితే వైష్ణవ మతంలో యీ శిథిల ధోరణులతోపాటు, కొన్ని సంస్కరణ ధోరణులు సైతం తలెత్తాయి. ఈ రకమైన ధోరణులకి మూలపురుషుడు- క్రీ.శ. 1300 ప్రాంతంలో కన్యాకుబ్జంలో (కనూజ్‌లో) జీవించిన రామానందుడనే బ్రాహ్మణుడు. దక్షిణ భారతంలో వైష్ణవ ఆళ్వారులు ప్రభోధించిన భావాల్ని రామానందుడు స్వీకరించి, తక్కువ కులాలవారి పట్ల సానుభూతి చూపి, కులభేదాల్ని అత్యంత తీవ్రంగా ఖండించాడు. కుల- మతాలకి అతీతమైన మానవ సమానత్వ ధోరణిని ప్రచారం జేసిన యీతడు, అంతర్వర్ణ భోజనాల్ని ప్రోత్సహించి, అన్ని కులాలవారి నుండి - ఆఖరికి ముస్లిముల నుండి సైతం శిష్యుల్ని స్వీకరించాడు. క్షత్రియుడైన పీపా, మహమ్మదీయుడైన కబీరు, మంగలియైన సేన, పాలకాపు అయిన ధన్నా, పంచముడైన రామ్‌దాస్, పద్మావతి, యిత్యాదులు రామానందుని శిష్యులు. ఉత్తర భారతమంతా రామభక్తినీ,- మతసామరస్యాన్నీ- ప్రచారం జేసిన వీరు, కులభేదాల్ని అత్యంత తీవ్రంగా ఖండించారు. 111 సంవత్సరాయి జీవించిన రామానందుడు క్రీ.శ. 1411 లో మరణించాడు.

కబీరు

రామానందుని శిష్యుల్లో కబీరు అగ్రగణ్యుడు. యీతడు క్రీ.శ. 1398 నుండి 1500 వరకూ జీవించాడు. కాశీలో నేతపనివాడైన యీతడు మహామనీయుడు. హిందూ-ముస్లిం మత సామరస్యాన్ని, రామ-రహీంల ఏకత్వాన్ని యీతడు ప్రచారం చేశాడు. నాటి ఢిల్లీ నవాబైన సికందర్ లోడి, హింసువుగా మారిన యితణ్ణి అష్టకష్టాలు పెట్టినట్లు చరిత్ర తెలియ జేస్తోంది. ఈతని పరమానంతరం, ఈయన మొక్కై హిందూ-ముస్లిం శిష్యులు "కబీర్ మాపాడంటే-మాపాడు" అని గుద్దులాడు కొన్నారు. దగలేసిన తర్వాత యీయన బూడిదని తెంపుగా విభజించి, హిందూ శిష్యులు తమ వాటాను గంగలో కలపగా, ముస్లిం శిష్యులు తమ వాటా కొచ్చిన బూడిదపై వొక గోరీని నిర్మించారు!

కబీరు కులభేదాల్ని మూఢమతాచారాల్ని అత్యంత తీవ్రంగా ఖండిస్తూ, ఎన్నో గీతాలు రాశాడు:

"మనిషి తాకితేనే మైలపడ్డానని
నువ్వు స్నానం జేస్తోన్నావు
తాకితేనే మైలపడే నువ్వు
తాకినవాని కన్న తక్కువ స్థాయికి చెందుతావా?"

అని కబీరు సూటిగా ప్రశ్నించాడు. కబీరు పలికే, హరిజనుడైన రామదాస్ సైతం "సోహందాస్" అనే పేరుతో కులభేదాల్ని అత్యంత నిశితంగా విమర్శిస్తూ మహారాష్ట్రలో ప్రచారం జేశాడు. మహారాష్ట్ర బ్రాహ్మణేతర ప్రజానీకంలో, ఈ సోహందాస్ అనుచరులు నేటికీ వున్నారు. అలాగే యివే భావాల్ని ప్రచారం జేసిన మంగు-సేన గూడా మహారాష్ట్రలో కుల వ్యతిరేక ఉద్యమ చరిత్రలో చాలా ప్రసిద్ధి కెక్కాడు.

మన్‌భావ్ కాఖ :

మధ్యయుగాల నాటి మహారాష్ట్రలో, యీ కాఖకి చెందినవారు వుండేవారు. నల్లని దుస్తులు ధరించి, బైరాగి మతాలుగా - భజన సమాజాలుగా- సంఘటితమైన వీరు, భిక్షాటన ద్వారా లభించిన దాన్ని సమానంగా పంచుకొనేవారు. కులవ్యవస్థను సంపూర్ణంగా నిరాకరించిన వీరు, ప్రాచీన కాలంనాటి సామూహిక జీవిత విధానాన్ని గూర్చి ప్రజల్లో ప్రచారం జేశారు. (Myth and Reality - D. D. Kosambi)

జ్ఞానేశ్వర్ :

సాంప్రదాయ సిద్ధమైన కుల - మత - విశ్వాసాలకి వ్యతిరేకంగా యీరడు బోధించినందువల్ల, నాటి బ్రాహ్మణ పురోహితులు యితన్ని మహారాష్ట్ర నించి నిర్దాక్షిణ్యంగా తరిమివేశారు. అంచేత, క్రీ.శ. 1210 ప్రాంతంలో యాదవరాజైన రామచంద్ర దేవుడు తన రాజ్యంలో యితనికి రక్షణ యిచ్చాడు. ఆహార పానీయాలు లేకండా, అత్యంత ఘోరంగా జ్ఞానేశ్వర్ తన దేహాన్ని కృశింప జేసుకొన్నాడు. సంస్కృతంలో గాక జ్ఞానేశ్వరూ ఆతని తర్వాత వచ్చిన మహారాష్ట్ర సన్యాసులూ, మహారాష్ట్ర భాషలోనే చాల గ్రంథాలు రచించారు. సమాజంలోని సమస్త కులాల నుండి వచ్చిన ఈ సన్యాసులు, సామాన్య ప్రజలు పడే కష్టాలన్నిటినీ స్వయంగా అనుభవించారు.

నామదేవ్ :

మహారాష్ట్రలో శూద్రుడుగా జన్మించిన నామదేవ్, క్రీ.శ. 1370 - 1400 మధ్య కాలంలో జీవించి పుంఖాడని చరిత్రకారులు భావిస్తోన్నారు. దర్జీ వృత్తి ద్వారా పొట్టపోసుకొన్న యీరడు, "భక్తి" ఉద్యమాన్ని ఉత్తరభారతం వరకూ వ్యాపింప జేయగల్గాడు. యీయన

బోధల్లో కొన్ని సిక్కుల పవిత్ర పుస్తగ్రంధమైన "గ్రంథ సాహెబ్"లో పైతం చోటు జేసుకొన్నాయని పండితులు తలుస్తున్నారు.

గోర కుంభార్ :

కుమ్మరి కులంలో జన్మించిన గోర కుంభార్, అదే వృత్తిని స్వీకరించి "భక్తుడు"గా సామాన్య ప్రజల్లో విశేషఖ్యాతి నార్జించాడు.

చోఖమేళా :

చోఖమేళా అనే మహర్ "భక్తుడు" పంచపుడు. పుండగళదేవి నగర ప్రాకారానికి వెట్టిచాకిరీ జేస్తోండగా, అది-కూలి యాతడు మృత్యువణం పాలయ్యాడు.

ఏక్‌నాథ్ :

మహారాష్ట్ర బ్రాహ్మడైన ఏక్‌నాథ్ మరో భక్తుడు. మహారాష్ట్ర భాషలో ఎన్నో భక్తి గీతాలు రచించిన యాతడు, అస్పృశ్యతకు చెందిన పైశాచిక నియమ నిబంధనల్ని బాహాటంగా ఉల్లంఘించ యత్నించాడు.

తుకారాం :

మహారాష్ట్ర భక్తులందరిలో అగ్రగణ్యుడైన తుకారాం, అతి సామాన్యమైన వైశ్యకుటుంబంలో క్రీ. శ. 1607 లో జన్మించాడు. ఈతడు శివాజీకి సమకాలికుడు. సామాన్య ధాన్యవర్తకుడుగా జీవించిన యాతడు, భయంకరమైన కరువుకాటకాలకి గురియై, నాటి మహారాష్ట్ర బ్రాహ్మల అసూయాద్వేషాలకి చెరయై, జీవిత చరమదశలో నదిలోదూకి ఆత్మహత్య జేసుకొన్నాడు! (Kosambi - Myth and Reality.)

("భక్త తుకారాం" అనే పేరిట, తెలుగులో తీయబడిన సినిమా, పచ్చి అబద్ధాల్తో- లడ్డయిన అసూత కల్పనల్తో, పాశ్చాత్య నిండా పచ్చనోట్లు ధట్టించుకోవడానికి నిర్మించిన కట్టుకథ సినిమా మాత్రమే.)

మహారాష్ట్రకు చెందిన యీ వైష్ణవభక్తుల్లో, ఎక్కువమంది బ్రాహ్మణేతరులు గావడం ప్రత్యేకంగా గమనార్హం. మహారాష్ట్ర భక్తి ఉద్యమానికి చెందిన ఈ వ్యక్తులంతా, నాటి సామాన్య ప్రజల బాధల గాధల్ని తమ గీతాల్లో ప్రతిబింబించ గలిగారు. ఆకలీ ఆవేదనల్తో జీవితాలు గడిపిన వీరు, సహజంగానే నాటి పాలకవర్గాలకి వ్యతిరేకంగా ప్రచారం జేశారు. అధికార పదాంధుల్ని అనంచపర్చటానికి వీరెన్నడూ యత్నించ లేదు. అయితే వీరు మరణించిన తర్వాత, వీరి పేరు చెప్పుకొని, వీరిని "పరమ భక్తులు" గా కీర్తించి, వీరంతా బొంబితోనే వైకుంఠానికి పెళ్ళారని అడ్డమైన అబద్ధాలూ రాసి, వైదిక పురోహితవరం మాత్రం రెండు చేతుల్తో సొమ్ము జేసుకొంది! సిగ్గూ లజ్జా విడిచి, నేటికీ సొమ్ము జేసుకొంటూనే వుంది!

శంకర- రామానుజ - మధ్వాచార్యుల్లా మహోన్నతులుగాని వీరు, హిందూ సాంఘిక వ్యవస్థకి చెందిన పీడిత వర్గాల్లోంచి వొచ్చిన వీరు, భయంకరమైన కరువు కాటకాలకీ, పరాభవ పరాజయాలకీ అడుగడుగునా గురిజేయబడిన వీరు, నాటి కుల-మత భేదాలకి వ్యతిరేకంగా ప్రచారం జేసి, ఉత్తర భారతంలో-ప్రత్యేకంగా మహారాష్ట్రలో-సంఘ సంస్కరణోద్యమానికి నాంది పల్కారు. అయితే వీరి కులవ్యతిరేక పోరాటం, భక్తి ఉద్యమమనే సముద్రంలో కాకితెట్టలా కొట్టుకపోయి, దాని అర్థాన్ని ప్రాధాన్యాన్ని క్రమేణా పోగొట్టుకొంది. సాంఘిక అసమానతలకి వ్యతిరేకంగా పోరాడిన వీరిని, హిందూపురోహితవర్గ పండితులు, పాండురంగని భక్తులుగా చిత్రించి, వారి సాంఘిక సంస్కరణోద్యమ ఆశయాలకి గుబ్బ పట్టించి, వారి మూఢభక్తిని మాత్రం ఆకాశానికెత్తారు! చొక్కా మాటలో చెప్పాలంటే, యీ ఉద్యమ గుజ్జు నిరాకరించబడి, దానిపైని పొట్టు మాత్రం- గుడ్డి వైదభక్తి మాత్రం- మిగల్చ బడింది!

అల్లాయుద్దీన్ ఖిల్జీ లాంటి మహమ్మదీయ సుల్తానుల నాయకత్వాన తురకలు తమ కరకు కత్తుల్తో శత్రువుల శిరాలు నరికివేస్తోంటే, గుళ్ళలోని

దేవుళ్ళ విగ్రహాల్ని గండ్ర గొడ్డళ్ళతో ముక్కలకింద విరగ్గొడుతోంటే, ధన కనక వస్తువాహనాల్ని ఒంటెలపై తరలించుక పోతోంటే, దగావ తారాలకి చెందిన ఏ దేవుణ్ణీ యీ దండయాత్రలనించి ప్రజల్ని కాపాడ లేక, నిమ్మకి నీరెత్తినట్లు దిమ్మదీది బొమ్మల్లా వుండడం కళ్ళారా చూసిన యీ భక్తులకీ - వారి శిష్యులకీ - నిరాశా నిస్పృహలు మాత్రమే మిగిలాయి ! అంచేతనే యీ "భక్తి" ఉద్యమం, అంధవిశ్వాసాల కుప్పగా మిగిలిపోయింది.

తెలుగు దేశంలో
కులవ్యతిరేక ఉద్యమం

వేమన - పోతులూరి వీరబ్రహ్మం - దూదేకుల సిద్ధయ్యలాంటి వారు, కుల-మత, భేదాల్ని, కుహనా పూజల్ని చీల్చి చెండాడారు. అంతఃపుర అవసరాల కోసం అష్టాదశ వర్ణనల్తో ప్రబంధాలు అవతరించిన రోజుల్లో, సమస్త శాస్త్రాలూ కళలూ రాణీవాసం చుట్టూ ప్రదక్షిణం జేస్తోన్న దినాల్లో సైతం, వీరు తమ బాధామయ గాథల్ని అత్యంత శక్తివంతంగా కథలూ కవితలుగా రూపొందించారు. హీనలోహాల్ని ఉచ్చలోహాలుగా మార్చవొచ్చునని రసవాదం ప్రతిపాదించగా, హీనకులజుడు ఉచ్చకులజుడుగా ఎంచేల మారగూడదని వీరు సూటిగా ప్రశ్నించారు.

పోతులూరి వీరబ్రహ్మం

కర్నూలు జిల్లా - బనగాన పల్లెలోని గుమ్మనెడ్డి వెంకటరెడ్డి యింటిలో శుభయన బాల్యం గడిచింది. యీతడు విశ్వబ్రాహ్మడు. చిన్న తనంలో గొట్లుకాసే బుడ్డాడిలా, ఈ రెడ్డి యింటిలో జీవితం గడిపాడు. యీయన సన్యాసి కాడు; సంసారి. యీతని భార్యపేరు - గోవిందమ్మ. అయిదుగురు కొడుకులూ, ఒక్క కూతురూ వున్నారు. యీయన

పదిహేడవ శతాబ్దానికి చెంది వుంటాడని, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ అన్నారు. విగ్రహారాధనా, జాతరలూ, జంతుబలులూ, కులభేదాల్ని వీరబ్రహ్మం నిశితంగా విమర్శించాడు. యీయన శిష్యుల్లో మాదేకుల సిద్దయ్య సుప్రసిద్ధుడు.

"చిల్లర రాళ్ళకు మొక్కుచునుంటే
చిత్తము చెడునుర వారే వారే"

అని ఈయన బోధించాడు. కంచిపల్లయపల్లెలో మరణించాడు. కుల భేదాల్ని బాహాటంగా ఖండించిన వీరబ్రహ్మం, మహాప్రభావయుక్తమైన మాదేకుల సిద్ధయ్యను తన శిష్యుడుగా స్వీకరించాడు. "కుల మెంచగా నేల గుణమె కారణము—" అని- కులం మనుషులు చేసే గుణమూలేని పరమ లుచ్చాల్ని - వీరబ్రహ్మమూ, సిద్ధయ్యా నిర్దాక్షిణ్యంగా ఈసడించారు.

"ఏ కులమని నన్నివర పుడిగితే
ఏమని చెప్పుదు లోకులకు - పయిగాకులకు-
దుర్మార్గులకు - ఈ దుష్టులకూ"

అని వీరు ప్రశ్నించారు.

మధ్యయుగాల నాటి యోగులు:
కులవ్యవస్థపై తిరుగుబాట్లు

కుల వ్యవస్థపై గానీ, దాని పిలకయైన అస్పృశ్యతపైగానీ, జరిగిన సిద్ధాంతపరమైన- లేదా- కేవల పుటపరమైన తిరుగుబాట్లు, ఆ వ్యవస్థను పూర్తిగా కూలదోయలేక పోయాయి. పటిష్టమైన హింసా సంఘ నిర్మాణమూ, అత్యంత అభివృద్ధి నిరోధకమైన దాని ఆలోచనా ధోరణీ

యిందుకు ప్రధాన కారణాలు. ఏ వ్యక్తియైనా కులంపై తిరగబడితే, ఆ తిరుగుబాటు దారుని ఆ కులం నుండి వెలివేసేవారు. ఆ వ్యక్తి యింకా తలయెత్తితే, వాని అనుచరులకి మరో కొత్త కులం సృష్టించి, హిందూ సంఘ భవనంలో మరో గది కల్పించేవారు. ఈ తిరుగుబాటు అశేష ప్రజల ఆదరాభిమానాలు పొందిందని పాలక కులాలు గుర్తించినప్పుడు, బ్రాహ్మలూ, వారి నమ్మిన బంట్లయిన రాజులూ, వారి జోహుకుందార్లయిన సపు స్త శూద్ర- అగ్రవర్ణాలవాళూ, అంతా కలిసి, ఈ తిరుగుబాటుదారు వొక మహాయోగియనీ, సాక్షాత్ అవతారపురుషుడనీ, మహాభక్తుడనీ, విష్ణు సంభూతుడనీ అడ్డమైన పేర్లతో కీర్తించి, పూజించి, అమాంతం అటక్కి ఆకాశాని కెత్తేసేవారు! ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ- మహాకవి వేమనయే! మధ్యయుగాల భారతంలో సాంస్కృతిక విప్లవోద్యమానికి వేగుచుక్కయై, హింసా దేవుళ్ళనీ, హిందూ మతాన్నీ, యావత్ అంధ విశ్వాసాల్నీ నడివీధిలో గేలిచేసి, కుల వ్యవస్థను వీడు నిలువుల గోతిలో పాతివేయమని భోధించిన వేమన, ఈ పురోహితవర్గ దగుల్బాజీల చేతిలో "యోగి వేమన"గా మారాడు! వొక వ్యక్తిని యోగిగా మార్చడం ద్వారా, అటక్కి అమాంతం అధఃపాతాళ లోకానికి తొక్కివేయవచ్చుననే కుటిల తంత్రం, హింసా పురోహితవర్గానికి తెలిసినంత లోతుగా, మరే దేశ పురోహితవర్గానికీ బహుశా తెలియదేమో?!

ఈ విధంగా ఈ సాంఘిక తిరుగుబాటుదార్లను, సామ-దాన-భేద-దండోపాయాల ద్వారా, అగ్రవర్ణాలకి చెందిన పాలకవర్గాలు అణిచివేశారు. ఈ విధంగా ఈ తిరుగుబాటు దార్లని "యోగులు"గా, భక్తులుగా చేయడం ద్వారా, వీరి అనుయాయులకి కొంత ఊరటకలిగేదిగాని, వర్ణవ్యవస్థ మాత్రం యథాతథంగానే వుండేది!

వెందుకయ్యా
వుంచినావూ - బ్రిందిఖానాలో

మధ్యయుగాల నాటి భారతదేశంలో, "యోగులూ" "భక్తులు" గా కీర్తించబడిన కబీర్, నానక్, ఏక్‌నాథ్, చైతన్య, తులసీదాస్, చోక్‌మేళ్, జానాబాయ్ వంటి కాయకష్టం జేసే కులాల నించి వొచ్చినవారు, హింసా సాంఘిక వ్యవస్థలో మానవత్వం కోసమూ, మానవ గౌరవం కోసమూ జరిగిన తిరుగుబాటుచార్ల జాబితాలో కలకాలం నిలిచివుంటారు. వీరు మూఢభక్తినీ చైవభీతినీ బోధించిన మాట వాస్తవమైనా, నాటి కులవ్యవస్థ కుటిల చక్రాన్ని శక్తి కొద్దీ ఢీకొనివేసిన విషయం గూడా సత్యమే.

తర తరాలుగా బ్రాహ్మణ పురోహితులు సృష్టించిన కర్మకాండను తిరస్కరించిన ఈ సాధువులూ,సన్యాసులూ, బ్రాహ్మల సాయం లేకుండానే "మోక్షప్రాప్తికి" భక్తి, దైవనామ స్మరణ, యిత్యాది సులభ పద్ధతుల్ని చెప్పారు. వైదిక కర్మకాండను పూర్తిగా నిరాకరించిన ఈ తిరుగుబాటు, పూజారి వర్గం పాలిట ప్రాణాంతకంగా పరిణమించింది. అంచేత యీ యోగులూ, వారి భక్తిమార్గమూ, అగ్రవర్ణాలచే నిర్దాక్షిణ్యంగా తరిమి కొట్ట బడ్డాయి. ఈ తిరుగుబాట్లు పాలకవర్గాలచే అణిచివేయ బడ్డాయి. అయితే ఈ యోగులకీ, వారి భక్తకోటికీ చచ్చింతర్వాత స్వర్గంలోకీ, బలికుండగా గుళ్ళోకి ప్రవేశం మాత్రం దొరికింది! శూద్రులూ పంచములూ దేవాలయంలో ప్రవేశించరాదనే ఆంక్షలు మాత్రం అతికొద్దిగా సడలించ బడ్డాయి! అంటే, భగవద్గీతలో శ్రీ కృష్ణ పరమాత్మ, స్త్రీలూ- వైశ్యులూ- శూద్రులూ- చచ్చిం తర్వాత మోక్షం పొందవొచ్చునని సెలవిచ్చారు గదా ?! (స్త్రియోం వైశ్య స్తథా శూద్ర తేపి పరంగతి) ఆ విధంగా శూద్ర బానిసలకీ, గ్రామ చండాలురకీ, చచ్చిం తర్వాత మోక్షం గ్యారంటీ జేయ బడినా, వాస్తవానికి వీరు ఏ లక్ష్యం కోసం యీ తిరుగుబాట్లు జరిపారో,

ఆ లక్ష్యం మాత్రం సిద్ధించలేదు. పరలోకంలో ముక్తి గ్యారంటీ జేయబడినా, నరలోకంలో మాత్రం కుల వానిసత్వం నించి వీరికి విముక్తి లభించలేదు. వాస్తవ జీవితంలో సాంఘిక సమానత్వమూ, వ్యక్తి స్వాతంత్ర్యమూ వీరికి నిరాకరింపబడ్డాయి. అంటే - ఆచరణలో ఈ సాంఘిక తిరుగుబాటు, పూర్తిగా విఫలమైంది. చివరికి రామనామస్మరణా, మూఢభక్తి మాత్రం శేషించాయి. "ప్రెంచికయ్యా ప్రపంచినాపూ-ప్రబంది ఘనాలో" అనే రామదాసు కీర్తనలే, పున గ్రామీణ పేద ప్రజలకి మిగిలాయి!

గ్రామాల్లో కులవ్యవస్థ

ఎవరైనా కొత్తవాడు గ్రామంలోకి వొస్తే, ముందు అతని కులం తెలుసుకోవడానికి ఉబలాట పడ్తారు. పేరును బట్టి, మాట తీరునుబట్టి, అతని కులం తెలుసుకోలేకపోతే, "మీ యింటిపేరు" ఏమిటనీ, ఆ పైన్నో "ఫలానా సుబ్బయ్యగారు మీకు తెలుసా?" అనీ, అటువేపునించి నరుక్కొంటూ వొస్తారు! బ్రాహ్మణ - రాజు - రెడ్డి - కమ్మ - కాపు - అని తేల్చుకొంటే ఆ వ్యక్తితో వొక విధంగానూ, మాల - మాదిగ - చాకలి - చుంగలి - ఎరుకల ఏనాది యిత్యాది కులాలకి చెందిన వాడని అనుకొంటే, ఆ వ్యక్తితో "మరో విధంగా" నూ ప్రవర్తిస్తారు. కోమటి అని తెలిస్తే, పురీ చులకనగా వ్యవహరిస్తారు. గ్రామంలో పని చేయడానికి ఉద్యోగరీత్యా వెళ్ళిన ఆలడు కింది కులాలకి చెందిన వాడైతే, "మాల డాక్టరు", "చాకలి ఇంజనీరు", "చుంగు చెబ్తారు", "బోగం కాంపౌండరు" అంటో, పరుష నీచాతి నీచంగా మాట్లాడి, పగలబడి నవ్వుతారు. ప్రత్యేకంగా బ్లాకుల్లో పనిజేసే హరిజన బీచర్లనీ, నర్సులనీ "జాన్ మత్తయ్ కంపెనీరా" అంటో యీ బడుద్ధాయిలు వ్యాఖ్యా

74730

నిస్తోంటారు. మరీ కొన్ని గ్రామాల్లో హరిజనులకి అద్దెకి యిళ్ళు గూడా దొరకవు. ఈ నాటికీ కొన్ని గ్రామాల్లో, హరిజనుల్ని మంచినీళ్ళ భావిలో నీళ్ళు తోడుకోవడానికి అనుమతించడం లేదు. గ్రామాల్లో కన్న పట్నాల్లో కులం పట్టింపులు తక్కువ. అంటే నగరవాసులు మహా విశాలమైన మనస్తత్వం గలవారని అర్థం గాదు. పట్టణాల్లో కన్పించే సమానత్వం—చాలా వరకు పొరుగువారిని చూచి అంతగా పట్టించుకోనందువల్ల వొచ్చిన "సమానత్వమే"!

అంచేత నేటి సమాజంలో, వ్యక్తినిగాక ఆతని కులాన్నే ప్రధానంగా పట్టించు కొంటున్నారు. కులవ్యవస్థలో వ్యక్తికీ ఆతని వ్యక్తిత్వానికీ ఏ మాత్రం తావు లేదు. అతడు ఎంత మంచివాడైనా, ఆతడు "నీచ" కులానికి చెందినవాడు గాబట్టి, అతనికి నీచపు బుద్ధులే వుంటాయని అలవోకగా వ్యాఖ్యానిస్తోంటారు. తరతరాలుగా మన నరనరాల్లో పాతుకపోయిన ఈ భంగాలపు అలవాటు తప్పక మారితీరాలి.

గుర్రం జాషువా వొకసారి సభలో గొంతెత్తి పద్యం చదివాడు. అదే సభలో కవిసామ్రాట్ బిరుదు పొందిన మహా వెధవ (పేరెందుకు లెండి) "జాషువాగారు పంచమ స్వరంలో చదివిన పద్యం ఆపాత మధురంగా వుంది" అని వ్యాఖ్యానించాడు. జాషువా పంచముడు అనే విషయాన్ని, ఈ సభలో గూడా ఎత్తి పొడవడమే ఈ వెధవ ఉద్దేశం. అంచేతనే "గబ్బిలం" కావ్యంలో ఆ మహాకవి దారుణమైన ఆవేదన వెలిబుచ్చాడు :

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి,
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
కసరి బిసకొట్టు నాతని గాలి సోక,
వాల్గ పడగల హైందవ నాగరాజు."

(జాషువా - గబ్బిలం)

"పామునకు పాయు, చీమకు పంచదార,
చేపుగొనుచున్న కర్మభూమిం జనించు
ప్రాక్తనంబైన ధర్మదేవతకు గూడ
నులికిపడు జబ్బుగలదు వీడున్నచోట"

(గబ్బిలం)

"ముసలివాడైన బ్రహ్మకు బుట్టినారు
నలువురు కుమారులనుట విన్నాముగాని,
పసరమున కన్న హీనుడభాగ్యుడైన
వైదవ కులస్రుచెవ్వరమ్మా! సవిత్రి!"

(జాషువా - ఖండకావ్యం - 2)

"వేద చతుష్టయంబు ప్రభవించిన వ్యాసుని దివ్యవాణిలో
మాదిగలుందురా ? రుధిర మాంసములుంగల యంటరానివా
రాదిపువాసు లక్కటకటా! తలపోసిన నల్లగుండెలో
సూదులు మోసులెత్తును గ్యశోదరి! మెట్లు సహించుకొందువో!"

(ఖండకావ్యం - 2)

ప్రథమ స్థానం బ్రాహ్మడిది
అధమ స్థానం హరిజనుడిది

భారతీయ గ్రామీణ వ్యవస్థ ఎంతో విచిత్రమైనది. ఊరిలో అమాంబాపతు కులాలవారుంటే, ఊరి బయట మాల - మాదిగలుంటారు. ఇండియాలోని ప్రతి పల్లెకీ, విధిగా వొక మాలపల్లె వుంటుంది!

మాదిగ కన్న మాల- మాల కన్న పంగల-పంగ కన్న చాకి - చాకి కన్న గౌడ - గౌడ కన్న సాలె - సాలెకన్న పద్మసాలి - పద్మసాలి కన్న దేవాంగుల - దేవాంగులకన్న కాపు - కాపుకన్న రెడ్డి - రెడ్డికన్న

కమ్మ - కమ్మకన్న పెదకమ్మ - పెదకమ్మ కన్న పెలమ - పెలమకన్న రాజు - రాజుకన్న విశ్వబ్రాహ్మణ-వీరిందరి కన్న బ్రాహ్మడు గొప్పవాడు, ఈ విధంగా అంచెలంచెలుగా-నిచ్చెన మెట్లలా ఈ కులవ్యవస్థ వుంటుంది. ఈ నిచ్చెన మెట్లతోపాటు, వాడే కులంలో అనేక రకాలు. వడ్లలో ఎన్ని రకాలున్నాయో, పెద్లలో అన్ని రకాలు. బ్రాహ్మల్లో పైనికి - నియోగి అనే భేదాల్తోపాటు, మరెన్నో శాఖలు!

వీరిలో కొందరు తమ "నీచ" కులం పేరును కప్పిపుచ్చే ప్రయత్నంలో, తమ తమ కులాలకి చిత్ర విచిత్రమైన చరిత్రలు తగిలించుకొంటారు! మంగళ్ళు - నాయీ బ్రాహ్మలనీ, కంసాళ్ళు - విశ్వబ్రాహ్మలనీ, పెద్దలు - అగ్నికుల క్షత్రియులనీ, చాకళ్ళు - రజకులనీ, మాదిగలు - అరుంధతీయులనీ, మేదర్లు - మహేంద్రులనీ, వడ్డెర్లు - వడ్డెరాజులనీ, గొల్లలు - యాదవులనీ, బోగంవాళ్ళు - కళావంతులనీ, కాపులు - నాయుళ్ళనీ, కమ్మలు చాదర్లనీ, అహంకారంతో దుర్గర్వంతో తమ్ము తాము పిలిచుకొంటారు!

ఈ విధంగా యీ నిచ్చెన మెట్ల సాంఘిక వ్యవస్థలో, ఎవడికి వాడె మిగతావాడి కన్న అధికుడనీ, ఎవడికివాడు తనకన్న మిగతా వారంతా అధములనీ భావిస్తాడు! మాది మత్స్యగంధి వంశమని పెద్దలు భావిస్తే, మాది అరుంధతి వంశమని మాదిగవారు సంభావిస్తారు! మాది వశిష్టుని వంశమని కొందరు భావిస్తే, మాది శ్రీకృష్ణుని వంశమని గొల్లలు తలుస్తారు! గౌరీశంకర శిఖరాన్ని అధిగమించే వీరి బుద్ధి లక్ష్యం తనాన్ని, ఏలా చేరేజు వేయాలో తెలియదు.

ఎవరికి వారే యమునా తీరే

కోడి పెంటకన్న కంపొ - ఆకు ఏసాయి తప్పకవ అని కొంద రంటారు. బహుశా చేత్తో కోడిపెంటను పట్టుకొని, జాగ్రత్తగా చాసుతో

వేసి, ముక్కుతో వాసన చూసి, యీ చెప్పినవాడు తూసి వుంటాడు. అంచేత, ఇండియాలోని ఏ గ్రామమూ వొరటి కాదు. అంచేతనే యీ దేశాన్ని శత్రువులు యింత సులభంగా ఓడించి వుంటారు. అంతా పేరుకి హిందువులైనా, వొక పలానికి చెందినవాడి కూతుకు పెళ్ళిచేసుకోడు. వొకడి యింట్లో యింకోడు భోంచేయడు! నలుగురితో నారాయణా కులంతో గోవిందా! ప్రతి గ్రామం లోనూ రెండు విభిన్న ప్రపంచాలు, రెండు విరుద్ధ వర్గాలు, రెండు శత్రు కూటాలు "సహజీవనం" చేస్తుంటాయి. పైకి సహజీవనంగా కన్పించే ఈ గ్రామ జీవనం వెనక మాంధాత కాలం నాటి కుల మత ఆచారాలూ, మడి - పైల అంటరాని తనాలూ, లోని మానవుణ్ణి మంచినీటి బావివద్దకి రానీయని పరమ కిరాతకమైన కట్టుబాట్లూ, చివరికి పశువుల్లో సైతం కన్పించని పుణ్యం కట్టుబాట్లూ, పెళ్ళిచేయతగాలూ, రెండు కాళ్ళ మృగాల సాంప్రదాయాలూ, గబ్బు కంపుకొట్టే గబ్బిలాల ఆలోచనా ధోరణులూ, ఓరి ముసిక్కాలపలోని పురుగుల్లా కుళకుళలాడే మాల - మాదిగ గూడెల్లోని ప్రజలూ - మనకు కన్పిస్తారు. భారతదేశానికి వెన్నెముక గ్రామమేనని మన పెద్దలు రాల్రింబగళ్ళూ ఉద్ఘాటిస్తోంటారు. అయితే ఈ వెన్నెముకలాంటి గ్రామాన్ని చూస్తే, ఇండియా వొక దేశమా - కాక - అనేక వందల - వేల - లక్షల కులాల పంచకూళ్ళ కషాయమా - అనే అనుమానం ఎలాంటి వానికైనా రాకమానదు.

ఈ "ప్రజాస్వామ్యం" భారతంలో పలం-పులం - అనే విషబీజాలు, ఇంతింతై వటుడింతయైన చందంగా, నానాటికీ ప్రత్యక్షంలా విస్తరిస్తోన్నాయి. బ్రిటిషువారు మనదేశానికి స్వాతంత్ర్యప్రదానం జేసిన అనంతరం, ఈ కుల-మతాల విజృంభణ మరీ పెచ్చరిల్లింది. ఏరోటి దగ్గిరాపాట పాడే రాజకీయ నాయకులు, తమ స్వార్థం కోసం వీటిని పనిగట్టుక పెంచి పోషిస్తోన్నారంటే మనం అర్థం జేసుకోవొచ్చు. కాని విద్యాధికులమనీ మేలభావు

మనీ విర్రవీగేవారు సైతం యీ కాలపర్వాలకి పాలుపోసి వాటిపట్ల ఆవ రాభిమానాలు చూపుతోంటే, మనం ఏ విధంగా అర్థం జేసుకోవాలి? మారు తోన్న కాలంతోపాటు మారలేని ఉష్ట్రపక్షి మనస్తత్వంతో బతికే యీ పెద్దల్ని మనం వొదిలినా, భావిభారత పౌరులైన విద్యార్థి - యువకులు సైతం, ఈ కాలనాగుల ప్రభావానికి లోనవుతోన్నారు. అంధకార బంధురమైన దేశభవిష్యత్తుకు, ఇది - అత్యంత ప్రమాదకరమైన చిహ్నం గాదా ?

అప్లికేషన్లలో కుల మతాల వివరాలు

సెక్యులరిజం అమలుజరప బడుతోందని చెప్పే యీ దేశంలో, ఏ విద్యార్థియైనా స్కూలు-కాలేజీ-యూనివర్సిటీ- దేనిలో ప్రవేశించాలన్నా, జాతి - మతము - కులమునకు చెందిన కాలమ్మును విధిగా పూర్తిజేయాలి. అంతేగాదు- ఆ కులం- ముందుబడ్డ కులం కిందకి వొస్తుందా? కాక-వెనక బడ్డ కులం కిందకి వొస్తుందా? లేక - షెడ్యూల్డు కులాల-తెగల-జాబితా లోకి వొస్తుందా? అనే వివరాల్ని సైతం పూర్తిజేయాలి. ప్రభుత్వ ఉద్యోగాలకి అప్లయ్ జేసే యువతీ యువకులు సైతం, తమ అప్లికేషన్స్‌లో యీ కులం కుష్టుకి చెందిన సమస్త భాగోతాన్నీ ఫిలప్ జేయవొలసిందే! ఇన్ని కుల - మత - వివరాల్ని సేకరించే యీ ప్రభుత్వం, ఏ రకమైన సెక్యులరిజాన్ని వెలగబెడుతోందో వేరేగా చెప్పనవసరం లేదు. ఇదేమి సెక్యులరిజమని ఎవరైనా అడిగితే, సెక్యులరిజమంటే - కుల మతాతీతమైన విధానంగాదనీ, సమస్త కుల-మతాల్నీ సమానంగా చూచే విధానమేననీ, ప్రభుత్వంలో తిష్టవేసిన మంత్రులూ, వారి సామంతులూ, అపూర్వమైన నిర్వచనాన్ని యివ్వ సాహసిస్తోన్నారు! ఇంతకన్న సిగ్గులేని నిర్వచనం, ఈ భూమండలంలోని ఏ నిఘంటువులోనూ కొరకదేమో ?

శనివారం నాడు సుప్రభాతం
ఆదివారం నాడు ఏసు భజన

ఇహ ఆలిండియా రేడియో కార్యక్రమాలు, మన దేశంలోని సెక్యులర్ డెమోక్రసీకి ఆణిముత్యాల్లాంటి ఉదాహరణగా మాత్రమే మిగుల్తాయి. శుక్రవారంనాడు అల్లానీ, శనివారంనాడు సుప్రభాతాన్నీ, ఆదివారంనాడు ఏసుప్రభువునీ, అన్నివారాల్లో హరినామ స్మరణనీ రాత్రిం బగళ్ళూ, పాలరాతియుగంనాటి గీతగోవిందాన్నీ, సూక్తిముక్తావళినీ, అప్పుడప్పుడూ తపతప యిళ్ళల్లోని శ్రోతల కోరికపై చిత్తకార్తె శ్యంగారానికి చెందిన బూతు సినిమా పాటల్నీ ప్రసారంజేస్తూ, లౌకిక ప్రజాతంత్ర భావాల్నీ- ఆధ్యాత్మిక చైతన్యాన్నీ శక్తికొద్దీ ప్రసాదిస్తోన్నాయి.

జీవన విధానంలోనూ, ప్రాపంచిక దృక్పథంలోనూ, ఏ మాత్రం సెక్యులర్ భావాలు లేని వారి ద్వారా, మన సెక్యులర్ రాజ్యాంగం నేడు అపహాస్యపడుతోంది. నెలకొకసారి తిరపతికి వెళ్ళే మంత్రులూ, స్వాములవార్లకి సాష్టాంగ దండప్రణామం గావించే ముఖ్యమంత్రులూ, బాబాల కాళ్ళని సాష్టాంగా నెత్తిమీద పెట్టుకొనే పాలకులూ, మనప్రభుత్వాధినేతలుగా వున్న యీ రోజున, మన సెక్యులర్ రాజ్యాంగం ఏకోదం తిరపతి రాజ్యాంగంగా మార్చివేయబడగలదు.

IV

ముప్పయ్ మూడేళ్ళ స్వాతంత్ర్య భారతం ఏమి సాధించింది? చుక్కలంటే ధరలతో, నిష్ఫలమైన నిరుద్యోగంతో, దుర్భరమైన దారిద్ర్యంతో, సామాన్య ప్రజలు యమయాతన లనుభవిస్తో, దినగండం నూరేళ్ళ ఆయుష్షులా జీవచ్ఛవాల్లా బతుకుతోన్నారు. పేదలు నిరుపేదలుగా మారగా, లక్షాధికార్లు కోటీశ్వరులుగా తెగ బలిసిపోతోన్నారు. అక్షరం

ముక్కరాని నిజానీరాయుళ్ళు లజ్జితాల్లుగా అవతరిస్తో, కనిపొచ్చే లోజొస్తే నదిచొచ్చే కొడుకు పుట్టొడని, నడుమంత్రపుసిరి వేదాంతాన్ని వల్లిస్తోన్నారు! వొక్కమాటలో చెప్పాలంటే, బోడిగాళ్ళకి స్వర్గంగా, పీడిత ప్రజలకు నరకంగా నేటిధారతావని దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధిని సాధించింది- కులతత్వం, అస్పృశ్యతా జాడ్యం, ప్రాంతీయతత్వం, మతమౌఢ్యం నానాటికీ పెచ్చరిల్లి జాతీయ సమైక్యతకి మహోపద్రవకరంగా తయారయ్యాయి.

V

70 కోట్ల జనాభాగల ఈ సువిశాల భారతంలో, అన్ని యుగాల సాంఘిక వ్యవస్థలూ అచ్చంలోని ప్రతిబింబంలా కన్పిస్తాయి. ఆదిమ - ఆటవిక - మానవ సమాజ అవశేషాలు, నేటికీ మనచేశంలో కాన వొస్తాయి. కుప్పకూలిపోయిన ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలు సైతం మన కళ్ళముందే సాక్షాత్కరిస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క మాయ నాటకాలన్నిటినీ, మనం సైనందిన జీవితంలో చూస్తోనే వున్నాం. దాని విచిత్ర విషాద పరిణామాలన్నిటికీ, మనం ప్రత్యక్ష సాక్షులుగానూ వున్నాం.

మన శాసనసభలు, ధనం - కులం - మతం - అజ్ఞానం - అధికారం - పదవీవ్యామోహం యిత్యాదులకి ప్రాతినిధ్యం వహించినంతగా, నిర్దిష్ట విధానాలకి ప్రాతినిధ్యం వహించడం లేదు. జాతికి మార్గదర్శకులుగా వుండాల్సిన రాజకీయ నాయకులు, ఆదర్శాల్ని గాలికి వొదిలేసి, పూటకో పార్టీ ఫిరాయించి, రోజుకో గ్రూపులో చేరుతోన్నారు. ముఠా రాజకీయాల మురికి గుంటల్లో మునిగితేలుతో, అవినీతి నిచ్చెనమొక్క ఆఖరిమెట్టు చెక్కేందుకు అహోరాత్రాలూ కృషిజేస్తో, అధికారమున్న పార్టీలో దూరడానికి అంగల పంగలమీద వీరు ఉరుకులు తీస్తోన్నారు. ఏ పార్టీలో

దూరితే, ఏ పదవి లంకించుకోగలమా - అనే ఆలోచన మినహా, యీ దేశం ఏ దిశకు పయనిస్తోందో వారికేమాత్రం పట్టదేమ. అయిదేళ్ళ కొహసారి ఓళ్ళమీద పడి, ప్రజాస్వామ్య రక్షణ - బలహీనవర్గాల సంక్షేమం - హరిజన గిరిజనోద్ధరణ-అంటూ పొలికేకలు పెట్టి, ఎన్నో అక్రమ పద్ధతుల ద్వారా ఓట్లు గడించి, తప పబ్బం గడుపుకొనేవారు, నేడు జాతినేతల్లా అవతరించారు.

వీరు ఎటు తిప్పితే, చరిత్ర అటు నడుస్తుంది. వీరు ఏ పార్టీలో దూరితే, ఆ పార్టీ అధికారంలో కొస్తుంది. వీరు చెప్పించంతా వేదమై తీర్తుంది. అయిదేళ్ళ కొహసారి మాత్రమే దైవదర్శనమిచ్చే ఈ నవలోక దేవుళ్ళు, ఎన్నికల తర్వాత మళ్ళీ ఓటర్లకి ఛస్తే కన్పించరు! వొకపార్టీ టక్కెట్టుపై గెలిచిన వీరు, అది-అధికారంలోకి రాకపోతే, అధికారంలో కొచ్చిన పార్టీలోకి తెల్లారేప్పటికల్లా ఫిరాయించగలరు. ఇలాంటి ఫిరాయింపు దారుల్తో నిండిన ఇండియన్ డెమోక్రసీ మొక్క- ఏడు రంగుల సినిమా- అందచందాల్ని అభివర్ణించడం చాలా కష్టం.

భారతీయ ఓటర్ల సేవకులైన
ప్రజాసేవా దురంధరులు

పన రాజకీయ సినీ నాయకులు, ప్రత్యేకంగా ఎన్నికల సమయంలో చేసే వేషాలూ, చేసే అపూర్వ నటన, భాషకీ భావానికీ సైతం అందదు. ఎలక్షన్ల కాలంలో వీరు ఏమైనా చేయగలరు. ఏ పాత్ర యిచ్చినా,అందులో జీవిస్తో నటించగలరు. తెచ్చుకొన్న చిరునవ్వును పెదవులకి అతికించుకొని, వీరు చిరునవ్వులు చిందించగలరు. అవసరమనుకొంటే ఓటర్ల ముందు, గ్లిసరిన్ లేకుండానే భోరున ఏడవగలరు. గుడిసెలోని పుల్లిని - పుల్లమ్మా

అని ఆప్యాయంగా పిచి డైలాగ్ చెప్పగలరు. ఎల్లిగాజ్జి - ఎల్లయ్యా అని ప్రేమతో నోరారా పలకరించగలరు. హరిజనవాడకెళ్ళి, కొరివికారం పచ్చడిపున్న చట్టిలో వేలుపెట్టి, నాలికపై రాసుకొని, అమ్మో యిలాంటి కారప్పచ్చడితో ఎలా తింటోన్నారని ప్రశ్నించి, కంటి వెంట కన్నీరు కడవలకొద్దీ కార్చగలరు! చేతులు జోడించి, ప్రజాసేవకుల్లా ఓట్లు అడగ్గలరు. వేదికలెక్కి కిరాయి ఆశ్రితుల్తో పూలచండ వేయించుకొని, జనాన్ని ఉద్ధరిస్తామని ఉపన్యాసా లివ్వగలరు. నేడు వేశధ్వరికి కిలోలకొద్దీ సానుభూతిని చూపి, లీటర్లకొద్దీ కన్నీరుని కార్చగలరు. వీరి మాటలూ, చేతలూ, నీతులూ, రీతులూ, హామీలూ, అభయహస్తాలూ - అన్నీ ఎ. క్లాస్ నటనే. నేడు ఈ నటనే పనదేశాన్ని నియంత్రిస్తోంది. జాతీయ అవకాశవాదాన్ని వీహ కళగా పరిచిన ఈ గిరీశాలవల్లే పనదేశానికి ఈ అధోగతి దాపరించింది.

లక్షల పెట్టుబడిపెట్టి కోట్లు గడించేందుకి, పున ఎన్నికలు రాచబాట. కోట్ల పెట్టుబడి పెట్టి, ప్రభుత్వాధికారాన్ని వైభవం జేసుకోవడానికి, పున ఎన్నికలు చట్టబద్ధమైన బోవ. అయిదేళ్ళ కొకా సారి జరిగే ఈ ఎన్నికల జగన్నాటకంలో, వేవప్రజలు నిమిత్తమాత్రులు మాత్రమే! కోటీశ్వరులూ-వారి ఏజెంట్లే, యీ జగన్నాటకంలో అసలైన సూత్రధారులు!

కొందరు సినిమా వేషాలు వేసి కోట్లు గడిస్తోంటే, మరికొందరు రాజకీయ రంకువేషాలు వేసి ఓట్లు సంపాయిస్తోన్నారు. సినీనటులుగావున్న యం.జి.ఆర్. ADMK పేరు చెప్పుక, రాజకీయ నటవేఖరులుగా అవతరించాడు. సినీనటులకీ, రాజకీయ నట విట వేఖరులకీ, నేటి డెమోక్రసీలో చాలా దగ్గర పోలికలున్నాయనే విషయం పునందరికీ తెలిసిందే !

రాజకీయాల్లో యం.జి. రామచంద్రన్, సినీనటన చూపిస్తోన్నాడని కరుణానిధి తీవ్రంగా బాధపడుతోన్నాడు! తన సినీనటన ద్వారా రాము

చంద్రన్ గుంపుల్ని ఆకర్షిస్తోన్నాడనీ, ఈ గుంపులు ఎలాంటివో ఎవరైనా సులభంగా ఊహించుకోవొచ్చుననీ, కరుణానిధి కంప్లెయింట్ జేస్తోన్నాడు. ఇంతకీ - ఏతావాతా తేలిందేమంటే, ఇండియన్ డెమోక్రసీ భవిష్యత్తును అంతిమంగా నిర్ణయిస్తోన్నవి - ఈ సినీనటుల-యీ రాజకీయ విటుల - ఈ గూండా గుంపుల రాజకీయాలేననీ, యీ గుంపుల గాలి రాజకీయాలే - నేటి దేశభవిష్యత్తును నైతం తీర్చిదిద్దుతోన్నాయనే అనుమానం కలుగుతోంది.

గాలి రాజకీయాలు

"గారివల్ల చాలా యిబ్బందులున్నాయి. సుడిగాలి అయితే చుట్టు ముట్టేస్తుంది. కళ్ళు, చెవులు, నోరు మూసుకోక తప్పదు. రాజకీయమైన గాలులు కూడా జనాన్ని అలాగే చుట్టేస్తాయి. ఆలోచించే అవకాశంకూడా యివ్వవు. అందువల్లనే చాలాచోట్ల ఎక్కువగా గారిసరుకు పైకి యెగిరి వస్తుంది. ఊహాపేహా లేని అభ్యర్థులు, "అఖండ" విజయాలు సాధించి అధికార పీఠాల మీద వాలుతారు. సుడిగాలిలో చెండుటాకులు, చెంగి లాకులు, పైపైకి యెగిరి విష్ణుచక్రాల్లా స్వైరవిహారం చేసినట్లు ఏ ఘనత లేని అభ్యర్థులు ఆ గాలిలో తేలిపోతారు. అందువల్ల రాజకీయాల్లో ఘన పదార్థం అడుగుకుచేరి, తేలిక బాపతు అంతా "చిన్నత్యా"న్ని అందు కుంటాయి. ఘన ప్రజలున్నారే వాళ్ళు నిజంగానే మహానుభావులు. ఆగ్రహం అనుగ్రహం ఏది వచ్చినా, బాగా రెచ్చిపోతారు. అలిగారా? నెత్తికెక్కించుకున్న వాళ్ళను, నేలమీద కూలెయ్యడమే కాదు, లాగి తన్ని తరిమేస్తారు. మెచ్చారా? పాతాళంలో వున్న వాళ్ళను లేవనెత్తి, పూజా పుష్పంలా ఆరాధించి శిరో భూషణంగా ధరిస్తారు. యీ రెండు ధోరణుల మధ్య సమన్వయం ఘన పుణ్యభూమిలో లేదనే చెప్పారు. ఇప్పుడు 1989 మధ్యంతర ఎన్నికలలో ఘన మహాజనులు అదే పనిచేశారు. అన్నీ అమ్మే చూసుకుంటుంది లెమ్మను కున్నట్లుంది. ఒక దశాబ్దంగా దేశంలో

ప్రాబల్యం వహిస్తున్న గాలి రాజకీయాల వల్లనే దేశం ఇన్ని విషమ సమస్యలు ఎదుర్కొంటూంది."

(గజ్జెల మల్లారెడ్డి - పుణ్యభూమి - ఈనాడు - 13-1-80)

ప్రపంచంలో "ఎగ్గెస్ట్ డెమోక్రసీ" గా పరిగణించబడుతోన్న మన మహత్తర ప్రజాస్వామ్యాన్ని, అంతిమంగా నిర్ణయిస్తోన్నవి - యీ గాలి రాజకీయాలే!

VI

కులం - మనదేశంలో అన్నిటికన్న పెద్దపార్టీ - అని - జయ ప్రకాశ్ నారాయణ్ ఎన్నో ఏళ్ళక్రితం వ్యాఖ్యానించాడు. నాటికీ నేటికీ యీ పరిస్థితి మారకపోగా, నానాటికి తీసికట్టు నాగంభొట్లుగా ఈ సమస్య తయారైంది. కులసమస్య మనదేశ రాజకీయరంగంలో అత్యంత ప్రధాన మైనది. చాలా లోతైనది. ఓట్లకోసమే పాటుపడే రాజకీయ నాయకులు యీ సమస్యను పరిష్కరించలేరు. జాతి ప్రయోజనాల్ని ఏ మాత్రం ఘాతరుజేయని యీ వ్యక్తులు, ప్రజల అమాయకత్వాన్ని మాత్రమే ఎన్నికల సమయంలో సొమ్ము జేసుకొంటారు.

ఎన్నికల్లో వొక వ్యక్తిని అభ్యర్థిగా ఎంపిక చేయబోయే ముందు, ఆతడు తన నియోజకవర్గంలో తన కులం ఆధారంగా ఎన్ని ఓట్లు సంపాయించగలడు - అనే అంశాన్ని - అన్ని రాజకీయపార్టీలూ ప్రధానంగా పరిగణనలోకి తీసుకొంటోన్నాయి. ఈ అంశం గురించి శ్రీ నంబూద్రిపాద్ యీ విధంగా అన్నాడు :

"It would be totally unrealistic to close one's eyes to the fact that even those political parties which claim to be secular and above all considerations of castes and communities, have to take in to consideration the caste or communal composition of particular constituencies when

they select their candidates for election. Tbis, is only one among the many important factors which have to be considered." (Castes, Classes and parties in Modern Political Development - E. M. S. Namboodiripad - Social Scientist - 1977 - Novem'ber)

అంతేగాదు; ఎన్నికల అనంతరం ఏర్పడే మంత్రివర్గంలో నైతం, ఏ కులానికి ఎన్నెన్ని సీట్లు కేటాయించాలి - అనేది గూడా ప్రధానమైన అంశంగా పరిగణింపబడుతోంది. పేరుకు వీరంతా మంత్రివర్గ సభ్యులైనా, లోలోన మాత్రం కులాల ఆధారంగా వివిధ గ్రూపు లుంటాయి. యీ గ్రూపుల బేసిస్‌పై వీరిలో వీరు అధికారం కోసం ఆంతోతుల్లా గుద్దు కొంటుంటారు.

ఎన్నికల్లో కులతత్వం

ఎన్నికలకీ కులతత్వానికీ మధ్య ఇంతీయూలో విచిత్రమైన సంబంధ ముంది. వొకదానివల్ల మరొకదానికి లాభం గూడా వుంది! దేశానికి స్వాతంత్ర్యం వొచ్చిననాటి నించి, యీ చిత్రమైన సంబంధం మరింత విచిత్రరూపం ధరించింది. ప్రత్యేకించి బీహార్‌లాంటి రాష్ట్రంలో ఎన్నికలకి ముందూ - ఎన్నికల సమయంలోనూ - ఎన్నికల అనంతరమూ - దారుణమైన హింసాకాండ జరుగుతుంది. యీ హింసాకాండకి ప్రధాన కారణం - కులతత్వమే. మన ఎన్నికల్లో కుల - మత - ప్రాంతీయ తత్వాలు, పెట్రి తలలు వేసి వికటాట్టహాసం జేస్తోండగా, రాజకీయ - ఆర్థిక ప్రలోభాలు గణనీయమైన పాత్ర నిర్వహిస్తోన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వం, ఎన్నికల్లో హింసా - ముస్లిం - తత్వం ప్రాబల్యం వహించింది. ఈనాటి దేశ పరిస్థితుల్లో, ఎన్నికలు ఉధృతరూపం ధరించడానికి కుల తత్వమూ, కులతత్వం వికృతరూపం వహించడానికి ఎన్నికలూ, పరస్పరం దోహదం జేసుకొందోన్నాయి. ఏ రాజకీయపార్టీకి చెందినా, వొక

అభ్యర్థికీ ఆతని పుట్టుపుచ్చుకకి మధ్య "ఏొక రకమైన సాన్నిహిత్యం" ఏర్పడ్డానికి, యీ కులతత్వం చేసుక్కూగా పనిజేస్తోంది.

వాస్తవానికి స్వరాజ్యం రాకపూర్వం, కులతత్వం చాలా తక్కువగా వుండేది. స్వాతంత్ర్య ప్రదానం చేయబడిన తర్వాత, గ్రామ పంచాయితి దగ్గరనించి పార్లమెంట్ దాకా, యీ కులతత్వమే ప్రాతిపదికగా రూపొందింది. ఎన్నికల్లో పోటిజేసే అభ్యర్థులకి టిక్కెట్లు యిచ్చేముందు, రాజకీయపార్టీలు ఎంతో మెలకువతో వ్యవహరించవలసి వొస్తోంది. కులం బలం ప్రధానంగా వుంటాయనే సూత్రంతోపాటు, కారు - ఫోను - మేడ - వ్యాపారం - యిత్యాది అన్నతలు గూడా పరిగణనలోకి తీసుకొంటున్నారు! ముప్పయ్యేళ్ళ స్వరాజ్యపాలన ఫలితంగా, నానాకాల సంపాదనల ద్వారా పరమపద సోపాన పటంలో ప్రదేశా నిచ్చినమెట్లు ఎక్కి, "పైకి వొచ్చిన" కొత్త ధనవంతుల పంగంబీద కొచ్చిన తర్వాత, కులతత్వం కనీవినీ యెరుగని స్థాయిలో నేడు విజృంభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ - తెలంగాణా జిల్లాల్లో రెడ్డి - వెలమ - ప్రాబల్యమూ, కోస్తాజిల్లాల్లో కమ్మవారి ప్రభావమూ ఎన్నికల్లో అధికంగా కన్పిస్తుంది. యీ పరిస్థితుల్లో దళిత కులాలకి చెందినవారు, ఆయా నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలోవున్నా, అగ్రకులానికి చెంది లక్షలు ఖర్చుపెట్ట గల్గిన వాడే, అభ్యర్థిగా ఎంపిక చేయబడే అవకాశాలు అధికంగా వున్నాయి.

నిర్దిష్టమైన రాజకీయ - ఆర్థిక - విధానాల ప్రాతిపదికపై పోటీ జేసే పొలిటికల్ పార్టీలు సైతం, కొన్ని సందర్భాల్లో కులతత్వ ప్రాతిపదికపైనే తమ అభ్యర్థుల్ని ఎంపిక జేయడం చాలా విచారకరమైన విషయం. ఈ విధంగా జరగడంవల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకే విఘాతం కలుగుతుంది. అప్పుడు పార్టీ పాలసీల కన్న, కులతత్వానికే ఎక్కువ ప్రాముఖ్యం లభిస్తుంది.

సమకాలీన రాజకీయాల్లోని అజ్ఞానం, ఉద్రేకం, మూర్ఖత్వం, గాలి తనంవల్ల, మన ఎన్నికల్లో మతతత్వం కన్న కులతత్వం మరింత భీకరంగా విజృంభించే సూచనలు నేడు కానవస్తోన్నాయి. యీ విధంగా రాజకీయాల్లోకి కులతత్వం ప్రవేశించినందువల్ల, మన రాజకీయ - సాంఘిక - సాంస్కృతిక - వ్యవస్థ యింతగా గబ్బు పట్టడానికి కారణమైంది. "దెబ్బయి అయిదు శాతం జనాభా నిరక్షరాస్యులుగా వున్న మనదేశంలో, బలవంతులవీ ధనవంతులవీ, ఆడించే ఆట - పాడించే పాట. అందువల్ల యీ దేశంలో సోషలిజం బదులు ఫాసిజం వచ్చే ప్రమాదం సుస్పష్టమే" అని మహాకవి శ్రీశ్రీ అన్నాడు. (ఈనాడు - 19-12-79)

అభ్యర్థుల ఎంపికలో కులాల ప్రాబల్యం

"1980 జనవరిలో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో, కులం ప్రాధాన్యం వహించింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకి చెందిన అభ్యర్థుల ఎంపికలో, కులానికి విపరీతమైన ప్రాముఖ్యం లభించింది. యీ నాలు రాష్ట్రాల్లోని మొత్తం లోక్‌సభ స్థానాలు - 162. లోక్‌సభ మొత్తం స్థానాల్లో యిది - దాదాపు మూడో వంతు.

ఉత్తరప్రదేశ్ జనాభా పదకొండు కోట్లు. ఇందులో బ్రాహ్మల సంఖ్య, పది శాతం దాకా వుంటుంది. (1 కోటి 10 లక్షలు) ఉత్తర ప్రదేశ్‌లో 85 లోక్‌సభ స్థానాలున్నాయి. యీ స్థానాల కొరకు ఇందిరా కాంగ్రెస్ 19 మంది బ్రాహ్మల్ని, జనతాపార్టీ 15 మంది బ్రాహ్మల్ని, లోక్‌దళ్ నలుగురు బ్రాహ్మల్ని, అర్స్ కాంగ్రెస్ నీడుగురు బ్రాహ్మల్ని తమ తమ అభ్యర్థులుగా నిర్ణయించాయి. దీన్నిబట్టి ఇందిరా కాంగ్రెస్‌లో బ్రాహ్మణ ఆధిపత్యం వుందని స్పష్టంగా తెలుస్తోంది. లోక్‌దళ్ - జనతా పార్టీలకు కూడా, కొన్ని కులాల పట్ల ప్రత్యేకమైన అభిమానముంది.

లోక్‌దళ్‌లోని ప్రతి మూడవ అభ్యర్థీ, వెనకబడ్డ కులాలకి చెందిన కుర్మి - లేదా - యాదవ కులస్థుడే. జనతాపార్టీలోని ప్రతి మూడవ అభ్యర్థీ ఠాకూర్ లేదా రాజపుట్ కులానికి చెందినవాడే! ఠాకూర్లు - జనతాపార్టీ జాబితాలో 26 మంది కాగా, లోక్‌దళ్ పట్టికలో వీరు నలుగురు మాత్రమే. ఇందిరా కాంగ్రెస్ జాబితాలో పదిమంది ఠాకూర్లకీ, అర్స్‌కాంగ్రెస్ పట్టికలో ఎనిమిదిమంది ఠాకూర్లకీ టిక్కెట్లు లభించాయి.

ఉత్తరప్రదేశ్‌లో ప్రతి రాజకీయపార్టీ, యీ ఎన్నికల్లో ప్రధానంగా కులం మీద ఆధారపడింది. మొత్తం రాజకీయపార్టీలకి చెందిన 284 మంది అభ్యర్థుల్లో, ప్రతి ఏడవ వ్యక్తీ, వెనకబడ్డ కులాలకి చెందినవాడు. ప్రతి ఆరవ అభ్యర్థీ, బ్రాహ్మడు - లేదా రాజపుత్రుడు- లేదా మహమ్మదీయుడు- లేదా హరిజనుడు.

పొరుగున వున్న బీహార్‌లో గూడా పరిస్థితి, ఇంచుకే మాత్రం భిన్నంగా లేదు. బీహార్‌లోని ఇందిరా కాంగ్రెస్ - జనతాపార్టీ అభ్యర్థుల జాబితాల్లో, బ్రాహ్మలు - భూమిహార్లు - రాజపుత్రులు ప్రాబల్యం వహించారు. ఇందిరా కాంగ్రెస్ పట్టికలో ఆర్గురు బ్రాహ్మణ అభ్యర్థులూ, జనతా జాబితాలో నలుగురు బ్రాహ్మణ అభ్యర్థులూ, లోక్‌దళ్‌లో వొక బ్రాహ్మణ అభ్యర్థీ వున్నారు. జనతా జాబితాలో 9 మంది రాజపుత్రులూ, ఆర్గురు భూమిహార్లూ వున్నారు. లోక్‌దళ్ పట్టికలో యీ రెండు కులాలకి చెందినవారు, యిద్దరిద్దరు చొప్పున వున్నారు. బీహార్ లోక్‌దళ్ అభ్యర్థుల్లో దాదాపు సగంమంది (15) వెనకబడ్డ కులాలవారే. బీహార్‌లోని లోక్‌దళ్, వెనకబడ్డకులాల మీదనే అధికంగా ఆధారపడింది. భారత కమ్యూనిస్టు పార్టీకి (సి.పి.ఐ.) చెందిన 16 మంది అభ్యర్థుల్లో, ఏడుగురు రాజపుట్ - భూమిహార్ - కులాలకి చెందినవారే. హర్యానా - పంజాబ్‌లోని ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థుల జాబితాల్లో, చరణ్‌సింగ్ కులస్థులైన జాట్లూ - సిక్కులూ - ప్రాధాన్యం వహించారు." (చిత్రా సుబ్రమణ్యం, ప్రభుచావ్లా - ఇండియా టుడే - పత్రిక 1979 డిసెంబరు)

VII

ఎంతో శ్రద్ధగా ఓట్లకులాల్ని సృష్టిస్తోన్న నేటి పాలకవర్గం, ప్రజాస్వామ్య ఛాంపియన్‌గా నేడు ప్రపంచ వేదిక ముందు పోజు చెడుతోంది. హరిజనుల్ని ఎన్నికల చదరంగంలో పావులుగా వాడుకొంటున్న నేటి పాలక వర్గం, నిజానికి కోరేది - హరిజన సంక్షేమంగాదు. వారి ఓట్లు మాత్రమే. ఓట్లు గుడ్లుపెట్టే బంగారు బాతుల్లా నేడు వీరు పరిగణింపబడుతోన్నారు. ఎసెంబ్లీ - పార్లమెంట్ - ఎన్నికల్లో పాలకవర్గాలు గెలవడానికి, హరిజనులకి నానా భ్రమలూ చూపి, వారిని ప్రత్యేకమైన "ఓట్లకులం"గా సృష్టించారు. పంచాయితీ నించి పార్లమెంట్ వరకూ జరిగే ఎన్నికల్లో వీరిని, తమ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం పాచికలుగా వాడుకొంటోన్నారు. కుష్క-నినాదాల గాలి దుమారం మినహా, ఆచరణలో వీరికి ఒరిగిందేమీ లేదు. మన రాజకీయ నాయకులు ఎన్నికల ముందు, ఎన్నో వాగ్దానాలు జేస్తారు. అవి నెరవేరేవి కావని వాళ్ళకీ తెలుసు. మనకీ తెలుసు. ఎన్నికల సన్నిపాత జ్వరంలో ఈ వాగ్దానాల సంధిప్రలాపం, మరింత తీవ్రస్థాయికి జేరుకొంటుంది. ఈ వాగ్దానాలచే జనాన్ని మోసించి, లాంచి, జోకొట్టి, ఓట్లు వేయించుకొంటారు. పబ్బం గడిచిన తర్వాత చీ - పొమ్మంటారు.

దారిద్ర్య రేఖకి దిగువన జీవించే నిరుపేదలు

ఇండియాలోని అధిక సంఖ్యాకులైన పేదప్రజలు, కిరాతకమైన కులవ్యవస్థ చేతిలో బానిసలు. దారిద్ర్యమూ, కులబానిసత్వమూ, వారి నవనాడుల్ని పీల్చి పిప్పి జేస్తోన్నాయి. దేశంలోని 25 కోట్లమంది ప్రజలు, దారిద్ర్యరేఖకు దిగువన నివసించే ఆగర్భదరిద్రులు. వీరిలో 12 కోట్ల

చుంది షెడ్యూల్డు కులాలు - తెగలకి చెందినవారే. నిరాశ, సామాజిక దురన్యాయం, పీడన, సాంఘిక విచక్షణ, అనే రకరకాల సాలీడుగూళ్ళు విడదీయరానంతగా అల్లుకపోయిన ఫలితంగా, వీరి విముక్తి అత్యంత కష్టసాధ్యమైన సమస్యగా నేడు రూపుదాల్చింది.

నేటి విషాద భారతంలోని హరిజనుల్ని, సజీవ మానవులనేకన్నా బలికున్న శవాలని అనడం, ఏ మాత్రం అతిశయోక్తి గాదు. గూడేల్లో మురికి పేరుకొన్న వీధులు. గబ్బు కంపుకొట్టే మురికాల్వలవు. నీళ్ళు రాని పంపులు. వీధి దీపాల్లేని సందులు. సందుల్లో లెక్కలేని పందులు - కోళ్ళు - కుక్కలు. ఉంటానికి సరైన యిల్లుండదు. కట్టేందుకి బట్ట లుండవు. వండుకోటానికి గిన్నెలుండవు. గింజ లుండవు. బిక్కమొహాలేసుక, పీక్కపోయిన కళ్ళతో, నడుపుకు అంటుకుపోయిన పొట్టలతో, స్మశానశాంతిలాంటి వాతావరణంలో, గ్రామాల్లోని హరిజనవాడల్లో వీరు చావలేక బతకలేక, బతుకులు యీడుస్తోన్నారు.

మన రాజకీయనాయకులు అధికారంలో సుస్థిరంగా వుండాలంటే, దేశంలో వేదరికం శాశ్వతంగా వుండాల్సిన అవసరముంతో వుంది. అలా కాకపోతే, వేదలూ ప్రత్యేకంగా హరిజనులపట్ల వీరికున్న ప్రేమాభిమానాల్ని వ్యక్తం జేయడానికి మార్గమేది?! మాటల్లో హరిజన- గిరిజనుల పట్ల సానుభూతిని వొలకబోస్తోన్న నేటి పాలకవర్గం, చేతల్లో భూస్వాములకూ పెట్టుబడిదార్లకూ ఊడిగం జేస్తోంది.హరిజనులకు భూమి చేబాయించి వట్లు యిచ్చే పట్టాలు, కేవలం కాయితాల మీదనే వుంటోన్నాయి. ఇచ్చిన భూమి యెక్కడున్నదీ - పట్టాదారుకు తెలియదు. వొకవేళ తెలిసినా, ఈ భూమి - భూస్వామి చేతుల్లోనే వుంటుందిగాని, పట్టాదారునికి మాత్రం స్వాధీనం గావడంలేదు. ప్రభుత్వం హరిజనులకు ఇళ్ళ స్థలాల కోసం పట్టాలు యిచ్చినా, అధికార్లు ఆ స్థలాలు ఎక్కడున్నవో చూపించడంలేదని

హరిజనులు ఫిర్యాదు జేస్తోన్నారు. పట్టాలు చేతికొచ్చినా, స్థలం మాత్రం స్వాధీనం కావడం లేదని పురికొంచరు చెబుతోన్నారు.

హరిజన కాలనీలు : అరుంధతీయుల పాళేలు

నానారకాల పేర్లతో కొన్ని పట్టణాల్లో, ఊరికి దూరంగానో లేదా చివరనో, హరిజనవాడలూ - అరుంధతీయుల పాళేలూ (పూరిగుడిసెలు) నిర్మించబడుతోన్నాయి. లాగి పొక్కితన్నా తంతే దభీలున కూలిపోయే ఈ యిళ్ళు, మనకు యీ వాడల్లో కన్పిస్తాయి. హరిజనులకు యిళ్ళు నిర్మించడంలో గూడా ప్రభుత్వం యీ విధంగా కులవక్షపాతాన్ని పాటించడమూ, వారిని శాశ్వతంగా ఊరి వెలపల అంటరానివారుగానే వుంచడమూ విడ్డూరం గాదా ?! ఇళ్ళు కట్టుకోవడానికి హరిజనులకు, యిండ్లకి నాలుగు వందల రూపాయల చొప్పున, దయగల ప్రభుత్వంవారు యిస్తోన్నారు. యీ స్వల్ప మొత్తంతో ఏ విధంగా ఏ రకమైన యిళ్లు కట్టుకోవడానికి వీలుంది? ఆ విధంగానే హరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా హరిజన హాస్టల్స్‌ను పెట్టి, వసతులు కల్పించడం జరుగుతోంది. యీ విధంగా ప్రత్యేక హాస్టళ్ళు నిర్మించడంవల్ల అంటరానితనం పోవడంలేదు సరిగదా, ఆ విద్యార్థుల్లో ఒక విధమైన క్రోధం ద్వేషం రగుల్కొంటోంది. తమను హీనులుగా చూస్తోన్నారని, సంఘంపై కసిదీర్చుకోవడానికి యీ ధోరణి దారి తీయదా?

కుల ప్రసక్తి లేకుండా పేదలకు సహాయం

"పేద ప్రజలకీ, అట్టడుగు వర్గాలవారికీ సహాయాన్ని అంద జేయడంలో కులం ప్రస్తి వుండరాదని భారత రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి అన్నారు. హరిజనుల కోసం పునం 100 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినప్పుడు, అందులో కనీసం పదిశాతం సహాయమైనా పేదప్రజలకు

ఇతర కులాలవారికీ అందజేయాలని ఆయన చెప్పారు. సమాజంలోని ఇతర కులాలకి చెందిన పేదవారు గూడా సహాయానికి అర్హులేనన్న విషయాన్ని ప్రభుత్వం విస్మరించరాదు. హరిజనులకు కాలనీలు ఏర్పాటు జేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించి, వారికీ యీ విధంగా కాలనీలు ఏర్పాటు చేయడం ద్వారా, వారిని మిగతా కులాలవారి నుంచి పేరుపరుస్తున్నారనీ, మిగతావారికి గూడా హరిజన కాలనీలలో వసతి కల్పిస్తే బాగుంటుందనీ ఆయన సూచించారు."

(ఆంధ్రజ్యోతి - 5-9-1978)

బలహీనవర్గాల ప్రయోజనాల పేరు చెప్పి, హరిజన గిరిజనుల పేరు చెప్పి, చలాపుణీ అవుతోన్న నేటి ప్రభుత్వం, వారి ఉత్పత్తిశక్తిని పెంపొందించి తద్వారా వారి ఆదాయాన్ని పెంచడానికి మారుగా, వారికి ఏవో దానధర్మాలు చేసినట్లు నటిస్తోంది. అధికార పదవుల్లో తిష్టవేసిన స్థానిక భూస్వామ్య - పెత్తందార్ల ద్వారా, గొర్రెనో బర్రెనో యిస్తే, వీరి సమస్యలు పరిష్కారంగావు. ఈ శ్రామిక ప్రజల ఉత్పత్తి శక్తిని పెంచడానికి బదులు, వారిని ఎచ్చగాళ్ళుగా తయారు జేయడం ఏ మాత్రం శ్రేయస్కరమూ గాదు.

మన రాజకీయనాయకులూ, సాంఘికసేవా దురంధరులూ, హరిజనోద్ధరణ గూర్చి ఎన్ని కన్నీటి తుడుపు మాటలు చెప్పినా, గ్రామసీమల్లో సవర్ణ హిందూ కులాలవారికీ, అవర్ణకులాలవారికీ పధ్యమున్నది అదాతం మాత్రం నేటికీ, అలాగే వుంది.

కాశీ విశ్వేశ్వరాలయంలో హరిజన ఆఫీసర్‌ను కాలుపెట్టి నిస్తారా ?

ఇండియాలోని రాజకీయనాయకులు సాంఘికరంగంలో పరమ అభివృద్ధి నిరోధకులు. రాజకీయరంగంలో రాడికల్స్! సముద్ర ప్రయాణం

ద్వారా విదేశాలకి వెళ్ళిన వీరసావర్కర్‌లూ, బాలగంగాధరతిలకూ, స్వదేశానికి తిరిగివొచ్చిన తర్వాత, పాశ్చాత్య సంపర్కంవల్ల కలిగిన మైలనించి తమ్ముతాము "శుద్ధి" జేసుకొన్నారు! గాంధీజీ ఆడుగుజాడల్లోనే నడిచిందని చెప్పబడిన ఆయన భార్య - కస్తూరిబాయి, హరిజన పిల్లయైన లక్ష్మిని తన యింట్లో గాంధీజీ పెంచుతున్నప్పుడు, ఆ పిల్లని తక్షణం యింటి నించి వెళ్ళగొట్టకపోతే, తాను ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని భర్తని బెదిరించింది! అంచేతనే, మనదేశంలోని నాయకుల్ని సోషల్ టోరీలనీ - పొలిటికల్ రాడికల్స్ అనీ, డాక్టర్ అంబేడ్కర్ అభివర్ణించాడు. అంతదాకా యెందుకు ? డాక్టర్ అంబేడ్కర్ కేంద్ర ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా వున్నప్పుడు, అగ్రవర్ణానికి చెందిన వొక ఫ్యూన్, ఆయనపై ఫైల్‌ను విసిరిగొడితే దిక్కులేదు! ముప్పయ్యేళ్ళ స్వాతంత్ర్యం తర్వాత, కాశీ విశ్వేశ్వరాలయంలో హరిజన ఐ.ఎ.యస్. అఫీసరును నేటికైనా కాలుపెట్ట నిస్తారా ?!

హరిజనులపై జరపబడుతోన్న అక్కృత్యాలకి వ్యతిరేకంగా, దేశంలోని బూర్జువా రాజకీయపార్టీల నాయకులు, మొసలి కన్నీటిని కార్చడంలో తీవ్రంగా పోటీలు పడుతోన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన ఫోటోల్ని ఆవిష్కరిస్తో, వీధులకీ రోడ్లకీ ఆయన పేరు పెట్టడానికి నానా తంటాలూ పడుతోన్నారు! ప్రతి ఏడూ ఆయనకి పెట్టే ఈ తద్దినాన్ని అస్పృశ్యులు నిశ్శబ్దంగానే తిలకిస్తోన్నారు.

పంచమత్వం లాభంగా పరిణమించిందా ?

"అగ్ర - అధమ - కులాలకి చెందిన పాలవిధులూ - నిషేధాలూ, నిచ్చెనమెట్ల కులవ్యవస్థా, నేడు అంతరించి పోతోన్నాయి. సాంఘిక ఆర్థిక అభ్యున్నతి కోసం, తనకులంపై వ్యక్తి ఆధారపడే ధోరణి - అంటే కులతత్వం, నేడు మితిమీరి పోతోంది. తత్ఫలితంగా నేడు అస్పృశ్యత

(పంచమత్వం) శాపంలాగాక లాభంలా పరిణమించింది" అని శ్రీసిన్హా వ్యాఖ్యానించాడు. (A Psychological Analysis of Caste Tension)

దేశంలోని హరిజనుల్లో అతికొద్ది మందికి మాత్రమే, ప్రభుత్వం యిస్తోన్న రిజర్వేషన్లు చూసి, చాలా మంది అసూయపడుతోన్నారు. గత ముప్పయ్యేళ్ళుగా యీ రిజర్వేషన్లనను పొడిగిస్తో వచ్చినా, వీటివల్ల హరిజన - గిరిజనుల్లోంచి వొక ప్రత్యేకమైన వర్గం బయలుదేరి బాగు పడ్డం మినహా, గ్రామాల్లోని సామాన్య హరిజన - గిరిజనుల స్థితి మాత్రం అధోగతిగానే మిగిలిపోయింది. సెంటు పొలం సైతం లేక, చేతి నిండా పనిలేక, అర్ధాకలితో వీరు నేటికీ అలమటిస్తోన్నారు. వీరి బిడ్డలు కనీసం ప్రాథమిక విద్యకి సైతం నోచుకోవడంలేదు. అంచేత ఉద్యోగాల్లో కల్పించిన ఈ రిజర్వేషన్ సౌకర్యాలు వీరి బిడ్డలకేమాత్రం ఉపయోగపడ్డం లేదు. బ్రిటిష్‌వారి హయాంలో చదువుకొని పైకివొచ్చిన హరిజన క్రైస్తవులకే యీ రిజర్వేషన్లు బాగా ఉపయోగపడుతోన్నాయనే విషయం అందరికీ తెలిసిందే. తెల్లదొరల పాలనాకాలంలో క్రైస్తవమతం పుచ్చుకొన్న వీరు, శుద్ధిసంఘాల ద్వారా నేడు "హరిజనులుగా" గా అవతరించారు.

వొకవేపున కులవ్యవస్థ నాశనం గావాలని మనం కోరుతోన్నాము. మరోవేపున వెనకబడ్డ కులాలవారికీ - హరిజన గిరిజనులకీ, రిజర్వేషన్ల పేరిట కన్సెషన్లు యివ్వాలని మరికొంచరు కోరుతోన్నారు. వీరికి స్పెషల్ కన్సెషన్లు యిచ్చినంత వరకూ, వీరి మొహాలపై రాసిపున్న "హీనకులజుడు". అనే కులం నల్లమచ్చను తుడిచివేయడం అసాధ్యం. ఈ కులం - మచ్చ వున్నంత వరకూ, రిజర్వేషన్లు కొనసాగడం ఖాయం! అంచేత, కులవ్యవస్థా - రిజర్వేషన్లూ - వొకే నాణేనికి వున్న బొమ్మా - బొరుసూ - లాంటివి. ఈ రెండూ పరస్పరం సంబంధం గలవి. వొకటి వున్నంత వరకూ, రెండోవి గూడా వుండి తీర్తుంది. కులం నల్లమచ్చను

తుడిచిపెట్టి, రిజర్వేషన్లను కొనసాగించడం సాధ్యం కాదు. ఇదే - నేటి దేశం ఎదుర్కొంటోన్న అత్యంత విచిత్రమైన పేరడాక్స్. (వీకులాట)

ఇండియాలోని కులవ్యవస్థనూ, అస్పృశ్యతనూ, నవభారత రాజ్యాంగ నిర్మాతలు అంతమొందించలేదు. నవభారత రాజ్యాంగం అస్పృశ్యతను మాత్రమే నిషేధించింది గాని, 'అస్పృశ్యతకి మూలమైన కులవ్యవస్థను నిషేధించలేదు. అంతేగాదు - మన రాజ్యాంగం కులాలకి లీగల్ ఆమోదం కలగజేయడం ద్వారా, వాటిని పరోక్షంగా ప్రోత్సహించింది.

భారతీయ దోపిడీ విధానానికి కులవ్యవస్థ - ప్రతిరూపం. ఈ కుల వ్యవస్థ మొక్క పిలకయే - అస్పృశ్యత. ఆస్పృశ్యత మౌలికంగా సాంఘిక సమస్య. సాంఘిక సమస్యమైన ఈ అంటరానితనాన్ని, కేవలం చట్టాల ద్వారా తుదముట్టించడం సాధ్యంగాదు. ఇండియాలోని సాంఘిక - ఆర్థిక - వ్యవస్థ విప్లవాత్మకంగా పరిణామం చెందినప్పుడే, కులవ్యవస్థ సర్వనాశనం గావించబడినప్పుడే, కులం పిలకయైన ఈ అస్పృశ్యత సైతం పూర్తిగా అదృశ్యమవుతుంది.

మాలలు మాత్రం మనుషులు కారా?
నీలో వున్నది పాలా?

1955 నుండి 1964 వరకూ నడిచిన రెండ్నిమేళ్ళ కాలంలో, దేశవ్యాపితంగా అస్పృశ్యతను పాటించిన నేరానికి 4540 కేసులు పోలీసులచే రెజిష్టర్ చేయబడినప్పటి వీరిపట్ల అగ్రవర్ణ దురహంకారులు ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో మనకు విదితమవుతుంది.

"పలంలో వున్న శక్తి యేమిటి? విషాన్ని బ్రాహ్మడు తిన్నా, హరిజనుడు తిన్నా, ఎవడు తిన్నా చస్తాడు" అని గురునానక్ బోధించాడు.

బ్రాహ్మణ్ణి కోస్తే పాలూ, మాలని కోస్తే నీరూ రావు. ఎవరిని కోసినా రక్తమే వొస్తుంది. అలాంటప్పుడు రక్తమాంసాలు గల పంచమున్ని, నీచులుగా పరిగణించే వర్ణధర్మం - హీనాతి హీనమైంది గాదా? మాన వున్ని చారలి - మంగళ్ళుగా, మాలమాదిగలుగా పరిగణించే వర్ణధర్మం - హేయాతి హేయమైందిగాదా? మనుషుల్ని అగ్ర - అధమ కులాలుగా విభజించిన వర్ణవ్యవస్థ, మానవత్వానికే తీరని కళంకం గాదా?

VIII

వర్ణవ్యవస్థ ఈశ్వర కల్పితమని, హిందూ పురోహితవర్గం ఉద్ఘోష పూర్వకంగా ప్రచారం జేసింది. హిందూ సంఘంలోని మనుషుల్ని జీవచ్ఛ వాలుగా - నిష్క్రియాపరులుగా - కుష్టువాధి పీడితులుగా - పక్షవాత రోగులుగా - యీ నికృష్ట వ్యవస్థ తయారు జేసింది. కుక్కలు చింపిన విస్తరిలా సంఘాన్ని, కులాల కత్తుల్తో చీల్చివేసిన యీ వర్ణవ్యవస్థను, భగవంతుడే సృష్టించాడని భగవద్గీత ద్వారా, వైదిక పురోహితవర్గం పని గట్టుక ప్రతిపాదించింది. గీత చెప్పిన విషయాన్నే గాంధీజీ మరోరకంగా వివరించాడు. "భగవంతుని సృష్టికి సేవజేయడం కోసమే, అందరూ జన్మించారు. తన జ్ఞానంతో బ్రాహ్మడూ, రక్షణ కలగజేసే శక్తితో క్షత్రియుడూ, వ్యాపార దక్షతతో వైశ్యుడూ, శారీరక శ్రమతో శూద్రుడూ, పరమేశ్వరుని సృష్టికి సేవజేస్తున్నారు. వర్ణాశ్రమమంటే ఆత్మనిగ్రహం. శక్తిని మరో రూపంలోకి మార్చడం," అని గాంధీజీ వ్యాఖ్యానించాడు.

("All are born to serve God's creation, a brahmin with his knowledge, a Kshatriya with his power of protection, a vaishya with his commercial ability and a shudra

with bodily labour..... Varnashrama is self - restraint and convertion and economy of energy."

"వర్ణాలను బట్టి ముఖంలో భేదాలుంటున్నవి. సామాన్యంగా ముఖం చూస్తే వర్ణం తెలుస్తుంది. నూటికి యాభైపుంది ముఖాలు తెలుస్తవి. పూర్వకాలంలో నూటికి నూరు ముఖాలు తెలిసేవేమో. చాలా మందిని చూస్తే వాళ్ళ కులము తెలుస్తూనే వుంటుంది." (విశ్వనాధ సత్యనారాయణ - ఆరు నములు నవల) కవిసామ్రాట్ సత్యనారాయణగారు వెల్లడించిన, మేరిమి బంగరు తునకలాంటి ఈ సత్యంపై వ్యాఖ్యానం అవసరం లేదు. మొహం చూసి కులం చెప్పగల ఈయన అనన్యసామాన్య మైన మేధోశక్తిని అర్థం జేసుకోవడం మనలాంటి సామాన్యులకు నిజంగా కష్టమే !

ఎక్కడి బ్రాహ్మణత్వం

"శిరోముండనం వల్ల (గుండు గొరిగించుకున్నందు వల్ల) వొక వ్యక్తి బ్రాహ్మడు కాడు. గౌరవనీయమైన కుటుంబంలో జన్మించడంవల్లగానీ, లేదా జన్మవల్లగానీ, వొక వ్యక్తి బ్రాహ్మడు కాలేడు. సత్యమూ - సత్‌శీలమూ గలిగిన వాడే బ్రాహ్మడు. ఓ బుద్ధిహీనుడా! శిరోముండనం వల్ల ఏం లాభం ? బయటికి నువ్వు పరమ పవిత్రంగా వున్నట్లు కన్పిస్తావు. కాని నీలోపల తోడెయి వుంది. బ్రాహ్మణ గోత్రానికి చెందినందువల్లగానీ, బ్రాహ్మణ స్త్రీకి జన్మించినందువల్లగానీ, నేను వొక వ్యక్తిని బ్రాహ్మడుగా పరిగణించను. బ్రాహ్మడని పిలవబడే యాచకుడు నిజంగా దురహంకారి. జందేన్నీ - దానికి చెందిన సమస్త అవలక్షణాల్నీ, యావత్ ఐహిక బంధనాల్నీ తెంచివేసినవాడే - నిజమైన బ్రాహ్మడు" అని వేల ఏళ్ళ నాడే బుద్ధుడు స్పష్టంగా చెప్పాడు.

(గౌతమబుద్ధ - ధమ్మపదం)

ప్రాచీన ధర్మశాస్త్రం విధించిన నియమాల ప్రకారమే, నేటి బ్రాహ్మలు జీవిస్తోన్నారా? వర్తమాన సమాజంలోని బ్రాహ్మల్లో ఎందరు తపస్సంపన్ను లున్నారో, ఎందరు వేదం చదివిన వారున్నారో, దాన్ని బోధించే వారెందరున్నారో, యజ్ఞం చేసి దాన్ని చేయించే వారెందరున్నారో, ప్రాచీన ధర్మశాస్త్రం నిర్దేశించిన బ్రహ్మచర్య - గృహస్థ - సన్యాసాశ్రమాల్ని స్వీకరిస్తోన్న వారెందరున్నారో, వర్ణవ్యవస్థను నేడు సమర్థించేవారు చెప్పగలరా? ధర్మశాస్త్రాల్లోని ప్రత్యక్షరం పరమ పవిత్ర మైందనీ, అనుల్లంఘనీయమనీ ఘోషిస్తోన్న నేటి వర్ణాశ్రమధర్మ దీక్షా దురంధరులు, ఈ విషయం గూర్చి చెప్పగలరా? శవదమాది లక్షణాలు శూన్యం కాగా, సంధ్యావందనానికి సున్నాచుట్టి, వడ్డీ వ్యాపారంతోపాటు భోజన హోటళ్ళు సైతం నడిపే బ్రాహ్మణాచారులు, బ్రాహ్మలుగా చలామణీ అవుతోన్న నేడు వర్ణవ్యవస్థ నిజంగా ఎక్కడుంది? కుల ధర్మాల్ని నేడు ఎవరు పాటిస్తోన్నారు? కులవృత్తుల్ని నేడు ఎవరు అనుసరిస్తోన్నారు? వేలాదివేల లౌకికోద్యోగాల్లో ప్రవేశించి, కూటి కోసం కోటి విద్యలు నేర్చి, శూద్ర - పంచమ - కులాల వృత్తులు సైతం చేబట్టి సనాతన ధర్మాన్ని నిలువెత్తున పాతిపెట్టి, నేటి బ్రాహ్మలు గడిస్తోన్న ఆస్తిపాస్తులు, ప్రాచీన ధర్మశాస్త్రాల ప్రకారం "పాప మూలమైనవి" కావా?

గోల్కొండ రాజ్యాన్ని పాలించిన తానీషా కొలువులో, అక్కన్న మాదన్నలు పనిజేశారు. స్వచ్ఛమైన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినవీరు, అచ్చమైన మ్లేచ్ఛుని కొల్వ పనిజేసి నప్పుడు వర్ణధర్మం భ్రష్టుపట్టలేదా?! క్రీ.శ. 1550 ప్రాంతాల ఆంధ్రదేశాన్ని పాలించిన మల్కిభరాం (మాలిక్ ఇబ్రహీం) ఆస్థానంలో, "యయాతి చరిత్ర" రాసిన పొన్నిగంటి తెలగన్న వున్నాడు. బ్రాహ్మణ కులంలో పుట్టిన యీతడు, తురకనవాబు దగ్గిర దాస ధర్మాలు పట్టినపుడు, వర్ణధర్మానికి గబ్బు పట్టలేదా?

తూర్పుగోదావరి జిల్లా ముంగొండలో జన్మించి, మొగల్ పాదుషా-షాజహాన్ ఆస్థానంలో పండితుడుగా స్థిరపడిన జగన్నాధ పండితరాయలు, షాజహాన్ ఉప్పూ పులుసూ తిని బతికాడు. చరకపాలకుని కొలువు కూటంలో జీవించడం ద్వారా, ఈ బ్రాహ్మణ పండితుడు వర్ణధర్మానికి భ్రష్టు పట్టించలేదా ?

మైసూరు రాజ్యాన్ని పాలించిన టిప్పు సుల్తాన్‌వొద్ద నంజయ్య పంపులు పుంజ్రిగా వున్నాడు. లార్డ్ వెల్స్లీ వొద్ద లంచంతిని, బ్రిటిష్ సేనలకి అనుకూలంగా అర్ధరాత్రివేళ చిరుమానాపల్లి కోట తలుపులు తీసి వేయించాడు. ఉత్తమ నియోగి కుటుంబంలో జన్మించిన నంజయ్యపంపు చరకనవాణి దగ్గిర నౌకరీ జేసినప్పుడు, వర్ణధర్మం గుడ్డు గుడిసి పోలేదా ?!

అంచేత క్రీస్తు పూర్వం నించి క్రీస్తు తర్వాత అనేక శతాబ్దాల వరకూ, ఇండియాని ఏలిన వివిధ పాలకవర్గాలకి పుంజ్రులుగా - సేనా నాయకులుగా - దండనాధిపతులుగా - సలహాదారులుగా - కులగురువులుగా - కవులుగా - పురోహితవర్గానికి చెందిన పెద్దలు పనిజేసినప్పుడే వర్ణధర్మం నాశనమై పోయింది.చివరకి ఈనాడు గూడా అడుగడుగునా భ్రష్టు పడుతోండగా, నెత్తిన శిఖ(పిలక), మెడకి జంధెం వేసుకొన్నంత మాత్రం చేతనే, బ్రాహ్మణుగా చలామణీ అవడం సాధ్యమా ?

ఉపనయనం

శూద్రులూ స్త్రీలూ సమానం గాబట్టి, బ్రాహ్మణ స్త్రీలకు జంధెం వేయాల్సిన అవసరం కలగలేదు. బ్రాహ్మణ బాలురకు మాత్రం ఎనిమిదేళ్ళ తర్వాతనే వడుగు జేయాలని నిర్దేశించారు. అంటే - 8 ఏళ్ళలోపున వున్న బ్రాహ్మణ బాలురంతా శూద్రుల్తో సమానమేనన్నమాట. అంటుసొంటులకీ, మడి - పైల - యిత్యాదులకీ వీరు అతీతులు !

హిందూ సంఘంలోని వొక పురుషుని మెడలో జంధెం కనిపిస్తే, ఆతడు అగ్రవర్ణానికి చెందినవాడని మనం సాధారణంగా భావిస్తాం. అయితే కోమట్లూ, రాజులూ, కంసాలులూ, కమ్మవ్రాహ్మలూ, దేవాంగులూ, ఆర్య సమాజంవారూ యిత్యాదులు జంధెం వేసుకొన్నా, వారిని అగ్రవర్ణాల వారినిగా పరిగణించడం జరగదు. జంధెం వేసుకొన్న వ్రాహ్మడికే (ద్విజునికే) సంఘంలో ఈ పెద్దపీట లభిస్తుంది. వడుగు చేయడమనేది ఖచ్చితంగా ఏ శకాబ్దం నుండి అమల్లోకొచ్చిందో, మింత నిశితంగా పరిశీలించవలసిన అవసరముంది.

వడుగు చేసేప్పుడు, పెళ్ళికి చేసినంత హడావుడి చేస్తారు గాబట్టి బ్రిటిష్‌వారు ఈ వడుగును Thread marriage అని పిలిచారు. హిందువుల నొసటన పెట్టుకొనే పంగనామాలూ, వీబూదిరేఖలూ (నిలువు బొట్లూ - అడ్డబొట్లూ) చూచిన ఆంగ్లేయులు వీటిని Caste marks అని పిలిచారు. వాస్తవానికి వీటిని రెలిజియస్ మార్క్స్ అని పిలవాలి. జంధెం అనేది కుల చిహ్నం. పంచె కట్టుకొని, చేతిలో రాగిచెంబు పట్టుకొని, మెడలో జంధెం వేసుకొని, ఇంటింటికీ తిరుగుతో, తిథి వార నక్షత్రాలు చెప్పే ఆయవార వ్రాహ్మడు వైతం, సాంఘికంగా ఉన్నతుడుగానే మన సమాజంలో గౌరవింపబడుతోన్నాడు. మనదేశంలో అడుక్కు-తినడం - వొక కులానికి చెందిన పవిత్ర వృత్తి.

జంధెం ఉపయోగాలు

శూద్రక మహాకవి సంస్కృతంలో "మృచ్ఛకటిక" (మట్టిబండి) అనే సుప్రసిద్ధ నాటకం రాశాడు. దీనిలో శర్విలకుడు అనే వ్రాహ్మణ చోరుడున్నాడు. "ఈ జంధెం ఎంతో ఉపయుక్తమైంది. దీనితో కన్నం లోతును కొలవవొచ్చు. లయిపు గడియల్ని ఎత్తవొచ్చు. విషప్పురుగు కరిస్తే, కుట్టిన చోట దీనితో కట్టుకట్ట వొచ్చు" అని జంధెం ఉపయోగాలు

గూర్చి యీ బ్రాహ్మణ దొంగ గుప్తయుగంలోనే వివరించాడు. కందుకూరి వీరేశలింగంగారు జీవించియున్న కాలంలో, కొందరు బ్రాహ్మలు జంధేన్ని ఏ విధంగా ఉపయోగించేవారో, వీరేశలింగం తన ప్రహసనాల్లో వివరంగా వర్ణించాడు. కల్లుపాకలో ప్రల్లుతాగి, డబ్బు లివ్వకుండా దొంగ చాటుగా తప్పించుక పారిపోయే బ్రాహ్మలజంధెంపోగు పట్టుకొని, కల్లంగడివాడు నిలదీయగా, దాన్ని తెంపవొచ్చని అతన్ని కాళ్ళావేళ్ళా బతిమాలి, బేడడబ్బులకి జంధేన్ని తాకట్టు పెట్టి, నాటి కాలంలో కొందరు బ్రాహ్మలు కల్లు అంగడి నుండి బయట పడేవారని తెలుస్తోంది. అంతేగాదు - తాళం చెవులు కట్టుకోవానికీ, వీపు దురదపెడితే గోక్కోవానికీ జంధెం ఎంచక్కా పనికి వొస్తుంది. నేడు కాలేజీల్లో చదువుకొనే బ్రాహ్మణ విద్యార్థులూ, ఉద్యోగాలు చేసే బ్రాహ్మణ యువకులూ, జంధెం వేసుకోవడం మూసెన్నాగా ధరించి, దాన్ని పుడిచి, ఫుళీ అగ్గిపెట్టెలో భద్రంగా దాచేస్తోన్నారు. శుభాశుభకార్యాల సమయంలోనే, ఆడవాళ్ళ చేతిగడియారంలా మళ్ళీ దీన్ని ధరిస్తోన్నారు. అగ్రవర్ణ దురహంకారానికి పతాక సంకేతం లాంటి యీ జంధేన్ని అడ్డం పెట్టుకొని, వీరు బ్రాహ్మల్లా నేడు చలామణీ అవుతోన్నారు. సాధారణంగా బ్రహ్మజ్ఞానం గలవాడే - బ్రాహ్మడని చెబుతారు. అసలు - బ్రహ్మజ్ఞానమంటే ఏదిలో వీరు నిర్వచించగలరా?! ఏరిలో నూటికి వొకరైనా ఈ "బ్రహ్మజ్ఞాన" మనేది వుందా? అది - లేక పోయినప్పుడు యీ బ్రాహ్మణ నామం, పదవి డొడిపోయిన మాజీమంత్రి బిరుదుతో సమానం గాదా ?!

మనోళ్ళపై ప్రేమ చూపే మనోళ్ళు

ఇంటినివ్వనీ పరీక్షలకి చెందిన సైన్స్ ప్రాక్టికల్స్ జరుగుతున్న సమయంలో, లేబరేటరీలో ప్రాక్టికల్స్ జేసే బ్రాహ్మణ విద్యార్థులకి బయటనించి వొచ్చిన ఎగ్జామినర్లు లోపాయికారీగా సహాయం జేయడానికి,

ప్రేమగా భుజంపై చెయ్యివేసి, చొక్కాకింద జంధెం వుంకో లేదో నని తెలుసుకోవడానికి, చొక్కాను బొటన వేలితో నొక్కి చూస్తారట! వేలుకు జంధెం తగిలితే వొకరకం మార్కులూ, తగలక పోతే మరోరకం మార్కులూ వేస్తారట! అయితే ఈ విధంగా దొంగ మార్కులు వేయడం, వొక్క బ్రాహ్మణ విద్యార్థులకే పరిమితంగాదు. మెడికల్-ఇంజనీరింగ్ యిత్యాది కోర్సుల్లో, కమ్మ-రెడ్డి ఇత్యాది కులాలకి చెందిన విద్యార్థులకి గూడ దొంగ మార్కులు వేసి, "మనోళ్ళ"పై ఆప్యాయత చూపే "మనోళ్ళు" యూనివర్సిటీ - కాలేజీ - స్థాయిల్లో చాలా మంది వున్నారు.

హిందూ బ్రాహ్మలు, ఆర్యజాతికి చెందినవారనే అభిప్రాయాన్ని మన పాత కాంగ్రెస్ నాయకుల్లో అధిక సంఖ్యాకులైన బ్రాహ్మలు, పని గట్టుక ప్రచారం జేశారని లోమిలా ఢాపర్ చెప్పింది. అచ్చ స్వచ్ఛమైన ఆర్యరక్తం, హిందూ బ్రాహ్మల్లోనే వుందన్న మూఢనమ్మకం కొందరిలో నేటికీ వుంది. బ్రాహ్మల్లో హై ఓల్టేజ్ కరంటూ, శూద్రుల్లో లో ఓల్టేజ్ కరంటూ ప్రవహిస్తుందని శ్రీ విశ్వనాధ సత్యనారాయణ స్పష్టంగా చెప్పాడు. ఆర్య - బ్రాహ్మలు అనే మాట - అంతగా నేడు వినిపించక పోయినా, ఆర్యవైశ్యులు అనేది మాత్రం, యీ నాటికీ వినిపిస్తుంటుంది. అలాగే ఆర్య వైశ్య భోజనహోటల్ అనేది గూడా, అక్కడక్కడ మనకు కనిపిస్తుంటుంది!

తారుమారైన కులవృత్తులు

ఉద్యోగాలకోసం నేటి బ్రాహ్మలు అవలంభిస్తోన్న వివిధవృత్తులూ, చేస్తోన్న పనులూ, వర్ణసంకరానికి నేరుగా దారితీస్తో, ప్రాచీన బ్రాహ్మణ కులధర్మాన్ని నిలువునా కాల్చేసేవిగా తయారయ్యాయి. ఈనాడు పైరవీటు కంపెనీల దగ్గర నుండి ప్రభుత్వ కార్యాలయాల వరకూ, ఫ్యూనులుగా పని జేసే బ్రాహ్మలు చాలామంది వున్నారు. బ్రాంచీ షాపులు పెట్టి, మద్య

74730

విక్రేతయిగా - గవళ్ళ వృత్తి దార్లుగా - మారిన బ్రాహ్మలున్నారు.దాటా - చెప్పోనా - లాంటి చెప్పుల కంపెనీల్లో పనిజేస్తో, షాపుల్లో చెప్పులమ్ముతో, చర్మకార వృత్తిని స్వీకరించిన బ్రాహ్మలున్నారు. కోళ్ళా - సీమపందుల్ని పెంచి, మాంసం అమ్మే "కసాయి" బ్రాహ్మలున్నారు. వర్తక వ్యాపారాల్లో ప్రవేశించి, వైశ్య వృత్తిని చేబట్టిన కోమటి బ్రాహ్మలున్నారు. ఆహార - విహారాల్లో శూద్రుల్ని మించి వీరు మధ్య మాంసాల్ని సేవిస్తోన్నారు. పందు పార్టీల్లో - క్లబ్బుల్లో - దాక్లలో - బ్రాందీ విస్కీతాగే విస్కీశ్వర శర్మలూ, లాప్టింగులూ నడిపే సోమయాజులూ, నేడు తయారయ్యారు. చేపలకీ - జలపుష్పాలనీ, కోడిగుడ్లకీ - వీర్యాదిపళ్ళనీ, రొయ్యలకి వజ్రాలనే అందమైన పేర్లు పెట్టి, గుట్టుగా యిళ్ళలో సైతం కొందరు బ్రాహ్మలు భోంచేస్తోన్నారు. అయితే, కళింగ కోమట్లూ, ఓడ్ర (ఒరిస్సా) బ్రాహ్మలూ, వెంగారీ బ్రాహ్మలూ, పబ్లిగ్గానే చేపలు తింటారు.

అంచేత, ప్రాచీన బ్రాహ్మణత్వం - ద్విజత్వం - వీనాడో వల్లకాట్లో కలిసింది. నేటి బ్రాహ్మణ్యం అన్ని విధాలా అపభ్రంశమై పోయింది. "పరమ పవిత్ర"మైన యజ్ఞోపవీతం (జంధెం) నేడు వీపు గోక్కోడానికే పనికి వొచ్చింది. కొబట్టి, బూజుపట్టిన మూఢాచారాలకి దూరంగా, నేటి బ్రాహ్మణ యువతీ యువకులంతా జీవించడానికి చిత్తశుద్ధితో యత్నించాలి. మారిన కాలంతో పాటు వారూ మారి తీరాలి. పురో గత్యంతరం లేదు.

పాత కులాలు అదృశ్యం:
కొత్త కులాల పుట్టుక

మహాభారతంలో కన్పించే "సూత" కులం (కర్ణునిది) ఈనాడు మన దేశంలో లేదు. అలాగే కొద్ది శతాబ్దాల క్రితం వరకూ (మధ్య యుగాలకి పూర్వం వరకూ) లేని రెడ్డి - కమ్మ - వెలమ - తెలగ

యిత్యాది కులాలు, ఇతిహాస - పురాణాల్లో కరికానికైనా కన్పించని ఈ కులాలు నేడు మన సంఘంలో కొత్తగా రంగంమీద కొచ్చాయి.

యుద్ధాల్లో కిరాయి యోధులుగా పాల్గొన్నందుకు, బ్రాహ్మణేతర సామంతులకు సైతం, పదవ శతాబ్దంనించి గ్రామదానాలు లభించాయి. అంచేత, బ్రాహ్మలు సైతం కత్తి బట్టి ఖడ్గ తిక్కనలా కదనరంగంలో పాల్గొని, సామంతులుగా తయారయ్యారు. మహారాష్ట్రను పాలించిన పీష్వాల ద్వారా ఈ విధానం క్రీ. శ. 1720 తర్వాత అమల్లో కొచ్చింది. బ్రాహ్మణ విధులన్నీ తూచా తప్పకుండా నిర్వర్తించిన మహారాష్ట్ర పీష్వాలు, కులానికి బ్రాహ్మలు ; వృత్తి రీత్యా రాజులు!

"పెట్టి చాకిరీ చేయవలసిన శూద్రులు, రాజ్యాలేలారు. ఒక అస్పృశ్యుడు మంత్రిగా కూడా పని చేశాడు. భారతంలోనే గాక చరిత్రలో కూడా, బ్రాహ్మణులు రాజ్యపాలన చేశారు. యుద్ధాలలో క్షత్రియుల లాగా పోరాడి, గొప్ప వీరులనిపించుకొని, జాగీర్లు సంపాదించుకొన్నారు. వర్ణ ధర్మం యేనాడో నోదిలోకి రాకుండా పోయింది. కులాల ప్రస్తికిలేని జ్ఞాతికన్యలు, కులవ్యవస్థలో మహారాణు లయ్యారు. కుల వ్యవస్థ కూడా వర్ణవ్యవస్థ లాగే, చాలాసార్లు తారుమారయింది." (కొడవటిగంటి కుటుంబరావు - బ్రాహ్మణులు - పేజి-5)

బ్రాందీ సీసాలు అమ్మేవారంతా గవళ్ళవారేనా ?
చెప్పుల కంపెనీలు నడిపేవారంతా చర్మకారులేనా?

ఈనాడు బ్రాంది సీసాలూ అమ్మేవారంతా గవళ్ళవారు కాదు. బ్రాయిలర్ కోడి మాంసాన్ని, ప్యాకెట్ల ద్వారా సరఫరాజేసే వాంఛతా కసాయివారూ కాదు. పడతమంచాల - పడక గదుల - "లాడ్జింగులు" నడిపే వారంతా బోగం సానులూ కాదు. స్నోవైట్స్ లాంటి లాండ్రీలు

నడిపేవారంతా చాకళ్ళూ కాదు. చెప్పుల కంపెనీలు నడిపే వారంతా మాదిగలూ కాదు. వ్యాపారం జేసే వారంతా కోమట్లూ కాదు. డబ్బు సంపాదన ఏ వృత్తిలో వుంటే, ఆ వృత్తినే వీలైనంత వరకు అంతా అనుసరించడానికి యత్నిస్తోన్నారు. ఎలాంటి అడ్డమైన గడ్డి తినైనా, డబ్బు సంపాయించడమే, నేడు అత్యంత గౌరవనీయమైన ఉన్నత కులవృత్తి!

తరతరాల గుదిబండయే కులం

"మనం ఇంకా కులాలను పట్టుకు వేళ్ళాడుతున్నామే గాని, కుల ధర్మాలు మనని ఏనాడో వదిలి పోయాయి. అన్ని వృత్తులలోనూ, దాదాపు అన్ని కులాల వాళ్ళూ కనిపిస్తారు. ముఖ్యంగా ఈ పోటీ ధనార్జనకు ఎక్కువ అవకాశాలు గల వృత్తులలో - డాక్టరూ ఇంజినీరూ శాస్త్రవేత్తా ప్లీడరూ వగైరాలలో, కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. హీన వృత్తులలో, అనగా సంపాదన తక్కువగా వుండే వృత్తులలో, పోటీ అంతగా కన పడదు. పాకీ బ్రాహ్మణులూ, చర్మకారీ బ్రాహ్మణులూ, మంగలి బ్రాహ్మణులూ, మనకు కనిపించరు. ఒకప్పుడు కులాలు - వృత్తులను బట్టి ఏర్పడినా, ఈనాడు కులాలను బట్టి వృత్తులుండడం లేదు. ఆర్థికవ్యవస్థ - సామాజిక స్వరూపాన్ని నిర్ణయిస్తుందన్నది కూడా చాలా మందికి తెలియదు. అందుచేతనే, వైదిక ధర్మమనీ సదాచారమనీ కొట్టుకుపోయే వాళ్ళు అజ్ఞానులు. యీనాడు మనం వదిలించుకోవలసిన మూఢాచారాలలో, కులవ్యవస్థ ఒకటి. అది ఒకంతట వదిలేది కాదు. దానికి తోడు పాలక వర్గాల ఆసరా, మాటలలో కాకపోతే చేతలలో ఉండటం విచారకరం."

(కొడవటిగంటి కుటుంబరావు - బ్రాహ్మణులు - పేజి - 24)

"అధికారవర్గాలు తమ అధికారానికి, కులవ్యవస్థను సిగ్గులేకుండా వినియోగించుకొంటున్నారు. కులాల ఓట్ల కోసం, నియోజకవర్గాలను

రూపొందిస్తున్నారు. ప్రత్యేక కులాలవాళ్ళకు టిక్కెట్లు యిస్తున్నారు. కులాల ఆర్థిక పునాదులను పరిరక్షిస్తున్నారు. కులతత్వం బలంగా ఉండ టానికి, యింతకన్న పెద్ద ఆధారం వేరే అవసరం లేదు."

(కొడవటిగండి కుటుంబరావు - బ్రాహ్మణులు - పేజి - 5-సమతా పబ్లికేషన్స్- విజయవాడ)

దేశంలో అతికొద్ది మంది బ్రాహ్మలు మాత్రమే, నేడు సనాతనా చార సాంప్రదాయాన్ని అనుసరిస్తో "శుద్ధ శ్రోత్రియం"గా జీవిస్తోన్నారు. నేడు సాయుధ దళాల్లో సమస్త కులాలకి చెందినవారూ వున్నారు. నిజానికి యావత్ భారతచరిత్రలో, "క్షత్రియులు" అనేవారు లేనేలేరు. బ్రాహ్మణ-క్షత్రియ - వైశ్య - కులాలకి చాకిరీ చేయాల్సిన శూద్రులు, యీనాడు ఆపని చేయడం లేదు. అగ్రవర్ణాలవారి వృత్తులన్నిటినీ అనుసరించే శూద్రులు నేడు అవలంబించారు. పంచములుగా ఒకనాడు పరిగణించబడిన హరిజనులు, నేడు I. A. S. కలక్టర్ల దగ్గర నుండి గుమాస్తాల వరకూ, రకరకాల ఉద్యోగాలు జేస్తోన్నారు.

ప్రస్తుత సమాజంలో యీ కులవృత్తులు, యింత అపూర్వంగా తారుమారయ్యాయి. అయినా యథాతథస్థితి ద్వారా తరతరాలుగా లాభం పొందిన అగ్రవర్ణాలవారు మాత్రం, కులవ్యవస్థలో ఏ మార్పు వొచ్చినా తీవ్రంగా నష్టపడతారు గాబట్టి, వీరు యీ కులవ్యవస్థను కాపాడ్డానికి అహోరాత్రాలూ కృషిజేస్తోనే వున్నారు. మంత్రులుగా- పురోహితులుగా- రాజమంత్రులుగా - కులగురువులుగా - ఆచార్యులుగా - వున్న వొకనాటి బ్రాహ్మలకి, నేడు ఆ పదవులూ - ఆ భుజకీర్తులూ - దొరికిపోయాయి. గోల్వాల్కరూ - ఆర్.యస్.యస్. వారూ, ఆనాటి "పురోహిత్వ స్వర్ణయుగాన్ని" తిరిగి ప్రతిష్టించి, బ్రాహ్మణ రాజ్యాన్ని మళ్ళీ స్థాపించ డానికి నేడు చేస్తోన్న కృషియంతా శుద్ధదండగ.

ఆనాటి నిరుపహాలిస్థలాలూ, రమణీ ప్రియదూతికలు తెచ్చి యిచ్చే ఆ కప్పురవిడియాలూ, ఆ ఉద్యాల పుంజాలూ, కప్పుర వంటకాలూ, కమ్మని భోజనాలూ, కర్పూర హిమాంబు కుంకుమ రజఃకస్తూరికా చానాలూ, కనకాభిషేకాలూ, మాణిక్యాంగుళీయకాలూ, రత్నాంబరాలూ, తారహారాలూ, ముక్తాలసరాలూ, చింతారహిత జాగరత్వమూ, అగ్ర హారాలూ, అగ్నిహోత్రాలూ యిహరావు! అసంఖ్యాక ప్రజల్ని కొల్ల గొట్టి, పురోహిత వర్గానికి చేతికి ఎముక లేకుండా దానంజేసే నాథుడూ నేడు లేడు! ఆ చీకటి వ్యవస్థ గతంలోనే హతమైంది. రాచరిక ఫ్యూడల్ వ్యవస్థకి మారు, నేడు ప్రజాస్వామ్య వ్యవస్థ ఉనికిలో కొచ్చింది. నేటి యుగంలో కులం - మతం - పేరిట ఏక వ్యక్తి మరోవ్యక్తి శిరస్సుపై చెక్కి సవారీ జేసేందుకు వీల్లేదు. ఏ వర్గాధిపత్యమూ, ఏవర్ణ ఆధిక్యతా, ఎవడూ అంగీకరించని చారిత్రక దశలో జీవిస్తున్నపుడు, అంతా కులమత భేదాల ప్రస క్తి లేకుండా, మారిన పరిస్థితు లకి అనుగుణంగా జీవితాన్ని మలచుకో వలసిందే. అన్యధా శరణం నాస్తి!

కులవ్యవస్థకి చెందిన ఏకనాటి డొక్కుచట్రం నేడు అదృశ్యమైనా, మానసికంగానూ అంతర్గతంగానూ అత్యధిక సంఖ్యాకులైన మన ప్రజలు, యీ కుల దానిసల్వం నించి యింకా బయటపడనే లేదు. యీ కులపిశాచి కబంధ హస్తాల నించి పూర్తిగా విముక్తి కావడానికి, యింకా ఎన్ని దశాబ్దాలు - శతాబ్దాలు - పడుతుందో యిప్పుడే చెప్పడంకష్టం. కులతత్వం అమల్లో వున్నంత వరకూ, ఈ దేశం పురోగమించడం అసాధ్యం. మనం ఏక నేషన్‌గా మనడమూ దుర్లభం. ఇండియాలోని ఫ్యూడల్ వ్యవస్థ మొక్క ధారిక పునాదియైన ఈ కులాన్ని - సాంస్కృతిక సామాజిక రంగాల్లో సమస్త అభివృద్ధి నిరోధక అంశాలకీ మూలకందమైన యీ కులాన్ని - సర్వనాశనం జేయనంత వరకూ, బూర్జువా ప్రజాతంత్ర

ఉద్యమం సైతం ముందుకు పోలేదు. కనీసం బూర్జువా సంస్కృతి విలసిల్లడానికి సైతం, ఈ కులవ్యవస్థ ఆటంకంగా పరిణమిస్తుంది. అంచేత యీ కులరక్కసిని మనం నిర్దాక్షిణ్యంగా హతమార్చనంతవరకూ, మనకు భవిష్యత్తులేదు. ముమ్మాటికీ లేనే లేదు.

కులవ్యవస్థకి చెందిన అనేకానేక సమస్యల గూర్చి, విభిన్న అభిప్రాయాలు గల్గిన వ్యక్తులు వివిధ దృక్కోణాల నించి వెలిబుచ్చిన భావాల్ని యిందులో పొందుపరిచాను. యీ భావాల్లోని గుణదోషాల్ని అంతిమంగా నిర్ణయించ వలసినవారు పాఠకులే. ఆధునిక యుగంలో కులవ్యవస్థ యొక్క స్వరూప స్వభావాల్ని చర్చించేందుకి నేను చేసిన ఈ ప్రయత్నాన్ని, ఆంధ్ర పాఠకలోకం ఆదరిస్తుందని ఆశిస్తోన్నాను.

26-1-1980

సి. వి.

1. గాంధి - అంబేడ్కర్

"వర్ణవ్యవస్థకి సైంటిఫిక్ ప్రాతిపదిక వుందని, నేను అభిప్రాయ పడుతోన్నాను. ఈ వ్యవస్థకి వ్యతిరేకంగా హేతువు తిరుగుబాటు చేయదు" అని గాంధీజీ అన్నాడు. (In my opinion, caste system has a scientific basis. Reason does not revolt against it.)

ఆయన ఈ క్రింది విధంగా గూడా చెప్పాడు:

"మతానికీ కులానికీ ఏ విధమైన సంబంధమూ లేదు. కులమనేది ఒక ఆచారం. ఈ కులం యొక్క మూలం నాకు తెలియదు. నా ఆధ్యాత్మిక దాహం తీర్చుకోవడానికి, దీని మూలం (Origin) తెలుసుకొన వలసిన అవసరమూ నాకు లేదు."

"యీనాటి మన దౌర్భాగ్యపరిస్థితికి, కులం కారణంకాదని నేను అభిప్రాయపడుతున్నాను. మన దురాశ, ప్రాథమిక విలువలపట్ల మనకున్న నిర్లక్ష్యమే, మనల్ని జానిసత్వంలో ముంచింది. హిందూమతం అంత మొందకుండా, కులమే రక్షించిందని నేను విశ్వసిస్తున్నాను. చాతుర్వర్ణ వ్యవస్థ మౌలికమయినది (ఫండమెంటల్) సహజమైనది; (నేచురల్) అవసరమైనది—అని నేను భావిస్తున్నాను. యీ చాతుర్వర్ణ వ్యవస్థను

నాశనంజేసే ఏ ప్రయత్నానికైనా, నేను నిస్సందేహంగా వ్యతిరేకినే. అసమానత్వ ప్రాతిపదికపై కులవ్యవస్థ ఆధారపడలేదు."

"మానవ స్వభావంలోనే వర్ణాశ్రమ ధర్మం అంతర్గతంగా వుందని, నేను అభిప్రాయ పడుతోన్నాను. హిందూమతం యీ వర్ణధర్మాన్ని సైన్స్ కిందకి కుదించింది. యీ వర్ణధర్మం, వ్యక్తియొక్క జన్మకి సంబంధించింది. దీని ప్రకారం యిష్టమొచ్చినట్లు ఎవరు వ్యక్తీ తన కులాన్ని మార్చడానికి వీలులేదు. ధర్మానికి తరొగ్గకపోవడమంటే, వారసత్వానికి చెందిన నిబంధనను (Law) నిర్లక్ష్యం చేయడమే." కోహినూర్ వజ్రంకన్న విలువైన యీయన భాష్యాన్ని ప్రత్యేకంగా వ్యాఖ్యానించవలసిన అవసరం లేదు.

పాకీవాడుగా జన్మించినవాడు పాకీవాడుగానే వుండాలి

"జన్మ - కర్మ - రీత్యా నేను వర్ణాశ్రమ ధర్మాన్ని విశ్వసిస్తాను. కాని పాకీవానిని (భంగీ) నేను తక్కువ వాణ్ణిగా మాత్రం భావించను."

"పాకీవాడుగా జన్మించినవాడు, పాకీవాడుగానే వుంటూ తన జీవనోపాదిని సంపాయించుకోవాలి. ఆ తర్వాత ఆతడు ఏదైనా చేసుకోవొచ్చు. ఎందేతనంటే, లాయర్‌కి ఆతని వృత్తి ఎంతగా గౌరవప్రదమైనదో, పాకివానికిగూడా ఆతని వృత్తి అంతగా గౌరవప్రద మైనట్టిదే. నా ప్రకారం హిందూమతమంటే యిదే."

"సాంప్రదాయ సిద్ధంగా వొస్తున్న తన కులవృత్తిని విసర్జించినప్పుడే, ఒక వ్యక్తీ కులాల గందరగోళాన్ని సృష్టిస్తాడు- అనే విషయం స్పష్టమే. ఒక బ్రాహ్మడు తన జీవనోపాదికోసం మంగలి - లేదా - ఇంజనీరు వృత్తిని స్వీకరించినప్పుడు, ఆతడు గందరగోళాన్ని సృష్టిస్తాడు.

ఆ విధంగానే మంగలిగానీ, లేదా ఇంజనీరుగానీ, ఆధ్యాత్మిక బోధ చేయడం ద్వారా బ్రాహ్మణ వృత్తిని అనుసరించినప్పుడు, యిదే కుల గందర గోళాన్ని సృష్టిస్తాడు."

అంటే గాంధీజీ ప్రకారం, మంగలి - మంగలిగానేవుండి, తన తర తరాల కులధర్మాన్ని నిర్వర్తించాలి! అలాగే బ్రాహ్మడూ తన వర్ణధర్మాన్ని నిర్వర్తించాలి. అలాగాక ఈ వర్ణ ధర్మాలు తారుమారైతే, కుల గందర గోళం వస్తుందని గీతాకారుడులా గాంధీజీ హెచ్చరిస్తున్నాడు! అంతేగాదు; వైశ్యుడిగా పుట్టిన గాంధీజీ, వ్యతిరిక్తా చిల్లరకొట్టు పెట్టుకొని వ్యాపారం చేయాలి. కాని ఇంగ్లండులో బారిస్టర్ చదివి, దక్షిణాఫ్రికాలో ప్లీడరుగా ఎంచేత ప్రాక్టీస్ చేశాడు? వ్యాపారాన్ని వొదిలి, రాజకీయాల్ని ఎంచేత స్వీకరించాడు?! ఈ విధంగా చేయడం కుల గందరగోళాన్ని సృష్టించడం గాదా?!

"నేను హిందూమతాన్ని ఉద్ధరించ తలపెట్టాను. పంచములు హిందూ సంఘంలో అంతర్భాగమని నేను భావిస్తోన్నాను. హిందూమతం లోంచి వొక్కొక్కొక్క పాకీవాడు పుట్టి మరణంలోకి వెళ్ళినా, నేనెంతో తీవ్రంగా బాధపడతాను. అయితే, అన్ని వర్గ వ్యత్యాసాలూ అంత మొందించబడతాయని మాత్రం నేను విశ్వసించను."

"బ్రాహ్మలూ క్షత్రియులూ శూద్రులూ గోవును రక్షించలేరా? గోవుకోసం చావడానికి సైతం సిద్ధంగానివాడు, హిందువుగా వుండగలడా?"

వర్ణాంతర వివాహాలు : సహపంక్తి భోజనాలు

"పుట్టుక - వివాహమూ - పాపకార్యాలు. జనన - మరణాలనించి వ్యక్తి పొందే స్వేచ్ఛయే మోక్షం. ఆత్మ సాక్షాత్కారం త్వరగా కావడానికి, వర్ణాంతర వివాహాన్నీ - సహపంక్తి భోజనాన్నీ నిషేధించం

అవసరం." (Prohibition against inter-caste marriage and interdining is essential for rapid evolution of soul.) [Gandhi and Gandhism-Dr. Ambedkar-Bheem Patrika Publications.]

ఇంతటి "విప్లవాత్మకమైన" భావాన్ని వెలువరించిన గాంధీజీతో, గోరాగారు యే విధంగా సాహచర్యం జేశారో మనకు అర్థంగాదు. "అస్పృశ్యత ధర్మశాస్త్ర సమ్మతమే"నని చెప్పిన గాంధీజీ, అస్పృశ్యతా నిర్మూలనకోసం కృషిచేశాడు. అంటరానివారుగా పరిగణించబడిన పంచములకి, ఆయన "హరిజనులు" (దేవుని బిడ్డలు) అనే కొత్తపేరు పెట్టాడు. కాంగ్రెస్ ప్రభుత్వాలు షెడ్యూల్డు కులాలవారికి, ప్రత్యేక కన్సెషన్లు యివ్వాలని ఆయన సూచించాడు.

కులమూ - మతమూ - గూర్చి గాంధీజీ యిలాంటి "సుందరమైన" భావాలు కలిగినవాడు కాబట్టే, బ్రాహ్మలూ - తదితర అగ్రవర్ణాలవారూ - నాటి జాతీయోద్యమంలో పాల్గొని, దానికి ప్రధానంగా నాయకత్వం వహించారనే విషయం, ప్రత్యేకంగా యిక్కడ గమనార్హం! అంతేగాదు. మహారాష్ట్రలోని జ్యోతిబా ఫూలే - పహదేవ గోవిందరెనడె, తమిళనాడులో రామస్వామినాయకర్, ఆంధ్రలో రఘుపతి వెంకటరత్నం - త్రిపురనేని రామస్వామి - తాపీ ధర్మారావు యిత్యాదులు, కాంగ్రెస్‌కి దూరంగా వుండి, తమ శక్తికొద్దీ కుల - మతాలకీ, మూఢాచారాలకీ వ్యతిరేకంగా పోరాడారు.

ధర్మకర్తృత్వ సిద్ధాంతం

గాంధీజీ ధరించే కొల్లాయిగుడ్డా - బోసినవ్వూ - భారత ప్రజల్ని ముగ్ధుల్ని జేశాయి. అంచేతనే, "కొల్లాయి గట్టిలేనేమీ-మా గాంధి కోపుచ్చి పుట్టితేనేమీ" అని సుప్రసిద్ధ భావకవి - బసవరాజు అప్పారావు అన్నాడు. "నేను రాజకీయాలు చేపట్టిన మహాత్ముణ్ణి కాను. మహాత్ముడు కావడానికి యత్నిస్తోన్న రాజకీయవాదిని మాత్రమే" అని, ఆయన పదేపదే

చెప్పుకొన్నాడు. పేదప్రజల్ని ఉద్ధరించడానికి పోటీశ్వరులు సిద్ధపడాలనీ, సామాజిక సంపద పాలిట వారు ధర్మకర్తలుగా వ్యవహరించాలనీ ఆయన కోరాడు.

జెరూసలెం దేవాలయం నించి ఏసుక్రీస్తు వ్యాపారస్తుల్ని తరిమి వేశాడు. ఒక చెంపమీద కొడితే, రెండవ చెంపను యివ్వమని జీసస్ అహింసాబోధ చేశాడు. అయితే నాటి యూదు పురోహితులు, ఆయన రెండు చెంపలూ వాయించడంతోపాటు, జీసస్‌ను అత్యంత అమానుషంగా శిలువ వేశారు. గొర్రెలు ప్రార్థించినంత మాత్రాన, తోడేళ్ళకి హృదయ పరివర్తనం కలగదు! పాముకీ కప్పకీ సహజీవనం, ప్రకృతిలోనే పూర్తిగా అసాధ్యం గదా?! అంతేగాదు; నాటి యూదు పురోహితుల్ని ఆయన సున్నంగొట్టిన సమాధులని అత్యంత నిశితంగా విమర్శించాడు. కాని ఆ సున్నంగొట్టిన సమాధులే, మారు వేషంలో, పురో భాషలో, ఆయన సిద్ధాంతాల్ని తమ భుజాన వేసుకొని, అనంత కాలంలో అడ్డమైన వ్యాఖ్యానాలతో వాటికి గబ్బు పట్టించారు.

బుద్ధుడు తన శిష్యులకి, ఒక భిక్షాపాత్రా - రెండు గుడ్డముక్కలూ మినహా, మరేవీ వుండగూడదని నిషేధించాడు. కాని ఆయన కళ్ళముందే, ఆయన శిష్యుడయిన అజాతశత్రువు, రాజ్యంకోసం తన తండ్రినే హత్య చేశాడు.

ఆ విధంగానే కోట్లకి పడగలెత్తిన మహాత్ముని శిష్యులు, "ధర్మకర్తలు"గా తాము గడించిన లాభాలలో అవగింజంత యివ్వమని అడిగిన కార్మికులపై, అత్యంత కిరాతకంగా తుపాకులు కాల్పిస్తోన్నారు. తమ పాపపరిహారార్థం వారు చలవరాళ్ళతో గుళ్ళుకట్టించి, పుణ్యాత్ముల్లా చలామణి అవుతోన్నారు. అంచేత, గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతానికీ ఆయన

జీవితకాలంలోనే యీ 'ఖర్మ' పట్టింది. కాబట్టి, కథలూ కావ్యాలలో ఈ నీతిబోధల వల్లింపులు ఎంత మనోహరంగా వున్నా, వాస్తవ జీవితంలో యివి ఏ మాత్రం ఆచరణ సాధ్యంగావు. తన తియ్యని తలపులు - తన కళ్ళ ముందే ముక్కచెక్కలై పోతోంటే, తన సిద్ధాంత స్వప్నసౌధాలు పేక మేడల్లా అమాంతం తన కళ్ళముందే కూలిపోతోంటే, చరిత్రకీ-ప్రజలకీ-యెవ్వరికీ పనికిరాని తన ప్రియమైన ప్రణాళికలు విరిగిపోతోంటే, ఆయన పడిన వేదన అట్యంత విషాదకరమైంది!

సోషల్ టోరి

"మహాత్ముడు ఆధునిక భారతదేశాన్ని, తన సాంఘిక చారిత్రక అవగాహనకు అనుగుణంగా, పునర్ నిర్మించాలని భావించాడు. ఈ విషయంలో, ప్రధానంగా మధ్యయుగాలనాటి భారతదేశ నిర్మాణ పద్ధతికీ, నాటి మౌలిక భావాలకీ, ఆయన ప్రతినిధి తప్ప మరొకటి కాదు. యీ భావాల్నే ఆయన "హిందూ స్వరాజ్" పత్రికలో రేఖామాత్రంగా వివరించాడు. పాత కాలపు ఉత్పత్తి విధానంపై, సాధనాలపై, ఆధారపడ్డ సాంఘిక - ఆర్థిక - వ్యవస్థను ఆయన వాంఛించాడు. రాట్నమూ, ఎడ్లబండీ, అస్పృశ్యతలేని వర్ణాశ్రమ ధర్మమూ, యివే ఆయన కోరిన సాంఘిక వ్యవస్థకి మూలమైనవి. కోటీశ్వరుల సంపదను, వారి ధర్మనిధిగా మారిపోవలి వేయమని ఆయన కోరాడు. కుటుంబ ప్రాతిపదికగా బ్రహ్మచర్యాన్ని ఆచరించాలనీ, అహింస ద్వారా పైరుధ్యాల్ని పరిష్కరించుకోవాలనీ, సన్మార్గుని దుఃఖంద్వారా దుర్మార్గునికి హృదయ పరివర్తన కలగజేయాలనీ ఆయన కోరాడు. ఏ విధమైన పోరాటాన్నయినా ఆయన వ్యతిరేకించాడు. ఆయన జీవిత కాలంలోనే యీ అభిప్రాయాలన్నీ పూర్తిగా వమ్మయి పోయాయి." (డాంగే-చరిత్ర బోధక శక్తులు - పేజీ 11)

సాంఘికంగా యింతటి అభివృద్ధి నిరోధకమైన భావాల్ని వెలువరించినందువల్లనే, గాంధీని "సోషల్ టోరి" అని అంబేడ్కర్

అభివర్ణించాడు. పైకి కన్పించే లిబరల్ భావాల పొటున, పరమ ఛాందసమైన భావాలు దాక్కొని వున్నాయని గూడా ఆయన వ్యాఖ్యానించాడు.

"గాంధీగారు దగుల్బాజీ కులాన్ని (Cursed caste) సమర్థిస్తున్నాడు. ఫెనటిక్ హిందువైన ఆయన హిందూమతానికి వత్తాసు యిస్తున్నాడు" అని అంబేడ్కర్ అన్నాడు.

ఎవరికోసం ఈ రాజకీయాధికారం?

"బ్రిటిష్‌వారిపై విజయం సాధించిన తర్వాత, గాంధీగారు ఏమి చేయదలచు కొన్నారు? తాను పొందదోతున్నానని ఆయన ఆశించే యీ స్వాతంత్ర్యంతో, అస్పృశ్యుల్ని బానిసత్వంనించి విడిపిస్తాడా? కాక - అస్పృశ్యులు బానిసల్లా వుండేందుకు యీ స్వాతంత్ర్య సహాయంతో హిందువులకి ఇంతకి పూర్వంలేని అసాధారణమైన అధికారం యిస్తాడా? గాంధీగారూ హిందువులూ వొక నూత్న సమాజాన్ని నెలకొల్పుతారా? కాక, స్వేచ్ఛ - సమానత్వం - సౌభ్రాతృత్వాల్ని నిరాకరించి, కులాల్నీ అస్పృశ్యతనీ పాటించే సాంప్రదాయ సిద్ధమైన హిందూ ఇండియాను పునఃస్థాపించడంతోనే వీరు సంతృప్తి చెందుతారా? ఈ ప్రశ్నల కివ్వబడే సమాధానాలపైనే, గాంధీగారు జేస్తున్న పోరాటం, స్వాతంత్ర్య పోరాటమో - కాక - అధికారం కోసం చేసే యుద్ధమో (War for power) అనే విషయం మాకు తెలుస్తుంది అని అంబేడ్కర్ అన్నాడు.

గాంధీజి: అస్పృశ్యత

గాంధీజి అస్పృశ్యతను మాత్రమే వ్యతిరేకించాడుగాని, కుల వ్యవస్థను మాత్రం కాదు. "కుల వ్యవస్థను విశ్వసించిన గాంధి, సనాతన

సాంప్రదాయవాదుల శక్తితో దాన్ని సమర్థించాడు" అని అంబేడ్కర్ అన్నాడు. (కుల నిర్మూలన - పేజీ - 127)

"అమెరికన్ దానిసల దాధలపట్ల అపాదమస్తకం తల్లడిల్లిపోయిన జెఫర్సన్‌లాంటి వ్యక్తి, ఇండియాలోని హిందువులలో ఎవరికైనా కన్పిస్తాడా? అస్పృశ్యతకి వ్యతిరేకంగా హిందువుల ఆగ్రహాన్ని ప్రదర్శించడంలేదు. హిందువుల దృష్టిలో అస్పృశ్యత నైతిక పాపమూ గాదు. పౌర సంబంధమైన నేరమూగాదు. అది - క్రికెట్ లాంటి వొక ఆట మాత్రమే."

"గాంధీగారు హరిజనోద్ధరణకై కృషిజేయడం లేదా? అని ఆయన మిత్రులు కొందరు ప్రశ్నిస్తున్నారు. హరిజన సేవక్ సంఘాన్ని ఆయన స్థాపించలేదా? అని వీరు అడుగుతున్నారు. ఈయన స్థాపించిన హరిజన సేవక్ సంఘం యొక్క ఉద్దేశం ఏమిటి? హిందూ యజమానుల నుండి అస్పృశ్యులు తమ స్వేచ్ఛను సాధించుకోవడానికి, వారిని యీ సంఘం సిద్ధంచేస్తుందా? హిందూ యజమానులతోపాటు సమాన ధాయిలో, సాంఘిక - రాజకీయ రంగాలలో సమానులుగా అస్పృశ్యులు తయారు కావడానికి .యీ సంఘం కృషి జేస్తుందా? గాంధీగారికి ఈ విధమైన ఉద్దేశమేదీ లేదు. యీ రకమైన కృషిని సాగించడం ఆయన కేమాత్రం యిష్టంలేదు. అంతేగాదు - ఆయన యీ పని ఎన్నడూ చేయలేదు. ప్రజా స్వామ్యవాది - విప్లవకారుడయిన వ్యక్తి మాత్రమే, యీ కృషిని చేయగలడు. ఈ రెంటిలో గాంధీగారు ఏదీగాదు. జన్మరీత్యానూ - విశ్వాసం రీత్యానూ - ఆయన పరమ అభివృద్ధి నిరోధకుడు. (He is a Tory by birth as well as by faith.) హరిజన సేవక్ సంఘం పని - అస్పృశ్యతను ఉద్ధరించడానికి కాదు. హిందువులకే హిందూ మతానికీ భద్రంగా వుండే విధంగా, ఇండియాను దిద్దడమే ఆయన ప్రధానోద్దేశం. యీ విషయం ఆత్మగౌరవంగల ప్రతి అస్పృశ్యునికీ తెలిసించే.

అంటరానివారి కొరకు ఆయన పోరాటం చేయటం లేదనేది - స్పష్టమే. హరిజన సేవక సంఘం ఆధ్వర్యాన బుల్లిబుల్లి (Petty) బహుమతుల్ని నిరుపేద హరిజనులకి పంచడంద్వారా అస్పృశ్యుల్ని కొనడానికీ, పంజా విప్పుతోన్న వారి కోపాగ్నిపై నీరు చల్లడానికీ యీయన ప్రయత్నిస్తున్నాడు. అయితే ఈ అస్పృశ్యుల కోపాగ్నియే కులవ్యవస్థను సర్వనాశనం జేసి, ఇండియాలో నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పగలిగిన శక్తియని గూడా ఆయనకు తెలుసు. హిందూ మతమూ - హింసా కులవ్యవస్థా - యథాతథంగా వుండాలని గాంధీగారు కోరుతోన్నాడు. అస్పృశ్యులు హిందువులుగానే వుండాలనిగూడా ఆయన వాంఛిస్తున్నాడు. అయితే వారు ఏ విధంగా వుండాలని? హిందువుల భాగస్వాములుగా గాక, వారి పేద బంధువులుగా మాత్రమే వుండాలని ఆయన కోరుతోన్నాడు. అస్పృశ్యుల పట్ల గాంధీగారు దయ చూపుతోన్నాడు. ఎందుకు? సపరేషన్ కోసం వారు నిర్వహిస్తున్న ఉద్యమాన్నీ, సవర్ణ హిందువుల దాస్యంనుండి స్వేచ్ఛను కోరుతున్న వారి ఉద్యమాన్నీ, హతమార్చడానికే ఆయన ఈ దయ చూపుతోన్నాడు."

కులవ్యవస్థ

"ఒక కులానికి వ్యతిరేకంగా మరో కులం, ద్వేషయుక్తమైన గీతాలాపన చేయడమే కులవ్యవస్థలో జన్మిస్తుంది. హిందువుల సాహిత్య మంతా కులానికి చెందిన వంశవృక్షాలతో నిండిపోయింది. ఈ వంశవృక్షాలతో ఒక కులానికి ఉన్నతమైన పుట్టుకనూ మరొకొన్ని కులాలకి నీచమైన పుట్టుకనూ అంటగట్టారు." "పురాణాలకి చెందిన కట్టుకథలతో నిండిన చాతుర్వర్ణ వ్యవస్థ హేతుగా నిష్ప్రయోజనమైంది. దాని పేరెత్తితేనే నాకు పట్టరాని కోపం వొస్తుంది."

"సవర్ణ హిందువులకూ అస్పృశ్యులకూ మధ్య ఏర్పడిన గండి - మతపరమైంది. సంఘపరమైంది. శతాబ్దాలుగా నెలకొన్న ఈ అసమ సంబంధాలు, బానిసకీ - బానిస యజమానికీ - మధ్యవున్న సంబంధాలవలె వుండిపోయాయి."

"కులమనేది మౌలికంగా హిందువులకి చెందింది. హిందువులు పరిశుభ్రమయిన గాలినంతటినీ, దుర్గంధభూయిష్టం జేసినందువల్ల, సిక్కులకీ - ముస్లింలకీ - క్రైస్తవులకీ ఈ కులజాడ్యం అంటింది."

(గాంధి అండ్ గాంధీయిజం)



2. వివిధ మతాల్లో కులవ్యవస్థ

హిందూమతమంటే రకరకాల కులాలున్న మనుషుల సమూహమే. క్రైస్తవ - ముస్లిం - మతాల్లో కులవ్యవస్థ లేకపోయినా, ఇండియాలోని హిందూమత ప్రభావం వల్ల, మాల - మాదిగ - రెడ్డి - కమ్మ - క్రిస్టియన్లు ఉన్నట్లే, ముస్లిములో గూడా తురక చాకళ్ళు - తురక మంగళ్ళు ఉనికిలోకి రావడం విడ్డూరమైనా చారిత్రక వాస్తవమే! అంటే - ఈ కుల పిశాచి, కులంలేని క్రైస్తవ - ముస్లిం - ప్రజలపై గూడా తన కిరాతక కబంధహస్తాల్ని చాచగల్గింది. అలాగే హిందువుల్లో వుండే నల్లపూసలూ, మంగళసూత్రాలూ, మెట్టెలూ, యీ రెండు మతాలకి చెందిన స్త్రీలలోకి సైతం వ్యాపించడం ప్రత్యేకంగా గమనార్హం.

ప్రాచీన హిందూ సైన్యంలో కులాలు

ప్రాచీన హిందూ సంఘంలోనే గాక, ఆనాటి హిందూ సైన్యంలో సైతం కులవ్యవస్థ వుండేది. ఇందుకు ప్రత్యక్ష సాక్షం - కౌటిల్యుని అర్థశాస్త్రమే!

క్రీ. పూ. 326 లో అలెగ్జాండర్ ఇండియాపై దండెత్తాడు. గ్రీకు సైన్యాన్ని ప్రతిఘటించడానికి నాటి హింసూ రాజైన పురుషోత్తముడు (పోరస్) జీలంనదీ తీరాన సైన్యసమేతంగా మోహరించి వుండగా, ఇవతలి

ఒడ్డున అలెగ్జాండర్ సర్వసన్నద్ధుడై వున్నాడు. చీకటిపడ్డ తర్వాత హిందూ సైనికులు కులాలవారీగా పొయ్యిలు పెట్టుకొని, ఎవరి వంట వారు చేసుకోవడం ప్రారంభించారు. హిందూ సైనికుల్లోని యీ కుల చీలికల్ని గమనించిన అలెగ్జాండర్, పురుషోత్తముణ్ణి సులభంగా ఓడించ వొచ్చునని భావించినట్లు సాంప్రదాయం ద్వారా మనకు తెలుస్తోంది.

కౌటిల్యునికి పూర్వమున్న అర్థశాస్త్రవేత్తలు, బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్ర-సైనికులు అంటూ, వర్ణవ్యవస్థ ప్రాతిపదికగా సైనికుల్ని వర్గీకరించారు! మిగతా కులాల సైనికులకన్న బ్రాహ్మణ సైనికులు ఎందుకు అధికులంటే, వారియొక్క తేజస్సు వల్లనేనని నాటి సిద్ధాంతవేత్తలు నిర్ధరించారు! అయితే కౌటిల్యుడు యీ బడుద్ధాయి సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. సైనికుల క్రమం గూర్చి, పూర్వ శాస్త్రవేత్తలు వెలిబుచ్చిన అభిప్రాయాల వల్ల రాజ్యభద్రతకు భంగం వాటిల్లుతుందని ఆతడు చెప్పాడు.

భారతీయ సైన్యంలో కులతత్వం

ఇన్ని శతాబ్దాలు గడిచినా, నేటికీ భారతీయ సైన్యంలో కులాల పేరిట కొన్ని రెజిమెంట్లు కొనసాగింపబడుతోనే వున్నాయి. ఉదహరణకి-జాట్ రెజిమెంటూ, మరాటా రెజిమెంటూ యిలాంటివే. ఉత్తర భారతంలోని "యాదవులు" తమ కులం పేరిట, వొక ప్రత్యేక రెజిమెంట్ నిర్మించాలని రక్షణశాఖా మంత్రిని కోరారు! అఖిల భారత యాదవ సంయుక్తాధ్యక్షుడూ - హర్యాన మాజీ ముఖ్యమంత్రియైన శ్రీ రావు బీరేంద్రసింగ్ యాదవ్, తమ కులం పేరుతో వొక రెజిమెంట్‌ను ఏర్పాటు జేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాడు! అకుంఠిత ధైర్య సాహసాల్తో దేశాన్ని రక్షించడమనేది, ఇండియాలోని ఏ కులం యొక్క ప్రత్యేక లక్షణమూ గాదు. సైన్యంలో కులాల పేరిట రెజిమెంట్స్ వుండడం చాలా ప్రమాదకరం. కులాల పేరిట రెజిమెంట్లు ఏర్పాటు చేయమని కోరడం - అంతకన్న బుద్ధిమాంద్యం.

భారతీయ సైన్యంలో గూడా కులతత్వముంది. ఉత్తర భారతంలోని జాట్స్ (చరణ్‌సింగ్ కులంవాళ్ళు), ఆహిర్ కులస్తుల్ని అంతగా తమలో కలవనివ్వరు. రాయల్ సిక్కు రెజిమెంటువారు, రాంఘాసియా సిక్కు యూనిట్‌ను చిన్నచూపు చూస్తారు. మరాఠా యూనిట్‌వారు, మహర్స్‌ను (మహారాష్ట్రలో అంబేడ్కర్ కులంవాళ్ళు) హీనంగా చూస్తారు. ఈ కుల-మత-విచక్షణను నేటికీ మన సైన్యంలో కొనసాగిస్తోన్నారు. ఈ విషయం గూర్చి కర్నల్ బియన్‌కాల్ ఈ విధంగా చెప్పాడు: "నిజానికి దీన్ని జాతీయ సమస్యగా పరిగణించి ఆలోచించాల్సిన అవసరముంది. అన్ని రంగాలలోనూ జాతి కుల మత విచక్షణను రూపుమాపటానికి ప్రయత్నిస్తు వుండగా, సైన్యంలో మాత్రం ఈ విచక్షణను కొనసాగించటం పరిపాటి అయిపోయింది."

"యీ జాతులూ కులాలవారీగా రెజిమెంట్లను విభజించే విధానం, బ్రిటిష్‌వారికే గాక మన భారతీయులకు గూడా చాలా అలవాటైంది. జాతి కుల మత ప్రాంతీయ సంకుచిత తత్వాలకు అతీతంగా, సైనికోద్యోగులను ఎన్నుకోవటం శ్రేయస్కరం. వారిలో నమ్మకముంచి, శిక్షణ యిచ్చి, ఆయుధాలిచ్చి, జాతీయతా దృక్పథాన్ని పెంపొందిస్తే, భారతీయ సైనికులంతా సమానంగానే పోరాడగలరు." (సైనికుల ఎన్నికలో సనాతన ధోరణులు - ఈనాడు - 27-8-78)

హిందూమతంలోని అత్యధిక సంఖ్యాకుల్ని శూద్రులూ - పంచములుగా పరిగణించిన బ్రాహ్మణమతం, వారిని హీనాతి హీనంగా చూచింది. ప్రత్యేకంగా అంటరానివారి బతుకుల్లో, యీ బ్రాహ్మణమతం నిప్పులు పోసింది. ఇలాంటి సంఘ బహిష్కృతులే, క్రీ.పూ. 6వ శతాబ్దంలో జైన - బౌద్ధ - మతస్థులుగానూ, ముస్లిం దండయాత్రల తర్వాత మహమ్మదీయులుగానూ, బ్రిటిష్‌వారి హయాంలో క్రైస్తవులుగానూ

మాత్రమే పోయారు. హింసామతాన్ని వ్యతిరేకించే ఏ కొత్తమతంలోనైనా, ఇండియాలోని వేదప్రజలు జేరడానికి - యిదే - ప్రధాన కారణంగా కన్పిస్తోంది. "ది ఆర్య్యనైజేషన్ ఆఫ్ ఇండియా" అనే గ్రంధంలో, డాక్టరు వ్యవేంద్ర కుమారదత్తు వివరించిన విధంగా, నేటి బంగ్లాదేశ్ పౌరుల్లో నూటికి రొంభైమంది - నావశూద్రులకి చెందినవారే.

ఇండియాని గ్రీకులూ - పారశీకులూ- పార్థియనులూ-హూణులూ-కుషాణులూ - జయించినా, ముస్లిం సుల్తానులు వైవశం జేసుకొని వంద లాది వీళ్ళు ఏలినా, బ్రిటిష్‌వారు ఏకచ్ఛత్రాధిపత్యంగా శతాబ్దాలపాటు పాలించినా, వీరిలో ఎవ్వరూ వర్ణ వ్యవస్థను మాత్రం నాశనం జేయలేక పోయారు! యీ కులవ్యవస్థ పెయ్యి పడగల నాగులా యిన్ని వేల ఏళ్ళు గడిచినా, ఇన్ని విదేశ దండయాత్రలు సాగినా నేటికీ కొత్త బలాన్ని పుంజుకొంటూ, కొత్త ఆహారాల్ని దాలుస్తోనే వుంది!

ముస్లిములలో కులవ్యవస్థ

వాస్తవానికి ముస్లిం - క్రైస్తవ - మతాల్లో కులవ్యవస్థ లేనేలేదు. ఇండియాని మినహాయించి, ప్రపంచంలోని ఏ ముస్లిం - క్రైస్తవునికైనా- కులమంటే ఏమిటో తెలియదు. ఈ రెండు మతాలూ, తమ మతస్థులమధ్య సాంఘిక సమానత్వాన్ని ప్రతిపాదించాయి. కాని ఇండియాలో మాత్రం యీ రెండు మతాలకి చెందిన వారిలో గూడా కుల భేదాలుండడం ప్రత్యేకంగా గమనార్హం! బెంగాల్లోని ముస్లిములలో "అష్రాఫ్". "అజ్లాఫ్" అనే రెండు ముఖ్యమైన తెగలున్నాయి. అష్రాఫ్ తెగవారు తాము అగ్రవర్ణానికి చెందిన వారుగా భావించి, అజ్లాఫ్ తెగవారిని నీచంగా చూస్తారు. విదేశాలనించి వలస వచ్చిన పాలకవర్గాల ముస్లిములూ, హిందూ సంఘంలో ఎొకప్పుడు అగ్రవర్ణాలకి చెందివుంది, అనంతరం ఇస్లాం మతాన్ని స్వీకరించినవారూ అష్రాఫ్ తెగవారుగా పరిణమించి వుంటారు. హిందూ సాంఘిక వ్యవస్థలో "నావశూద్రులు"గా వున్నవారూ, అవంతర దశలో

ముస్లిములుగా మారినవారూ "అష్లాఫ్" లెగవారై వుంటారు. అష్లాఫ్ లెగవారికన్న మరింత నీచంగా చూడబడే అర్జల్ లెగవారు గూడా బెంగాల్లోనే వున్నారు. నమాజ్ చేసుకోవడానికి వీరిని మసీదుల్లోకి రానివ్వరు. అందరినీ సమాధిజేసే గోరీల దొడ్డిలో, అర్జల్ లెగకి చెందిన శవాల్ని పాతిపెట్ట నివ్వరు ! అంటే - వీరు ముస్లిముల్లో హరిజనులన్నమాట !

ముస్లిముల్లో మొత్తం 26 కులాలున్నాయనీ, వీటిని వెనకబడిన తరగతులుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించినదనీ, ప్రొఫెసర్ యాసిన్ చెప్పాడు. 1977 జనవరి 12 న హైదరాబాద్లో ఇస్లాం సంస్కృతిపై జరిగిన సదస్సులో ప్రొఫెసర్ యాసిన్ మాట్లాడుతూ, ఈ 26 కులాల్లో 20 కులాలు గౌరవనీయమైన వృత్తులకు చెందినవనీ, అష్రాఫ్ - షేక్ - సయ్యద్ - మొగల్ - పఠాన్ యిత్యాదులు ఈ గౌరవనీయ వృత్తుల చేబట్టుతాయనీ ఆయన అన్నాడు. హిందూరాజపుత్రులు ముస్లిములుగా మారినప్పుడూ, చేనేత-చాకలి- వృత్తులవారూ, పాకీపని చేసేవారూ యీ మిగిలిన 6 కులాలకి చెందినవారని ఆయన చెప్పాడు.

అష్రాఫ్ అంటే జంటిల్మన్ అని అర్థం. అష్రాఫ్లు-సాయిబుల్లో బ్రాహ్మల్లాంటి వారు. "కమీన్లు" ముస్లిముల్లో శూద్రుల్లాంటివారు. వీరిలో జులహాలు (తురక సాలెలు) నాయీలు (తురక మంగళ్ళు) బోదీలు (తురక చాకళ్ళు) అనే వారున్నారు. భారతీయ ముస్లిముల్లో వీరుశూద్రులు. షేక్ - సయ్యద్ - యిత్యాది శాఖలకి చెందిన ఏ ముస్లిమూ, పైవారికి చెందిన పిల్లను పెళ్ళిచేసుకోడు. అయితే యీ "తక్కువ" కులాలకి చెందిన ముస్లిములు, "అన్సారి" - లేదా - "ఖురేషి" - అనే పేర్లను తగిలించుకోవడం ద్వారా, తమ సోషల్ స్టేటస్సు నేడు పెంచుకొంటున్నారు !

వందల సంవత్సరాల క్రితం ఇండియాపై ముస్లిములు దండెత్తిన సమయంలో, వివిధ సందర్భాల్లో షేక్ - సయ్యద్ - మొఘల్ - పఠాన్

లకి చెందినవారు, అరేబియా - పెర్షియా - ఆఫ్ఘనిస్థాన్ - తుర్కిమని స్థాన్‌ల నుండి పునరేశానికి వలస వొచ్చి యిక్కడే స్థిరపడిపోయారు. వీరి దృష్టిలో భారతీయ ముస్లిములు (Nau Muslims) తక్కువ రకానికి చెందిన వారుగా నేడికీ పరిగణింప బడుతోన్నారు. పరిపూర్ణమైన సాంఘిక సమానత్వం విలసిల్లుతుందని చెప్పబడే ఇస్లామిక్ సమాజంలో సైతం, యీ రకమైన తరతమ భేదాలుండడం ఆశ్చర్యకరమైన అంశం.

(కె. ఎ. అబ్బాస్ - కేస్ట్ ఫీలింగ్ - మిర్రర్ పత్రిక - 1978 జూన్)

క్రైస్తవుల్లో కులవ్యవస్థ

ఈ విధంగానే క్రైస్తవుల్లో సైతం కులభేదాలు కన్పిస్తాయి. గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురం ప్రాంతంలో ఎంతోమంది కేథలిక్ మతాన్ని పుచ్చుకొన్నారు. వీరిలో రెడ్డి క్రైస్తవులూ కమ్మ క్రైస్తవులూ వున్నారు. పరస్పర్యా వీరు క్రైస్తవులైనా, ఈ రెడ్డి - కమ్మ - వారి మధ్య వివాహ సంబంధాలు మాత్రముండవు. అంతా క్రీస్తు భక్తులైనా ఎవరి కులం వారిదే ! అంతేగాదు - కేథలిక్ మతాన్ని పుచ్చుకొన్న మాల - మాదిగ కులస్తులు, కమ్మ - రెడ్డి క్రైస్తవుల సరసన మోకరిల్లి ప్రభువును ప్రార్థించడానికి వీల్లేదు! కమ్మ - రెడ్డి - క్రైస్తవులు చర్చిలోని కుర్చీల్లో ఆసీనులైతే, మాల - మాదిగ క్రైస్తవులు చాపల మీదనో, పట్టాలమీదనో కూర్చుని దేవుణ్ణి ప్రార్థిస్తారు! అంతేకాదు; మాల క్రైస్తవులకీ మాదిగ - క్రైస్తవులకీ మధ్యన పెళ్ళి పేరంటాలుండవు.

కమ్మ క్రిస్టియన్లు
రెడ్డి క్రిస్టియన్లు

క్రైస్తవమతంలో కులతత్వం లేకపోయినా, హిందూమతంలోవున్న కులాలు క్రైస్తవమతంలోకి గూడా జొరబడ్డాయి ! మానవ సోదరత్వాన్ని

ప్రబోధించిన క్రైస్తవమతంలో మలతత్వం ప్రవేశించడంవల్ల, కమ్మ క్రిస్టియన్లు, రెడ్డి క్రిస్టియన్లు, మాల క్రిస్టియన్లు, మాదిగ క్రిస్టియన్లు ఉనికిలోకి వొచ్చారు. మానవుల్ని అగ్ర - అధమ - కులాల కింద ముక్కలుగా నరికిన హిందూ కులవ్యవస్థ; మనుషుల్లో కొందరు అస్పృశ్యులనీ అంటరానివారనీ చెప్పి, సిగ్గూ బిడియం లేకుండా వారిని ఊరిబయటి చండాలవాడల్లోకి తోలివేసిన కులవ్యవస్థ; యీ విధంగా క్రైస్తవమతంలోకి సైతం జొరబడిందంటే, కోటికోరల కులపిశాచి యెంతటి విషసర్పమైనదో, వేరేగా చెప్పనవసరం లేదు.

హిందూమతం లోంచి క్రైస్తవమతంలోకి మారినా, మాల క్రిస్టియన్, మాదిగ క్రిస్టియన్ యువతిని పెళ్ళి చేసుకోడు. రెడ్డి క్రిస్టియన్, కమ్మ క్రిస్టియన్ యువతిని వివాహమాడ్డానికి నసేమిరా ఒప్పుకోడు! అంటే మతాలు మారినా, "మారుమనసు" పొందినా, కులపిచాచి భయంకర కౌగిలి నుంచి, వీరు విముక్తి కాలేదనేది నగ్నసత్యం! అలాంటప్పుడు ఎందుకు యీ మారుమనసులు? ఎవరి కోసం యీ ఏసు భజనలు? పెళ్ళీ పేరంటం లాంటి కార్యాల సందర్భంగా, పవర్ణమి - అమావాస్య లాంటి తిథి వార నక్షత్రాల్ని యీక్రైస్తవులు పాటిస్తోన్నారు. ఇళ్ళు కట్టించడానికి ముందు, సిద్ధాంతి దగ్గిరకెళ్ళి, పంచాంగం చూపించి, శంఖుస్థాపనలు చేయిస్తోన్నారు. సామాన్య హిందువులు నిత్యజీవితంలో అనుసరించే సమస్త అంధవిశ్వాసాల్నీ వీరు పాటిస్తోన్నారు. మరి - యింకెక్కడి క్రైస్తవమతం? ఇంకెక్కడ జీసస్ సిద్ధాంతం?! దాదాపు 200 సంవత్సరాలపాటు ఇండియాలో విదేశ మిషనరీలు క్రైస్తవమతాన్ని బోధించి, మాల - మాదిగ - వాడల్లోకి క్రీస్తు సందేశాన్ని తానిపోయినా, మాల - మాదిగ - క్రైస్తవుల్లో అనేకమంది విద్యాధికులు తయారై ఎన్నో ఉన్నత పదవు లలంకరించినా, యీనాటికీ మాల-మాదిగ - క్రైస్తవుల మధ్య వివాహసంబంధాలు లేకపోవడమేగాక, యీ ఉభయుల మధ్య "కుల"

ద్వేషం యీనాటికీ పరమ భీకరంగా రగుల్కొంటోనే వుంది. అంటరాని వారుగా పరిగణింపబడే యీ మాల - మాదిగ - కులాలవారి మధ్య నున్న భయంకరమైన అనైక్యతను చూచిన మహాకవి జాషువా యీ విధంగా అన్నాడు :

"కలచమ్మా వ్రణ మంటరానితన మాకర్ణింపుమీ యింతయూ
పొలమందుం గల మాల మాదిగలకున్, ఘాతేపుడేకాము, కృ
ష్ణులు, కృష్ణున్నిరసించు చైవములు, క్రీస్తుర్ మస్తుగా బుట్టినన్,
కలుపన్నేరరు రెండు జాతులను వక్కాణింప సిగ్గయ్యెడిన్."

దాదాపు శతాబ్దం క్రితం ఆంధ్రదేశంలో విదేశ మిషనరీలచే నెల కొల్పబడిన విద్యాసంస్థలు, ఈ కులద్వేష ఫలితంగానే నేడు బద్దలై పోయి, ఆ సంస్థల్లోని ఉన్నత విద్యాప్రమాణాలు అడుగంటిపోయి, చివరికి స్వార్థ పరులైన మాల - మాదిగ - క్రైస్తవ కులపెత్తందార్ల అధికార దాహం తీర్చుకొనే కదనరంగా లయ్యాయి.

మేము నేసే గుడ్డ ఒంటివికాద
మీరు కుట్టే చెప్పులు ఇంటిబయట

క్రైస్తవుల్లో యింతగా విద్యావ్యాప్తి జరిగినా, ఈ మాల- మాదిగ కులస్తుల మధ్య వుండే పాతకాలంనాటి ద్వేషాలు నేటికీ అంతరించలేదు. సాలీలతోపాటు మాలలు గూడా నేత నేస్తారు. అంచేతనే "సాలినేత - మాలనేత" అనే సామెత నేటికీ అక్కడక్కడ మనకు వినిపిస్తుంది. మాదిగలకన్న తాము అధికులమనే విషయాన్ని చెప్పడానికి, మాలలు ఓక విచిత్రమైన పాయింట్ చెబుతారు. "మేము నేసే గుడ్డను మైతులు ఒంటిమీద వేసుకొంటే, మీరు కుట్టే చెప్పుల్ని కాలికి వేసుకొని, యింటి బయటే విడుస్తారు." ఇంతకన్న కులదురహంకారానికి మరో నిదర్శనం కన్పించదు. హిందూ సంఘవ్యవస్థలో అట్టడుగున వున్న వీరు, తర

తరాలుగా అగ్రవర్ణాలవారిచే నేటికీ చారుణంగా దోపిడీ చేయబడుతోన్న వీరు, పీడిత ప్రజలుగా ఐక్యం గావడానికి మారు, "మేం గొప్పంటే మేం గొప్ప"యని చెప్పుకోవడం, కుక్కలు చింపిన విస్తరి ముక్కల్లా చీలి పోవడం ఏమంత వివేకం?

కులం పెలికి హరిజనుల బలి

మధ్యయుగాల నాటి కులంపెలి - కులాచారాలు - కులం కట్టు బాట్లు, శిథిల సంస్కృతీ అవశేషాలుగా నేటికి మిగిలివున్నాయి. ఇవి - గ్రామీణ పేదల్లో, ప్రత్యేకంగా హరిజనుల బతుకుల్లో యీనాటికీ నిప్పులు చెరిగి పోస్తున్నాయి.

ఖమ్మంజిల్లా లోని హరిజనుల్లో మాల - మాదిగ - నేతకాని - అనే మూడు శాఖల వారున్నారు. వీరిపై "తాలూకా పెద్దలు" గూడా వున్నారు. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ కైనా మినహాయింపు వుంటుందేమో గాని, యీ కులపెద్దల తీర్పు మాత్రం ఖచ్చితంగా అమలు జరిగి తీర వలసిందే! కులంలో "నేరం" చేసిన వారికి, ఈ పెద్దలు 50 నుండి 500 రూపాయలదాకా "కులం తప్పు" పేరిట జరిమానా విధిస్తారు. ఈ డబ్బుతో పెద్దలూ కులంలోనివారూ కాగి లందనాలాడతారు. యీ జరిమానా చెల్లించలేని వారిని, నిర్దాక్షిణ్యంగా కులం నించి వెలివేస్తారు. చట్టప్రకారం యీ "కులంవెలి" నేరమైనా, గ్రామాల్లో మాత్రం నేటికీ యిది అమలు జరపబడుతోనే వుంది. కులంవెలికి గురిజేయబడిన వ్యక్తి యొక్క కుటుంబ సభ్యుల్తో, గూడెంలోని వారెవ్వరూ మాట్లాడరు. నీళ్ళు తెచ్చుకొనే బావి దగ్గిరకి వారిని రానివ్వరు. మనిషి చచ్చినా, వారి యింటికి ఎవ్వరూ వెళ్ళరు. గ్రామంలోని వారికేగాక, చుట్టుపక్కల గ్రామాల్లో వుండే హరిజన కుటుంబాలవారికి సైతం, యీ వార్తను అందజేస్తారు. యీ విధంగా దుర్భరమైన మానసిక నరకానికి వీరిని గురిజేస్తారు. తర తరాలుగా దుర్మార్గమైన ఆర్థిక దోపిడీకి గురిజేయబడుతూన్న యీ నిరు

పేద హరిజనులు, కులాచారాల పేరిట యీ ఆధ్యాత్మిక దోపిడీకి సైతం గురిజేయబడడం ప్రత్యేకంగా గమనార్హం.

కులాల నిచ్చెన

హిందూ సంఘానికి ప్రాతిపదిక - కులం. ఈ కులవ్యవస్థ నిచ్చెన మెట్ల లాంటిది. ఉదాహరణకి - యీ వ్యవస్థ మొక్క ఉపరితలంపైవున్న బ్రాహ్మల్నే తీసుకొందాం. బ్రాహ్మలంతా ఉప్కుముద్దలా వొకటి కారు. ఆంధ్రబ్రాహ్మల్లో ప్రధానంగా నియోగి (కరణం) - వైదీకి - శాఖలున్నాయి. యీ శాఖల్లో మళ్ళీ అనేకానేకమైన ఉపశాఖలూ గోత్రాలూ వున్నాయి. గోత్రమూ శాఖా కుదరకపోతే, యువతీ యువకులు బ్రాహ్మలైనా వీరిద్దరి మధ్య పెళ్ళి కుదరదు! ఆంధ్రప్రదేశ్‌కి చెందిన మాదిగల్లోనే దాదాపు పాతిక ఉపకులాలున్నాయి. మాస్టీన్ - సింధిబోగరి - దెక్కల - అనే మూడు శాఖలకి చెందిన హరిజన విచ్చగాళ్ళు పంచముల వద్దనే బిచ్చమెత్తుకొని జీవిస్తారు. దేశవ్యాపితంగా హరిజనుల్లో 563 ఉపకులాలున్నాయని జగ్‌జీవన్‌రాం చెప్పాడు.

మహారాష్ట్రలోని "చిత్‌పవన్" బ్రాహ్మలు, మిగతా బ్రాహ్మల కన్న అధికులు. తమిళనాడులోని శ్రీవైష్ణవబ్రాహ్మలు (అయ్యంగార్లు), మిగతా బ్రాహ్మలకన్న ఉన్నతులు! కేరళలోని "నంబూద్రి" బ్రాహ్మలు, మిగతా బ్రాహ్మల కన్న గొప్పవారు! పెళ్ళి - తద్దినం - యిత్యాది కర్మకాండని చేసే వైదీక బ్రాహ్మలున్నారు. రాగి చెంబు పట్టుక భిక్షకి బయల్దేరే ఆయవారం బ్రాహ్మలున్నారు. కిరాయికి శవాల్ని మోసే బ్రాహ్మలూ వున్నారు. ఈ విధంగా వొక్క బ్రాహ్మణ కులంలోనే ఎన్నో తారతమ్యాలున్నాయి. నేటి భారతదేశంలో రెండువేలకి పైగా కులాలున్నాయి. యీ కులాలకి పిలకలైన ఉపకులాల్ని గూడా పరిగణనలోకి తీసుకొంటే ఇవి - లక్షల సంఖ్యలోకి సులభంగా పాకవొచ్చు, వొక్క బ్రాహ్మణ కులంలోనే, రెండువేలకి పైగా ఉపకులాలున్నాయి!

ఈ విధంగానే శూద్రులూ - పంచముల్లో గూడా అనేక శాఖలూ ఉపశాఖలూ తరతమ భేదాలూ వున్నాయి. ఉదాహరణకి - గొల్లల్లో కర్నెగొల్ల - పూజగొల్ల - ఎర్రగొల్ల - పెద్దింటిగొల్ల - గణపతిగొల్ల - అనే ఉపశాఖలున్నాయి. అలాగే పంచముల్లో ఎన్నో తరతమ భేదాలున్నాయి. మాలల కన్న మాష్టీనులు తక్కువ. అస్పృశ్యుల్లోనే మొండిబండాళ్ళు, డొక్కలాళ్ళు, పిచ్చుకగుంటవాళ్ళు, తంబలవాళ్ళు అనే రకరకాల కులాలున్నాయి. ఉత్తర భారతంలోని అస్పృశ్యులందరిలోకీ అధికులు- చమర్లు. (చర్మకారులు) వీరికన్న భంగీలు (పాకీవారు) 'అధములు'. అంతేగాదు - అస్పృశ్యుల్లోనే అస్పృశ్యులున్నారు!

ప్రతి గ్రామానికి దూరంగా మాలపల్లె - మాదిగగూడెం - వుండడం చనందరికీ తెలిసిందే. హిందూసంఘం వీరిని వెలివేయగా, యీ మాల-మాదిగలు వొకర్ని వొకరు వెలివేసుకొన్నారు! మాల యింట్లో, మాదిగ కనీసం మంచినీళ్ళు గూడా తాగడు. ఇంతకన్న మూర్ఖత్వం మరొకటి వుండబోదు. మాల యింటిలో మాదిగ ప్రవేశించి, వారి కుండా చట్టీ ముట్టుకోవడానికి వీల్లేనంత అస్పృశ్యత, వీరిద్దరి మధ్య వుంది. మాలలు తోడుకొనే బావిలో, మాదిగలు నీళ్ళు తోడుకోరు. ఈ విధంగా ఎవరి బావి వారిదే. ఎవరి పల్లె వారిదే. ఎవరి బతుకు వారిదే. ఏ సవర్ణులు వీరిని గ్రామం నించి వెలివేశాకో, వారికి వ్యతిరేకంగా ఐక్యమై పోరాడాల్సిన ఈ పీడిత కులాలవారు, తమలో తాము అస్పృశ్యతను పాటించడంకన్న ఘోరమైన విషయం మరేమి వుంటుంది? సాటి మానవుల్ని ఓరికి మారంగా వుంచడం అగ్రకులాలవారి అమానుషత్వానికి నిదర్శనమైతే, ఈ హరిజనులు ఎవరికులం చుట్టూ వారు కోటగోడలు నిర్మించుకొని, ఉపస్థ మండూకాల్లా బతకడం ఏరకమైన ఇంగితజ్ఞానానికి తార్కాణం?

3. అస్పృశ్యత

పంచమూడవ శతాబ్దానికి చెందిన ధర్మస్వామి, బీహార్‌లోని వర్ణ వ్యవస్థను తెలియజేసే ఓక విచిత్రమైన కథను రాశాడు. మగధలోని నదిలో మునిగిపోతున్న ఒక టిబెటన్ సన్యాసి, "రక్షించండి-రక్షించండి" అంటో బిగ్గరగా కేకలు వేయనారంభించాడు. ఈ దృశ్యాన్ని ఓక అస్పృశ్యుడు దగ్గరనించి చూస్తోన్నాడు. నదిలో మునిగిపోతున్న సన్యాసిని రక్షించాలనే బలమైన కోరిక ఈ పంచమునికి ఉంది. అంతేగాదు-ఈతనికి ఈదడం సైతం తెలుసు. అయినా యితడు దగ్గరికి వెళ్ళడానికి తటపటాయించాడు. సన్యాసిని రక్షించవలిస్తే, అతన్ని ముట్టుకోవాలి. ముట్టుకొంచే సన్యాసి మైలపడతాడు! సన్యాసి బతికి బయటపడ్డ తర్వాత, అతన్ని ముట్టుకొన్నందుకు యీ పంచముడు తీవ్రంగా శిక్షింపబడ్డాడు ! ఇదీ కథ.

ఈ కథ రాయబడి నేటికి ఏడు శతాబ్దాలు గడిచినా, మనదేశంలో మడి - మైల అనే తతంగమూ, కులంకుష్టూ, యీనాటికి సమస్త జీవిత రంగాల్ని మహామ్మారిలా ఆవహించే వున్నాయి. నేడు యీ కులం కుష్టు యొక్క వికృత సంతావమైన అస్పృశ్యత, దేశ రాజకీయరంగంలో సైతం ప్రవేశించింది.

ప్రాచీనకాలంలో చండాలుర వాడలు

వాస్తవానికి యీ అస్పృశ్యతా దురాచారం, అత్యంత ప్రాచీనకాలం నించి అమలులో వున్నట్లు కన్పిస్తోంది. "చండాలుర నూతికి కట్టిన గొడ్డు దెయ్యకను చూచి దాటసారులు తొలగిపోవునట్లు" అని సంస్కృత మహా కవియైన భర్తృహరి అన్నాడు. అంటే - ఆనాడు బ్రాహ్మలకీ, శూద్రులకీ పంచములకీ వేర్వేరు బావులుండేవన్నమాట. దాటసారులు తమకి తెలియక పంచముల బావినీరు తాగి "మైల" పడకుండా వుండడానికి, చండాలుర నూతికి గుర్తుగా, వొక గొడ్డుదెయ్యకను కట్టేవారు! ఆనాడు ఫలానా బావి గొడ్డుమాంసం తినేవారిది - అని తెలియజేయడానికి యీ ఎయ్యకను గుర్తుగా వినియోగించేవారన్నమాట! యీ విధంగా శతాబ్దాలుగా మిగిలిన కులాల నించి, పంచముల్ని వేరుజేసి, అస్పృశ్యతను పాటించడానికి హింసా పురోహితులు పన్నిన కుట్రలూ, పడినపాట్లూ, వర్ణించడానికి వందల - వేల - పేజీలు కావాలి.

మైసూరు - తమిళనాడు

"హోలియార్లు (మైసూరు రాష్ట్రంలోని అస్పృశ్యులు) నివసించే ప్రాంతానికి "హోలిగిరి" అని పేరు. ఇది (మాలపల్లె) ప్రతి గ్రామ శివారులోనూ వుంటుంది. హోలియార్లు పూర్వం నిర్బంధ బానిసలుగా (Serfs) వుండేవారు. వీరిని అపవిత్రమైనవారిగా భావించి, వారి స్పర్శవల్ల మైలపడతామనే భావంతోనే వారిని ఊరి బయట వుంచారని నేను భావిస్తున్నాను" అని కెప్టెన్ J. S. F. మెకంజి "ఇండియన్ ఆంటిక్వరి" లో రాశాడు.

అత్యంత విచిత్రమైన విషయమేమంటే, "బ్రాహ్మలు తమ పల్లెల్లో ప్రవేశిస్తే, తమకు అరిష్టం కలుగుతుందనే నమ్మకం వల్ల అస్పృశ్యులు (తంజావూరు జిల్లాలోని పరయన్ - పల్లన్ - చెక్కిలియన్

కులాలవారు) బ్రాహ్మణ్ణి తమ పల్లెలలోకి రానివ్వరు" అని, తంజావూరు జిల్లా గెజెటీర్‌కు ఎడిటర్‌గా పనిజేసిన హెమింగ్స్‌వే రాశాడు!

మహారాష్ట్రలోని అంటరానివారిని "మహర్లు" అని పిలుస్తారు. మహర్లు ప్రతి గ్రామంలోనూ వుంటారు. ప్రతి గ్రామంచుట్టూ గోడ వుంటుంది. యీ గోడకి బయటనే అంటరానివారి యిళ్ళు వుంటాయి. గ్రామ రక్షణ బాధ్యతను, మహర్లు వంతులవారీగా నిర్వహిస్తారు. సవర్ణ హిందువులు వీరికి 52 హక్కులు ఇచ్చారని మహర్లు చెబుతారు. గ్రామస్థులనించి తిండి గింజలు పోగుజేసుకొనే హక్కు, కోతలకాలంలో పైరులనించి ధాన్యాన్ని కళ్ళంలో పోగుజేసుకొనే హక్కు, గ్రామంలోని పశువుల మృత కళేబరాల్ని సొంతం జేసుకొనేహక్కు, యిత్యాదుల్ని గ్రామస్థులు తమకిచ్చారని వీరు అంటారు. ఆహా! ఎంతటి గొప్ప హక్కులు?!

ఎట్టి పరిస్థితులలోనూ అస్పృశ్యులకు బ్రాహ్మలు పౌరోహిత్యం చేయరు. అంటరానివారు తమ పురోహితుల్ని తామే కలిగియుంటారు. (తెలుగు దేశంలో వీరిని మాలదాసులు అని అంటారు.)

మైలపడడం - మైలపోవడం - అనే మాటలు సాధారణంగా మనం వింటుంటాము. అలాగే మైలబట్ట - పడిబట్ట - అనే పదాలుగూడా వింటుంటాము. ఆహార పదార్థాలు, నీరు, యిత్యాదులు కర్తీకి (మైలకి) వాహనాలైతే, హిందూసంఘంలో కొందరి శరీరాలుగూడా మైలకి వాహనాలు గావడం చాలా ఆశ్చర్యకరమయిన విషయం. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని అస్పృశ్యత, వొక్క హిందూ సంఘంలో మాత్రమే కన్పిస్తుంది.

అంతెందుకు-కేంద్ర ప్రభుత్వ మాజీ మంత్రియైన శ్రీజగజీవన్‌రాం ఉత్తరప్రదేశ్‌కి చెందిన డాక్టరు సంపూర్ణానంద్ విగ్రహాన్ని ఆవిష్క-

రించగా, హరిజనుడు ముట్టుకొనగా మైలపడ్డ విగ్రహాన్ని హిందూమత అగ్రవర్ణ దురహంకారులు, గంగాజలంతో కడిగి దాన్ని "శుద్ధి" జేయ లేదా ?! కేంద్రమంత్రియైన జగ్జీవన్‌రామే ఈ దేశంలో అస్పృశ్యుడుగా పరిగణింపబడుతోండగా, సామాన్య హరిజనుల నికృష్ట పరిస్థితిగూర్చి వేరేగా చెప్పాలా ?! అంతేగాదు; కాశీలోని సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ - ఛాన్సలర్‌గా, బ్రాహ్మణేతరుడయిన సంస్కృత పండితుడు వుండాలని శ్రీ జగ్జీవన్‌రాం సూచించాడు. యీ విధంగా ఆయన చెప్పిన మహాపాపానికి, ఆ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆయన దిష్టి బొమ్మను జేసి ఊరేగించి దగ్ధంజేశారు! కేంద్రమంత్రివర్గంలో గత ముప్పయ్ రెండు సంవత్సరాలుగా మంత్రిగావున్న శ్రీ జగ్జీవన్‌రాంకే యీ గతి పట్టగా, దేశంలోని సామాన్య హరిజనుల హృదయ విదారక పరిస్థితినిగూర్చి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు!

అగ్రకులాలవారు తమను అస్పృశ్యులుగా - అంటరానివారుగా - పరమనీచంగా చూస్తున్నారని విమర్శించే హరిజనులు, తమలో తాము అంటరానితనాన్ని పాటించడం సిగ్గుచేటుగాదా ? తరతరాల యీ దుర్మార్గ సాంఘికాచారానికి వ్యతిరేకంగా ఐక్యతతో - సంఘటిత శక్తితో - రివగ బడవలసిన వీరే పరస్పరం అస్పృశ్యులుగా పరిగణించడంకన్న పొరపాటు మరొకటి ఉందా ?

అస్పృశ్యతా జాడ్య నిర్మూలన
విశ్వనాధ సత్యనారాయణ వ్యాఖ్య

"హరిజనుల్ని ఇంగ్లీషువారు బాగుచేసిందిలేదు. గాంధీగారు బాగు చేసింది లేదు. వాళ్ళూ ఆయనా కూడా హరిజనులకు ఒక నల్లమందు వేశారు. యీ నల్లమందు - అస్పృశ్యతా నివారణమన్న మాట. రెండవ నల్లమందు - హరిజన దేవాలయ ప్రవేశము. అదీ సాగలేదు. ఇదీ సాగ

లేదు. కడచిన ఏభై - అరవై యేండ్లుగా మనదేశంలో ఇంగ్లీషువాళ్ళు, వాళ్ళను అనుసరించి గాంధీమతస్థులూ చేసిన మహాకార్యమేమంటే, దేశంలో శాంతి అనేది లేకుండా చేశారు. విప్లవ భావాలు తేకెత్తించారు. కులం పేరుచెప్పి, మతంపేరు చెప్పి, వర్ణంపేరుచెప్పి, ఎవరు ధనవంతులో వారిమీద ఎక్కువ దౌష్టన్యం చేయటానికి వీలు ఏర్పరచారు. ప్రజా స్వామికం వచ్చిన తరువాత ఈ లక్షణం మరీ వృద్ధిపొందింది."

(విశ్వనాధ సత్యనారాయణ - "ఆరునదులు" నవల)

బ్రిటిష్‌వారు అస్పృశ్యతా నిర్మూలనకు కృషిచేయకపోయినా, నిమ్నజాతుల ఉద్ధరణకు మాత్రం పాటుపడ్డారు. ప్రత్యేకంగా క్రైస్తవ మిషనరీలు చేసినకృషి భారత సంఘ సంస్కరణోద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగింది. స్వాతంత్ర్యానికి పూర్వం అమలులోవున్న న్యాయపాలనా వ్యవస్థలో, మార్పులుచెచ్చి చట్టం దృష్టిలో అంతా సమానమే - అనే భావాన్ని బ్రిటిష్ పాలకులు కలగజేశారు. అయినా ఆ రోజుల్లో శూద్ర - పంచములు చదువుకోవడానికి అవకాశాలు దాదాపు శూన్యమనే చెప్పాలి.

అస్పృశ్యతా నిర్మూలనకు కృషిజేసినవారిలో గాంధీజీ ఒకరు. హిందూమత మూలసిద్ధాంతాలకి అస్పృశ్యత వ్యతిరేకమని ఆయన నిరసించాడు. అస్పృశ్యులుగా వ్యవహరింపబడినవారికి, ఆయన "హరిజనులు" అని పేరుపెట్టాడు. జాతీయ స్థాయిలో హరిజన సేవాసంఘాన్ని స్థాపించి హరిజనులకు దేవాలయ ప్రవేశం కలుగజేశాడు. హరిజనుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం డాక్టర్ అంబేడ్కర్ జీవితాంతం పోరాడాడు. ఆయన నిర్విరామ కృషి ఫలితంగానే, భారత రాజ్యాంగంలో హరిజనుల సముద్ధరణకు,కొన్ని ప్రత్యేకసదుపాయాలూ రక్షణలూ కల్పించబడ్డాయి.

1947 లో దేశానికి స్వాతంత్ర్యం లభించినతర్వాత, ప్రభుత్వ స్థాయిలో హరిజనోద్ధరణకు కృషి జరుగుతూనే వుంది. పార్లమెంటు, రాష్ట్రశాసన సభలలోను కేంద్ర - రాష్ట్ర - ప్రభుత్వ సర్వీసులలోను, హరిజన - గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించ బడింది. భారత రాజ్యాంగం లోని 17 వ ఆర్టికల్, అస్పృశ్యతను నిషేధించింది. 1955 లో అస్పృశ్యత (నేరం) చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం అస్పృశ్యతను పాటించినవారు శిక్షార్హులవుతారు. దేవాలయాలూ పబ్లిక్ స్థలాలలోకి హరిజనుల ప్రవేశాన్ని అడ్డగించేవారికి, ఆరునెలల జైలుశిక్షగానీ, 500 రూపాయల జరిమానాగానీ, లేదా రెండూగానీ, విధింపబడవచ్చు. అస్పృశ్యతకు చెందిన కేసులు ఎన్నో నమోదైనా, అవసరమైన సాక్ష్యాధారం లభించనందున, అతికొద్ది కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయి.

అంచేత పై చట్టంవల్ల పెద్దగా ప్రయోజనం కలగలేదు. కాబట్టి దీన్ని సవరించడానికి 1972 లో పార్లమెంటులో ఒకబిల్లు ప్రవేశపెట్టారు. 1976లో ఈ చట్టాన్ని మళ్ళీ మార్చి, "Civil Rights Protection Act" అనే పేరు పెట్టారు. ఈ చట్టం ద్వారా అస్పృశ్యతను పాటించడం అపరాధంగా పోలీసులే గుర్తింప తగినట్లు చేశారు! అస్పృశ్యతా నిర్మూలనకు చెందిన ఫిర్యాదుల్ని పరిశీలించవలసిందిగా, జిల్లా కలెక్టర్లకూ, జిల్లాపోలీసు అధికారులకూ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలిచ్చాయి; యిస్తోనే వున్నాయి! యీ చట్టం క్రింద నేరాల రిజిస్ట్రేషన్, దర్యాప్తు యిత్యాది అంశాల్ని సరళం జేయడానికి, రాష్ట్రస్థాయిలో సంఘాల్ని సైతం ఏర్పాటు జేశారు. తమిళనాడులో అస్పృశ్యతను పాటించేవారిపై చర్యతీసుకొనేందుకు, సంచార పోలీస్ దళాల్నిగూడా ఏర్పాటు జేశారు. యీ విధంగా అస్పృశ్యతా నిర్మూలనకి కేంద్ర - రాష్ట్ర - ప్రభుత్వాలు కన్నీటి తుడుపులాంటి చర్యల్ని తీసుకొంటోన్నాయి. అయితే, అస్పృశ్యతను నిర్మూలించడానికి బదులు,

నేటి పాలకవర్గాలు అస్పృశ్యతనే నిర్మూలించడానికి యత్నిస్తున్నాయా - అనే సందేహం, దెల్చి యిత్యాది సంఘటనలు రుజువుజేస్తున్నాయి !

దేశ స్వాతంత్ర్యం కోసం జరిగే జాతీయోద్యమ విజయానికే గాక, భారత సాంఘిక వ్యవస్థా పునర్నిర్మాణానికి సైతం, అస్పృశ్యతా నిర్మూలన అనేది ఖచ్చితమైన షరతు అని గాంధీజీ పట్టుపట్టాడు. అయితే యీ షరతు ఆయన శిష్యుల చేతిలో నేడు ఏ రూపం దాల్చింది ?

ముప్పయ్‌ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత, దేశవ్యాపితంగా విద్యా వ్యాప్తి జరిగిన తర్వాత, షెడ్యూలు కులాల - తెగల - అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చుచెట్టిన తర్వాత, చట్టరీత్యా అస్పృశ్యతను నిషేధించిన తర్వాత, హరిజనులకి ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించిన తర్వాత, ఇంత జరిగిన తర్వాత గూడా అస్పృశ్యత హిందూ సంఘంలో పిశాచిలా పీడకలలా గజ్జిలా గనేరియాలా కుష్టులా క్షయలా నేటికీ మొండిగా తాండవిస్తూనే వుంది !

హరిజనులు తమ హక్కుల కోసం మొప్పుడు సిద్ధపడినా, హిందూ సంఘంలోని "సవర్ణులు" అగ్రవర్ణాలవారికి చెందిన భూస్వామ్య పెత్తందారులు, వారి గూండా అనుచరుల అండదండలతో, పోలీసుల సాయంతో, తమ కందుబాటులో వున్న సమస్త హింసాయుత దౌర్జన్య పద్ధతులతో, చివరికి తుపాకులతో సైతం వారిని నిర్దాక్షిణ్యంగా అణిచి వేస్తున్నారు. యీ విధంగా వీరు అస్పృశ్యతా నిర్మూలనను ప్రతిఘటించడానికి కారణమేమిటి ? యీ ప్రతీఘాతుక ఉద్యమం వెనుకవున్న శక్తులేవి? గాంధీజీ మొక్కు ఆశీర్వచనాలున్నా, ప్రభుత్వ ప్రచారసాధనాలు రాత్రింబవళ్ళు అస్పృశ్యత పాటించడం తీవ్రమైన నేరమని బోధిస్తున్నా, భారత రాజ్యాంగం అస్పృశ్యతను నిషేధించినా, యీ సాంఘిక దురాచారం నేటికీ యెందుకింత శక్తివంతంగా వుంది ?! ప్రధానంగా భారతీయ

గ్రామసీమల్లో యీ జాడ్యం నేటికీ యెంచుకింతగా విలయతాండవం గావిస్తోంది ?

గాంధీజీ భావాలూ, ఆయన సిద్ధాంతాల ప్రచారమూ, చట్టరీత్యా అస్పృశ్యతా నిషేధమూ, వొక భావాన్ని ఆచరణలో పెట్టలేవు. అంచేత, అస్పృశ్యత పుట్టడానికి కారణమైన భౌతిక పరిస్థితుల్ని మనం అర్థం జేసుకొన్నప్పుడే, యీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

అత్యంత విచిత్రమైన విషయమేమంటే, ఈ ఇరవయ్యో శతాబ్దిలో సైతం, హిందూమత పీఠాధిపతియైన పూరీశంకరాచార్యులు సిగ్గూ బిడియం లేకుండా, తన పవిత్ర ధర్మశాస్త్రాల సాయంతో అస్పృశ్యత "ధర్మ" సమ్మతమేనని బహిరంగంగా సమర్థిస్తున్నాడు ! వాస్తవానికి యీయన విపర్యకులకన్న, యీయనే తన పవిత్ర ధర్మశాస్త్రాలసాయంతో యెంతో బలంగా వున్నాడు ! ఎంచేతనంటే, తరతరాల భారత చరిత్రకి చెందిన సమస్త అంధ విశ్వాసాలూ, బ్రాహ్మణమతానికి చెందిన సమస్త ధర్మశాస్త్రాలూ, వర్తమాన దేశంలోని యావత్ ప్రతీఘాతుక శక్తులూ, దేశవ్యాపితంగా వున్న మఠాలూ - పీఠాలలో తిష్టవేసిన సమస్త చీకటి వ్యక్తులూ, యీయనకి బాసటగా వున్నారు ! అంచేత, అస్పృశ్యతను నిషేధించే చట్టాలూ, గాంధీజీ బోధలూ, హింసాసంఘం నుండి యీ జాడ్యాన్ని నిర్మూలించలేవు. అస్పృశ్యతా నిర్మూలనకి, దేశంలోని అస్పృశ్యుల్నీ, యావత్ పీడిత ప్రజల్నీ సమీకరించాలి. మానవసహజమైన స్వేచ్ఛాసమానత్వాల్ని వాంఛించే వ్యక్తులుగా, యీ దారుణ దురాచారానికి వ్యతిరేకంగా వారు పోరుసల్పి సిద్ధమైనప్పుడే, ఎలాంటి బలిదానాలకి సైతం వెరవకుండా వారు రంగంలోకి దూకినప్పుడే, ఈ తరతరాల కిరాతక దురాచారాన్ని నిర్మూలించడం సాధ్యం. అంతేగాని, నీతిబోధలూ, చట్ట

నిషేధాలూ, హృదయ పరివర్తనలూ, ప్రార్థనలూ, యీ సమస్యను పరిష్కరించలేవు. మంత్రాలకి చింతకాయలు రాలవు!

అస్పృశ్యతా నిర్మూలనకి మార్గాలు

అస్పృశ్యతను నిర్మూలించడానికి, మతం మార్పిడిని ఒక మార్గంగా కొందరు సూచిస్తున్నారు. డాక్టర్ అంబేడ్కర్, తన వేలాది సహచరులతో బౌద్ధమతం స్వీకరించాడు. బౌద్ధమతం స్వీకరించిన యీ "నియో బౌద్ధులు" నేటికీ హిందూసంఘంలోనే జీవిస్తున్నారు. యీ విధంగా జీవించే వీరిని, అగ్రవర్ణాలవారు గౌరవంగా చూస్తున్నారా? హిందూమతంలో నుండి బౌద్ధ మతంలో ప్రవేశించినంత మాత్రాన, వీరు అంటరానివారు కాకుండా పోతారా?! హిందూమాల - క్రిస్టియన్ మాల - బౌద్ధమాల - అని పిలవ బడకుండా వీరుంటారా? క్రిస్టియన్ మతంలో కమ్మ క్రైస్తవులూ- మాల క్రైస్తవులూ - మాదిగ క్రైస్తవు లున్నట్లే, తురక మతంలో తురక చాకళ్ళూ తురక మంగళ్ళూ వున్నట్లే, బౌద్ధంలో గూడా బౌద్ధమాలలూ- బౌద్ధ మాదిగలూ వుంటారు. అలాంటివారు లేకపోతే, హిందూ పురో హితులు తమ యావత్ మేధోశక్తినీ ఉపయోగించి, అట్టి పేర్లను పనిమాలా సృష్టించి ప్రచారంలో పెట్టగలరు! ఈ దేశంలో వారికి అసాధ్యమైనది వీదయినా వుందా?! అంచేత, మతం మార్చుకున్నంత మాత్రాన, కులం మాత్రం నాశనంకాదు. కాబట్టి అస్పృశ్యతకీ, మానవ అసమానత్వానికీ, మానవ బానిత్వానికీ యింకా అనేకానేక దుర్మార్గ సాంప్రదాయాలకీ మూల మైన కోటి కోరల కులవ్యవస్థ మూలమట్టంగా నాశనం జేయబడినప్పుడే - అప్పుడే - ఈ సమస్యకు అంతిమ పరిష్కారం లభిస్తుంది.

4. దక్షిణ భారతంలో కులవ్యవస్థ

"పంచముడు అంటుకొంటే మైలపడిపోతామనే భావానికి చెందిన కర్మకాండ, మద్రాసులో చాలా విస్తృతంగా అభివృద్ధి చేయబడింది. తన కన్న ఎక్కువ కులానికి చెందిన వ్యక్తిని, ఒక నాయర్ కులస్థుడు అంటు కొంటేనే అవతలివాడు మైలపడతాడని, కొచ్చిన్ జనాభా లెక్కల రిపోర్టు తెలియజేసింది. వడ్రంగులు - కమ్మరులు - చర్మకారులు - యిత్యాది కులాలకి చెందినవారు 24 అడుగుల దూరంలో వుండగా; కల్లుగీతపనివారు 36 అడుగుల దూరంలో వుండగా; పులయాన్ వ్యవసాయదార్లు 48 అడుగుల దూరంలో వుండగా; పంచములు 64 అడుగుల దూరంలో వుండగా, అగ్రవర్ణాలవారు మైలపడతారని కొచ్చిన్ రిపోర్టు చెప్పింది. ఇలాంటి విచిత్రమైన భావాలు ప్రచారంలో వుండగా, బ్రాహ్మల అధికారం యథేచ్ఛగా కొనసాగుతోండగా, శూద్ర - పంచమ - కులాలకి చెందిన వారు, గ్రామంలో అగ్రవర్ణాలు నివసించే ప్రాంతంలో అడుగుపెట్టడం నిషేధించబడింది. బ్రాహ్మలు దోవమెంట రావడం చూసిన తక్షణం, యీ కులాలవారు పక్కకి తప్పుకోవడమో, లేదా, మధ్యయుగాలనాటి యూరపులో కుష్టురోగులు అరిచినట్లు తమ రాకను సూచిస్తో పెద్దగా కేక వేయడమో జరిగేది." (Sir Herbert Risley - The people of India - page - 115)

దాదాపు శతాబ్దం క్రితం మద్రాసులో వున్న యీ పరిస్థితే, తరతమ భేదాల్తో ఆనాటి దక్షిణ భారతమంతటా అమల్లో వుండేది.

ఇండియాలోని అన్నిరాష్ట్రాల్లోనూ వర్ణవ్యవస్థ అమల్లోవున్నా, దీనిలోని మూడో వర్ణమైన వైశ్యులు మాత్రం కేరళలో లేరు! ఇదే యీ రాష్ట్రానికి చెందిన విచిత్ర లక్షణం. "అనాది" గా చాతుర్వర్ణ వ్యవస్థ దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ వొకే విధంగా లేవని చెప్పడానికి, కేరళ - వొక నగ్నమైన ఉదాహరణ. ప్రాచీన కేరళ చరిత్రలో వర్తక - వాణిజ్యాలు జోరుగా సాగినా, వ్యాపారవృత్తికి చెందిన కులంగా కేరళలో వైశ్యులు లేరు.

కేరళ

కేరళలోని మొత్తం కులాల్లో, ముస్లిం - క్రైస్తవ - మత సముదాయాల్లో, సిరియన్ క్రిస్టియన్లు విద్యా - వైజ్ఞానిక - సాంఘిక- రంగాల్లో అగ్రభాగాన వున్నారు. కేరళలోని బ్రిటిష్ మిషనరీలు, వీరికి విద్యా - ఉద్యోగ - రంగాల్లో విపరీతమైన అవకాశాలు కలగజేయడమే, వీరి పురోభివృద్ధికి కారణం. సిరియన్ క్రిస్టియన్ల తర్వాత, బాగా అభివృద్ధి జెందినవారు నాయర్లూ - కేరళలోని తమిళ బ్రాహ్మలు. బ్రిటిష్‌వారు పాలించిన కాలంలో, యీ నాయర్లూ - తమిళబ్రాహ్మలే, కేరళలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో అధికంగా వుండేవారు. వాస్తవానికి వీరిద్దరే పాత కాలంనాటి రాజుల వొద్ద గూడా ఉద్యోగాలు జేశారు. కేరళ సంస్థానాధిపతులు పోయినా, తెల్లదొరలు వొచ్చినా, ఉద్యోగాలు మాత్రం వీరి చేతుల్లోంచి పోలేదు! తిరువాన్కూర్ సంస్థానానికి దివాన్‌గా పనిజేసిన సర్. సి. పి. రామస్వామి అయ్యర్ తమిళ బ్రాహ్మడే.

కేరళలో ఆధునిక భావాల వ్యాప్తికి, సిరియన్ క్రిస్టియన్లతోపాటు నాయర్లూ - తమిళ బ్రాహ్మలూ శక్తికొద్దీ కృషిజేశారు. అయితే వీరిలో

వీరికి పొత్తుమాత్రం కుదరదు. ప్రత్యేకంగా కేరళనాయర్లకీ - తమిళ బ్రాహ్మలకీ అసలు పడదు. తిరువాన్కూర్ - కొచ్చిన్ - సంస్థానాల్ని పాలించిన వారు, గాఢమైన హిందూమతాభిమానులు కావడం వల్ల, యీ ఉభయ సంస్థానాల్లో దివాన్లుగా వున్న వారు అగ్రవర్ణాలవారే. అంచేత యీ రెండు సంస్థానాల్లో వున్న నాయర్లూ - తమిళ బ్రాహ్మల్తో పోలిస్తే, ఎన్నో కష్టనష్టాలకి గురిజేయబడినవారు - సిరియన్ క్రిస్టియన్లే. ఈ ఉభయ సంస్థానాల్లో, నాయర్లూ - తమిళ బ్రాహ్మలూ ఉన్నతమైన పదవు లధిష్టించగా, సిరియన్ క్రిస్టియన్లకి మాత్రం యిది సాధ్యపడలేదు.

అంతేగాదు; సంపన్నులూ - సంస్కృతీపరులైన సిరియన్ క్రిస్టియన్లకీ, బాగా వెనకబడ్డ సాధారణ క్రిస్టియన్లకీ మధ్య వైషమ్యముంది. సిరియన్ క్రిస్టియన్లు సాంఘిక - రాజకీయ - రంగాల్లో, తమిళ బ్రాహ్మలూ - నాయర్లతో దాదాపు సమాన ఫాయిలో వుంటారు. "తక్కువ" కులాలకి చెందిన హిందువులు ఏ బాధలకు గురిజేయ బడుతోన్నారో సరీగ్గా అదే బాధలకి, వెనకబడ్డ క్రిస్టియన్లు సైతం గురిజేయబడు తోన్నారు.

ప్రాచీన కాలంలో కేరళకు వొచ్చిన సెయింట్ థామస్ వంటి జీసస్ శిష్యునిద్వారా తాము మతం పుచ్చుకొన్నామనీ, తాము అగ్రవర్ణాలకి చెందిన హిందువులమనీ, తిరువాన్కూర్ - కొచ్చిన్ సంస్థానాల్లోవున్న సిరియన్ క్రిస్టియన్లు గర్విస్తోంటారు! గత శతాబ్దంలో బ్రిటిష్ మిషనరీల ద్వారా, మతం పుచ్చుకొన్న "హీన" కులాల వారిని, ఈ సిరియన్ క్రిస్టియన్లు ఎంతో నీచంగా చూస్తారు. బ్రిటిష్‌పాలిత ప్రాంతమైన మలబారు లోని అధిక సంఖ్యాకులైన క్రిస్టియన్లు, హిందూ సంఘంలోని "తక్కువ" కులాలకి చెందిన వారే.

కర్నాటక

కర్నాటక రాష్ట్రానికి చెందిన బసవేశ్వరుడు (12 వ శతాబ్దం) కులభేదాల్ని అత్యంత నిశితంగా ఖండించాడు. 17 వ శతాబ్దానికి చెందిన సర్వజ్ఞుడు గూడా, కులాన్ని - పురోహితవర్గాన్ని - విగ్రహారాధననీ - చాలా తీవ్రంగా విమర్శించాడు. ఇతడు సన్యాసి; కుమ్మరి కులానికి చెందినవాడు.

బసవేశ్వరుని అనుచరులైన నేటి లింగాయతులు (వీరశైవులు) మాత్రం, మూఢమత విశ్వాసం గల శైవులే. వీరిలో కులతత్వం చాలా తీవ్రరూపంలో వ్యాపించి వుంది. పాత మైసూరు - బొంబాయి- రాష్ట్రాలకి చెందిన హైకోర్టులు, ఈ లింగాయతులు శూద్రులేనని స్పష్టంగా తీర్పు చెప్పాయి.

ప్రప్రథమంగా బ్రాహ్మణేతర ఉద్యమం, తమిళనాడులో అంకురించింది. క్రమేణా - యిది - పొరుగురాష్ట్రమైన కర్నాటకకి సైతం పాకింది. 1928 లో పెరియార్ రామస్వామి బెంగుళూరు వొచ్చిన తర్వాతనే, యీ రాష్ట్రంలో నిర్దిష్టమైన బ్రాహ్మణేతర ఉద్యమం ప్రారంభమైంది.

బెంగుళూరులోని చిన్న ప్రైవేట్ స్కూల్లో, పెరియార్ రాక సందర్భంగా వొక సమావేశం ఏర్పాటు జేశారు. రాముడూ - కృష్ణుడూ - దేవుళ్ళేకారనీ, మొదలంటూ పుచ్చిపోయిన హిందూమతం అంటరాని తనమనే భయంకర జాఢ్యానికి మూలమనీ, యీ అస్పృశ్యత లాంటిది ప్రపంచంలో ఏ దేశంలోనూ లేదనీ, శూద్ర - పంచమ - నొసటిపై హీన కులజులుగా పుట్టమని బ్రహ్మదేవుడు రాత రాయలేదనీ ఆనాడు పెరియార్ చెప్పాడు.

ఇలాంటి ఉపన్యాసం కన్నడ ప్రజలు వినడం యిదే మొదటిసారి. ఈ ప్రసంగమే - కర్నాటకలో హేతువాద నాస్తిక ఉద్యమానికి నాంది

గీతం పల్కింది. 1949 ఫిబ్రవరిలో ప్రొఫెసర్ ధర్మలింగం, బెంగుళూరులో "తిరువళ్ళువర్ సంఘం" అనే పేరిట ఒక హేతువాద సంఘాన్ని స్థాపించి, ఆత్మగౌరవ ఉద్యమానికి చెందిన భావాల్ని ప్రచారం జేయనారంభించాడు. క్రమేణా బెంగుళూరులో ద్రవిడకజగం, (DK) ద్రవిడ మున్నేట్ర కజగం (DMK) స్థాపింపబడి, హేతువాద - నాస్తిక - భావవ్యాప్తికి దోహదం జేశాయి. (క్రీస్తు పూర్వం 1 వ శతాబ్దానికి చెందిన వాడే - తిరువళ్ళువర్. యీతడు అస్పృశ్యుడు. తమిళనాడుకి చెందిన యీ ప్రాచీన మహాకవి, "కురల్" అనే కావ్యం రాశాడు. దానిలో కులరాహిత్యాన్నీ, స్త్రీ స్వాతంత్ర్యాన్నీ, అన్ని కులాల వారికి విద్యనీ, సాంఘిక జీవితంలో ఉత్తమ శీలాన్నీ, యీయన ప్రతిపాదించాడు. పెరియారూ, ద్రవిడకజగంవారూ, ఈయన భావాలకి ఎంతో ప్రాధాన్యమిస్తారు.)

హిందూమతంపై బసవలింగప్ప దాడి

ఆధునిక కర్నాటక సాంస్కృతికోద్యమ చరిత్రలో, హరిజన నాయకుడైన బసవలింగప్ప అవతరణ చాలా ప్రముఖమైంది. ఈయన 1973 లో కర్నాటక రాష్ట్రప్రభుత్వంలో మంత్రిగా వుండేవాడు. ప్రముఖ హేతువాదియైన ఈయన, రాష్ట్రంలోని హరిజనుల - శూద్రుల - విద్యా సాన్ని అధికంగా చూరగొన్నాడు. 1973లో మైసూరు విశ్వవిద్యాలయంలో వొకసారి ప్రసంగిస్తూ, "వేలసీళ్ళు గడిచినా, శూద్ర - పంచముల - పరిస్థితిని ఏ మాత్రం మెరుగుపరచలేని హిందూ దేవుళ్ళనీ, హిందూధర్మ శాస్త్రాల్నీ, చెత్తకుప్పపైకి విసిరివేయాలి" అని ఖండితంగా చెప్పాడు. మరో సభలో ఉపన్యసిస్తూ, "కులాన్నీ - అంటరానితనాన్నీ - అంధ విశ్వాసాల్నీ నిర్మూలించేందుకి, సామాన్య ప్రజల చైతన్యాన్ని వృద్ధి జేయలేని కన్నడ సాహిత్యమంతా, ఆంబోతుల్ని (బసవన్నల్ని) పూజించే

చెత్త సాహిత్యమేననీ, ధనికుల - మధ్యతరగతి - ప్రజల జీవితాల్నే యీ సాహిత్యం చిత్రిస్తోందనీ, దళితకులాలవారి జీవిత సమస్యల్ని రచయితలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనీ, పేదప్రజల జీవితాన్ని చిత్రించని సాహిత్యమంతా చెత్తయేననీ" ఆయన చెప్పాడు. (He declared that "most of Kannada literature was nothing but cattle feed-boosa, as they are not calculated to rouse the conscience of the people to abolish caste and untouchability and to destroy superstition.") యథాతథస్థితిని కాపాడే కాపలా కుక్కల్లాంటి కర్నాటక పత్రికలు, ఈ విధంగా మాట్లాడిన బసవలింగప్పపై నిప్పుల వర్షం కురిపించాయి! క్రమేణా రాష్ట్రిమంత్రి వర్గంలోని ఆయన సహచరులు గూడా బసవలింగప్పపట్ల శత్రువైఖరి నవలంబించారు. తత్ఫలితంగా నాటి ముఖ్యమంత్రి, ఆయన్ని మంత్రి వర్గం నించి తప్పించాడు!

బసవలింగప్ప యిచ్చిన ఉపన్యాసాలు, కర్నాటకలో అగ్ర- అధమ-కులాల మధ్య తీవ్రమైన ఘర్షణల్ని సృష్టించి, నూత్న చైతన్యానికి దోవ తీసాయి. ఈ నూత్న చైతన్య స్రవంతి లోంచే, కర్నాటకలో దళిత సంఘర్ష సమితి (D.S.S.) 1973 లో ఆవిర్భవించింది. యీ చైతన్యం రాజకీయరంగంలో రైల్వే సమ్మెకీ, ఆహారధాన్యాల కోసం జరిగిన మిల్లు సెంట్ పోరాటాలకీ, సాంఘికరంగంలో కులవ్యతిరేక పోరాటాలకీ, హరిజన విద్యార్థుల హాస్టల్ సమస్యలకి చెందిన ఆందోళనకీ దోవతీసింది. బినామీ భూముల్ని పంపకం చేయాలనీ, హరిజనులపై జరిపే అత్యాచారాల్నీ హత్యల్నీ అంత మొందించాలనే ఆందోళన సైతం జరుపబడింది.

మైసూరులోనే గాక రాష్ట్రంలోని యితర ప్రాంతాల్లో గూడా, దళిత సంఘర్ష సమితి పేరిట అనేక శాఖలు వీర్పడ్డాయి. వీటిలోని సభ్యులు

అధికంగా హరిజనులే. 1975 లో యీ శాఖలు, హరిజనుల దేవాలయ ప్రవేశం, హోటళ్ళలో ప్రవేశం, సవర్ణ హిందువుల బావుల్లోంచి నీరు తోడుకోవడం లాంటి సాంఘిక సమస్యల కోసం కృషిజేశాయి. యీ శాఖల్లో ప్రధానమైనవి మూడున్నాయి. 1. లోహియా దళిత్ గ్రూప్. 2. మహాదేవప్ప మెమోరియల్ మార్క్సిస్ట్ లైబ్రరి దళిత్ గ్రూపు. (MMML) 3. సి.పి.యం. దళిత్ గ్రూపు.

దళితుల (హరిజనుల) సమస్యల్ని జనానికి తెలియ జేసేందుకు, "పంచమ" "శూద్ర" "వికేంద్ర" "విముక్త" "విమోచన" యిత్యాది పత్రికలు ప్రచురించబడ్డాయి. కర్నాటక దళిత ఉద్యమ కార్యకర్తల్లో అనేకులు శక్తివంతమైన రచయితలు. మహారాష్ట్రలోని "దళిత్ పేంథర్ల" ప్రభావం, కర్నాటక దళిత గ్రూపులపై అధికంగా పడింది. మహారాష్ట్రలో వలె, కర్నాటకలో కూడా దళిత ఉద్యమం, బ్రాహ్మణ మతానికి వ్యతిరేకంగా ప్రారంభమైంది. ఈ కర్నాటక ఉద్యమం, కేవలం హరిజన వాడలకే పరిమితంగాకుండా, గ్రామసీమల్లోకి సైరం చొచ్చుక పోయింది.

ఇండియాలోని హేతువాద ఉద్యమం, తొలివశలో బ్రాహ్మణేతర ఉద్యమంగా ప్రారంభమైంది. ఇది క్రమేణా కులవ్యతిరేక (Anti-caste) అంధ విశ్వాసాల వ్యతిరేక (Anti-Superstion) దైవ వ్యతిరేక (Anti-god) ఉద్యమంగా రూపుదాల్చింది. తమిళనాడులో పెరియార్ను తీసుకొన్నా, ఆంధ్రదేశంలో త్రిపురనేని రామస్వామి - తాపీ ధర్మారావు - యిత్యాదుల్ని తీసుకొన్నా, కర్నాటకలో ప్రొఫెసర్ ధర్మలింగం - దళిత ఉద్యమ కార్యకర్తల్ని తీసుకొన్నా, కేరళలో నారాయణగురును తీసుకొన్నా, ఈ సత్యమే మనకు గోచరిస్తుంది. అనంతర దశలో యిది - కొన్ని రాష్ట్రాల్లో ఆస్తిక హేతువాద ఉద్యమానికీ, మరికొన్ని చోట్ల

బ్రాహ్మణమత వ్యతిరేక ధోరణులకీ, ఆంధ్రలో స్పష్టమైన నాస్తికోద్య మానికీ దారి తీసింది. త్రిపురనేని రామస్వామి, గోరా, గౌరిబోయిన పోలయ్య యిత్యాదులు, తమ రచనల ద్వారా కుల-మతాల్నీ, దేవుళ్ళనీ, నడిబజార్లో కడిగిపారేశారు. మొత్తం మీద చెప్పాలంటే, దక్షిణ భారతంలోని హేతువాద ఉద్యమం, బ్రాహ్మణేతర ఉద్యమంగా మొగ్గ తొడిగింది. ఈ ఉద్యమమే మౌలికంగా కులవ్యతిరేక పోరాటంగా పరిణమించింది.

5. ఉత్తర భారతంలో కులవ్యవస్థ

మహారాష్ట్రలో "మహర్" కులంవారు అంటరానివారు. ఈ రాష్ట్రంలో వీరే అత్యధిక సంఖ్యాకులైన అస్పృశ్యులు. అంబేడ్కర్ ఈ కులానికే చెందినవాడు. నాటి మహారాష్ట్రలో హరిజనులు, మెళ్ళో ముంత - చేతిలో చీపిరి - పట్టుక వీధుల్లో నడవాలి. హరిజనుల నీడ సోకిన తక్షణం, నాటి బ్రాహ్మలు కట్టుబట్టల్తో స్నానం (సచేల స్నానం) జేసేవారు!

మహారాష్ట్ర

అస్పృశ్యత మహమ్మారిలా వ్యాపించిన ఆ రోజుల్లో, మహారాష్ట్రలోని మోవో గ్రామంలో 1891 ఏప్రిల్ 14 న అంబేడ్కర్ జన్మించాడు. బాల్యం నుండీ అంటరానితనానికి చెందిన ధీకర అవమాన పరంపరల్ని ఆయన స్వయంగా అనుభవించాడు. అంచేతనే కులతత్వమూ అస్పృశ్యతకి వ్యతిరేకంగా ఆయన నిప్పులు గక్కాడు. ఆపాపపుస్తకం ఆగ్రహోదగ్రుడై, వర్ణవ్యవస్థ సమూల విధ్వంసానికి ఆయన నిర్విరామంగా కృషి జేశాడు.

కులవ్యవస్థ - దాని పిలకయైన అస్పృశ్యత - ధర్మసమ్మతమేనని ప్రతిపాదించి, మానవత్వాన్ని మంట గలిపిన మనుస్మృతిని, 1926

డిసెంబరు 25 వ తేదీన డాక్టర్ అంబేడ్కర్ దగ్ధం జేశాడు. 1927 లో మహారాష్ట్ర హరిజనుల హక్కుల కోసం, ఆయన చారిత్రాత్మకమైన మహాడ్ సత్యాగ్రహానికి నాయకత్వం వహించి నడిపాడు. కులతత్వపు మూసలో కరిగించబడి రూపుదిద్దుకొన్న హిందూసమాజాన్ని; అనుక్షణం కోట్లాది హరిజనులచే అస్పృశ్యతా గరళాన్ని మింగింప జేస్తోన్న హిందూ సమాజాన్ని; కులం నెపంతో అశేష ప్రజల్ని అవహాన పరంపరలకి గురిజేస్తోన్న హిందూ సమాజాన్ని; అంబేడ్కర్ తన రచనల్లో అడుగడుగునా ఎండగట్టాడు. "కులం పునాదులపై మీరు దేన్నీ నిర్మించలేరు. ఒక జాతినీ నిర్మించలేరు. ఒక నీతినీ నిర్మించలేరు" అని ఆయన హెచ్చరించాడు. ("కుల నిర్మూలన" గ్రంధం) భారతీయులు కులభేదాల్ని నిర్మూలించనంత వరకూ, వారు స్వాతంత్ర్యం పొందడానికి అర్హులు కారు - అని కూడా ఆయన అన్నాడు. 1942 లో ఆలిండియా షెడ్యూల్డు కాస్ట్స్ ఫెడరేషన్‌ను స్థాపించాడు. అనంతరం ఈ పార్టీ పేరును "రిపబ్లికన్ పార్టీ"గా మార్చాడు.

"1950 జనవరి 26 వ తేదీన రాజకీయాల్లో సమానత్వమూ, సాంఘిక - ఆర్థిక - జీవితంలో అసమానత్వమూ మనకు ఏర్పడుతోంది. మనం ఈ వైరుధ్యాన్ని సాధ్యమైనంత త్వరగా అంతమొందించాలి. అలా కాకపోతే, అసమానత్వం ద్వారా బాధపడేవారు, పొలిటికల్ డెమోక్రసీకి చెందిన చట్రాన్ని అంతమొందిస్తారు" అని, నవభారత రాజ్యాంగం అమల్లో కొచ్చిన రోజున, డాక్టర్ అంబేడ్కర్ హెచ్చరించాడు.

దేవుళ్ళూ ప్రవక్తలూ మిమ్మల్ని రక్షించలేరు

1956 అక్టోబరు 14 వ తేదీన 5 లక్షల పంది హరిజన అనుయాయుల్తో, అంబేడ్కర్ నాగపూర్‌లో బౌద్ధమతాన్ని స్వీకరించాడు. "మేకల్ని బలియిస్తారు గాని, సింహాల్ని బలియివ్వరు. మీ హక్కులు

భద్రంగా వుంటాలంటే బలహీనత పనికిరాదు. నేటి మీ కష్టాలన్నీ పూర్వజన్మ - కర్మ ఫలితాలు మాత్రం కావు. అగ్రవర్ణాలు కుట్రజేసి, మీపై రుద్దినట్టివే. మీ స్వశక్తితోనే మీ బానిసత్వాన్ని రూపుమాపుకోవాలి. దేవుళ్ళు, తీర్థయాత్రలూ, ప్రవక్తలూ, ఉపవాసాలూ, మతగ్రంథాల వంటివేవీ, మిమ్మల్ని రక్షించ జాలవు" అని డాక్టర్ అంబేడ్కర్ హరిజనుల్ని హెచ్చరించాడు. పంచముల్ని మేల్కొల్పే ప్రయత్నంలో, ఆయన ఎన్నో ఘర్షణల్ని చెదురొక్కొన్నాడు. ఆజన్మాంతం సాంఘిక విప్లవం కోసం కృషిజేసిన అంబేడ్కర్, 1956 డిసెంబరు 6వ తేదీన మరణించాడు. ఈయనకి పూర్వం మహారాష్ట్రలో, జ్యోతిబా పూలే - మహాదేవ రెనడె - సాంఘిక విప్లవం కోసం చెనలేని కృషి జేశారు.

అంబేడ్కర్ చేసిన కృషికి చిహ్నంగా, మరాట్వాడా యూనివర్సిటీ పేరును డాక్టర్ అంబేడ్కర్ యూనివర్సిటీగా మార్చాలని, రాష్ట్రంలోని విద్యాధికులూ - దళితేతరులూ కోరారు.

మరాట్వాడా యూనివర్సిటీకి అంబేడ్కర్ పేరు పెట్టడం

మరాట్వాడా యూనివర్సిటీ పేరును, డాక్టర్ అంబేడ్కర్ యూనివర్సిటీగా మార్చాలనే తీర్మానం, మహారాష్ట్ర ఎసెంబ్లీలోనూ కౌన్సిల్‌లోనూ అత్యధిక మెజారిటీతో నెగ్గింది. కాని మరుక్షణమే మరాట్వాడా అంతటా అత్యంత తీవ్రమైన స్థాయిలో హింసాకాండ చెలరేగింది!

అగ్రపర్ణాలకి చెందిన విద్యార్థులు, ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం జేశారు. రైళ్ళు బస్సులకి నిప్పుపెట్టారు. తంతి - తపాలా సౌకర్యాలు స్తంభించి పోయాయి. రోడ్లూ వంతెనలూ ధ్వంసం చేయబడినందువల్ల, రాకపోకలకు అంతరాయం కల్గింది. నగరాల నించి ఈ దౌర్జన్యకాండ

క్షణంలో గ్రామాలకి సైతం వ్యాపించింది. తత్ఫలితంగా హరిజనులపై దౌర్జన్యం జరిపి, వారి గుడిసెల్ని సైతం దగ్ధంజేసి వేశారు.

అగ్రవర్ణాలకి చెందిన నాయకులు, విద్యార్థుల్లో మిస్చివస్ ప్రచారం జేశారు. పరాట్వాడా యూనివర్సిటి ఉనికిలోకి వొచ్చిన తర్వాత, విద్యార్థులకి డిగ్రీలు యిచ్చేప్పుడు, అంబేడ్కర్ బొమ్మ ఆ డిగ్రీలపై వుంటుందనీ, డిగ్రీ తీసుకొన్న విద్యార్థి, ఆ డిగ్రీని పటం కట్టించి గోడకి తగిలిస్తే, అది-దేవతా విగ్రహారాధనతో సమానమవుతుందనీ, కొంచరు హిందూమత దురహంకారులు ప్రచారం జేశారు. అంబేడ్కర్ పేరును యూనివర్సిటీకి పెట్టిన తర్వాత, ఆ యూనివర్సిటీ యాజమాన్యంలో వుండే కాలేజీల్లో, బౌద్ధ ప్రార్థనలు సైతం ప్రారంభింపబడతాయనే కుటిల ప్రచారాన్నిగూడా ఈ భటాచోర్లే చేశారు. అంతేగాదు; ఔరంగాబాద్ పేరును "అంబేడ్కర్ నగర్"గా త్వరలోనే మార్చడం జరుగుతుందని, ముస్లిమ్ విద్యార్థుల్లో ఈ అగ్రవర్ణాలవారే విషప్రచారం జేశారు. స్త్రీలు వేసుకొనే గాజులున్న కవర్లను విద్యార్థులకి వీరే పంచిపెట్టారు. మొనగాళ్ళయితే పోరాటంలో దూకండి - లేదా - గాజులు తొడిగించుకో దలచుకొంటే ముండల్లా వుండండి - అని అత్యంత నీచంగా తెచ్చగొట్టడానికి, ఈ గాజుల ప్యాకెట్లను వీరు విద్యార్థులకి పంచిపెట్టారు.

తత్ఫలితంగా ఇటు దళితవర్గాల్లోనూ, అటు సవర్ణ హిందువుల్లోనూ, తీవ్రస్థాయిలో ఉద్రేకాలు పెరిగాయి. మహారాష్ట్ర నించి యితర ప్రాంతాలకి సైతం ఈ ఉద్రేకాలు విస్తరించాయి. ఈ సందర్భంలో బీహార్‌కి చెందిన ఒక హరిజన నాయకుడు, తమకు ప్రత్యేకంగా "దళిత్ ప్రజల నాడు" కావాలని డిమాండ్ చేయగా, కర్ణాటకకు చెందిన మరో హరిజన నాయకుడు, హరిజనులు మాత్రమే నివసించడానికి వీలుగా కొన్ని ప్రాంతాల్ని వేరుచేయాలని కోరాడు.

అంబేడ్కర్ పేరును మరాట్వాడా యూనివర్సిటీకి పెట్టగూడదనే ఈ అగ్రవర్ణాల ఉద్యమం వెనక ఏమైనా కారణాలున్నాయా? గత రెండు శతాబ్దాలుగా మహారాష్ట్ర ప్రభుత్వం, షెడ్యూలు కులాలవారికి కల్పించిన కన్సెషన్లకి వ్యతిరేకంగా, ఈ అగ్రవర్ణాలపొరిలో గూడుకట్టుకొన్న ఆగ్రహ విద్వేషాలు, ఈ ఉద్యమ రూపంలో కట్టలు తెంచుక ప్రవహించాయా? హరిజనులకు చేటాయిస్తోన్న రిజర్వేషన్లు, తమ చదువుల్నీ ఉద్యోగావకాశాల్నీ దెబ్బగొడుతున్నాయని భావించిన సవర్ణ హిందూ విద్యార్థులు, యూనివర్సిటీకి కొత్త పేరును "బలవంతంగా రుద్దడంతో" చిరకాలంగా తమలో రగిలే ఆగ్రహావేశాల్ని వొక్కసారిగా బయటికి వెళ్ళగక్కారని కొందరు వ్యాఖ్యాతలు అంచనా వేస్తున్నారు.

మరాట్వాడా యూనివర్సిటి సంక్షోభం
ఏ మేరకు కులాల మధ్య అంతర్యుద్ధం?

"అగ్రవర్ణాలకి చెందినవారు మహారాష్ట్రలో తమ కివ్వబడుతోన్న విచక్షణారహితమైన ట్రీట్‌మెంటును గూర్చి ఆందోళన చెందుతున్నారు. వివిధమైన హరిజన డిమాండ్‌ను వ్యతిరేకించినా, ఏ ముప్పు వాటిల్లుతుందోనని వారు భయపడుతోన్నారు. అభివృద్ధి నిరోధకులనే బిళ్ళ తమకు తగిలించబడుతుందేమోనని వారు భీతిల్లుతోన్నారు. మహారాష్ట్ర గ్రామసీమల్లో వున్న దళిత్‌ల (అంబేడ్కర్ అనుయాయుల) జిత్తులమారి ఎత్తుగడలతో గ్రామీణులు విసిగిపోయారు. పౌరహక్కుల రక్షణ చట్టం (Protection of Civil Rights Act) ఈ దళిత్‌ల చేతుల్లో ప్రమాదకరమైన ఆయుధంగా తయారైంది" అని వొక బ్రాహ్మణ పెద్దమనిషి ఈ మరాట్వాడా యూనివర్సిటి వివాదంపై వ్యాఖ్యానించాడు.

"అగ్రవర్ణాలకి చెందిన మాపై తీవ్రమైన వివక్ష చూపుతోన్నారు. హరిజనులకి వ్యతిరేకంగా వొక్క మాట గూడా అనడానికి ఎవ్వరికీ

ధైర్యం చాలడంలేదు. కాని అగ్రవర్ణాలవాని వారు యిష్టమొచ్చినట్లు తిట్టి, హాయిగా వెళ్ళిపోవచ్చు" అని మరో పెద్దమనిషి వ్యాఖ్యానించాడు. (ఇలస్ట్రేటెడ్ వీక్లీ - 1978 సెప్టెంబరు - 10 వ తేదీనాటి సంచిక)

మరాట్వాడా యూనివర్సిటి వివాదం - అనేకానేక కారణాల సముదాయం. షెడ్యూలు కులాల - తెగల - విద్యార్థులకి కాలేజీల్లో 34 శాతం సీట్లను రిజర్వ్ చేయడమూ, ప్రభుత్వ ఉద్యోగాలకి చెందిన ప్రమోషన్లలో వివక్షత చూపించడమూ, హరిజనేతర విద్యార్థుల్లో బ్రహ్మాండమైన ఆగ్రహానికి దోవతీసింది. రాష్ట్రంలో 18 శాతం సీట్లు షెడ్యూలుకులాలు - తెగలవారికీ, 16 శాతం సీట్లు వెనకబడిన కులాలవారికీ రిజర్వ్ చేయబడ్డాయి. అంచేత, మిగతా కులాలవారిలో ఈ ఆవేశకావేషాలు పెచ్చరిల్లాయి.

ఎసెంబ్లీలో తీర్మానం పాస్ అయినంత మాత్రాన, యూనివర్సిటీ పేరును మార్చడం ఏమాత్రం సబబు? అని కొందరు ప్రశ్నించారు. బాగానే వుంది. మరాట్వాడా యూనివర్సిటీకి అంబేడ్కర్ పేరు పెట్టడం పౌరపాటు అవుతుంది గాని, దానికి ఆదిశంకరా యూనివర్సిటీ అని నామకరణం గావిస్తే, యిట్టివాటికి మహా సమ్మగా వుంటుంది కామోసు! అవును మరి! పంచముడయిన అంబేడ్కర్ పేరును, పవిత్రమైన మరాట్వాడా యూనివర్సిటీకి పెట్టడం క్షమించరాని నేరంగాదూ?! అలా చేస్తే ఆ యూనివర్సిటీ మైలపడిపోదూ?!

సవర్ణ విద్యార్థులకు ఫిర్యాదుజేసే హక్కు లేనేలేవని, హరిజన విద్యార్థులు అంటోన్నారు. షెడ్యూలు కులాల వారికిచ్చే రిజర్వేషన్లు, తమ ఉద్యోగావకాశాల్ని దెబ్బగొడుతున్నాయని సవర్ణులు భావించే పక్షంలో, అనేక శతాబ్దాలుగా అగ్రవర్ణాలవారు దళిత ప్రజలపై జరిపిన పైశాచిక కృత్యాల్తో దీన్ని పోలిస్తే, ఈ రిజర్వేషన్లు ఏ మూలకి - అని హరిజనులు ప్రశ్నిస్తోన్నారు. తరతరాలుగా అగ్రవర్ణాలవారు అనుభవించిన అమేయ

74730

భోగలాలసాల్తో పోలిస్తే, దళితవర్గాలవారికి నేడిచ్చే ఈ రిజర్వేషన్లు ఏ పాటి? ఉప్పుకా - చింతపండుకా? సవర్ణుల దురాగతాలు ఆగిపోయాయా అంటే అవీ లేదు. నేటికీ హరిజనులపట్ల దుర్మార్గమైన ధోరణినీ, క్రూరత్వాన్నీ ప్రదర్శిస్తోనే వున్నారు. కులంపేరిట నానాటికీ నేరాలు పెరుగుతూనే వున్నాయి. కులంపేరిట నేటికీ ఎన్నో ఘోరాలు జరుగుతూనే వున్నాయి, అని దళితవర్గాలవారు వాదిస్తోన్నారు.

"అయితే పేదవాడూ - తెలివైనవాడూ - కులతత్వం లేనివాడూ అయిన వొక హరిజనేతర విద్యార్థి వుంటాడు. రిజర్వేషన్ల వల్ల అతనికి కాలేజీలో సీటు రాదు. గవర్నమెంటు ఉద్యోగమూ రాదు. ఆతని పూర్వీకులు గతంలో చేసిన పాపానికి, ఆతడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలా" అని కొందరు ప్రశ్నిస్తోన్నారు. నిజమే-కొందరికి కొంచెమంత అన్యాయం జరుగుతున్న విషయం సత్యమే. అయితే వేల సంవత్సరాల పర్యంతం, ఈ అగ్రవర్ణాలవారు పంచములనీ గ్రామ చండాలురనే పేరిట, ఊరిబయట మాల - మాదిగ గూడేల్లో పెట్టి, పురుగుల్లా - పశువుల్లా - పరమ నీచాతి నీచంగా చూసిన భయంకర చరిత్రను, ఈ ప్రశ్నించే వారు మరుగుపర్చడానికి ప్రయత్నిస్తోన్నారా?! రక్తమూ కన్నీటితో రాయవలసిన ఈ శతాబ్దాల హరిజన చరిత్రను, మభ్యపర్చడానికి శతథా వీరు యత్నిస్తోన్నారా?! ఆకలికీ, అవమానాలకీ, అంతూ పంతూలేని గొడ్డుచాకిరికీ, తరతరాలుగా గురిజేయబడిన యీ హరిజనుల బిడ్డల్లో అతి కొద్దిమంది, నేడు రిజర్వేషన్ల ఫలితంగా ఉద్యోగాలూ-కాలేజీ సీట్లూ-పొందుతోంటే, ఏదో బ్రహ్మాండం బద్దలై పోయినట్లూ, ఏదో జరగరాని మహా పాతకం జరిగి పోతోన్నట్లూ వీరు ఎంచేత గావుకేకలు వేస్తోన్నారు? అసూయ ద్వేషాల్తో వారిని చూసి, లోలోన వీరు కుళ్ళి కుళ్ళి ఎందుకు ఏడుస్తోన్నారు?

"మారాట్వాడా యూనివర్సిటీకి శివాజీ లేదా రామానందతీర్థ పేరును పెట్టినే, యీ ఆందోళనే వుండేదిగాదు. అంబేడ్కర్ పేరు పెట్టినందు వల్లనే వారు కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇది కులాల మధ్య యుద్ధం."

"బ్రాహ్మలే ఈ ఆందోళనకు నాయకత్వం వహించారు. పోలీసు అధికార్లు అగ్రవర్ణాలకి చెందిన హిందువులు. వారు హరిజన వ్యతిరేకులు. మేం బానిసలుగా బతకాలని అగ్రవర్ణాలవారు కోరుతున్నారు. వారు మమ్మల్ని హీనపరుస్తోన్నారు; అగౌరవ పరుస్తోన్నారు."

"బ్రాహ్మలే ఈ సంక్షోభానికి పథకం వేశారు. మరాఠా ప్రజలకీ (Marathas) షెడ్యూల్డు కులాలవారికీ మధ్యనున్న అఘాతాన్ని పెంచడమే వారి ప్రధాన లక్ష్యం. ఇందులో వారు గెలుపొందారు. మరాఠా ప్రజల్ని బ్రాహ్మలు ఎంతగా ద్వేషిస్తారో, షెడ్యూల్డు కులాలవారిని సైతం వారు అంతగానే ద్వేషిస్తారు. బ్రాహ్మణాధిక్యతను స్థాపించడానికే వారు ఈ రకమైన చీలిక ఎత్తుగడల్ని ప్రయోగిస్తోన్నారు" అని ఈ సంక్షోభంపై వ్యాఖ్యానిస్తో, మహారాష్ట్ర హరిజన నాయకుడైన శ్రీ గవాయ్ అన్నాడు.

షెడ్యూల్డు కులాలవారికి ప్రభుత్వం యిస్తోన్న రిజర్వేషన్ల పట్ల అగ్రవర్ణాలవారు ప్రదర్శించే ఆగ్రహం గూర్చి మాట్లాడుతో - "ఈ కోపం తప్పకుండా వుంటుంది. డాక్టర్ అంబేడ్కర్ గూడా దీన్ని గూర్చి భయ పడ్డాడు. అంచేత, బలహీన తరగతులవారిని మిగతా కులాలవారితో పాటు సమానంగా అభివృద్ధి జేయడానికి, నిర్ణీతకాల వ్యవధితో కూడిన కార్య క్రమాన్ని ప్రభుత్వం చేబట్టాం. బలహీనవర్గాల వారిని, మిగిలిన కులాల వారి యొక్క సమాన స్థాయికి ప్రభుత్వం తీసుకరాలేక పోయిందని, పార్లమెంటులో ప్రతి పది ఏళ్ళ కొకసారి హోంమంత్రి ప్రకటించడమూ,

రిజర్వేషన్లను మరో పది ఏళ్ళ పాటు పొడిగించడమూ పరిపాటిగా తయారైంది" అని శ్రీ గవాయ్ అన్నాడు.

ఈ దేశం అగ్రవర్ణాలవారి గుత్తసొమ్ము కాదు

పౌరహక్కుల చట్టాన్ని హరిజనులు దుర్వినియోగం గావిస్తో, అగ్రవర్ణాలవారిపై దురాగతాలు చేస్తున్నారని మహారాష్ట్రలో కొందరు చేస్తోన్న ప్రచారానికి జవాబుగా ఆయన యిలా అన్నాడు: "మహారాష్ట్ర గ్రామసీమల్లోని సామాన్య హరిజనులకి, ఇలాంటి చట్టముంటూ వొకటి వుందనే విషయమే తెలియదు. ఈ చట్టం అస్పృశ్యతా నిర్మూలన చట్టం అనే పేరిట గతంలో పిలవబడేది. అప్పుడు ఈ చట్టం చాలా బలహీనంగా వుండేది. ఇందిరాగాంధీ 1976 లో ఈ చట్టాన్ని సవరించి, దీన్ని తీవ్రమైన శాసనంగా రూపొందించింది. నేడు యీ చట్ట ప్రకారం పోలీసు అధికారే కేసును రెజిస్టర్ చేయాలి. అలా చేయకపోతే, చట్టప్రకారం అతడు నేరానికి బలం చేకూర్చినవాడుగా పరిగణింపబడతాడు. అయితే మహారాష్ట్రకి సంబంధించినంతవరకు, యీ చట్టం కాయితం మీదనే వుండిపోయింది!"

"ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం పొందడానికి, గ్రామాల్లోని దళితులు తమ గుడిసెల్ని తామే దగ్ధం జేస్తోన్నారని కొందరు ప్రచారం జేస్తోన్నారు. ఎంతటి దీనావస్థలో వున్నా, తమ కొంపల్ని తామే ఎవరైనా తగలబెట్టు కొంటారా?"

"భారత ప్రజలనుండి విడిపోవడానికి మేము ఎంచేత కోరుకుంటాం? భారతదేశం అగ్రవర్ణాలవారి గుత్తసొమ్మేమీ కాదు. వాస్తవానికి మేమే యీ దేశంలో ఆదిమవాసులం. మా హక్కులకోసం మేం నిలబడతాం. యీ దేశంలోనే వుండి మా హక్కుల కొరకు పోరాడతాం" అని శ్రీ గవాయ్ అన్నాడు.

"దళితులు ఏం చేయగలరు? వారు ఎగ్రెసివ్‌గా తయారై వుండవొచ్చు; వారు దానిపలుగానైనా బతకాలి - లేదా - వీరోచితంగానైనా (Militant) తయారు గావాలి. ఇంతకీ మినహా వారికి మరో గత్యంతరం లేదు. అగ్రవర్ణాల పాదాల ముందు హరిజనులు పడివుండాలని సవర్ణ హిందువులు కోరుతున్నారు. వారు అత్యంత నీచంగా హరిజనుల పట్ల ప్రవర్తిస్తోన్నారు. దళితులు అసభ్యకరమైన భాషను వాడుతుండవొచ్చు. అయితే వారీ విధంగా వాడటానికి కారణముంది. సవర్ణ హిందువులు వారిని విపరీతంగా రెచ్చగొడుతోన్నారు. పౌరహక్కుల చట్టం వాస్తవానికి అమలు చేయడమేలేదు. ఇందుకు కారణం, సవర్ణ హిందువులకి చెందిన పోలీసులు జనరల్‌గా హరిజన వ్యతిరేకులు కావడమే."

"ప్రతి గ్రామంలో అతికొద్ది హరిజన కుటుంబాలు మాత్రమే వున్నాయి. గ్రామంలో మెజారిటీలో వున్న సవర్ణ హిందువులపై నిజం లేదా అబద్ధమైన కంప్లెయింట్ చేయడానికి, అత్యంత స్వల్పమైన సంఖ్యలో వున్న హరిజనుల్లో ఎందరికి ధైర్యముంటుంది? మేం ఎంతో కాలం ఈ అవమాన పరంపరల్ని భరించడానికి సిద్ధంగా లేము. నేటి వరకూ ప్రతి గ్రామంలో సవర్ణ హిందువులకి పూర్తి దూరంగానే, హరిజనులు నివసిస్తోన్నారు. ప్రత్యేక హరిజనవాడు కావాలనే డిమాండ్ నేడు ఎంచేత విన్పిస్తోంది? ఈ సమస్య గూర్చి మనమంతా ఆలోచించాలి. అలాగాకపోతే, మనమంతా విచారించవలసి వుంటుంది," అని రాజ్యసభ మాజీ డిప్యూటి ఛైర్మనూ, మహారాష్ట్ర హరిజన నాయకుడైన శ్రీ బి. డి. ఖోబ్రగాడె అన్నాడు.

"స్వాతంత్ర్యం లభించిన ముప్పయ్ సంవత్సరాల తర్వాత గూడా, గ్రామాల్లో నేటికీ మేం దూరంగా నివసించాల్సిన పరిస్థితి వున్నదంటే, వేరే బావుల్లో మేం నీరు తోడుకోవలసిన గతి వున్నదంటే, అనుక్షణం

మమ్మల్ని హీనంగా చూస్తోంటే, ఏమాత్రం నోరెత్తినా మమ్మల్ని పక్కలికగదన్ని చిత్రహింసలకి గురిచేస్తోంటే, యీ దేశం ఏమి సాధించినట్టు?" అని బి. పి. మౌర్య అన్నాడు.

("After 30 years, if we are still made to lead a segregated life in the villages, drawing water from separate wells, being looked down upon, being attacked and massacred at the slightest provokation, what has the country achieved?" (ఇలస్ట్రేటెడ్ వీక్లీ - 1978 సెప్టెంబరు 10 నాటి సంచిక)

గుజరాత్

గుజరాత్‌లో "జాంజమెర్" అనే గ్రామముంది. ఇది అహమ్మదాబాద్‌కు చాలా సమీపంలో వుంది. యీ గ్రామానికి చెందిన కర్సన్ దూధా అనే హరిజన యువకుణ్ణి 1978 ఆగస్టు ఒకటవ తేదీన 200 మంది గూండాలు, లాఠీలూ బల్లేలూ గొడ్డళ్ళతో చావడాది, ముక్కలకింద నరికి వేశారు. ఈ పేద హరిజనుడు దొంగతనం చేయలేదు; బ్లాక్‌మార్కెట్ చేయలేదు; స్మగ్లింగూ చేయలేదు; కేవీ గాడివకొడుకుల్లా కోయంబత్తూర్ దొంగనోట్లనూ ముద్రించలేదు. ఆతడు చేసిన మహానేరమల్లా - "క్షత్రి" కులానికి చెందిన కమూబెన్ అనే యువతిని మనసారా ప్రేమించి, చట్టబద్ధంగా పెళ్ళాడడమే! పెళ్ళి భోజనం పెట్టడానికి అవసరమైన బియ్యమూ-వంట సామగ్రినీ తెచ్చుకోవడానికి యీతడు పోలీసు సహాయం అడిగాడు. ఆనాటి సాయంత్రం యితనివెంట యిద్దరు పోలీసులు ఎస్కార్ట్ వున్నప్పటికీ, గూండాలు దారిగాచి యితన్ని అత్యంత దారుణంగా హత్యచేశారు. ఈ హత్యకాండ సాగుతోంటే, వెంటవున్న పోలీసులు కళ్ళప్పగించి చిత్రం చూస్తో నిలబడ్డారు!

హరిజనులపై దురాగతాలు

అకారణంగా వొక హరిజనుడు పచ్చి నెత్తుటేర్లలో ముంచెత్తబడిన ఈ దారుణ సంఘటన పట్ల, గుజరాత్‌లోని వేలాది హరిజనులు ఆగ్రహావేశ పరవశు లయ్యారు. గుజరాత్ హోం మంత్రియైన పోపట్‌లాల్ వ్యాస్, వెంటనే యీ సంఘటనపై న్యాయ విచారణకు ఆజ్ఞలు జారీచేశాడు. అయితే, మైనర్ బాలికను లేవదీసుక పోయినందుకు; కర్సన్ దూధా హత్య చేయబడ్డాడని హోంమంత్రి "భావించాడు"! వాస్తవానికి తాను పెళ్ళాడిన కమూబెన్, మేజరైన కన్యయేనని డాక్టరు ద్వారా మెడికల్ సర్టిఫికెట్‌ను సైతం, కర్సన్ దూధా పెళ్ళికి పూర్వమే తీసుకొన్నాడు. రెజిస్టర్ ఆఫీసులో తమ ఉభయులకి వివాహమైనట్లు దూధా వొద్ద వొక సర్టిఫికెట్ గూడా వుంది. ఇన్ని ఆధారాలున్నా, విచారణ తర్వాత యీ కేసుకు ఏ గతి పడుతుందో మనందరికీ తెలుసు!

"గుజరాత్‌లో వర్ణ - లేదా - వర్గ - పీడన అనేది వున్నదనేందుకు ఆధారమే లేదు. ఇదంతా రాజకీయ ప్రచారం మాత్రమేననీ, గుజరాత్‌లో హరిజన సమస్య అనేది లేనేలేదనీ, గుజరాత్ హోం మంత్రిగారు సెలవిచ్చాడు! అయితే "గుజరాత్‌లోని ప్రతి గ్రామమూ, జాంజమర్ లాంటి గ్రామమే"నని, రాష్ట్రీ దళిత్ పేంథర్ల సంఘాధ్యక్షుడైన శ్రీ రమేశ్ చంద్ర పర్మార్ స్పష్టంగా చెప్పాడు. "షెడ్యూలు కులాలవారిపై దురా గతాలు జేస్తోన్నారని ఘాషాయ్‌కాశాలు బద్దలయ్యేట్లు, వివిధ రాజకీయపార్టీల నాయకులు ప్రకటనలు జేస్తోంటారు. కాని వీరిలో ఎవ్వరూ యీ సమస్య యొక్క లోతుపాతుల్ని నిశితంగా పరిశీలించరు. ఎంచేతనంటే, సవర్ణ హిందువుల - హరిజనుల ఓట్లపై వీరు ఆధారపడి వున్నారు. పార్లమెంట్‌లోని హరిజన మెంబర్లు, దేశంలోని షెడ్యూలు కులాలవారికి ప్రాతినిధ్యమే వహించరు" అని పర్మార్ అన్నాడు. (Perspective మాస పత్రిక - 1978 అక్టోబరు సంచిక)

పార్లమెంటుకూ ఎసెంబ్లీలకూ జరిగే ఎన్నికల్లో, పాలకపార్టీయ "ప్రత్యేక" నియోజకవర్గాల్లో, హరిజనసభ్యుల్ని అభ్యర్థులుగానియమిస్తాయి. ఎన్నికైన యీ హరిజన అభ్యర్థులు, ఆచరణలో అతి బలహీనులుగా, పరమ మితవాదులుగా ప్రవర్తిస్తో, హరిజన-గిరిజన సమస్యల్ని పార్లమెంట్ దృష్టికి తీసుకరాలేని అసహాయులుగా తయారవుతోన్నారని, గుజరాత్‌లోని దళిత్‌వేంధర్లు తమ అసంతృప్తిని వ్యక్తం జేస్తోన్నారు. వీరేగాక, గుజరాత్ రిపబ్లికన్‌పార్టీ యొక్క మితవాద నాయకులు సైతం నేటి ఎన్నికలూ-అంశాలో ఎన్నికయ్యే తమ అభ్యర్థుల ప్రవర్తనపట్ల తీవ్రమైన అసంతృప్తిని వెల్లడిస్తోన్నారు.

1960లో పేదప్రజల ఉద్యమం

గవర్నమెంట్ బంజరు భూమిని, గ్రామాల్లోని భూమిలేని నిరుపేద లకూ హరిజనులకూ పంచటానికి, 1960 లో గుజరాత్‌లో బలమైన ప్రజా ఉద్యమం నిర్వహించబడింది. కులభేదాల్తో ఏ మాత్రం నిమిత్తం లేకుండా గ్రామసీమల్లో వున్న పేదప్రజలు, యీ ఉద్యమంలోకి తీసుకరాబడ్డారు. "భూమి ప్రతి పాద్లా సమితి" నాయకత్వాన యీ భూపోరాటం నిర్వహింప బడింది.

1960 ఆగస్టు 18 వ తేదీన, గుజరాత్ శాసనసభ వర్షాకాల సమావేశం ప్రారంభమైంది. ఆనాడు అన్ని కులాలకి చెందిన భూమిలేని నిరుపేదలు 10 వేల మంది, అహమ్మదాబాద్ నగర వీధుల్లో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపారు. పోలీసులు హుటాహుటిన రంగంమీద కొచ్చారు. ప్రదర్శన కారుల తలలు ఎగిరిపోయాయి; వారి ఎముకలు విరిగిపోయాయి. నాటి ప్రదర్శనలో పాల్గొన్న వెయ్యిమంది, అత్యంత తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు 42 మందిని అరెస్ట్ జేశారు. వీరిలో నాటి భారత రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడైన కర్సన్‌దాస్ పర్మార్, మరి ముగ్గురు స్త్రీలూ వున్నారు.

కోర్టులో వారికి మూడు మాసాల కఠినమైన జైలుశిక్ష విధించబడింది. యీ విధంగా ఆ ఉద్యమం ఉధృతంగా ముందుకు సాగింది. దీని ఫలితంగా మొండివైఖరి నవలంబించిన గుజరాత్ ప్రభుత్వం, కిందికి దిగివొచ్చి 14 లక్షల ఎకరాల గవర్నమెంట్ బంజరు భూమినుండీ, 6 లక్షల ఎకరాల్ని భూమిలేని నిరుపేదలకి పంచవలసి వొచ్చింది. "ఈ ఆరు లక్షల ఎకరాల భూమీ నేటికీ మా చేతిలోనే వుంది" అని కర్సన్‌దాస్ పర్మార్ పర్‌స్పెక్టివ్ మాసపత్రిక విలేఖరితో గర్వంగా చెప్పాడు. ఇంత జరిగినా, రాష్ట్రంలోని భూస్వాముల చేతుల్లో వున్న మిగులు భూమి కుంటి సైతం పేద ప్రజలకి నేటికీ చక్కలేదు!

జమిందార్లు ఎక్కడున్నారు?

"భూమి హిన్ చేత్ సంఘర్ సమితి" నాయకత్వాన జరిగిన పోరాట ఫలితంగా, గుజరాత్‌కి చెందిన కొందరు హరిజనులకు భూమి లభించింది. ఇంతటి బలమైన ఉద్యమం జరిగినా, వాస్తవమైన భూసంస్కరణల్ని నేటికీ రాష్ట్రంలో అమలు జేయలేదు. 2 వేల ఎకరాలున్న బడా భూస్వాములు యీనాటికీ గుజరాత్‌లో వున్నారు. అయితే, "ఏ జమీందార్లు? రాష్ట్రంలో జమిందార్లే లేరు" అని గుజరాత్ హోం మంత్రి నేటికీ బుకాయిస్తోన్నాడు. రాష్ట్రంలో వున్న 14 లక్షల ఎకరాల ప్రభుత్వ బంజరులో, 6 లక్షల ఎకరాలు మాత్రమే గ్రామీణ నిరుపేదలకి పంచడం జరిగింది. మిగిలిన 8 లక్షల ఎకరాల్ని "గ్రామీణ అడవులు" అనే కొత్త సెక్టార్‌ను (రంగాన్ని) ప్రభుత్వం ప్రారంభించి, గవర్నమెంట్ బంజరు నంతటినీ, పేదప్రజలకి దక్కకుండా యీ పద్ధు కిందకి తోసివేసింది! దాదాపు 10 సంవత్సరాలపాటు సాగిన యీ ఉద్యమం, 1970 లో పూర్తిగా నీరుకార్చి వేయబడింది.

ఈ పేద ప్రజల ఉద్యమ ఫలితంగా భూమి ఎవ్వరికీ యివ్వ బడింకో, వారు భూమిని పొందిన తర్వాత ఉద్యమాన్ని సపోర్టు జేయడం మానివేశారు! పేదలకి భూమిని పంచే అధికారం, గుజరాత్‌లోని గ్రామ పంచాయితీలకి యివ్వబడింది. భూ ఆక్రమణ ఉద్యమంలో పాల్గొన్నవారికి, భూమి పంచబడదని పంచాయితీలు బెదిరించిన ఫలితంగా, చాలామంది నిరుపేదలూ హరిజనులూ ఈ ఉద్యమానికి దూరమైపోయారు. కొన్ని సందర్భాల్లో హరిజనులకి వారి సొంతమనుషులే ద్రోహం జేశారు. భూ ఆక్రమణ ఉద్యమంలో పాల్గొన్నవారిపై, ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించింది. ఏళ్ళ తరబడీ నడిచిన ఈ కోర్టు కేసుల్ని సక్రమంగా నిర్వహించడానికి పేదప్రజల వొద్ద డబ్బు లేనందువల్ల, క్రమేణా యీ ఉద్యమం నీరుకారి పోయింది. యీ విధంగా ప్రభుత్వమూ, దాని అధికారయంత్రాంగమూ యీ ఉద్యమాన్ని పరోక్ష మార్గాల ద్వారా అణిచి వేయ గలిగాయి. యీ విభిన్న కారణాల దృష్ట్యా, ప్రభుత్వాన్ని ఎదు ర్కోవడానికి, తమకు సాధన సంపత్తీ - శిక్షణ పొందిన క్యాడర్లూ లేరని గుజరాత్‌లోని దళిత్ పేంథర్ల నాయకులు అభిప్రాయ పడుతోన్నారు.

"భారతీయ శ్రామికులు కులతత్వంకో చీల్చివేయబడ్డారని, దళిత్ పేంథర్లు నేడు భావిస్తోన్నారు. అంటే - తమ పీడనకు మూలకారణం - ఆర్థికపరమైనదేగాక సాంఘిక పరమైనదని గూడా వారు తలస్తున్నారు. అగ్రవర్ణాలచే పాలించబడే ప్రభుత్వ ఆధ్వర్యంలో హరిజనుల ఆర్థికస్థితిలో అభివృద్ధి సాధించినంత మాత్రాన, హరిజనులకి విముక్తి లభిస్తుందని పేంథర్లు విశ్వసించడంలేదు. వారి ఆర్థిక పరిస్థితి కొంత వరకు అభివృద్ధి జెందినా, దేశంలోని అన్ని కులాలకి చెందిన యావన్మంది పీడితప్రజల ఉద్యమం ద్వారానే, ఈ విముక్తి సాధ్యమవుతుంది. అంచేత, సాంఘిక - ఆర్థిక ఉద్యమంగా వొకే కాలంలో ఇది ముందుకు సాగాలి. కామన్ ఆర్థిక

ప్రయోజనం మాత్రమే, కార్మిక - కర్షకుల్లో వాస్తవమైన ఐక్యతను సాధించలేదని, దళిత్ పేంథర్లు ధ్వనిస్తోన్నారు. కామన్ లక్ష్యాన్ని సాధించడానికి, కుల విద్వేషతను తాత్కాలికంగా పక్కకి నెట్టవొచ్చు. కాని అలాంటి ఐక్యత, ఎంతోకాల ముండదు. వర్గం - వర్ణాన్ని సర్వనాశనం జేసేంతవరకూ, పేదప్రజల్ని చీల్చి బలహీనపరుస్తోన్న వర్ణం, వర్గంచే (Class) పూర్తిగా ధ్వంసం జేయబడేంత వరకూ, పీడిత ప్రజల మధ్య శాశ్వితమైన ఐక్యత సాధించబడజాలదు" అని పేంథర్లు గాఢంగా విశ్వసిస్తోన్నారు. (దళిత్ పేంథర్స్ అండ్ ది హరిజన్ ఎక్స్పీరియన్స్ - ఇవాన్ ఫెరా - పర్స్పెక్టివ్ మాసపత్రిక - 1978 అక్టోబరు)

బీహార్

కులపిశాచి విలయతాండవానికి బీహార్ - గణనీయమైన కేంద్రం. ఇక్కడి కులవ్యవస్థలో ఎన్నో కులాలూ - ఉపకులాలూ - వున్నాయి. బ్రాహ్మల్లో సరస్వత్ - కన్యాకుబ్జ - సకల్‌దుప్ - మాథిల్ - అనే ఉపకులాలకి చెందినవారు తక్కువరకం బ్రాహ్మలు. ఎంచేతనంటే, వీరు అధమకులాలవారికి పౌరోహిత్యం చేస్తారు! వృత్తిరీత్యా చాలామంది బ్రాహ్మలు - క్షత్రియులే. భూమిహార్ల పేరు చివర కాయస్థ - ఠాకూర్ - సింగ్ - రాయ్ - అనే యింటి పేర్లు వుంటాయి. షహాబాద్‌లో కాయస్థుల కాళ్ళకి బ్రాహ్మలు మ్రొక్కుతారు. పూర్ణియాలో వైద్య-వైశ్య-కాయస్థుల-కన్న, సాంఘిక స్థాయిలో రాజపుత్రులు తక్కువవారుగా పరిగణింప బడ్తారు. అనేకమంది రాజపుత్రులు వృత్తిరీత్యా వ్యవసాయదార్లు - లేదా-కాంట్రాక్టర్లు. భగల్‌పూర్‌కు జెందిన క్షేతండులు, తమ్ము తాము క్షత్రియులమని పిలుచుకొంటారు. కాని పూర్ణియాలో మాత్రం వీరు ఘాముల్ని కొలుకిస్తారు. వృత్తిరీత్యా వీరిలో సగభాగం - కంసాలులు. వైశ్యుల్లో గూడా తక్కువరకం - ఎక్కువరకం - వైశ్యులున్నారు.

అంచెలంచెల కులవ్యవస్థ

ఈ రాష్ట్రంలో శూద్రులు ఎన్నో ఉపకులాలుగా చీలివున్నారు. హాల్వాయి (మిఠాయి అమ్మేవారు) బారుయ్ (తమలపాకుల తోటలు పెంచేవారు) మాలి (తోటమాలులు) ధనూక్ (పల్లకీలు మోసేవారు) కండు, ఛేద్‌భంజ్ - యిత్యాది కులాలకి చెందిన శూద్రులు బీహార్‌లో చాలామంది వున్నారు. వ్యవసాయ కూలీలంతా పంచములే. శూద్రుల్లో గూడా తక్కువకంవారూ - ఎక్కువ రకంవారూ వున్నారు. కహార్లూ - కుర్మీలూ - కులం రీత్యా పశువుల కాపలాదార్లతో సమానులుగా భావించ బడ్తారు. వీరితో బ్రాహ్మలు నీళ్ళు తెప్పించుకొంటారు. కాని కమ్మరులు - కుమ్మరులు - వడ్రంగులు - మంగళ్ళు - చెప్తలు - పైవారి కన్న తక్కువకం శూద్రులు. బల్హార్ - నొనియా - తంతి (నేతగాళ్ళు) తేలి (నూనెగానుగలవాళ్ళు) అనే కులాలకి చెందినవారు, పై శూద్రుల కన్న మరీ తక్కువవారు. వీరందరిలో తెలికలవారు (లేలి) హీనాతిహీనులుగా పరిగణింపబడ్తారు! ఏ బ్రాహ్మడూ వీరి యింట్లో పౌరోహిత్యం జేయడానికి అంగీకరించడు. యీ నూనెగానుగల వాళ్ళతో పాటు, కలాల్ (కల్లుగీతవాళ్ళు) పాసి (పక్షులూ అడివిజంతువుల్ని కొట్టి జీవించేవారు) అనే కులాలకి చెందినవారిని గూడా అతి "నీచ"మైన వారుగా చూస్తారు. వీరందరికన్న మరీ తక్కువవారు - చాకళ్ళు. ముషహార్లు అనే గిరిజనులు, డోమె - దుసాధ్ - ధోబి - చమర్ (పంచములు) యిత్యాదుల అన్నాన్ని ముట్టుకోరు. పావురాళ్ళ గూళ్ళలాంటి యీ నిచ్చెనమెట్ల కులవ్యవస్థ, నేటికీ బీహార్‌లో అమల్లో వుంది.

కులాలవారీగా జనాభా వివరాలు

కులాలవారీగా బీహార్ జనాభా వివరాలు యీ క్రింది విధంగా వున్నాయి: మొత్తం జనాభా ఆరుకోట్లు.

బ్రాహ్మలు : 42 లక్షలు
కాయస్థులు : 7 లక్షలు
రాజపుత్రులు : 28 లక్షలు
భూమిహారు : 18 లక్షలు

గత ముప్పయ్ ఏళ్ళుగా, పై నాలుగు అగ్రవర్ణాలవారూ ప్రభుత్వ వుద్యోగాల దగ్గర నుండి రాష్ట్ర మంత్రుల దాకా సమాజంలోని సమస్త రంగాల్లో ఎదురులేని అధికారం వెలగబెట్టారు. ప్రథమ భారత రాష్ట్రపతి యైన డాక్టర్ రాజేంద్రప్రసాద్, కాయస్థ కులానికి చెందినవాడు. తాకూర్లూ రాజపుత్రులూ వొకే కులానికి చెందినవారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి యైన కర్పూరీ ఠాకూర్ మంగలి కులానికి చెందినవాడు.) వెనకబడిన తరగతులుగా పిలవబడుతోన్న కులాలు - బీహార్లో 128 వరకూ వున్నాయి. వీటిలో 50 లక్షలమంది యాదవులూ, 21 లక్షలమంది కుర్మీలూ వున్నారు. పేరుకు వీరు వెనకబడిన కులాల జాబితాలో వున్నా, ఆర్థికంగా మాత్రం యాదవులూ కుర్మీలూ తెగబలిసినవారే.

శ్యామ్చాస్పూర్ బీహార్లోని వొక చిన్న గ్రామం. ఈ గ్రామంలో ఠాకూర్ పండిత వంశానికి చెందిన బ్రాహ్మలే ఎక్కువగా వున్నారు. జపతపాలూ - స్నానపానాలూ - పుడిమైలలూ - నియమ నిష్టలతో యీ భూదేవులు - ఎంతో "శుద్ధి"గా జీవితం గడుపుకోన్నారు. భూమ్మీద దేవతల్లాంటి బ్రాహ్మలు నివసించే యీ గ్రామంలో, వొక విచిత్రమైన ఆచారం అమల్లో వుంది. ఏ వ్యక్తియినా ఈ ఊళ్ళోవున్న హరిజనుల్తో మాట్లాడితే - కనీసం మాట్లాడితేనే సుమా - గ్రామంలోని బ్రాహ్మలు ఆ వ్యక్తికి నిర్దాక్షిణ్యంగా పాతికరూపాయల జరిమానా విధిస్తోన్నారు! ఈ దుర్మార్గమైన సాంప్రదాయానికి చెందిన "సాక్ష్యం" దొరకనందున, పోలీసులు సైతం ఎలాంటి చర్యనూ తీసుకోలేక నానాయాతనలూ పడుతోన్నారట! (9-1-79 - ఈనాడు - మొదటి పేజి)

కైలాస్ గ్రామంలో హరిజన శిరస్సులు

బీహార్‌లోని నలందాజిల్లా - కైలాస్ గ్రామంలో, హరిజనుల గుడిసెలపై 1978 డిసెంబరు 9 వ తేదీన భూస్వాములు రివాల్వర్లూ బరిసెలతో దాడిజేసి, పారిపోతోన్న ముగ్గురు హరిజనుల శిరస్సుల్ని అమాంతం నరికివేశారు. ఈ హత్యాకాండ నుండి తప్పించుకొన్న ఒక హరిజన స్త్రీ, పోలీసు స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టుజేయగా, పోలీసు అధికారులు రిపోర్టును దాఖలు జేసుకోలేదని పత్రికలు ప్రకటించాయి.

(20-12-78 - ఆంధ్రజ్యోతి దినపత్రిక)

దేశంలో హరిజనులపై జరుగుతోన్న యిలాంటి అమానుషమైన దుర్మార్గాల్ని గూర్చి రాసుకొంటూపోతే, వేల పేజీలు గూడా చాలవు. ఇలాంటి కిరాతక సంఘటనలెన్నో పత్రికల కెక్కకుండానే మధ్యలోనే హషప్ జేయబడుతోంటే కొన్ని మాత్రమే పత్రికా ముఖంగా రచ్చకెక్కుతోన్నాయి.

బజిత్‌పూర్ దురంతం

1978 నవంబరులో బజిల్‌పూర్‌లోనూ, 1978 డిసెంబర్‌లో ఛైన్‌పూర్‌లోనూ, చెల్చీలోనూ, ధనమదాంధులైన అగ్రవర్ణాల దుర్మార్గాలకి హరిజనులు అత్యంత అమానుషంగా బలైపోయారు. ఈ దారుణ హత్యలకి, ప్రధానంగా భూమి తగాదాలే మూలకారణమని తెలుస్తోంది.

1978 నవంబరు 15 వ తేదీన, బీహార్‌లోని బజిల్‌పూర్ గ్రామంలో, ఒక భూస్వామి నాలుగువందలమంది సాయుధ గూండాల్తో హరిజనులపై అత్యంత కిరాతకంగా దాడిజేశాడు. గ్రామంలోని హరిజనుల గుడిసెల్ని తగలబెట్టి, వారి కుంటా - చెంబూ - పగలగొట్టి, హరిజన స్త్రీల కొప్పుల్ని పట్టుక బయటికీడ్చి, వారి గుడ్డలిప్పదీసి, ఎందరో

గూండాలు కలిసి వారిని సామూహికంగా మానభంగం జేశారు. మగాళ్ళను పచ్చడికింద చితగ్గొట్టి, వారి కొంపా గోడూ కొల్లగొట్టి, ఉదయం 9 గంటల నించి సాయంత్రం 4 గంటల వరకూ - దాదాపు - ఏడుగంటల పాటు నిరాఘాటంగా పిండారుల్లా - ధగ్గుల్లా - విధ్వంసకాండ జరిపి, మానవ రక్తాన్ని ఏరుల్లా పారింపజేశారు. భూస్వామి వేషంలో వున్న ఈ నరరూప రక్కసుడు, హరిజనులకి జెందిన 800 హెక్టార్ల భూమిని స్వాధీనం జేసుక, వారిని గ్రామం నించి తరిమివేశాడు. గంటలకొద్దీ జరిగిన యీ ఘాతుక కృత్యాల ఫలితంగా, గ్రామంలోని హరిజనులంతా అర చేతిలో ప్రాణాలుంచుక మూకుమ్మడిగా పారిపోయారు. చివరికి ఊరు మొత్తం - వల్లకాడుగా మారిపోయింది! అవును భారతీయ పాలకవర్గాలకి అధికారపు కోరలున్నాయి. పెద్దపులి చారలున్నాయి. ఆయుధాల కొమ్ము లున్నాయి. జనాన్ని పిట్టల్లా పేల్చివేయగల దమ్ములున్నాయి!

గ్రామంలోని స్త్రీలపట్ల వీరు ప్రవర్తించిన తీరు - మానవ సభ్యతకే మచ్చలాంటిది. వీడునెల్ల గర్భవతి - మంజు - అనే 18 ఏళ్ళ యువతిని, యీ భూస్వామి గూండాలు నడివీధిలో వరసాగ్గా చెరిచినందువల్ల, యీమెకి స్పృహతప్పి జీవచ్ఛవంలా మారి, చివరికి గర్భస్రావం జరిగింది. ఇంతటి ఘోరకలి జరుగుతోన్నా, ఆపద్బాంధవుడూ - అనాధరక్షకుడైన శ్రీకృష్ణపరమాత్మ, ఆనాడు కౌరవసభలో ద్రౌపదీ వస్త్రాపహరణం జరుగుతోన్నప్పుడు, ద్రౌపదికి చీరలిచ్చి ఆమెను రక్షించినట్లు, బజిత్ పూర్‌లో జరిగిన సామూహిక మానభంగాల నించి కనీసం వొక్క హరిజన స్త్రీని సైతం కాపాడలేకపోయాడు. బహుశా గజేంద్రుని వేడుపు విన్పించి నట్లు, బజిత్‌పూర్ హరిజన స్త్రీల భీకరమైన ఆక్రందనలు ఆనాడు శ్రీహరికి విన్పించలేదేమో? కాక శ్రీహరికి ముసిలితనం కారణంగా చెవుడు వొచ్చిందేమో?! లేదా - తిరపతి కొండపై బండరాయిలా మారి పడివున్నాడేమో?! ఇలాంటి నిగూఢమైన తాత్విక సమస్యలకి తిరపతి

భక్తులూ - చిన్మయానంద శిష్యులే జవాబివ్వాలి. హరిజన స్త్రీలపై జరప బడిన సామూహిక మానభంగాలకీ, పురుషులపై జరపబడ్డ అత్యాచారాలకీ నష్ట పరిహారంగా బీహార్ ప్రభుత్వం వొక్కొక్క కుటుంబానికీ 50 రూపాయల చొప్పున యిచ్చింది! అంటే - ఇండియాలో హరిజన స్త్రీ మానం ఖరీదు - 50 రూపాయలు మాత్రమేనని మనం అర్థం చేసు కోవాలా?

యీ విధ్వంసకాండ జరిగిన తర్వాత, లోక్‌సభలో యీ సంఘటన చర్చించబడింది. నష్టపరిహారంగా 50 రూపాయ లిచ్చినందుకు, లోక్‌సభ లోని సభ్యులు ప్రశ్నవేయగా, "విధ్వంసకాండ జరిగిన వెంటనే సహాయ మందించడానికి, ఆ సమయంలో ప్రభుత్వం వద్ద అంతకన్న ఎక్కువ డబ్బు లేకపోవడం కారణం కావచ్చు"నని నాటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ జవాబిచ్చాడు! అంటే - ఆ సమయంలో బీహార్ ప్రభుత్వం పూర్తిగా దివాళా తీసిందని దీని భావమా?! ఎంతటి సుందర ముదరష్టమైన సమాధానం?

యీ విధంగానే తమిళనాడులోని కీలవెన్మణిలోనూ, విల్లుపురం లోనూ హరిజనులపై అనేకమైన అత్యాచారాలు జరపబడ్డాయి. ఈ విధంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో వీరిపై జరపబడ్తోన్న అకృత్యాలు మంచి నీళ్ళ ప్రాయంగా నేడు తయారయ్యాయి. హరిజన - గిరిజన స్త్రీల మాన భంగాల్లో సైతం ఉన్నత కులాల ఫ్యూడల్ తత్వమూ, వారి పరమ నిరంకుశమైన ఛాయలే కన్పిస్తోన్నాయి. మన ముప్పయ్యేళ్ళ స్వరాజ్యంలో, యీ ఫ్యూడల్ శక్తులు కుల - మతాల పేరిట కీలకస్థానాలాక్రమించి సమస్త సంఘ విద్రోహ కార్యకలాపాలకీ మూలమయ్యాయి.

దేశంలోని అనేక రాష్ట్ర ప్రభుత్వాలకి చెందిన ప్రభుత్వ యంత్రాంగంలో సైతం, కుల పిశాచి విలయతాండవం జేస్తోంది. చూడండి: "బీహార్‌లోని పోలీసు బలగం చట్టాలను అమలుజేసే

యంత్రాంగం, కులాల ప్రాతిపదికపై విడిపోయి, హరిజనులూ పేద ప్రజలపై తరచుగా జరిగే దౌర్జన్యకాండను అదుపుజేసి, శాంతిని పరి రక్షించడంలో విఫలమైందని, రాజ్యసభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి - శ్రీ ధనిక్‌లాల్ మండల్ అంగీకరించారు."

(ఆంధ్రజ్యోతి దినపత్రిక - 20-12-1978)

"శ్రీ మండల్ రాజ్యసభలో ఒక ప్రకటన చేస్తూ, బీహార్ పోలీసు బలగంలో గూడా కులతత్వం విశృంఖలంగా విజృంభించినదని, హరిజనులపై అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు." (ఆంక్షోభనల సుడిగుండంగా బీహారు - ఆంధ్రజ్యోతి దినపత్రిక - 20-12-78)

తమకు ఆయుధాలు లేనందువల్లనే, తమ శత్రువులైన కుర్మీల చేతుల్లో హత్యజేయబడుతోన్నామనీ, తమకి గూడా ఆయుధాలుంటే తమ్ము తాము రక్షించుకోగలమనీ, మాజీ కేంద్ర డిప్యూటీ హోంమంత్రి యైన శ్రీధనిక్‌లాల్ మండల్ సమక్షంలో బీహార్ హరిజనులు చెప్పారు. ఈ రాష్ట్రంలో హరిజనులు 14 శాతం వరకూ, ఆదివాసులు (Tribals) 10 శాతం వరకూ వున్నారు. అయితే అగ్రవర్ణాలు కేవలం 13 శాతం మాత్రమే. ఇట్టి పరిస్థితిలో హరిజనుల్లో నేడువొస్తోన్న యీ నూత్న చైతన్యాన్ని, అగ్రికులాలవారు దృష్టిలో వుంచుకొంటే భవిష్యత్ పరిణామాలూ - ఫలితాలూ అత్యంత విషమంగా వుంటాయి!

హరిజనులూ తదితర పేదప్రజలపై, ధనికవర్గాల దాడులూ దుర్మార్గాలూ యిటీవలికాలంలో మరీ పెచ్చరిల్లాయి. ప్రత్యేకంగా బీహార్‌లో యీ కిరాతకాలు విలయతాండవం జేస్తోన్నాయి. యీ హింసాకాండ నరికట్టేందుకి, బీహార్‌లోని ఆనాటి కర్పూరీ ఠాకూర్ ప్రభుత్వం, దురా గతాలు తరచుగా జరిగే ప్రాంతాల్లో సాయుధ హరిజన వలంటీర్ దళాల్ని

నిర్మించాలని నిర్ణయించింది ! ఈ పథకం ప్రకారం - హరిజన వలంటీర్లకు తుపాకులు కాల్చడంలో శిక్షణ యిచ్చి, శిక్షణాకాలంలో జీతాలు సైతం ముట్టజెప్పి, తర్వాత వారికి ఉచితంగా తుపాకులిస్తారు. అంతేగాక, బలహీన వర్గాల రక్షణకోసం ప్రభుత్వం పాస్‌జేసిన వివిధ చట్టాల్ని సైతం వారికి వివరిస్తారు. బీహార్ ప్రభుత్వం రూపొందించిన ఈ పథకాన్ని కేంద్రంలోని నాటి జనతా ప్రభుత్వం సైతం ఆమోదించింది!

దీని అర్థమేమిటి? ప్రభుత్వాధీనంలో వుండే పోలీసులు, రాష్ట్రంలో శాంతి భద్రతల్ని రక్షించలేకనీ, పేదప్రజల్ని కాపాడ జాలరనీ, యీ పథకం రూపొందించడం ద్వారా రాష్ట్ర - కేంద్ర - ప్రభుత్వాలు స్వయంగా అంగీకరించినట్లు గాదా ?! ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైన పోలీసులు, సంఘంలోని సమస్త ప్రజలపట్ల నిష్పాక్షికంగా వ్యవహరించ డంలేవనీ, ధనికవర్గాల కొమ్ము కాస్తోన్నారనీ, దీని ద్వారా అంగీకరించినట్లు గాదా ?! అంతేగాదు - బీహార్‌లో జరిగే అత్యాచారాల నుండి పేద ప్రజల్ని కాపాడ్డానికి, పోవేపున పోలీసులూ - మరోవేపున సాయుధ హరిజన వలంటీర్లూ సిద్ధమైతే, వీరి మధ్య పరస్పర సందేహాలూ స్పర్ధలూ రావా? ఒక ప్రాంతంలో బలహీనవర్గాలపై హింసాకాండ జరుగుతున్నట్లు తెలిసినప్పుడు, దాన్ని అదుపులో పెట్టడానికి వీరిద్దరూ సాయుధులై వెళ్ళితే పరిస్థితి ఏమవుతుంది?

బిచ్చమెత్తితే హక్కులు రావు

ఇవన్నీ చూస్తోంటే, దేశంలో పేదప్రజలకీ - ముఖ్యంగా హరి జనులకీ ప్రాణ - మాన - రక్షణ కల్పించడంలో రాష్ట్ర - కేంద్ర - ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని భావించక తప్పడంలేదు.

జనసంఘ్ - ప్రత్యేకంగా ఆర్.యస్.యస్. యిత్యాది రాజకీయపార్టీలూ - సంస్థలూ, అగ్రవర్ణాలకి చెందిన ఫూస్వామ్యవర్గాల్ని రెచ్చగొట్టి కుల కలహాలు సృష్టిస్తున్నందువల్ల ఉన్నత కులాలకి చెందిన గూండాలు నానాటికీ పెచ్చరిల్లి పేట్రేగిపోతోన్నారు. గ్రామాల్లో అధికారం వెలగబెట్టే యీ ఫూస్వామ్య - పెత్తందారీ వర్గాల పాలనలో, నిరుపేద హరిజనులు సాంఘిక న్యాయం ఆశించడం కేవలం భ్రమ మాత్రమే కాగలదు. కులాధిక్యతా - ధనమదాంధతా - రెండూ - జోడు గుర్రాల బండిలా సాగుతోండగా, పేదప్రజలకి న్యాయం జరగడం అసాధ్యం గదా? హరిజన స్త్రీలను పబ్లిగ్గా మానభంగం జేస్తోంటే, అట్టి నేరస్థుల్ని బంధించని పోలీసులూ, దండించని ప్రభుత్వమూ ఉనికిలో వున్న సమయంలో, దిక్కూ మొక్కూ లేని పేదల బతుకులకి నిష్కృతి లేదా? "వాక చెంపపై కొడితే రెండో చెంప నివ్వాలని" అహింసా ప్రబోధం గావిస్తో, "నేనే మార్గమును సత్యమును జీవమును" అని ఏసుక్రీస్తు చెప్పిన మాటల్ని సందర్భశుద్ధి లేకండా చిలకపలుకుల్లా వల్లిస్తో, నరలోకం అబద్ధమనీ - పరలోకం నిజమనీ, ఆధ్యాత్మిక దాహం తీరడానికి పరలోకంలో "జీవజలం" దొరుకుతుందనీ, నంగిబోధలు జేసే దొంగసాధువుల మాయ మాటకాలకి వీరు నేటికీ తలవొంచి కళ్ళున్న కబోదులుగా - చెవులున్న బధిరులుగా - చీమూ నెత్తురూ లేని శవాల్లా వీరు జీవితాలు గడప సిద్ధంగా వున్నారా? "పనం పోగొట్టుకొన్న హక్కులు, భిక్షమెత్తుకొంటే తిరిగి రావు. నిరంతర పోరాటం ద్వారానే వాటిని సాధించగలం" - అని అంబేడ్కర్ చెప్పలేదా?! రోమన్ బానిసలకి నాయకత్వం వహించిన మహావీరుడు - స్పార్టకస్, నాటి బానిసయజమానులకి వ్యతిరేకంగా తిరగ బడ్డప్పుడు, పరమకిరాతకమైన రోమన్ పాలకవర్గాల పునాదులు మూల మట్టంగా కంపించలేదా? వాని కాళ్ళకింది నేల ఆనాడు తొలుచుకపోలేదా? స్వేచ్ఛా - సమానత్వాలు మా జన్మహక్కని ఫూవభోంతరాళాలు దద్ద

రిల్లేట్లు ప్రళయ భీకరంగా గర్జించిన స్పార్టకస్-నేటికీ భారతీయ హరిజన - గిరిజనులకి పాఠాలు అందించడం లేదా ?

"Twice wretched are the 250 million Indian rural poor - condemned by caste, condemned by grinding dehumanising poverty, illeteracy, sickness and squalor. The captivity of this mass of humanity is too deeply entrenched in the social and economic system. It's liberation is going to be a difficult and complex process, consuming time and throwing up explosions, often of a violent nature." (Perspective-1978 June-Special Report,)

"ఇండియాలోని గ్రామీణ పేదలు రెండు రకాల నికృష్ట జీవితం గడుపుతోన్నారు. కుల దానిసత్వం, దారవాది నరకతుల్యమైన దారిద్ర్యం, అవిద్య, రోగాల్తో వీరు తమ బతుకులు యీడుస్తోన్నారు. కోట్లాదిగా వున్న యీ పేద ప్రజల నికృష్ట పరిస్థితి, సాంఘిక - ఆర్థిక - వ్యవస్థకో పూర్తిగా ముడివడి వుంది. ఎంతో కాలాన్ని తీసుకొని, మరెన్నో హింసాత్మక సంఘటనలకు దోవతీసే వీరి విముక్తి అత్యంత కష్టసాధ్యమైంది."

భారతీయ గ్రామసీమల్లో నివసించే పేద - హరిజన - గిరిజన - ప్రజల్లో, రాజకీయ చైతన్య రాహిత్యమూ - నిరక్షరాస్యత - భూస్వాముల వడ్డీవ్యాపార్ల కబంధ కౌగిట్లో వారు చిక్కుకపోవడమూ - నేటి ప్రజా స్వామ్యాన్ని పూర్తిగా అవహేళన పాల్జేస్తోన్నాయి. భూస్వామ్య సంస్కరణల్ని నిర్దుష్టంగా అమలు జేయకపోవడం వల్ల గ్రామీణ పరిశ్రమల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల, భూమిలేని - పనిలేని - గ్రామీణ పేదలు విపరీతంగా పెరిగిపోయారు. ముప్పయ్ సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో, కొత్త తరహా భూస్వామ్యవర్గాన్ని సృష్టించింది. యీ విధంగా సృష్టించబడ్డ వీరు, అసాధారణమైన రాజకీయ - ఆర్థిక

శక్తిని తమ గుప్పిట్లో పెట్టుకోగల్గారు. పశ్చిమ బెంగాల్ - కేరళ - మినహా, వివిధ రాష్ట్ర శాసనసభల్లోని 68 శాతం యం.యల్.ఎ.లు, ఈ కొత్తతరహా భూస్వామ్యవర్గం నించి ఎన్నికైన వారే. గుజరాత్ మహారాష్ట్ర రాజస్థాన్ మధ్యప్రదేశ్ ఉత్తరప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ తమిళ నాడుల్లోని గ్రామీణ సహకార సంఘాల్ని, వీరే పూర్తిగా కంట్రోల్ జేస్తోన్నారు. గ్రామీణ పేదప్రజల్లో కులసంబంధమైన చీలికలెన్ని వున్నా, మానవ మాత్రులుగా వీరు జీవించడానికి, కనీస జీవిత సౌకర్యాల కోసం, వీరు ఈ కొత్త తరహా భూస్వాముల జులుంకి వ్యతిరేకంగా పోరాడు తోన్నారు. పేద ప్రజల యీ తిరుగుబాటు ధోరణే, భారతీయ గ్రామ సీమల్లోని తరతరాల స్మశాన శాంతిని నేడు బద్దలు జేస్తోంది.

బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలకి చెందిన గ్రామాల్లో వుండే భూస్వాములందరికీ దాదాపు తమ సొంత తుపాకులూ ఆయుధాలూ వున్నాయి. భూస్వాముల కిరాతక చర్యల్ని వారి గూండాయిజాన్ని వ్యతిరేకించడానికి, ఆత్మరక్షణార్థం పోరాటంలోకి దూకిన పేద - హరిజన - ప్రజల్ని నిర్దాక్షిణ్యంగా కాల్చడానికీ, తీవ్రంగా గాయ పర్చడానికీ, గడిచిన పదిసంవత్సరాలనుండి ఈ భూస్వాముల మారణాయు ధాలు యథేచ్ఛగా వినియోగింప బడుతోన్నాయి.

ఈ గ్రామసీమల్లో వొక రకమైన, ప్రచ్ఛన్న వర్గయుద్ధం నేడు జరుగుతోంది. రాను రాను ఈ పోరాటం కొన్ని సందర్భాల్లో హింసా యుత స్వరూపాన్ని సైతం సంతరించు కొంటోంది. ఏ భూస్వాములు విచక్షణారహితంగా హింసాకాండకి దిగుతోన్నారో, ఆ భూస్వాముల జీవిత భద్రతకీ, వారి ఆస్తిపాస్తుల రక్షణకీ ప్రభుత్వయంత్రాంగ సహాయం అంద జేయబడుతోంది. అయినా గ్రామీణ పేదలు సైతం భూస్వాముల ఆటల్ని కట్టించేందుకు పోరాడుతోన్న సూచనలు స్పష్టంగా కానవస్తోన్నాయి.

షెడ్యూల్సు కులాల - తెగల - కమీషనరు యిచ్చిన సాంవత్సరిక నివేదికలో ఈ క్రింది వివరాలు పొందుపర్చబడ్డాయి: 1974 జనవరి నుండి జూన్ వరకూ జరిగిన కాలంలో, షెడ్యూల్సు కులాలు - తెగల వారిచే 2758 కంప్లెయింట్సు రెజిస్టర్ జేయబడ్డాయని 1973-74 రిపోర్టులో చెప్పబడింది. వీటిలో 114 కేసులు - హత్యలకి చెందినవి. తీవ్రంగా గాయపర్చబడిన వాటికి చెందిన కేసులు - 637. మానభంగాలకి చెందిన కేసులు - 127. గృహదహనాలకి చెందిన కేసులు - 320. 1974 కి చెందిన మొదటి ఆరుమాసాల్లో, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని భూస్వాములు, 114 మంది హరిజనుల్ని హత్య జేశారు. 600 మందిని తీవ్రంగా గాయపర్చారు. 127 మంది హరిజన స్త్రీలని మానభంగం జేశారు. హరిజనులకు చెందిన 320 గుడిసెల్ని తగలబెట్టారు. ఇవి ప్రభుత్వం దృష్టికి వొచ్చిన లెక్కలు మాత్రమే. ప్రభుత్వ దృష్టికి రాని సంఘటనలు యింకా ఎన్ని వేలున్నాయో?!

బెల్చి కిరాతకం

స్వాతంత్ర్య భారత చరిత్రలో బీహార్‌కి చెందిన బెల్చీ గ్రామ సంఘటన నిజంగా రక్త కన్నీటితో రాయదగింది. 1977 మే 27వ తేదీన ఈ దారుణ సంఘటన జరిగింది. "ఏ కులం పొడుచు కొచ్చిందా?" అని వొక హరిజన యువకుడు, భూస్వామ్య కులానికి చెందిన కుర్మీల్ని ప్రశ్నించిన పాపానికి, కండకావరం బలిసిన కుర్మీ భూస్వాములు యీ యువకుణ్ణీ - యితనితో పాటు మరో పదిమంది హరిజనుల్ని ముక్కల కింద నరికిపేసి, వారిని అమానుషం దగ్ధం జేసి వేశారు! ఈ సంఘటన జరిగినప్పుడు స్థానిక పోలీసులు నిమ్మకి నీరెత్తినట్లు గమ్మున వూరు కొన్నారు! కుర్మీల కులాధిక్యతను నగ్నంగా నిరూపించుకోవడానికే, యీ గ్రామంలోని కుర్మీ భూస్వాములు ఈ దారుణానికి వడిగట్టినట్లు పార్లమెంట్ సభ్యుల ప్రతినిధివర్గం సమర్పించిన రిపోర్టులో వేట తెల్లమైంది.

రిజర్వేషన్ల పేరిట నేటి పాలకవర్గాలు హరిజనుల్లో అతికొద్దిమంది విద్యాధికులకి ఉద్యోగాలిస్తో వారిని సంతృప్తి పరుస్తోంటే, అంతటితోనే హరిజనులంతా సుఖంగా జీవిస్తోన్నారని భ్రమిస్తో, తోటి సోదరుల్ని పూర్తిగా మర్చిపోయిన దళితకులాల ఉన్నతాధికారులూ, హరిజన యువతీ యువకులూ, నేడు దేశం నిండా వెలుస్తోన్న దెయ్యాల్ని గూర్చి తీవ్రంగా ఆలోచించాలి.

దేశ వ్యాప్తంగా హరిజనులపై అత్యాచారాలు జరుగుతోన్నట్లు ప్రతి దినం పత్రికల్లో వార్తలు వొస్తోన్నాయి. ఈ అత్యాచారాల్లో అగ్రస్థానం- ఉత్తర ప్రదేశ్‌కే దక్కింది. 1974 జనవరి నుండి 1974 జూన్ వరకూ గడిచిన ఆరు మాసాల కాలంలో, ఉత్తరప్రదేశ్‌లో 1698 - మధ్య ప్రదేశ్‌లో 254 - కేరళలో 168 - మహారాష్ట్రలో 147 - బీహార్‌లో 122 కేసులు నమోదు జేయబడ్డాయి. వీటితో పాటు, వివిధ రాష్ట్రాల్లో అస్పృశ్యతను నగ్నంగా పాటించినట్లు, పోలీసులచే 4622 కేసులు రెజిస్టర్ జేయబడ్డాయి.

సాంఘిక రంగంలో హరిజనుల్ని ఏ కిరాతకులు చిత్రహింసలకి గురి జేస్తోన్నారో, ఆర్థికరంగంలో ఆ గజదొంగలే వీరికి భూమిని పొందే హక్కునూ, పాలేర్లుగా - వ్యవసాయ కూలీలుగా - కనీస వేతనం పొందే హక్కునూ, చట్ట ప్రకారం వీరికి రావాల్సిన యితర ప్రయోజనాల్నీ హరించి వేస్తోన్నారు.

వేద ప్రజలకి చట్టం సహాయం చేయదు

చేటపెయ్య సోషలిజం అమలు జేయబడుతోన్న ఈ దేశంలో, సీలింగును అతిక్రమించి, చట్ట విరుద్ధంగా భూస్వాములు భూమిని కలిగి యుండడం - నేరమేమీ కాదు! కుక్క పేరా - నక్క పేరా - మందికి పుట్టబోయే పిల్లాడి పేరా - ఊర్లో ఉంచుకొన్న పడుపుకత్తె పేర, భూమిని

రాసేయడం నేరం గాదు! ఈ విధంగా సీలింగును మించి భూమిని కలిగి యుండడం నేరమైనా, దేశంలో ఈ నేరం కింద వొక్క భూస్వామిని గూడా నేటికీ జైలుకి పంపలేదు. అస్పృశ్యతను పాటించడం చట్టప్రకారం తీవ్రమైన నేరమైనా, అందరూ తోడుతొనే మంచినీటి బావుల్లో హరిజనులు నీరు తోడుకోవడానికి నిరాకరించిన ఎందరిని, చట్టప్రకారం జైళ్ళకి పంపారు? అస్పృశ్యతకి వ్యతిరేకంగా చట్టాలున్నా, ధన బలంతో విర్రవీగే భూస్వాములూ - ధనిక రైతున్నా, నిరుపేదలైన గ్రామీణ హరిజనులు కోర్టుల్లో సవాల్ జేయగలరా? కోర్టులో కేసుపెట్టి వారు డొల్లో వుండగలరా?! పీడ్లూ - పోలీసులూ - డబ్బూ - అధికారమూ - ఎవరివేపు వుంటాయో, వారి వేపే "న్యాయం" గూడా వుంటుందనే నగ్న సత్యం అందరికీ తెలిసిందే! చట్టం దృష్టిలో అంతా సమానమేనని ఎన్ని నంగనాచి నీతులు వల్లించినా, పేదప్రజలకి మాత్రం ఎన్నడూ చట్టం సహాయం చేయదు. అంచేత, గ్రామీణ పేదల - హరిజనుల-జీవన పరిస్థితులు బాగుపడేందుకు జరిపే పోరాటాన్ని, సెక్యులర్ ప్రాతిపదికపై మాత్రమే చేయాలనే నగ్నసత్యం, గత ముప్పయ్ ఏళ్ళ అనుభవం రుజువుజేసింది. కుల విభజన ప్రాతిపదికపై షెడ్యూల్సు కులాల ప్రయోజనాల్ని కాపాడ్డం ద్వారా, కులవ్యవస్థను యదాతథంగా - శాశ్వతంగా - వుంచడమూ, అదే సమయంలో కులరహిత సమాజం కోసం ప్రయత్నించడమూ - పరస్పర విరుద్ధమైన విషయం గాదా?! హరిజనుల హక్కుల్ని సమర్థించి, వారి పోసం నిరంతరం పోరాడ వలసిందే. అయితే వారు కేవలం హరిజనులైనందు వల్ల మాత్రమే కాదు. వారు పేదవారు గాబట్టి, సాంఘిక-ఆర్థిక - రంగాల్లో పీడింపబడుతోన్నారు కాబట్టి, వారి ప్రయోజనాల్ని పునం నిరంతరం తాచి కాపాడాలి. వారిని కేవలం హరిజనులుగానే పరిగణించి, వారి హక్కుల కొరకు పోరాడ్డమంటే, కుల వ్యవస్థకు శాశ్వితంగా ప్రాణం పోయడమే కాగలదు. ఆ వేయితలల విషనాగును

శాశ్వతంగా బతికించడమే కాగలదు. కుల వ్యవస్థల్లో వారిని పంచములు గానే వుంచి, వేల సంవత్సరాల పర్యంతం వారు హరిజనులుగానే జీవించ డానికి శాశ్వతమైన ఏర్పాటును చేయడమే కాగలదు. సమసమాజం కోసం జరిగే సెక్యులర్ పోరాటానికి తిలోదకా లివ్వడమే కాగలదు. ఆత్మహత్యా సదృశమైన ఈ విషాదకర పరిస్థితి, దేశంలో కులాలు మరింతగా ఘనీభ వించడానికే దోహదం జేస్తుంది. కుల నిర్మూలనకోసం జరిగే పోరాటానికి ఎనలేని ద్రోహం చేస్తుంది.

దళిత్ పేంథర్ల పోరాటం

నేడు మహారాష్ట్రలోని విద్యాధికులైన హరిజన యువకులు దళిత్ పేంథర్లుగా అవతరిస్తోన్నారు. హరిజనుల హక్కులకోసం వారు వీరోచిత మైన పోరాటం సాగిస్తోన్నారు. అయితే, కుల ప్రాతిపదికపై జరిగే ఈ పోరాటం, సమస్త పీడిత ప్రజల హక్కుల కోసం, వారి శ్రేయస్సు కోసం జరిగే సెక్యులర్ పోరాటాన్ని బలహీన పరుస్తుంది. కులతత్వాన్ని ప్రకోపింపజేస్తుంది. మరో రూపంలో కులవ్యవస్థకు ప్రాణం పోస్తుంది. కేవలం హరిజనుల హక్కుల కోసం జరుగుతోన్న ఈ వర్ణపోరాటం, దేశంలోని యావత్ పేదప్రజల శ్రేయస్సు కోసం జరిగే వర్గపోరాటంలో అంతర్భాగమైనప్పుడే, స్వాతంత్ర్యం అభ్యుదయం సమానత్వం విలసిల్లే సమ సమాజం ఆవిర్భవించడానికీ, తరతరాల కులపిశాచి అదృశ్యమై, కుల - మత - వర్గాలకి దూరమైన సంఘం ఉనికిలోకి రావడానికీ అవకాశముంటుంది. అగ్రకులాల దుర్మార్గాలకి వ్యతిరేకంగా హరిజనులు కుల ప్రాతిపదికపై జరిపే ఈ పోరాటం, చిత్తశుద్ధి గల దళిత్ పేంథర్ల శక్తినీ, వారి వీరోచిత బలిదానాల్నీ, వారి పోరాట పటిమనీ, పక్కదార్లకి పట్టించే ప్రమాదముంది.

వివిధ రాష్ట్రాల్లో అధికారం చలాయించే కులాల ముఠాలు

ముప్పయ్ ఏళ్ళ నల్లకొరల పాలన, జాతీయ స్థాయిలో విభిన్న కులముఠాల ఆవిర్భావానికి దోవతీసింది. ఉత్తర భారతంలోని జాట్ కులస్థులు (చరణ్‌సింగ్ కులంవారు) కుల ప్రాతిపదికపై ఏకమై, తమ భూస్వామ్యవర్గ ప్రయోజనాల్ని రక్షించుకోవడానికి తెరతీ అయ్యారు. ఆ విధంగానే రాజపుత్రులూ, వొక కులంగా సంఘటితమై తమ కుల ప్రయోజనాల కోసం కృషి జేస్తోన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని కాయస్తులూ, తమ కుల ప్రయోజనాల్ని కాపాడుకోవడానికి సిద్ధమయ్యారు. పరో అడుగు వీరు ముందుకు వేస్తే, జాతీయ స్థాయిలో ఈ ధనిక కులాలు వొక సంఘటిత ముఠాగా ఏర్పడే ప్రమాదం గూడా వుంది. వాస్తవానికి ఈ ధనిక కులాల కోయలీషన్లు, ఉత్తరప్రదేశ్ - బీహార్ - హర్యానా - రాజస్థాన్ - గుజరాత్ - మహారాష్ట్ర - కర్నాటకలలో - యిప్పటికే ఏర్పడి రంగంమీద వున్నాయి. మహారాష్ట్రలో మరాటా - బ్రాహ్మణ కులాలవారూ; ఉత్తరప్రదేశ్‌లో బ్రాహ్మణ - కాయస్థకులాల వారూ; కర్నాటకలో ఒక్కలిగ - లింగాయతులూ; తమిళనాడులో చెట్టియార్ - నాడార్ కులాలవారూ రాజకీయ రంగంలో ఎదురులేని అధికారం చలాయిస్తోన్నారు. కర్నాటకలోని ఒక్కలిగ - లింగాయత్ - కులాలముఠా, వ్యాపార - విద్యా - ఉద్యోగ - రంగాల్లో అపూర్వమైన ప్రాబల్యాన్ని కల్గివుంది. ప్రొఫెషనల్ కాలేజీలూ - ప్రైవేట్ విద్యా సంస్థలూ - కాంట్రాక్టులూ - వడ్డీవ్యాపారాలూ - సారా బ్రాందీ దుకాణాలూ - క్లాస్ హోటల్స్ - ప్రైవేట్ హాస్పిటల్స్ - సినిమా పరిశ్రమ వీరి చేతిల్లోనే వున్నాయి. వొక్కమాటలో చెప్పాలంటే నేడు సమస్త

వాణిజ్యకంగమూ వీరి గుప్పిట్లోనే వుంది. అలాగే మహారాష్ట్ర రాజకీయ రంగంలో విపరీతమైన పలుకుబడి గల "చిత్పవన్" బ్రాహ్మలే, నేడు ఈ రాష్ట్రంలో ఆర్.యస్.యస్ - జనసంఘానికి ప్రధానంగా నాయకత్వం వహిస్తోన్నారనేది ప్రత్యేకంగా గమనార్హం. నేటి గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని మధ్య తరగతివారు, ఈ ధనికకులాల ముఠాలపట్ల, వీరు స్థాపిస్తున్న పార్టీలపట్ల విపరీతమైన మోజు చూపుతున్నారు. యీ కులపార్టీలు జనానికి ఏదో ఒరగబెడతాయని భ్రమించే బెగ్గిబాగులవారు గూడా వున్నారు.

కుల - మతాలు పేదప్రజల శత్రువులు
యావత్ పీడితులూ ఏకం కావాలి

హరిజనులు - వొక కులంగా - తమ్ము తాము విముక్తి చేసుకోవడం సాధ్యంగాదనీ, దేశంలోని అణగారిన కులాలకి చెందిన సమస్త పేదప్రజలతో ఐక్యమై, ఈ దోపిడీ వ్యవస్థకి వ్యతిరేకంగా వారు పోరాడిన నాడే - ఆనాడే - తమ విముక్తి సాధ్యమవుతుందనీ, మహారాష్ట్ర దళిత్ పేంథర్లలో వొక సెక్షన్ నేడు గుర్తించడం ముదావహం. గ్రామ సీమల్లో సెక్యులర్ ప్రజాతంత్ర ఉద్యమం ఏమేరకు వృద్ధిజెందితే, హరిజన - గిరిజనుల ఆర్థిక సాంఘిక హక్కుల కొరకు జరిగే పోరాటం, అమేరకు వృద్ధిజెంది తీర్తుంది. గ్రామాల్లోని పేదరైతులతో హరిజనులు భుజం భుజం కలిపిననాడే, వర్గప్రాతిపదికపై తమ ప్రాథమిక హక్కుల కోసం పోరాడిన నాడే, హరిజనులకూ - యితర పేదప్రజలకూ- విముక్తి లభిస్తుంది గాని, వర్ణప్రాతిపదికపై జరిపే పోరాటంవల్ల మాత్రం కాదు. అంచేత, దేశంలోని అన్నికులాలకి చెందిన యావత్ పీడిత ప్రజలూ నేడు ఏకం కావాలి. ప్రతి వర్గంలో కులముందనీ, ప్రతి కులంలో వర్గముందనే నగ్నసత్యాన్ని దళిత్ పేంథర్లు గుర్తించడం శ్రేయస్కరం.

6. రిజర్వేషన్లు

ఇండియాకి స్వరాజ్యం రాకపూర్వమే రిజర్వేషన్లు అమల్లో వున్నాయి. 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం ప్రకారం, దళితవర్గాలకు (Depressed classes) ఢిల్లీ సెంట్రల్ ఎసెంబ్లీలోని 250 సీట్లలో 19 సీట్లు రిజర్వ్ చేయబడ్డాయి. ఈ చట్టం ప్రకారం, మైనారిటీలైన ముస్లిములకు - సిక్కులకు - ఆంగ్లో ఇండియన్లకు - ఇండియన్ క్రిస్టియన్లకు - యురపియన్లకు - చివరికి భూస్వాములకు సైతం ఆనాడు ప్రత్యేక ప్రాతినిధ్య మివ్వబడింది. కాని సెంట్రల్ ఎసెంబ్లీలో గిరిజనులకు రిజర్వ్ సీట్లు కేటాయించకపోయినా, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో మాత్రం కొద్దిగా సీట్లు యిచ్చారు.

స్వాతంత్ర్యం వొచ్చిన తర్వాత, నవీకృత రాజ్యాంగం షెడ్యూల్ కులాలు - తెగలకూ జనాభాలో వారి వారి విష్పత్తిని బట్టి లోక్‌సభ - రాష్ట్రశాసన సభల్లో సీట్లు రిజర్వు చేసింది. 1976 లో షెడ్యూల్ కులాల జనాభా 14.6 శాతం వుంది గాబట్టి, ఆ దామాషా ప్రకారం వారికి లోక్‌సభలో 78, వివిధ రాష్ట్రశాసనసభల్లో 540 రిజర్వు సీట్లూ కేటాయించబడ్డాయి. 1976 లో షెడ్యూల్ తెగల జనాభా 6.9 శాతం వుంది

గాబట్టి, వారికి లోక్‌సభలో 38, రాష్ట్రీయ సభల్లో 282 రిజర్వ్‌సీట్లు యివ్వబడ్డాయి.

లోక్‌సభ - రాష్ట్రీయసభల్లో వీరికి తాత్కాలికంగా వొక పదేళ్ళ పాటు రిజర్వ్ స్థానాలుంటే సరిపోతుందనీ, ఈ దశలో దేశం సాంఘిక - ఆర్థిక - రంగాల్లో బాగా పురోగమించితే, దళితవర్గాల పరిస్థితిలో గణనీయమైన మార్పు వొస్తుందనీ, యీ పదేళ్ళలో హరిజన - గిరిజనులు యితర భారతీయుల స్థాయికి ఎదుగుతారనీ, ఆ తర్వాత రిజర్వేషన్లు అవసరమే వుండదనీ, మన రాజ్యాంగ నిర్మాతలు ఊహించారు. స్వతంత్ర భారత ప్రప్రథమ న్యాయశాఖ మంత్రియైన డాక్టర్ అంబేడ్కర్‌తోపాటు అనేక మంది షెడ్యూలు కులాల నాయకులు, ఆనాడు రాజ్యాంగ పరిషత్తులో ఈ రిజర్వేషన్ విధానాన్ని గట్టిగా వ్యతిరేకించారు. రిజర్వేషన్ సౌకర్యం అగ్రవర్ణాల దయాదాక్షిణ్యాలపై దళిత ప్రజలు ఆధారపడ్డం, నాటి షెడ్యూలు కులాల నాయకులకు ఏ మాత్రం నచ్చలేదు. ఇది తాత్కాలిక సౌకర్యంగా ప్రారంభమై, శాశ్వతంగా కొనసాగుతుంచని 30 ఏళ్ళ క్రితమే వారు అనుమానించారు. దళిత జనుల పురోగతి దృష్ట్యా, ఈ రిజర్వేషన్లు కనీసం వొక పదేళ్ళవరకైనా అవసరమని, నాటి కాంగ్రెస్ అగ్రనాయకులు అంబేడ్కర్ యిత్యాదులకి నచ్చ జెప్పారు. హరిజనుల అభివృద్ధికై తగినంత కృషి జరగడం లేదని భావించిన అంబేడ్కర్, న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా జేసి, రిపబ్లికన్ పార్టీని స్థాపించాడు.

రిజర్వేషన్ల పొడిగింపు

1959 లో పది సంవత్సరాల వరకూ, 1969 లో మరో పది సంవత్సరాల వరకూ, షెడ్యూలు కులాలు - తెగలకు రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లు పొడిగించబడ్డాయి. 1980 జనవరి 26 వ తేదీ నాటికి, యీ రిజర్వేషన్ల గడువు పూర్తి అవుతోన్న దృష్ట్యా, లోక్‌సభ - రాష్ట్రీ

శాసనసభల్లోని యీ కులాలూ - తెగలవారికి, మరో పదేళ్ళపాటు రిజర్వు స్థానాల్ని కొనసాగించడానికి వీలుగా, రాజ్యాంగ సవరణను ప్రవేశ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

వాస్తవానికి స్వార్థ సంకుచిత రాజకీయ ప్రయోజనాల్నీ, హరిజన - గిరిజనుల ఓట్లనీ దృష్టిలో పెట్టుకొన్న కాంగ్రెస్ నాయకులు, యీ రిజర్వేషన్లను గత ముప్పయ్ ఏళ్ళుగా కొనసాగించారు. లోక్‌సభ - రాష్ట్ర ఎసెంబ్లీలలో అమలు జేయబడుతోన్న రిజర్వేషన్ విధానం, కేవలం కంటితుడుపు మాత్రమేననీ, హరిజన - గిరిజన - దళితవర్గాల అభివృద్ధికి యీ విధానం దోహదం జేయడం లేదనీ, దృఢంగా నమ్ముతోన్న షెడ్యూల్డు కులాల - తెగల - నాయకులు దేశంలో చాలా మంది వున్నారు.

1950 జనవరి 26 న నవభారత రాజ్యాంగం అమల్లో కొచ్చిన నాటి నించి, పార్లమెంట్ - రాష్ట్ర అసెంబ్లీలలో రిజర్వు స్థానాలు కేటాయించడంతో పాటు, గవర్నమెంట్ సర్వీసుల్లో కూడా పన్నెండు న్నర శాతం ఉద్యోగాలు, వీరి కొరకు ప్రత్యేకించబడ్డాయి. చదువుకొని ఉద్యోగానికి అవసరమైన అర్హతను సంపాయించుకొనడానికి ప్రత్యేక అవకాశాలూ - స్కాలర్‌షిప్పులూ యిత్యాదులు వీరికి కల్పించబడ్డాయి. హరిజన - గిరిజనుల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తోన్న పక్షపాత వైఖరికి, యీ రిజర్వేషన్ల పొడిగింపు ప్రబలమైన నిదర్శనమని అగ్రవర్ణాలు - అగ్రవర్ణాలకి చెందినవారు భావిస్తోన్నారు.

1971 పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీమతి ఇందిరాగాంధీ బ్రహ్మాండమైన విజయం సాధించిన తర్వాత, "వెనుకబడ్డతనం" (Backwardness) అనే పదం మళ్ళీ దేశ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. ఈ ఎన్నికల్లో తాను గెలిస్తే, వెనకబడ్డ తరగతుల వారికి న్యాయం చేకూర్చడానికి అవసరమైన చర్యల్ని తప్పక తీసుకొంటా

నని ఆమె వాగ్దానం చేసింది. తక్షణం రజక, యాదవ, నాయీబ్రాహ్మణ, పెరికల యిత్యాది మూలబడిన - వెనకబడ్డ కులాల సంఘాలన్నీ ముసిల్దాని ముస్తాబు జేసుక రంగంమీద కొచ్చి, తమతమ కోరికలు తీర్చమని ఒత్తిడి జేయ నారంభించాయి. 1972 నాటి ఎసెంబ్లీ ఎన్నికల్లో, పాలక కాంగ్రెస్ పార్టీ వివిధ నియోజకవర్గాల్లో నిలబెట్టే అభ్యర్థుల ఎంపికలో, తమతమ కులాలవారికి తగినంత ప్రాతినిధ్యమిచ్చి తీరాలని, యీ కులసంఘాలవారు కోరారు. మెడిసిన్-ఇంజనీరింగ్ - యిత్యాది టెక్నికల్ విద్యాసంస్థల్లోనూ, ప్రభుత్వోద్యోగాల్లోనూ, సీట్లను రిజర్వు జేయాలనీ, మంత్రిపదవుల పంపకంలో సైతం కులాలవారీగా ప్రాతినిధ్యమిచ్చి తీరాలనీ వీరు డిమాండ్ జేశారు.

కులాలవారీగా సీట్ల పంపకం కులవ్యవస్థకి ప్రాణం పోయడా?

ఈ విధంగా టెక్నికల్ సీట్లలోనూ, ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, మంత్రి పదవుల కేటాయింపులోనూ, కులాలవారీగా సీట్ల పంపకం జరగడం, కులవ్యవస్థకి కొత్తగా జీవంపోసి, యీ కులంకుష్టుకి నూత్న జవసత్వాల్ని కలుగజేయడం గాదా? అని దేశంలోని ప్రగతిశీలురైన మేధావులు కొందరు ప్రశ్నిస్తోన్నారు.

కులం ప్రాతిపదికపైనే ప్రభుత్వం కన్సెషన్లు యిస్తోన్నప్పుడు, వెనకబడ్డ కులాలవారు నిరంతరం తమతమ కులాలకే కట్టుబడి వుండరా? కులం ప్రాతిపదికపైనే యీ రాయితీలు యిస్తోన్నప్పుడు, కులం బేసిస్‌పై రాజకీయపార్టీల్ని స్థాపించడం అపసవ్యమైన పని అవుతుందా? తమతమ కులాల వారికివ్వబడిన యీ రాయితీల్నీ, ప్రత్యేక హక్కుల్నీ పెంపొందించుకోవడానికీ వాటిని నిరంతరం సంరక్షించుకోవడానికీ యీ కులసంస్థలు, కృషిజేయడం అసంబద్ధమైన చర్య కాదుగదా?! చివరికి యీ పరిణామం,

కులాల ప్రాతిపదికపై రాజకీయపార్టీల అవతరణకి దోవతీయదా? సమాజానికి చెందిన సపుస్త విషయాల్లో, కులాల్ని నిర్మూలించడానికి కృషిజేస్తోన్న వారిని ఈ ప్రశ్నలు తీవ్రంగా వేదిస్తోన్నాయి.

వెనకబడ్డతనం నేటి సమాజంలో వొక నగ్నసత్యం. అంచేతనే, భారత రాజ్యాంగ నిర్మాతలు విద్యా - ఉద్యోగ - రంగాల్లో, వెనబడిన తరగతులవారికి న్యాయం కలగజేసేందుకి, కొన్ని సూచనలు చేశారు. వారు ఆనాడు ఉపయోగించిన పదం - "వెనకబడ్డ తరగతులు" (backward Communities) అనే గాని, వెనకబడ్డ కులాలు అని మాత్రం గాదు. విద్యాసంస్థలూ - ప్రభుత్వ ఉద్యోగాల్లో - కులం ప్రాతిపదికపై కల్పించ బడిన సీట్ల రిజర్వేషన్‌ను, దేశంలోని అనేక రాష్ట్రాల హైకోర్టులు, తమ తమ తీర్పుల ద్వారా నిరాకరించాయి. అంచేత, కులం ప్రాతిపదికపై మాత్రమే వెనకబడ్డతనం నిర్ణయించబడరాదని, కోర్టులు తమ తీర్పుల్లో స్పష్టంగా చెప్పాయి.

కుల - మత - విచక్షణ లేకుండా, అందరికీ ఉద్యోగావకాశాలు కల్పించామని భారత రాజ్యాంగంలో చెప్పినా, హరిజన - గిరిజన - వెనక బడిన కులాలవారికి రిజర్వేషన్లు యివ్వడానికి వీలుగా రాజ్యాంగాన్ని సవరించాకనీ, ఉద్యోగ నియామకంలో శక్తి సామర్థ్యాలకే (మెరిట్) ప్రాధాన్య మివ్వాలనీ, రిజర్వేషన్లు కోరడం వానిస - బలహీన - మనస్తత్వ మనీ, కొందరు వాదిస్తోన్నారు. వెనకబడిన కులాల విద్యార్థులకి చదువు - సామగ్రిలో, ప్రభుత్వం హాస్టలూ-స్కాలర్‌షిప్పులూ - యిత్యాది ప్రత్యేక సౌకర్యాలు కల్పించి వారి శక్తి సామర్థ్యాలకి మెరుగులుపెట్టితే అభ్యంతరం లేదు. కాని ఉద్యోగాల్లో మాత్రం అన్నికులాలవారికీ సమాన అవకాశా లివ్వాలని వీరు డిమాండ్ జేస్తోన్నారు. కొన్ని కులాలవారికి రిజర్వేషన్లు యిస్తున్నపుడు, కులమనేది స్వప్రయోజనాన్ని సాధించే వొక Vested Interest గా తయారవుతోందనీ, "వెనకబడిన తనం"లో ఈ Vested Interest గర్భీకృతమైవుందనీ వీరు విమర్శిస్తోన్నారు.

ఆర్థిక ప్రాతిపదికపై రిజర్వేషన్లు

అంచేత కులం బేసిస్‌పై రిజర్వేషన్లు వుండరాదనీ, ప్రతి కుటుంబం యొక్క ఆర్థిక స్థాయి (స్టేటస్) మాత్రమే, రిజర్వేషన్లు యివ్వావలెనా - వొద్దా - అనే అంచాన్ని నిర్ణయించడానికి గీటురాయిగా వుండాలనీ వీరు గట్టిగా వాదిస్తోన్నారు. ఆ విధంగా యిచ్చినప్పుడే అర్హులైనవారికి ఈ రాయితీలు చెందుతాయనీ, కులం ప్రాతిపదికగా యిచ్చినప్పుడు, ఆర్థికంగా ముందుకొచ్చిన హరిజన కలెక్టరు కుమారునికి సైతం యీ రిజర్వేషన్ సౌకర్యం లభిస్తుందనీ, తద్వారా అభివృద్ధి సాధించిన వారికే డబుల్ సదుపాయాలు కలుగుతాయనీ వీరు అంటోన్నారు.

ఉదాహరణకి - బీహార్‌లో యాదవు లున్నారు. పూర్వం వీరు "అహీర్లు" అనే కులానికి చెందినవారు. షెడ్యూలు కులాల జాబితాలో జేర్చబడిన వీరు, నిజానికి ఆర్థిక-వ్యవసాయ-రంగాల్లో తెగబలిసినవారులా నేడు తయారయ్యారు. ఆర్థికంగా వీరు పెట్టే భూస్వాముల స్థాయికి ఎదిగినా, షెడ్యూలు కులం కిందకే వొస్తారు గాబట్టి, షెడ్యూలు కులాలకి లభించే అన్ని రిజర్వేషన్లనూ వీరు పసందుగా పొందుతోన్నారు! అంచేత, కులంపేరిట, తెగబలసినవారే యీ రాయితీలన్నీ రాబందుల్లా కొట్టి వేస్తోన్నారు.

సంపన్నుల బిడ్డలకీ, ఉన్నత స్థానాల్లోవున్న హరిజన అధికారుల పిల్లలకీ, స్కూళ్ళూ కాలేజీల్లోనూ - ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ - ప్రవేశించడానికి ఎన్నో సౌకర్యాలున్నాయి గాని, హరిజనుల కన్న అధ్వాన్నమైన స్థితిలో వున్న వారికి, ఈ రాయితీలు లభించకపోవడం వల్ల సమాజంలో అసంతృప్తి వ్యాపించదా? వాస్తవానికి ఉత్తరభారంలోని కొన్ని రాష్ట్రాలు, రిజర్వేషన్ల కోటాను 33 శాతానికి పెంచాలని నిర్ణయించిన తర్వాత, పరిస్థితి అత్యంత భయానకంగా విషమించింది. బీహార్‌లో యీనిర్ణయం తీసుకొన్న

తర్వాత జనాభా మొత్తం అగ్ర - అధమ - కులాలుగా చీలిపోయి, కత్తులు దూసి కుత్తుకలు కోసుకో నారంభించారు. అప్పటివరకూ వీరిమధ్య కొంత మేరకైనా వున్న సామాజిక సంబంధాలు, రిజర్వేషన్ కోటాను పెంచడంతో పూర్తిగా విషతుల్యమయ్యాయి.

జీవనోపాదికి ప్రభుత్వ ఉద్యోగాలే శరణ్యమైన మనదేశంలో, యీ రిజర్వేషన్ల వల్ల హరిజనేతరులకు ఉద్యోగావకాశాలు మరింతగా క్షీణించిపోయాయి. దేశంలో ఉద్యోగావకాశాలు బాగా వున్నట్లయితే, ఈ రిజర్వేషన్ కోటాను ఎంత పెంచినా పెద్ద ప్రమాదముండేదిగాదు. కాని నిరుద్యోగ రాక్షసి విలయతాండవం జేసే మనదేశంలో, హరిజన - గిరిజనులుగా జన్మించనందువల్ల, తమకు సమానావకాశాలు లభించడం లేదని యితర కులాలకి చెందినవారు ఆగ్రహిస్తోన్నారు. ఉద్యోగ నియామకంలోనే గాక, ప్రమోషన్ల విషయంలోనూ, "ప్రతిభకీ అర్హతక్కీ" తిలోదకాలిచ్చి, రిజర్వేషన్ల పేరిట కోటా పద్ధతి చోటు చేసుకోవడంతో, దేశంలో అసంతృప్తి దవానలంలా ప్రబలుతోందని వీరు వాదిస్తోన్నారు. భారతీయుల్లో 60 శాతానికిపైగా వున్న ప్రజలు, కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తోన్నారు. వీరిలో అన్ని కులాలకి చెందినవారూ వున్నారు.

సమాన హక్కుల సాధన కోసం, విముక్తి పోరాటం ప్రారంభించ వలసిందిగా శ్రీ జగ్జీవన్‌రాం షెడ్యూల్డు కులాలు - తెగల - యునైటెడ్ ఫ్రంట్‌కు పిలుపు నిచ్చాడు. వాస్తవానికి వీరికి సమాన హక్కులు వుండ వలసిందే. కాని ఆ సమాన హక్కులు హరిజనుల కొక్కరికే ఎందుకుండాలి? వివక్షతకు గురి అయ్యే వారందరికీ ఎందుకుండగూడదు? అని-రిజర్వేషన్లకి వ్యతిరేకంగా వున్నవారు వాదిస్తోన్నారు. హరిజన-గిరిజనుల్తో పాటు "ఆర్థికంగా వెనకబడిన" కులాల వారందరికీ, ప్రభుత్వం ప్రత్యేక

సౌకర్యాలు కల్పించాలని వీరు భావిస్తోన్నారు. ఒక వ్యక్తి యొక్క వెనకబడినతనాన్ని, ఆతని ఆర్థిక స్థితినిబట్టి నిర్ణయించాలిగాని, ఆతని కులాన్నిబట్టి కాకూడదని వీరు అంటున్నారు. అయితే దేశ జనాభాలో, దాదాపు 90 శాతం మంది ఈ విధంగా వెనకబడిన కులాల కిందికి వొచ్చే ప్రమాదముంది!

సోషలిస్టు - సెక్యులర్ వ్యవస్థకి "అంకితమైన" మనదేశం, కులప్రాతిపదికపై తన మనుగడ సాగించడం దుర్లభం గాబట్టి, ప్రభుత్వం ఈ రిజర్వేషన్ల సమస్యను సమగ్రంగా పునరాలోచించాలని వీరు అభిప్రాయపడుతోన్నారు. షెడ్యూలు - కులాలు - తెగలకి చెందినవారి జీవనపరిస్థితులు మెరుగుపడితే, అలాంటి వారికి యిక ముందు ఎలాంటి రాయితీలు పొందే అర్హత వుండగూడదనీ, 1989 లో ప్రభుత్వం యీ అనుచితమైన చట్టాన్ని మళ్ళీ మరో పదేళ్ళపాటు పొడిగించగూడదనీ వీరు అంటున్నారు.

పేద హరిజనులకు రిజర్వేషన్లు ఏమి మిగిల్చాయి

భారతీయ సమాజంలో అధిక సంఖ్యాకులైన నిరుపేదలు, పంచములే - గ్రామ చండాలురే - గాంధీగారి భాషలో హరిజనులే. యీ అట్టడుగు కులాల వారిలో అభివృద్ధిని సాధించడానికై, భారత రాజ్యాంగం రిజర్వేషన్లను ప్రవేశపెట్టినమాట వాస్తవమే.

అయితే గత ముప్పయ్యేళ్ళ రిజర్వేషన్లు, హరిజనులకి ఏమి మిగిల్చాయి?! గ్రామాల్లో అంటరానితనం మంటగలిసిందా ? అందరూ తోడుకొనే మంచినీటి బావుల వొద్ద, వారిని కనీసం మంచినీళ్ళయినా తోడుకోనిస్తోన్నారా ? ఈ ముప్పయ్యేళ్ళ రిజర్వేషన్ల పుణ్యాన వారు లక్షాధికారు లయ్యారా ? వారి జీవితాల్లో నూత్నవసంతాలు వెల్లివిరిశాయా? వారి జీవన పరిస్థితుల్లో మౌలికమైన మార్పులేమైనా వొచ్చాయా? యీ రిజ

ద్వేషన్ల పుణ్యాన వారి బిడ్డలు పాలూ తేనే తాగుతోన్నారా? ఈ రాయితీల వల్ల వారి పిల్లలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ళలో పంచభక్ష్య పరమాన్నాలు భోంచేస్తోన్నారా? గతంలో వలె వారి గొడ్డుచాకిరీ నేటికీ తప్పలేదే? రెక్కలు ముక్కలు జేసుకొన్నా, గుక్కెడు గంజినీళ్ళకి సైతం వారికి దిక్కులేదే? అసంఖ్యాకమైన వారి బిడ్డలు గొడ్డకాడ బుడ్డాళ్ళలా - పాలేర్లలా - చెప్పులుకుట్టే "ఇంటి మాదిగల్లా"- నేటికీ గ్రామాల్లోని కలవారి కొంపల్లో ఊడిగం జేస్తోనే వున్నారే? మరి యీ రిజర్వేషన్లు గ్రామ సీమల్లోని నిరుపేద హరిజనులకి ఏమి ఒరగబెట్టాయి? చింకి చాపలు - కుక్కమంచాలు - గోనెపట్టాల దుప్పట్లు - గోగునారల్లాంటి వారి బిడ్డలు - కొబ్బరి నూనెకి సైతం గతిలేని వారి పెళ్ళాల తలలు - మంచాల్ని అడ్డం బెట్టుక వారి భార్యలు జేసే స్నానాలు- ఏ షేక్స్పియర్- ఏ హ్యూగో - ఏ గోర్కీ - మరే శ్రీశ్రీ - వారి బతుకుల్ని వర్ణించ గలడు? వారి చాకిరి - వారి అరాకలి - వారి పస్తులు - వారి బిడల ఏడ్పులు-వారి స్త్రీల అవమానాలు - మానభంగాలు - కంచికచర్ల కోటేశుల సజీవదహనాలు - నేటికీ నిరాఘాటంగానే సాగుతోన్నాయే?!

నేటికీ వారు పడుతోన్న చీదరింపులు - తిట్లు - ఎవరు పడు తోన్నారు? రిజర్వేషన్ల ద్వారా హరిజనులకు "అన్ని" ఉద్యోగాలూ దొరుకుతోన్నాయని గగ్గోలుపెట్టే కొందరు, తరతరాలుగా అగ్రవర్ణాలు జేసిన అమానుషమైన దోపిడీ గూర్చి నోరెత్తి మాట్లాడరేం?! వేల సంవత్సరాలుగా వీరిని గ్రామ చంతాలురుగా - స్వపచులుగా - పరిగణించి, మాల - మాదిగ గూడెల్లోనే వుంచి, ఊరి పొలిమేరలు దాటకుండా నిషే ధించి, కాలవలోని పురుగుల్లా - శ్లేష్మంలో ఈగల్లా - గానుగెద్దుల్లా - గొలుసులోని కుక్కల్లా చూసి, వారిచే అత్యంత కిరాతంగా ఊడిగం చేయించిన అగ్రవర్ణాలవారి ప్రవర్తనను గూర్చి వీరు పల్లెత్తుమాట సైతం పల్కరేం?

అంతదాకా చెందుకు? దేశంలో వున్న పరిశ్రమలు నేడు ఎవరి చేతుల్లో వున్నాయ్? ప్రభుత్వాలు ఎవరి చేతుల్లో వున్నాయ్? మంత్రి పదవులు ఎవరి చేతుల్లో వున్నాయ్? చీకటి ధనం ఎవరి భోషాణాల్లో దాక్కొంది? కోయం బత్తూర్ నోట్ల ముద్రణ ద్వారా గడించిన దొంగ డబ్బు ఏ కొంపల్లో దాక్కొంది? గ్రామాల్లో వ్యవసాయకూలీల- పాలేర్ల- రక్తం పీల్చి, పట్టణాల్లో రకరకాల వ్యాపారాల ద్వారా కార్మిక - మధ్య తరగతి ప్రజల కడుపులు గొట్టి సంపాయించిన "మంది సొమ్ము" ఎవరి బొక్కసాల్లో మూల్గుతోంది? ఈ ముప్పయ్యేళ్ళ స్వాతంత్ర్యం ఫలితంగా ఏ ధనికరైతు కుటుంబాలు "కొత్త ధనవంతులు" గా (Neo - Rich) నేడు తలెత్తారు?

హరిజనులకు మాయమాటలు చెప్పి, వారిని మభ్యపెట్టి, వాళ్ళ ఓట్లను కొల్లగొట్టి, తద్వారా చిక్కించుకొన్న అధికారం, నేడు ఎవరి చేతుల్లో వుంది? అంచేత, రిజర్వేషన్ల వల్ల ముందుబడిన కులాలవారి (Forward communities) కొంపలు అంటుక పోతోన్నాయనే వాదన, "లేబర్ జనం మరీ అరాచకంగా తయారయ్యారని" గోలజేసే వారి రోదన- వాస్తవ విరుద్ధమైనవి. నిజంగా హరిజనుల్లో చైతన్యమే కల్గితే, సంఘటిత శక్తితో వారు ఉద్యమిస్తే, అగ్రవర్ణాల - అగ్రవర్గాల - వారి జీవితాలు ఏమయ్యేవో? వారు నిజంగానే రుద్రనేత్రం తెరిస్తే, ఈ సోంబేరుగాళ్ళ జీవితాలు ఏమయ్యేవో? వీరి పొలాల్ని దున్నుతోంది ఎవరు? వీరి పాకీ దొడ్లు ఊడ్చేది ఎవరు? రాత్రింబగళ్ళూ తెక్కలు ముక్కలు జేసుక వీరి కొంపల్లో చాకిరీ జేసేది ఎవరు? యీ కష్టజీవుల చెమటపై - పస్తులపై - రక్తకన్నీటిపై - ఎకరంమీద ఎకరం పోగేసుకొంటోన్న వీరు, బస్తీల్లో అంతస్తుపై అంతస్తు లేపుతోన్న వీరు, లేబర్ జనం తెలివి మీరారని వీడవడం సిగ్గుచేటు గాదా? అంతేగాదు; మధ్యతరగతికి చెందిన కొందరు, రిజర్వేషన్లద్వారా హరిజనులకి ఏదో లప్పం వొస్తోందని వాపోతున్నారు.

షడకీ గుడిసెకీ మధ్య వేలాడే వీరు, నేడు గుడిసెల్లోని వారిని తిట్టిపోస్తూ, రిజర్వేషన్లను తక్షణం యెత్తివేయాలని కోరుతున్నారు.

వాస్తవానికి వేల సంవత్సరాల హిందూ సమాజం, హరిజనుడికి ఏమి మిగిల్చింది? రెక్కల్ని ముక్కలు జేసే గొడ్డుచాకిరీ తప్ప ఆతనికి ఏమి - మిగిల్చింది? నేతనేయ వొచ్చుగదా - అని అడుగుతారు. "సాలినేత కన్నమాలనేత" హీనమని ఈ హింసా సమాజమే యీసడిస్తుంది గదా ?! (కమ్మ - రెడ్డి - రాజు - వెలమ - యిత్యాది కులాలవారికే వ్యవసాయం బాగా తెలుసుననీ, "చాకలి మంగలి పొత్తు - ఇంటికి రాదు యిత్తు" (విత్తు) అని చాకలి - మంగళ్ళని యీ సంఘమే ఎత్తి పొడుస్తుంది గదా ?!)

అంచేత, తరతరాల కులదానిసత్వానికి గురిజేయబడిన హరిజనులు, మానసికంగా పిరికివారుగా - భయస్తులుగా - మలచబడ్డారు. "జాన్ మత్తయ్ కంపెనీ" - అని హేళన జేయబడి, సాంఘికంగా అత్యంత హీనంగా చూడబడే వీరు, ఏ మాత్రం ఆర్థికవనరులు లేనివారు. వీరు కళ్ళన్న కబోదులుగా; కాళ్ళన్న కుంటివారుగా; మెదడున్నా ధైర్యంగా ఆలోచించలేని మరుగుజ్జులుగా, వేల ఏళ్ళ కులదానిసత్వం ఫలితంగా మలచబడ్డారు. (Due to centuries of caste - bondage, they are severely handicapped socially economically and psychologically.)హరిజన పురుషుల స్థితి దారుణమైతే, వారి స్త్రీలస్థితి - దారుణాతి దారుణం; హృదయ విదారకం; వీరి యావజ్జీవితం తుదీ మొదలూ లేని గొడ్డు చాకిరీతే అంకితం.

ఇండియాలోని ప్రతీ రాష్ట్రంలో, పాములూ - కప్పకీ; తోడేలు - మేకపిల్లకీ మధ్యవున్న సంబంధాల్లాంటివే, దాదాపు అగ్ర - అధమవర్ణాల మధ్య వున్నాయంటే ఏ మాత్రం అతిశయోక్తి గాదు. అయితే రాష్ట్రాల వారీగా ఈ సంబంధాల్లో తరతమ భేదాలుండ వొచ్చుగాక. ఇంతటి

కలుషితమైన సంబంధాలకీ-అగ్రకులాల దురహంకారమూ, కులం పెత్తం దార్ల పొగరుమోతుతనమూ, కుల - మత - మౌఢ్యమూ, అనూచానంగా వొస్తోన్న సాంప్రదాయమూ కారణాలు. ఈ విభిన్న కారణాల దృష్ట్యా, కొంతకాలంపాటు కులం ప్రాతిపదికపై రిజర్వేషన్లు పొడిగించాలని, కొందరు అభిప్రాయ పడుతున్నారు.

"చట్టం దృష్టిలో అంతా సమానమే"నని అంటుంటారు. ఇది - రెండు వేపులా పదునున్న కత్తిలాంటి సూత్రం. జీవిత పోరాటంలో బలవంతుల్నీ బలహీనుల్నీ, ఈ సూత్రం వొకే గాటన కడుతోంది. రిజర్వేషన్లు కల్పించడం వల్ల, అర్హతకీ ప్రతిభకీ ప్రాధాన్యం లేకండా పోతున్నదని కొందరు విమర్శిస్తోన్నారు. అర్హత - ప్రతిభ - అనేవి, భౌతిక మానసిక సాంస్కృతిక పరిస్థితులూ సౌకర్యాలపైనే ప్రధానంగా ఆధారపడివుంటాయి. సాంఘిక - విద్యా - వైజ్ఞానిక - రంగాల్లో వెనకబడి వున్న హరిజన గిరిజనుల బిడ్డలు, ఈ రంగాల్లో గతంలోనే అభివృద్ధిని సాధించిన సంపన్నవర్గాల వారి పిల్లలతో పోటీ పడలేరు. కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా వున్న వ్యక్తి యొక్క కుమారునితో, సాధారణ వ్యవసాయ కూలీగా పనిజేసేవాని కొడుకు పోటీపడలేడు. కాబట్టి సమానుల మధ్యనే సమానత్వముంటుంది గాని, సమానులకీ అసమానులకీ మధ్య సమానత్వముండనేరదు.

అంచేత, రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు, యీ నగ్నసత్యాన్ని గుర్తించాలి. ఈ సత్యాన్ని గుర్తిస్తోనే, అర్హత ప్రతిభ కలిగిన వారినే సాధ్యమైనంత వరకు ఉద్యోగాల్లోకి రిక్రూట్ చేయడం దేశ భవిష్యత్తుకి ఆరోగ్యకరం.

హరిజనులుగా వుంటేనే రిజర్వేషన్లు

షెడ్యూలు కులాలు - తెగలకి చెందిన వ్యక్తి, హిందువుగా వున్నంతవరకే ఈ రిజర్వేషన్ సౌకర్యాలు లభిస్తాయి. ఈ నిబంధన

అత్యంత విచిత్రమైనదే గాక, అత్యంత కీరాతకమైంది గూడా. ప్రస్తుతం ఈ నిబంధన సిక్కులకి సైతం వర్తిస్తుంది! అంటే - వొక వ్యక్తి ఇస్లాం మతాన్ని గానీ, క్రైస్తవ మతాన్ని గానీ స్వీకరిస్తే, స్వీకరించిన నాటినుండి ఆతనికి ఈ రిజర్వేషన్ సౌకర్యాలు లభించవు. మతం మారినందువల్ల ఆతడు షెడ్యూల్డు కులాలు - తెగలకి చెందినవాడు కాకుండా పోతాడు! ఇదే మనదేశంలో నేడు అమల్లో వున్న సెక్యులరిజం యొక్క నిజస్వరూపం! ఇదే - రిజర్వేషన్ల అమల్లో వున్న చిదంబర రహస్యం!

శుద్ధిసంఘంలో హరిజన ముద్ర

అసలేటి దేవకుటుంబానికి - భాస్కర్రావు - అనీ,

అర్జా ఆశీర్వాదానికి - సుబ్రమణ్యం - అనీ,

బొల్లారపు జాన్ వెంకటసామికి - వెంకటేశ్వరరావు - అనీ,

కత్తుల బెంజిమేనుకి - వెంకట రమణమూర్తి - అనీ,

రాసపోలు ఏసుపాదానికి - శ్రీనివాసరావు - అనీ,

దేవదానానికి - పార్వతీశం - అనీ,

డేవిడ్ సుందర్‌కి - రవికుమార్ - అనీ,

ప్రేమయ్యకీ - రామదాసు - అనీ,

కేథరిన్‌కి - కల్యాణి - అనీ,

మేరీగ్రేస్‌కి - పద్మావతి - అనీ,

బ్లాండినాకి - విజయలక్ష్మి - అనీ,

పేర్లుమార్చి, వారివారి సర్టిఫికెట్లలో "మాల-మాదిగ" కులాల్ని జాగ్రత్తగా రికార్డ్‌జేసి, శతాబ్దాల పర్యంతం వీరిని మాల - మాదిగలుగానే వుంచి యీ కులాలకి శాశ్వతంగా జీవం పోయడమే - ఈ శుద్ధి సంఘాల అంతిమ లక్ష్యమా?

క్రిస్టియన్ మతం పుచ్చుకొంటే హరిజనులు మైలపడ్తారా?! మైల పడిన హరిజనుల్ని ఈ సంఘాలు శుద్ధిజేసి, వారికి దోవీ మార్కులు వేస్తాయా? క్రైస్తవమతం పుచ్చుకొంటేనే - మనిషి మైలపడేట్లయితే, గుంటూరుజిల్లా ఫిరంగిపురం వెడ్లే సంగతేవిటి? కొత్తగా క్రైస్తవమతం పుచ్చుకొని, రామాయణం కన్న నిష్టగా బైబిల్‌ను పారాయణం జేస్తో, నిత్యం ప్రభువును ప్రార్థిస్తో, చచ్చిన శవాల నోట్లో పసుపు ముద్దలు పెడితే తిరిగి బతుకుతారని ప్రచారం జేస్తోన్న అగ్రవర్ణాలకి చెందిన ఏసు భక్తుల మాటేవిటి? వీరంతా శుద్ధిసంఘాల దృష్టిలో మైలపడ్డవారి కిందకే లెక్క కొస్తారా?! శుద్ధి సంఘాల పేరిట, నేడు జరపబడ్తోన్న ఈ తతంగం కన్న మూర్ఖత్వమూ ఇంగితజ్ఞాన రాహిత్యమూ పరాకాష్ట వుందా? శుద్ధి సంఘాల పేరిట దేశంలో "నియో బ్రాహ్మనిజాన్ని" పునఃస్థాపించడానికీ, వేల ఏళ్ళనాటి హ్యూడల్ వ్యవస్థకి తిరిగి బలమైన పునాదులు వేయడానికీ, ఈ రూపంగా ప్రయత్నం జరగడం లేదా? అత్యంత కిరాతకమైన ఈ ప్రయత్నంలోని ప్రమాదకర ఫలితాల్ని గూర్చి, దేశంలోని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం లేదా?

రిజర్వేషన్లకై హరిజనులకీ హరిజన క్రైస్తవులకీ మధ్య పోటీ

గ్రామాల్లో వ్యవసాయ కూలీలుగానో - లేదా - కులవృత్తిని జేసుకొనే వారు గానో వుంటూ, అష్టకష్టాలు పడి తమ బిడ్డల్ని చదివించిన హరిజనులు, పట్టణాల్లో పాతుకపోయి ఉద్యోగాలు సంపాదించి గతంలోనే వొకస్థాయిని పొందిన (హరిజన) క్రైస్తవుల పోటీకి తట్టుకోలేక నిరుద్యోగులుగానే మిగిలి పోతున్నారు. అంచేత, తమ స్వార్థం కోసమే రిజర్వేషన్లు కొనసాగించాలని క్రైస్తవులు ఆందోళన జేస్తోన్నారని హరిజనులు వీరిపై ఆరోపిస్తోన్నారు. రిజర్వేషన్ల పేరిట ప్రభుత్వం కల్పించే

రాయితీలన్నింటినీ, ఈ (హరిజన) క్రైస్తవులే "కొట్టి" వేస్తోన్నారనే ఆరోపణను సైతం నేడు హరిజనులు చేస్తోన్నారు. తెల్లవారల పాలనలో క్రైస్తవమతం స్వీకరించి ఉద్యోగాలు సంపాదించింది వీరేననీ, మళ్ళీ నల్లవారల రాజ్యంలో హిందువులుగా మారి ఉద్యోగాలు సంపాయిస్తున్నదీ వీరేననీ, గ్రామాల్లోని నిరుపేద హరిజనులు కంప్లెయింట్ జేస్తోన్నారు.

ప్రభుత్వం యిస్తోన్న ఈ రిజర్వేషన్లను, గతంలోనే ఆర్థిక - విద్యా - ఉద్యోగ - రంగాల్లో పురోగమించిన క్రైస్తవులు మాత్రమే వినియోగించుకొంటున్నారనీ, గ్రామ సీమల్లోని పేదహరిజనులకి ఈ రాయితీలు అందడం లేదనీ, కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లో వుండే పేద హరిజనుల పిల్లలకి ఈ రిజర్వేషన్లలో 75 శాతం వరకూ ఉద్యోగాలు రిజర్వ్ చేయాలనీ వీరు కోరుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే - క్రైస్తవులూ - హరిజనుల్లోని (మాల) దాసులూ వీటిని చాకచక్యంగా వినియోగించుకొంటున్నారని పేద హరిజనులు భావిస్తోన్నారు.

ఆదివారం నాడు క్రిస్టియన్ అప్లికేషన్‌లో హరిజన్

అన్ని రంగాల్లోనూ క్రైస్తవులు కొద్దో గొప్పో అభివృద్ధిని సాధించారనీ, మారిన పరిస్థితుల దృష్ట్యా వీరు గుంటూరులోని శుద్ధి సంఘం వారి వద్ద కెళ్ళి, క్రిస్టియన్ మతంలోంచి హిందూమతంలోకి ప్రవేశించినట్లు సర్టిఫికెట్లు పొంది, హరిజనులుగా చలామణీ అవుతూ రిజర్వేషన్ల ద్వారా నేడు ఉద్యోగాలు గడిస్తోన్నారని; మత విశ్వాసాల్లోనూ - పైనందిన జీవన విధానంలోనూ - నేటకీ వీరు క్రైస్తవులుగానే జీవిస్తోన్నా, అప్లికేషన్‌లోనూ - కులం సర్టిఫికెట్‌లోనూ - హరిజనులుగా రికార్డ్

జేయించుకొని సులభంగా ఉద్యోగాలు సంపాయిస్తోన్నారనీ హరిజనులు ఆరోపిస్తోన్నారు.

గతంలోనే చదువుసామ్యల్లో అభివృద్ధి జెందిన క్రైస్తవునితో, నేటి గ్రామీణ హరిజనుడు ఏ విధంగానూ పోటీ చేయలేడనీ, అంచేత పేరుకు మాత్రమే హరిజనులుగా నటిస్తోన్న క్రిస్టియన్ల పోటీ నుండి సాధారణ హరిజనులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలనీ, వీరు గట్టిగా కోరుతోన్నారు.

గ్రామాల్లో వ్యవసాయమూ - బస్తీల్లో వ్యాపారమూ కలిగి వుండి, రెండు చేతుల్తో పోగేసుకొనే భూస్వామ్య - ధనికవైశ్య - కుటుంబాల వాళ్ళే, రిజర్వేషన్లను గట్టిగా వ్యతిరేకిస్తోన్నారని చదువుకొన్న హరిజన యువతీ యువకులు అంటోన్నారు. వ్యవసాయ - వ్యాపారాల ద్వారా బాగా గడిస్తోన్న వీరిలో కొందరు, కరణాలకి లంచాలిచ్చి తమ సాలుసరి ఆదాయం 1500 రూపాయలు మాత్రమేనని కొంగ సర్టిఫికెట్లు పుట్టించి, ఆప్టిట్యూడ్ వాడిని గార్డియన్‌గా అప్లికేషన్‌లో చూపించి నగం జీతం కన్వెషన్లూ - స్కాలర్‌షిప్పులూ కొట్టివేస్తోన్నారనీ, ఈ కొంగ సర్టిఫికెట్ల ఆధారంగా హరిజన-గిరిజన-పేద విద్యార్థులకోసం ఏర్పరచిన సోషల్ వెల్‌ఫేర్ హాస్టళ్ళలో, సిగ్గూ బిడియం లేకుండా తమ పిల్లల్ని జేర్పించి, పేద విద్యార్థుల నోటి దగ్గర కూటిలో మట్టి గొడ్తోన్నారనీ, ఈ హరిజన-గిరిజన - విద్యార్థులే నేడు తీవ్రంగా కంప్లెయింట్ జేస్తోన్నారు.

మెడిసిన్ - ఇంజనీరింగ్ - యిత్యాది సీట్లను రిజర్వేషన్ల ప్రకారం కేటాయిస్తున్నందు వల్ల, అర్హత - ప్రతిభ - కల్గిన విద్యార్థులకి అవకాశం లేకుండా పోతోందని, ఈ విధానాన్ని వ్యతిరేకించేవారు వాదిస్తోన్నారు. ఈ విధానం అమలు జేయడం వల్ల, "మాల మాదిగలూ- ఎరికల ఏనాదులూ- చాకలి మంగళ్ళూ," పొట్టగోస్తే అక్షరం ముక్క రాని సమస్త భుంతలకీ సీట్లు వొస్తోన్నాయని, ప్యూడల్ - ధనికవైశ్య - కుటుంబాలకి చెందినవారు అంటోన్నారు. ఇది నిజమేనా?

ఎందరో మహానుభావులు
అందరికీ వందనాలు

ఎగ్జామినేషన్ హాల్లో వాచర్లుగా వుండేవాణి ముందుగానే కట్టుకొని, వాకి ముడుపులిచ్చి, ప్యూన్ల ద్వారా బయటినించి ఆన్సర్ పేపర్లు సరఫరా జేసినా, వీరి బిడ్డలకి అత్తెసరు మార్కులు గూడా పరీక్షల్లో రావడం లేదే?! వేల రూపాయలు పోసి, పగలూ రాత్రీ ట్యూషన్లు పెటించినా, అర్ధరాత్రి సమయంలో ట్యుటోరియల్ కాలేజీల "ప్రిన్సిపాళ్ళ" దగ్గర నించి రహస్యంగా సంపాయించిన కొశ్చన్లకి ఆన్సర్లను కంఠతా పట్టించినా, మోడరేషన్ దేవత కరుణిస్తే తప్ప, వీరి పిల్లలు పాస్ కావడం లేదే?! వేలుపోసి వీరి బిడ్డలు ట్యూషన్లు చదివినట్లు, వేలు పోసి వీరి పుత్ర - పుత్రికా రత్నాలకి దొంగ మార్కులు వేయించినట్లు, "మాల - మాదిగల" పిల్లలకి ట్యూషన్లు చదవడానికీ, మార్కులు వేయించుకోవడానికీ వీలు లేదే?! కూటికే గతిలేని వాకి ట్యూషన్ చదివే అవకాశ ముంటుందా?! గుడ్డకే గతిలేని వాకి దొంగమార్కులు వేయించుకొనే తాహత్తు వుంటుందా?

నాగార్జున యూనివర్సిటీలో
మార్కుల కుంభకోణం

నాగార్జున యూనివర్సిటీలో జరిగిన మార్కుల కుంభకోణం గూర్చి ఈనాడు పత్రిక యీ విధంగా రాసింది:

"నాగార్జున విశ్వవిద్యాలయంలో మార్కుల కుంభకోణం బయట పడింది. యూనివర్సిటీ సిండికేటు 34 మంది డిగ్రీలను రద్దు చేయడమే గాక, ఆ కుంభకోణానికి బాధ్యులయిన వారిని శిక్షించే నిమిత్తం కేరళ మార్కుల కుంభకోణంపై విచారణ నమూనాలో ఉన్నత పోలీసు అధికారిచే విచారణ జరిపించటానికి నిర్ణయించినట్లు కూడా తెలిసింది. ఈ

సందర్భంగానే రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్‌తో సహా రాష్ట్రప్రభుత్వ వున్నతాధికారులతో సంభాషణలు జరిపి తగిన ఏర్పాట్లు చేయడానికై యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ భాస్కరరెడ్డి హైదరాబాదు వెళ్ళినట్లు కూడా తెలిసింది.

నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వహణ విభాగంలో అవక తవకలను గూర్చి విచారించటానికి ఒక కమిటీని నియమించి విచారణ జరిపించారు. ఆ కమిటీ నివేదికను యూనివర్శిటీ సిండికేట్ ఆమోదించి నట్లు తెలిసింది. డిగ్రీలు రద్దు చేయబడిన 34 మందిలో కొందరు డిగ్రీలు ఈవరకే తీసుకున్నారని, మరి కొందరు ఇంకా తీసుకొనలేదని కూడా తెలిసింది. అసలు పరీక్ష రాయకుండానే ప్యాసయిన వారు వున్నట్లు కూడా బయట పడింది. మరి కొన్ని సందర్భాలలో మార్కులు జాబితాను దిద్ది, నిజంగా వచ్చిన మార్కులకంటే ఎక్కువ వేసినట్లు, పరీక్ష తప్పినవారు ప్యాసయినట్లు, మామూలుగా ప్యాసయిన వారికి తమకు వచ్చిన దానికంటే పై శ్రేణిలో ప్యాసయినట్లు చేశారని ఈ విచారణ సందర్భంగా వెల్లడయి నట్లు తెలిసింది. పరీక్షల నిర్వహణ విభాగంలో పనిచేసే వుద్యోగులకు డబ్బు ముట్టజెప్పి ఈ పనులు సాధించుకున్నట్లు తెలుస్తోంది. అలా సాధించుకున్న వారిలో ఎక్కువమంది విజయవాడ నగరంలోని కళాశాల లకు చెందిన విద్యార్థులు. బహుశా విజయవాడలో ఎవరో ఒక బ్రోకరు ద్వారా ఈ పనులు చేయించుకోవటం జరిగి వుండవచ్చునన్న అభిప్రాయం కూడా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వినిపించుతోంది."

(ఈనాడు - మొదటిపేజి - 1-5-82)

"కొచ్చన్ పేపర్లు" అతి కష్టంగా వున్నాయనీ, వాచర్లు నికృష్టపు ముండా కొడుకులనీ, అందిన ఆన్సర్ పేపర్లు చెంచీ కిందపెట్టి కాపీ కొట్ట డానికి వీలుకాలేదనీ, భోరున ఏడ్చి పడుకొంటే, ఆదరబాదరా మళ్ళీలొచ్చి హార్లిక్స్ తాగించి ఓదార్చి, ఆన్సర్ పేపర్లుదిద్దే డిఫరెంట్ సెంటర్లకి

డాడీల్ని తోలే మమ్మీ లెందరు లేరు? ఆన్సర్ పేపర్లుదిద్దే వారి అడ్రెస్సులు తెలుసుకొని, ఫారెన్ విస్కీ-బ్రాందీల్తో వాళ్ళ నోళ్ళు తడిపి, నోట్లకట్టల్తో వాళ్ళ పాకెట్లు ధట్టించి, వాళ్ళ యింట్లో స్టూడెంట్‌ను కూర్చోబెట్టి, అడిషనల్ షీట్లపై ఆన్సర్లు డిక్టేట్ జేయించి, 85 శాతం మార్కులు దాకా వేయించి, దొంగ మార్కుల్తో- దొంగ సర్టిఫికెట్లతో - దొంగ మొహాల్తో- మెడికల్ - ఇంజనీరింగ్ కాలేజీల్లో దొంగసీట్లు గడించే వారెందరు లేరు?! "కొండకాపు - కొండ రెడ్డి" అనే పేరిట దొంగ సర్టిఫికెట్లు పుట్టించి, షెడ్యూలు కులాల జాబితాలో జేరి, ఈ సీట్లు గడించే భటాచోర్లు ఎందరు లేరు?

ఇంతటి "అపూర్వ ప్రతిభ" గల్గిన ఈ పండిత పుత్రులు, మహమ్మద్ గజినీలా దండయాత్రలు గొడుతోండే, తెగ తప్పడం ద్వారా తమ పునాదిని కాంక్రీట్‌తో గట్టిపరచు కొంటోంటే, ఈ సిగ్గుమాలిన పరిస్థితిని చూచి భరించలేని వీరి తల్లి దండ్రులు, "మన" కులానికి చెందిన ప్రొఫెసర్లను కాకా బట్టి మార్కులు వేయించగా, చావు దప్పి కన్ను లొట్టబోయిన పరిస్థితిలో, డాక్టర్లూ ఎంజినీర్లుగా అవతరించేవారు - ఎందరు లేరు?! ఇంత లచ్చనంగా డిగ్రీ పుచ్చుకొన్న తర్వాత, కడుపు నొప్పిని అప్పెండిసైట్‌గా భావించి, అమాంతం కడుపును తెగ్గోసే డాక్టర్ నాపచేయు లెందరు లేరు?

లక్ష్మి యిచ్చే డొనేషన్ లంచాలకి
అమ్ముడుపోతున్న చదువుల సరస్వతి

ఖాహా వేళ ఈ కొట్టి పోవలన్నీ చాలా కష్టసాధ్యమైనవని భావించి నప్పుడు, నేరుగా డొనేషన్ ముడుపు చెల్లించి, డాక్టరూ - ఇంజనీరింగ్ - సీట్లను కొట్టేసే మహా ప్రతిభావంతులైన విద్యార్థు లెందరులేరు? (అయితే, డొనేషన్ కాలేజీల్లో చదివిన వారందరూ ప్రతిభ లేని వారని కాదు. వారిలో

కొందరు ప్రతిభావంతులు అచ్చితంగా వున్నారు.) ప్రభుత్వం అమలు జేస్తోన్న రిజర్వేషన్ల ద్వారా వీరికి సీట్లు దొరకక్కపోతే, డొనేషన్ల ద్వారా వీరికి సీట్లు వొస్తాయిగదా ?

ఈ డొనేషన్ పద్ధతివల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు, నిరాశా నిస్పృహలకి గురి అయ్యే ప్రమాదం లేదా? వీద విద్యార్థులు అలక్ష్యానికి గురికారా ? డబ్బుంటే చాలు అసమర్థులైన విద్యార్థులు గూడా ఇంజనీర్లు అయిపోయే అవకాశం లేదా ? ఇలాంటి దగుల్బాజీలవల్ల దేశం నష్టపోదా? అసమర్థుడైన ఇంజనీరు కట్టే ఆనకట్ట, ముచ్చటగా మూడోకోజునే కుప్ప కూలిపోదా ?- అని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకి జవాబేమిటి ?

(ఈనాడు - 23-10-1979)

ఈ విధంగా డొనేషన్ లంచాలకి ప్రొఫెషనల్ కాలేజీ సీట్లను, బజార్లోని ఉప్మా చింతపండులా డబ్బుకు అమ్మివేయడం - సాంఘిక న్యాయమా ? ఈ డొనేషన్ల విధానం - తెగబలిసిన ధనిక కుటుంబాల విద్యార్థులకి పసందుగా ఉపయోగపడ్డం లేదా ? యీ పద్ధతి ద్వారా సాంఘిక - ఆర్థిక - అసమానతలు పరింత పెరగవా ? కర్నాటకలోని డొనేషన్ కాలేజీల్లో లంచాల డిగ్రీలు గడించిన డొనేషన్ ఇంజనీర్లు, గవర్నమెంట్ కాలేజీల్లో చదివిన ఇంజనీర్లతో ప్రతిభ - సామర్థ్యంలో ఎందుకూ కొరగాక పోతోన్నారని, కర్నాటక ప్రభుత్వమే స్వయంగా అంగీకరించిందిగదా ?

ఇంజనీరింగ్ సీటు ముప్ఫయ్ వేలు
మెడికల్ సీటు లక్ష రూపాయలు

కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో వొక్కొక్క సీటుకి పాతిక వేల నించి ముప్ఫయ్‌వేల దాకా, డొనేషన్ రూపంలో వసూలు జేస్తోన్నారు.

ఇంత డబ్బు ఖర్చుచెట్టి ఇంజనీర్లయినవారు, మరి యింతకింత డబ్బు గడించడానికి అడ్డమైన గడ్డి కరవరా? అలాంటి అవకాశం లేకపోతే, తట్టా బుట్టా కట్టుకుని ఇరాన్ - అమెరికాలకి వలసపోరా? యీ డొనేషన్లు సంతలోని ఎద్దుల్లా వేలాది రూపాయలకి అమ్ముడుపోయే పెళ్ళికొడుకుల రేట్లను మరింత పెంచవా? కంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై ఉద్యోగాలు జేసే యీ ఇంజనీర్లు, వారు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టరా? డొనేషన్ విధానం కన్న సాంఘిక దురన్యాయం మరొహటి వుందా? నేడు యీ విధానం మూడేళ్ళ పసిపాప చదివే కె.జి. క్లాస్ నించి ప్రారంభమై, ప్రొఫెషనల్ కాలేజీల దాకా అంటుజాడ్యంలా పాకిపోయింది!

గేద పాలూ - కోడుగుడ్లు అమ్మకం ద్వారానూ, చెంబులూ - బిందెలూ - ఉంగరాలూ - చివరికి మంగళసూత్రాల్ని సైతం నూటికి నెలకి పదిరూపాయల చొప్పున తాకట్టుపెట్టుకొనే వడ్డీవ్యాపారం ద్వారానూ, సొంత బట్టల షాపుల్లోని శాంపిల్ పీసుల్ని యిరుగుపొరుగు ఆడాళ్ళకి మారుబేరానికి అమ్మడం ద్వారానూ, కన్నారింటి నించి వొచ్చే పైసలూ మినువులూ కందుల్ని భర్తల చాటున అమ్ముకోవడం ద్వారానూ గడించిన సొమ్ముతో, పట్టణాల్లో పుట్టకొక్కుల్లా వెలిసిన ఇంగ్లిష్ మీడియం పబ్లిక్ స్కూళ్ళలోని సీట్లను ధనిక కుటుంబాలకి చెందిన స్త్రీలు కొంటోన్నారనీ, యీ చాటుమాటు వ్యాపారాలు తమకి చాతకానందువల్ల, తమ పిల్లలకి "డాడీ - మమ్మీ - వాటర్ - డాగ్ -" లాంటి ఇంగ్లిష్ మాటలు రావడం లేవనీ, మధ్యతరగతి కుటుంబాలకి చెందిన కొందరు పెద్దిబాగుల స్త్రీలు వాపోతోన్నారు. "మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి" అని వేదికలపై గంటలకొద్దీ లెక్చర్లుదంచే కొందరు గిరీశాలు తమ పిల్లల్ని ఈ డాడీ - మమ్మీ పబ్లిక్ స్కూళ్ళకి పంపడం సిగ్గుచేటైన విషయంగాదా?

వడ్డీవ్యాపారం - సారా బ్రాందీ షాపులు - సినిమాహాళ్ళు - క్లాస్ హోటళ్ళ నిర్వహణ - బొంగుసోట్ల ముద్రణ - కాంట్రాక్టులు - ఏవిధంగా లాభసాటి వ్యాపారమో, ఆ విధంగానే డొనేషన్ కాలేజీలు స్థాపించడమూ వొక బతా వ్యాపారంగా, బంగారు గుడ్లు పెట్టే పసందైన వ్యవహారంగా నేడు తయారైంది. లేబొరేటరి - లైబ్రరి - భవనాలూ - వుండని యీ డొనేషన్ కాలేజీలు పశువుల దొడ్లకన్న హీనమనీ, అత్తెసరు మార్కుల్తో సీట్లు గడించే యిందులోని విద్యార్థులు తమ పాలిట ప్రాణాంతకంగా తయారయ్యారనీ, యీ కాలేజీల్లో పనిజేసే లెక్చరర్లు బాధపడుతోన్నారు. (ఈనాడు - 23-10-79)

డొనేషన్ విధానాన్ని పూర్తిగా రద్దు జేయాలని వొక వేపున విద్యార్థులు తీవ్రమైన ఆందోళన జేస్తోంటే, రద్దు చేస్తామని మంత్రులు శరపరంపరగా ఎన్నికల వాగ్దానాల్లాంటి పత్రికా ప్రకటనల్ని మరోవేపున గుప్పిస్తోంటే, హరిజన - గిరిజన - బలహీన వర్గాల సంక్షేమం కోసం, "అహోరాత్రాలూ కృషి జేయడానికి కంకణం గట్టుకొన్న" విద్యాశాఖ మంత్రియైన శ్రీ టి. హయగ్రీవాచారి, ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో, రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించనున్న ఇంజనీరింగ్ కాలేజీలో, డొనేషన్ విధానాన్ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో వుందని చెప్పడం మరీ విడ్డూరంగా వుంది. (ఈనాడు - 23-10-1979) సాంఘిక - ఆర్థిక - అసమానతలు తొలగించి, "సోషలిజం స్థాపించడానికి శపథం వహించిన" ఆంధ్రలోని ప్రభుత్వం డొనేషన్ల విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టడం, బలహీనవర్గాల ఉద్ధరణ కిందకే వొస్తుందా? యీ విధానం ద్వారా అవినీతి ఆకాశానికంటే ప్రమాదం లేదా? ఇది - అసమర్థతకి పట్టం గట్టినట్లు కాదా? అడ్డమైన పద్ధతుల ద్వారా డాక్టర్ డిగ్రీ కొట్టేసిన లైసెన్సేడు మర్డరర్స్‌ని సృష్టించడానికి, యీ డొనేషన్ల విధానం దోహదం జేయదా? అంచేత, రిజర్వేషన్లద్వారా

అన్హర్హతలేని వారిని ఉద్యోగాల్లోకి రిక్రూట్ చేయడం దేశ ప్రగతికి ఎంత హానికరమో, డొనేషన్ల ద్వారా డాక్టర్లనీ ఇంజనీర్లనీ "ఉత్పత్తి చేయడం" అంతకన్న హానికరం; ప్రమాదకరం.

ధనిక కుటుంబాలవారిచే రిజర్వేషన్ల దుర్వినియోగం

రిజర్వేషన్లు ఎంత దారుణంగా దుర్వినియోగం చేయబడుతోన్నాయో, రిజర్వేషన్ల పేరు చెప్పుకొని తెగబలిసిన కుటుంబాలకే చెందినవారు, కాలేజీల్లో సీట్లు తమకు యిచ్చి తీరాలని కోర్టులకు సైతం ఏ విధంగా ఎక్కుతున్నారో, యీ క్రింది ఉదాహరణలే నిరూపిస్తాయి.

సంపత్ అనే విద్యార్థి తల్లిదండ్రులు, ఉద్యోగరీత్యా గత పదకొండు సంవత్సరాల నుండి అమెరికాలోనే వుంటున్నారు. చెండు చేతుల్తో చాలర్లు సంపాయించి, ఇండియాలో భూములూ మేడలూ సంపాయిస్తోనే వున్నారు. 1971 నుండి 1977 వరకూ, యీ సంపత్ అనే కుర్రాడు అమెరికాలో వుండి, ఇండియానా యూనివర్సిటీలో విద్య నభ్యసించాడు! ప్రి - మెడికల్ కోర్సు పూర్తి జేశాడు. అనంతరం ఈ "అతిపేద" విద్యార్థి, ఇండియాకు తిరిగి వొచ్చి, మద్రాసు మెడికల్ కాలేజీలో సీటు కోసం అప్లికేషన్ పెట్టాడు! కాని సీటు రాలేదు. కాబట్టి కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు జేశాడు! తాను చెనకబడిన కులానికి చెందినవాణ్ణి గాబట్టి, తనకు మెడికల్ సీటు యిచ్చి తీరవలసిందేనని, "ఈ అతిపేదవాడు" వాదించాడు.

అలాగే తమిళనాడుకు చెందిన హంసధ్వానీ నాగరాజన్ అనే అమ్మాయి గూడా చెనకబడిన కులానికి చెందిందే! ఈమె తండ్రి - నాగరాజన్, గత 15 ఏళ్ళుగా అమెరికాలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం జేస్తోన్నాడు! అంచేత, కుమారి హంసధ్వానీ గూడా అమెరికాలోనే చదివి,

మెడికల్ కాలేజీలో సీటు సంపాయించేందుకి ఇండియాకి వేంచేసింది. మెడికల్ కాలేజీలో సీటు లభించనందున మద్రాసు హైకోర్టులో రిట్ వేసింది! తనను వెనకబడ్డ కులానికి చెందిన దాన్నిగా పరిగణించి, మెడికల్ సీటు యిప్పించాలని గట్టిగా వాదించింది! ఇలాంటివే మరో రెండు పిటిషన్లు గూడా 1978 ఆగస్టులో మద్రాసు హైకోర్టులో దాఖలు చేయ బడ్డాయి! ఆర్థికంగా వెనకబడ్డవారిని ఉద్ధరించేందుకు ఉద్దేశించబడిన యీ రిజర్వేషన్లను, కులాల పేరు చెప్పుకొని, ఆర్థికంగా తెగబలిసి, అధికారరీత్యా ఉన్నత పదవుల్లో వున్నవారు, భేషుగ్గా ఉపయో గించుకో గలుగుతున్నారని చెప్పడానికి యింతకన్నా వివరణం ఏం కావాలి ?!

కేరళలో రిజర్వేషన్లు

బ్రిటిష్‌పాలనకి పూర్వమున్న సమాజంలో, అత్యంత దారుణంగా అణిచివేయబడిన షెడ్యూల్డు కులాలు-తెగలకు-చెందినవారు, కేరళలో నేటికీ ఆ విధంగానే వున్నారు. ఎజ్వాలూ, విశ్వకర్మలూ, వెనకబడ్డ క్రిస్టియన్ల లాంటి తక్కువ కులాలకి చెందినవారి పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే వుంది. "బ్రిటిష్‌వారి హయాంలో ప్రభుత్వం కలగజేసిన విద్యా- ఉద్యోగ సౌకర్యాల్ని వీరు వినియోగించుకోగలిగారు. వెనకబడ్డ తరగతులకి రిజర్వేషన్ ద్వారా కేటాయించబడిన సీట్ల ఫలితంగా, వీరు ప్రభుత్వో ద్యోగాల్లో ప్రముఖమైన స్థానాల్ని, విద్యాసంస్థల్లో సీట్లనీ పొందగలిగారు. యీ రిజర్వేషన్లు అమలు జేయకుండా వుండి వుంటే, మధ్యయుగాల్లో వీరు ఏవిధంగా వున్నారో, ఆ విధంగానే వుండేవారు. షెడ్యూల్డుకులాలు - తెగలకి రిజర్వేషన్ సౌకర్యాలు వర్తింపజేసినా, వెనకబడ్డ తరగతులవారు ఎంతగా అభివృద్ధిజెందారో, అంతగా వీరు అభివృద్ధి జెందలేదు" అని ఇ.యం.యస్. నంబూద్రిపాద్ అన్నాడు.

కేరళలో రిజర్వేషన్లు అమలుజేయబడుతోన్న తీరు తెన్నుల్ని గూర్చి వ్యాఖ్యానిస్తో ఆయన యిలా రాశాడు: "ఆధునిక రాజకీయ ఉద్యమంలో బూర్జువావర్గ - శ్రామికవర్గ ధోరణుల అవతరణ, కులాలు - ఉపకులాలు - హిందూ ముస్లిం మతసమూహాలకి చెందిన సమస్యలొక్క-తీవ్రతను తగ్గించలేదు. అంతేగాక యీ కుల - మతాలు నేటికీ ప్రముఖమైన పాత్రను నిర్వహిస్తోనే వున్నాయి."

"The emergence of these two - bourgeois and proletarian trends in the modern political movement has not rendered the question of castes, sub - castes and religious communities irrelevant. On the other hand, they still play a very important role."

కేరళ రాజకీయరంగంలో, కులానికి చెందిన సమస్యలుగూర్చి ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించాడు:

"Nor is it true, as some other claim, that caste is no more a relevant factor at all. A proper analysis of all aspects of the existing situation would show that, while classes and political parties are assuming greater and greater importance in the political life of the state, the existence of caste as a social factor and the problems arising therefrom can not be wished away."

"వెనకబడ్డ తరగతులకి కల్పించవలసిన రిజర్వేషన్ల సమస్యపై కేరళలో నేడు చెలరేగిన భీకరమైన వివాదం, యిందుకు స్పష్టమైన నిదర్శనం. యీ సమస్య గురించి, కుమారపిళ్ళై కమీషన్ ఒక రిపోర్టునూ, నెట్టూర్ దామోదరన్ కమీషన్ మరొక రిపోర్టునూ సమర్పించాయి. వెనకబడ్డ తరగతుల విద్యార్థులకి, విద్యాసంస్థల్లో అడ్మిషన్లూ, సగం జీతాల కన్సెషన్లూ, స్టయిపెండ్లూ, పుస్తకాలూ యిత్యాది ఎడ్యుకేషనల్ కన్సెషన్లు గూర్చి, కుమారపిళ్ళై కమీషన్ రిపోర్టులో చర్చించబడింది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించే విషయంగూర్చి, నెట్టూర్ దామోదరన్ కమీషన్ చర్చించింది."

"ఈ రిజర్వేషన్ల సమస్యపై, కేరళలోని ముందుబడ్డ తరగతులకీ, వెనకబడ్డ తరగతులకీ చెందిన సపోర్టర్లు, శత్రుకూటాలుగా తయారయ్యారు. కులం బేసిస్‌పై ఆధారపడిన రిజర్వేషన్లు అశాస్త్రీయమైనవనీ, ఆధునిక రాజకీయ జీవితంలో కులానికి స్థానమేలేదనీ, ఫార్వర్డ్ కులాలవారు తీవ్రంగా వాదిస్తోన్నారు! ఏ విధమైన మార్పు లేకుండా మొత్తం రిజర్వేషన్ల పధకాన్ని యధాతధంగా వుంచాలని, బ్యాక్‌వర్డ్ కులాల ఛాంపియన్లు డిమాండ్ జేస్తున్నారు! యీ సమస్యపై నేటి కేరళలో భీకరమైన పోరాటం జరుగుతోంది."

"అయితే కేరళలోని పాలక - ప్రతిపక్ష - పార్టీలు, యీ రెండు వాదనల్నీ తిరస్కరించాయి. కుల ప్రాతిపదికపై వున్న రిజర్వేషన్లు, మరికొంత కాలంపాటు కొనసాగించబడాలనీ, ప్రతీ వెనకబడ్డ కులం తన బ్యాక్‌వర్డ్‌నెస్ నించి ఏమేరకు బయటపడింది - అనే - అంశాన్ని ప్రతి పదేళ్ళ కొకసారి పరిశీలించాలనీ, ఏ వెనకబడ్డ కుటుంబాలవారి సాలుసరి ఆదాయం, విధించబడిన సీలింగ్‌ను మించిపోయిందో, అలాంటి వెనకబడ్డ కుటుంబాలవారికి యీ రిజర్వేషన్ సూత్రం వర్తింప జేయగూడదనీ, నెట్టూర్ దామోదరన్ కమిషన్ చేసిన సూచనను, కేరళలోని ప్రతి రాజకీయపార్టీ అంగీకరించింది." (ఇ.యం.యస్. నంబూద్రిపాద్ వ్యాపం - సోషల్ సైంటిస్ట్ - 1977 నవంబరు)

బీహార్‌లో రిజర్వేషన్లు

బీహార్ ప్రభుత్వం 1979 జనవరిలో, రిజర్వేషన్ల విషయంలో రెండు ఎనెక్సర్లు (Annexers) వున్న ఓక సర్క్యులర్‌ను విడుదల జేసింది. బాగా వెనకబడ్డ 93 కులాల్ని మొదటి లిస్టులో పేర్కొన్నది.

ప్రభుత్వోద్యోగాల్లో యీ కులాలవారికి 12 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. అంతగా వెనకబడని 128 కులాన్ని, రెండవ లిస్టులో పేర్కొన్నది. వీరికి 8 శాతం ప్రభుత్వోద్యోగాలు లభిస్తాయి. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనకబడ్డవారి కోసం, ప్రభుత్వం మూడు శాతం ఉద్యోగాలు కేటాయించింది.

రిజర్వేషన్ల విధానాన్ని నిరాకరించేవారు, కులం ప్రాతిపదికపై ఆధారపడిన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోన్నారు. ఆర్థిక పరమైన వెనకబాటుతనం (economic backwardness) వొక్కటే, రిజర్వేషన్ల విధానానికి ప్రాతిపదిక కావాలని వీరు వాదిస్తోన్నారు. ఈ రకమైన వెనకబాటుతనాన్ని నిర్ణయించడానికి, ఆదాయం పన్ను కట్టాల్సిన పరిమితికి బాగా దిగువనవున్న వారిని మాత్రమే పరిగణనలోనికి తీసుకోవాలి. ఇందుకు అయిదువేల రూపాయల సాలుసరి ఆదాయాన్ని, గరిష్ట పరిమితిగా స్వీకరించ వొచ్చునని వీరు సూచిస్తోన్నారు.

కులాల్తో ఎట్టి నిమిత్తం లేకుండా, అన్ని కులాలకి చెందిన స్త్రీలకీ, మూడు శాతం ఉద్యోగాలకి రిజర్వేషన్లు కల్పించడమే, బీహార్ ప్రభుత్వ సర్క్యులర్ లోని విశిష్టమైన అంశం. ఆ విధంగానే ముస్లిమ్యేతర క్రైస్తవులకి చెందిన పరికొన్ని తెగల్నీ, రెండు లిస్టుల్లోనూ ప్రభుత్వం చేర్చడం ప్రత్యేకంగా గమనార్హం. ఈ ప్రకారం ముస్లింలకి చెందిన తెగలు, మొదటి లిస్టులో వొస్తాయి. వీరేగాక చురిహార (గాజుల వ్యాపారులు) భాకరి - బతియారా - మాదరి - రంగ్రేజ్ - దర్జీ - వంటి వారినీ, హరిజన క్రైస్తవుల్నీ ఈ మొదటి లిస్టులో జేర్చారు. చిక్-పామరియా - మిరియాసిన్ - సాయి - వంటి ముస్లిం తెగల్ని, రెండవ లిస్టులో జేర్చారు.

మొదటి లిస్టులోని బాగా వెనకబడ్డ తెగల్ని గమనించినప్పుడు, వారు హరిజనుల కన్న అత్యంత హీనమైన స్థితిలో వున్నారనే వాస్తవం స్పష్టమవుతుంది. 1971లో నియమించబడ్డ కమీషన్ చేసిన సూచనల

ఆధారంగా, ప్రభుత్వం తన కొత్త రిజర్వేషన్ల విధానాన్ని రూపొందించినట్లు పేర్కొన్నది. ఈ రిజర్వేషన్లు శాశ్వతం కావనీ, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా అవసరమైన సవరణలు జేయడం గూడా జరుగుతుందనీ, ప్రభుత్వం చెప్పింది. కాని రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిలో, ఈ ప్రభుత్వ ప్రకటన విశ్వాసాన్ని కలిగించలేక పోయింది. ఎందేతనంటే, షెడ్యూలు కులాలు - తెగలవారికి కల్పించిన రిజర్వేషన్లు, పరిమిత కాలానికి మాత్రమే ఉద్దేశించబడ్డాయని ప్రభుత్వం మొదట్లో చెప్పింది. కాని పరిస్థితిని గమనిస్తే, ఈ రిజర్వేషన్లు శాశ్వతంగా స్థిరపడినట్లేనని వీరికి అనిపిస్తోంది. ఇంత జరిగినా వీటివల్ల ప్రయోజనం పొందినవారు చాలా స్వల్ప సంఖ్యలో మాత్రమే వున్నారు.

బీహార్ ప్రభుత్వ రిజర్వేషన్ విధానం పట్ల, అగ్రవర్ణాల వారికి వున్న భయం - నిజానికి - ఆధార రహితమైంది. కారణమేమంటే రాష్ట్రం లోని నిరుద్యోగుల సంఖ్యతో పోలిస్తే, ప్రభుత్వం కల్పించగల ఉద్యోగాలు అత్యంత స్వల్పమైనవి. అంచేత, ఈ విధానం వల్ల అగ్రకులాల వారికి వాటిల్లే నష్టం గూడా చాలా స్వల్పంగానే వుంటుంది. ప్రభుత్వం ఏడాదికి 2000 ఉద్యోగాల్ని మాత్రమే కల్పించగలదు. వీటిలో యాభయి శాతం - రిజర్వేషన్ల కిందకి పోతాయి. (గతంలో యీ ప్రభుత్వోద్యోగాలు 24 శాతం మాత్రమే వుండేవి.) ఈ యాభయి శాతం లోంచి, ఆర్థికంగా వెనకబడ్డ అగ్రకులాల వారికీ - అన్ని కులాల స్త్రీలకీ - కేటాయించిన ఆరు శాతం తీసివేస్తే- వెనకబడ్డ కులాల వారికి అదనంగా 20 శాతం ఉద్యోగాలు మాత్రమే లభిస్తాయి! అంటే ఏడాదికి 200 ఉద్యోగాలు మాత్రమే వీరికి దొరుకుతాయి!

అగ్రవర్ణాలవారి భీతి

వెనకబడిన కులాల వారికి ప్రభుత్వం కొత్తగా కల్పించిన ఈ రిజర్వేషన్ సౌకర్యాల వల్ల, అగ్రవర్ణాల వారికీ - ప్రత్యేకంగా వెనకబడ్డ కులాల్లో

కొంచెకి - ఆందోళన కలుగుతోంది. ఈ కొత్త విధానం ఫలితంగా, యాదవులూ - కొయిరీలూ - కుర్మీలూ-వంటి తెగబలిసిన శూద్రకులాల పెత్తనం, యితర అగ్రవర్ణాల వారిపై మరింత ప్రబలుతుందేమోనని గూడా వీరు భీతిల్లుతోన్నారు! అత్యంత విచిత్రమైన విషయమేమంటే, ఈ రిజర్వేషన్ల పట్ల పేద హరిజనులు ఏ విధమైన ఆసక్తినీ కనబరచడం లేదు! ఈ విధానం వల్ల హరిజనుల్లో డబ్బూ - పలుకుబడి - వున్నవాళే ఉద్యోగాలు అధికంగా పొందగల్లుతోన్నారుగాని, అవి - న్యాయంగా చెందవలసిన నిరుపేద హరిజనులకి ఏ మాత్రం అందడంలేదని వారు భావిస్తోన్నారు.

కుల కలహాల అగ్నిగుండంగా మారిన బీహార్

బీహార్‌లో గత ప్రభుత్వం నియమించిన వొక ఉప సంఘం, వెనకబడిన కులాలకు ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు జేసింది. బీహార్‌లో వున్న నాటి జనతా ప్రభుత్వం, వెనకబడిన కులాల వారికి 25 శాతం ప్రభుత్వోద్యోగాలను రిజర్వు చేస్తూ వొక ప్రకటన చేసింది. ఈ రాష్ట్రంలో వెనకబడిన కులాలుగా వర్గీకరింపబడిన వాటిలో కొన్ని భూస్వామ్య కులాలు గూడా వున్నాయి. ఈ సమస్యపై బీహారులోని జనతాపార్టీ రెండు ముఠాలుగా చీలి, బ్యాక్‌వర్డ్ క్లాసెస్-ఫార్వర్డ్ లీగ్ - అనే పేరిట, స్కూళ్ళూ కాలేజీల్లో తీవ్రమైన ఘర్షణలు పడ్డారు. తత్ఫలితంగా స్కూళ్ళూ కాలేజీలూ యూనివర్సిటీలూ మూసివేయ బడ్డాయి. గ్రామాల్లో గృహదహనాలూ మనుషుల సజీవ దహనాలూ జరిగాయి.

రిజర్వేషన్లకి వ్యతిరేకంగా బీహార్‌లో జరిగిన ఈ ఆందోళనలో, వాస్తవ కారణాలకన్న స్వార్థ సంకుచిత రాజకీయ ప్రయోజనాలే అధికంగా చోటుచేసుకొన్నాయి. నిరుద్యోగులైన యువకుల్లోవున్న తీవ్ర అసంతృప్తిని

రెచ్చగొట్టిన రాజకీయ నాయకులు, తమ ఉద్యమాన్ని తారస్థాయిలో నిర్వహించారు. వాస్తవానికి ఈ రిజర్వేషన్ సమస్యపై రాష్ట్రం దాదాపు రెండుగా చీలి పోయింది. ఇట్టి పరిస్థితిలో ఉద్యోగావకాశాలు విస్తృతంగా వృద్ధి జెందితేనే తప్ప, ఈ నిరుద్యోగ సమస్యకి పరిష్కారం లభించదు. అంతవరకూ నిరంతర సంక్షోభానికి రాష్ట్రం గురికాక తప్పదు. అల్లకల్లోలమూ - కుల కలహాలూ - తప్పవు.

వెనకబడిన తరగతుల రక్షణ బిల్లు

బీహార్‌ని కుల కలహాల అగ్నిగుండంగా మార్చివేసిన "వెనకబడిన తరగతుల రక్షణ బిల్లు" ఈ క్రింది విషయాన్ని గూర్చి చర్చించింది:

వెనకబడినతనం అనేది కులం ప్రాతిపదికపై నిర్ణయించ బడాలా? కాక ఆర్థికస్థితి ప్రాతిపదికపై నిర్ణయించబడాలా? వెనకబడిన కులాలకి చెందిన కొందరు, ధనిక భూస్వాములుగా - బడావ్యాపారులుగా - కంట్రాక్టర్లుగా - కేంద్రమంత్రులుగా వుంటోన్నారు. కాని అగ్రవర్ణాలకి చెందిన అనేకమంది, పేదరికంలో నానా బాధలూ పడుతోన్నారు. (తమిళనాడు లోని బ్రాహ్మలూ, ఉత్తరప్రదేశ్‌లోని కాయస్థులూ, పంజాబ్ - హర్యానాల లోని వైశ్యులూ, పేరుకు అగ్రవర్ణాలవారైనా ఆర్థికంగా చాలా బాధలు పడుతోన్నారు.)

అయితే ఈ బిల్లులో గ్యారంటీ జేయబడిన రిజర్వేషన్లు, ఎన్నో దక్షిణాది రాష్ట్రాల్లోనూ - ఉత్తర ప్రదేశ్‌లోనూ - ఎన్నడో యివ్వబడ్డాయని, ఈ బిల్లును ప్రవేశ పెట్టిన మాజీ ముఖ్యమంత్రియైన శ్రీ కర్పూరీ ఠాకూర్ వాదించాడు. అగ్రవర్ణాలవారి నెత్తిపై పిడుగులా పడిన ఈ బిల్లు, వారి మానసిక శాంతిని భగ్నం జేసింది. నిన్నటి వరకూ తమ దృష్టిలో హీన కులజుడుగా భావించబడిన వాడు, ఈ బిల్లుద్వారా తమతో సమానుడుగానో - లేదా అధికుడుగానో తయారు కాబోతున్నాడు. ఇదే వారి గగ్గోలుకి

మూలకారణం! ఠాకూర్ ప్రవేశపెట్టిన యీ రిజర్వేషన్ విధానం, కులాల ప్రాతిపదికపై అగ్ర - అధమ - వర్ణాల పునర్ ఏకీకరణకి దారి తీసింది! అంతేగాక అగ్ర - అధమ - కులాల మధ్య పోటీకి సైతం బాట వేసింది. తరతరాలుగా ప్రభుత్వోద్యోగులుగా - తెల్ల చొక్కాల గుమాస్తాలుగా - కొనసాగిన అగ్రవర్ణాలవారి గుత్తాధికారం, ఈ రిజర్వేషన్ల వల్ల బద్దలై పోతుందని అగ్రవర్ణాలు భయపడ్డాయి. యీ విధానాన్ని అమలుజేసిన ఠాకూర్ ప్రభుత్వం, చివరికి యిందువల్లనే పతనమైంది.

తరతరాలుగా పురుగుల్లా బతికిన హరిజన - గిరిజనులూ, వెనక బడిన కులాలవారూ, యీ రిజర్వేషన్లు యివ్వకపోతే ఏ విధంగా ముందుకు పోగలరు? శతాబ్దాలుగా కులపిశాచికి బానిసలుగా వున్న వీరు, అగ్రవర్ణాల వారితో జరిగే పరుగుపందెంలో, ఎంతకాలం వొంటికాలితో పరుగెత్తగలరు? అని యీ బిల్లును సమర్థించినవారు వాదించారు.

రిజర్వేషన్ల ద్వారానే వెనకబడ్డ కులాలవారికి న్యాయం జరుగు తుందని యీ వెనకబడ్డ కులాలవారు వాదిస్తోంటే, రిజర్వేషన్ల పేరిట తమకు శాశ్వతమైన నిరుద్యోగం తప్పదని యిందుకు భిన్నమైనవారు వాదిస్తోన్నారు. బీహారు రాష్ట్రంలో 5,42000 మంది రిజిష్టరైన నిరు ద్యోగుల్లో, 72,000 మంది గ్రాడ్యుయేట్సు లేదా పోస్టు గ్రాడ్యుయేట్సు వున్నారు. వీరిలో 12,000 మంది ఇంజనీరింగ్ డిప్లొమా గలిగినవారు కూడా వున్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 3000 మందిని మాత్రమే రాష్ట్ర సర్వీసుల్లోకి తీసుకోగలదు. అంటే - 25 శాతం మేరకు - 750 ఉద్యోగాల్ని వెనకబడిన కులాలవారికి రిజర్వు చేయాలా వొద్దా అనే సమస్యపై, మొత్తం రాష్ట్రంలోని విద్యార్థులూ, నిరుద్యోగులుగా వున్న చదువుకొన్నవారూ తమలో తాము గుద్దులాడు కొంటోన్నారు. బజార్లలో

వొకరి కుత్తుకలు మరొకరు కోసుకొంటోన్నారు. అధమాధమమైన యీ కుల ఘర్షణలు, విద్యార్థి - యువకుల్ని పరస్పర విరుద్ధమైన రెండు శత్రు శిబిరాలుగా మార్చివేశాయి. దేశంలో తాండవిస్తోన్న భీకర నిరుద్యోగ రాక్షసికి కారణమైన ప్రస్తుత దోపిడీ వ్యవస్థకి వ్యతిరేకంగా ఐక్యపోరాటం చేయవలసిన యువజనులు, కులకక్షల పేరిట శత్రు ముఠాల్లా చీలిపోయారు. యీ చీలిక - దోపిడీ వర్గాలకే లాభదాయకమనే సత్యాన్ని వీరు గుర్తించ నిరాకరిస్తోన్నారు.

ఆకలీ - దరిద్రమూ
అన్ని కులాల పేదలకీ సమానమే

శతాబ్దాలుగా అణగారిన - వెనకబడ్డ కులాలవారి ఉద్ధరణకై, రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధం జేయడం సమర్థనీయమే. కాని యీ రిజర్వేషన్లు కల్పించి యిన్ని దశాబ్దాలైనా, వీటిని మళ్ళీ మళ్ళీ పొడిగిస్తూ పోవడం మాత్రం హాస్యాస్పదం. ఆర్థికంగా వెనకబడి, నిరుద్యోగ రాక్షసికి అనుక్షణం బలిచేయబడుతోన్న మిగతా కులాలవారికి, యీ రిజర్వేషన్లు ఎల్లకాలం కొనసాగుతాయేమోనన్న భీతి నానాటికీ వృద్ధిజెందుతోంది. అంచేత, వెనకబడ్డ కులాలవారుగా ప్రభుత్వం ద్వారా సౌకర్యాలు పొంది, ఆర్థికంగా జీవనప్రమాణం పెంచుకొన్న వ్యక్తుల సంతానానికి, రిజర్వేషన్ల పేరిట ఈ సౌకర్యాలు తిరిగి పొందే అర్హత లేకుండా చేయాలి. వెనకబడిన కులాలకి చెందిన సంపన్న కుటుంబాల వారికి, యీ రిజర్వేషన్లు వర్తించకుండా ప్రభుత్వం తగిన కట్టుదిట్టాలు చేయాలి. అలాగాక, కొందరిని నిరంతరం వెనకబడిన వారుగానే పరిగణించడం, కులాలూ - తెగల పేరిట ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం, కులద్వేషాలకి మూలమై, దేశ ఐక్యతకి అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది. తర తమ

భేదాలతో నిరుద్యోగమూ - ఆకలీ - దారిద్ర్యమూ, అన్ని కులాలపేదల్నీ వేధిస్తోనే వున్నాయి.

"దేశంలో కులవ్యవస్థ వున్నంత కాలం, హరిజనులకు షెడ్యూలు తెగలకు రిజర్వేషన్లు కొనసాగ వలసిందేనని, శ్రీ జగ్జీవన్‌రాం స్పష్టం చేశారు. ఇదే రిజర్వేషన్ విధానం ఎన్నికల్లో నియోజకవర్గాలకు కూడా వర్తింపజేయాలని ఆయన అన్నారు." (ఈనాడు - 25-9-1979) అంచేత, కులవవ్యస్థ వున్నంత వరకూ రిజర్వేషన్లు పోవు. రిజర్వేషన్లు వున్నంత వరకూ కులవ్యవస్థ నాశనం గాదు! కాబట్టి కులవ్యవస్థా రిజర్వేషన్లూ, బొమ్మా - బొరుసూ లాంటివి.

7. మతం మార్పిడి

"త్రమిళనాడులోని తిరునల్వేలి మొదలయిన జిల్లాల్లో హరిజనులు మూకుమ్మడిగా ముస్లిములై పోతున్నారన్న వార్త వెలువడగానే, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి మక్వానా, ఆర్యసమాజ్ వంటి పలు హిందూ సంస్థల ప్రతినిధులు అక్కడికి పరుగెత్తారు."

"రకరకాలుగా వినవస్తున్న యీ వార్తల్లో, నిజానిజాలు తెలుసుకోవాలంటే ముస్లింమతం స్వీకరించిన హరిజనులనూ, తోటి గ్రామస్తులనూ, కలుసుకుని మాట్లాడాలి. వెళ్ళి మాట్లాడితే వెల్లడైన విషయాలు క్లుప్తంగా ఇవి."

ముస్లిములుగా మారిన తమిళనాడు హరిజనులు

"మతాంతరీకరణలు ముమ్మరంగా సాగుతున్నమాట నిజం. ఇటీవలనే రామనాధపురం జిల్లాలో, నూరు హరిజన కుటుంబాలు ఇస్లాం చంద్రవంక పతాకచ్ఛాయకింద చేరాయి. హిందూమత దురన్యాయాల నుంచి బయట పడేందుకే, తాము అన్యమతం స్వీకరించామని వారంతా అంటున్నారు. "ముస్లిములు నన్ను తమతో సమానంగా చూస్తారు. అందువల్ల నేను ముస్లిం నయాను" అన్నాడు సయ్యద్ మహమ్మద్. రామనాధపురం జిల్లా ఆతియూతు గ్రామంలోని ఈ హరిజనుని పేరు, పూర్వాశ్రమంలో 'సేతు'.

గత ఫిబ్రవరిలో తిరునల్వేలిజిల్లాలో కొన్ని కుటుంబాలతో చిన్న ధారగా ప్రారంభమయిన యీ మతాంతరీకరణ, రామనాధపురం, సేలం,

తంజావూరు జిల్లాలలో నదిగా విస్తరించి, ఇప్పుడు తమిళనాడునే ముంచేత్తేటట్లుంది. ఎందువల్లనంటే, కొత్త మతం పుచ్చుకొన్న హరిజనులు, తమల్ని అనుసరించవలసిందిగా తోటి హరిజనులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరునల్వేలిలో సామూహిక మతమార్పిడుల తరువాత, వీటి తాకిడి రామనాధపురం జిల్లాపై పడటంలో ఆశ్చర్యంలేదు. అక్కడ గత ఫిబ్రవరిలో సవర్ణులకూ, హరిజనులకూ మధ్య తీవ్రఘర్షణలు జరిగాయి. పోలీసు కాల్పుల్లో ఇద్దరు మరణించారు. 200 హరిజనులు, 200 సవర్ణులు అరెస్టయ్యారు.

అయితే విచిత్రమేమంటే, ఘర్షణలు జరిగిన గ్రామాల్లో హరిజనులు తమ మతం మార్చుకుంటామని బెదిరించినా, ఇంతవరకూ ఆ పని చేయలేదు. ఘర్షణకు దూరంగా ఉన్న అతియూతు అనే ఒక చిన్నగ్రామ హరిజన కుటుంబాలు ముస్లిం మతం స్వీకరించాయి. మతం మార్పిడి జ్వరం, పక్కగ్రామాలకు వ్యాపించినది దీనితరువాతనే. అతియూతు గ్రామంలో ఒక్కరు కూడా అరెస్టు కాలేదు. కాబట్టి పోలీసు దురాక్రమణలు, మతం మార్పిడికి కారణమని చెప్పజాలం.

ఈ గ్రామంలో 350 కుటుంబాల్లో 250 ముస్లిం కుటుంబాలు; సవర్ణ కుటుంబాలు 35; మిగతా 65 హరిజన కుటుంబాలు. హరిజనులూ సవర్ణులూ ఉభయులూ నిరుపేదలని, వారి పూరిపాకలు చింపిరిబట్టలు చెప్పకచెబుతున్నాయి. కాని ముస్లింలకు బాగా జరుగుబాటు వుందనేందుకు, వారి రంగురంగుల కాంక్రీట్ డాబాలే సాక్ష్యం.

పెనికాటన్ షర్ట్ - కొత్త ముస్లిం టోపీ ధరించిన ఒక యువకుడు (ఇతని ఇప్పటి పేరు నసీర్ అమీర్; పునుపటి పేరు నాగు) మాప్రశ్నలకు ఇలా సమాధానమిచ్చాడు. "హిందూ మతమంటే నాకు అసహ్యం. మమ్మల్ని దేవాలయాల్లోకి రానివ్వరు. కాని ఇస్లాంలో

వున్నది ఒకే దేవుడు - అల్లా. మేము కలవాళ్ళమైనా, లేని వాళ్ళమైనా మసీదులో మమ్మల్ని సమానంగా చూస్తారు. అంతేకాదు. హిందువులు మమ్మల్ని పంక్తిలోకి రానివ్వరు. కాని, ముస్లింలూ నేనూ ఒకే పంక్తిలో తింటాం. వాళ్ళ ఇళ్ళలోకి స్వేచ్ఛగా వెళ్ళవచ్చును." మతం మార్చుకున్నందుకు తమకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదని, తామే చేతినుండి ఖర్చు పెట్టుకున్నామనీ అతనన్నాడు.

మునుపు 'సేతు'గా వుండి, నేడు సయ్యద్ మహమ్మద్‌గా మారిన స్థానిక హరిజన నాయకుడు, మా ప్రశ్నలకు ఇచ్చిన సమాధానం గమనార్హం: "ఘర్షణలు హిందువులకూ హరిజనులకూ మధ్య జరిగినట్లు పత్రికలు ప్రకటించాయి. అయితే మేము హిందువులము కామా? మమ్మల్ని ఎందుకు నీచంగా చూస్తారు? పట్నంలో హిందువులు ఎందుకు మమ్మల్ని కొట్టు నడుపుకోనివ్వరు? కొట్టు పెట్టినా, హిందువులు మావద్ద ఏమీకొనరు. ముస్లింలు అలాకాదు." మరి క్రైస్తవ మతం ఎందుకు పుచ్చుకోలేదని అడగ్గా, అతని సమాధానమిది. "క్రైస్తవుల్లో కూడా కులాల బెడదఉంది. నాడార్ క్రిస్టియన్లనీ, హరిజన క్రిస్టియన్లనీ. హరిజనులకు ప్రభుత్వం యిచ్చే రాయితీలు కేవలం కాగితంపై మాత్రమే ఉన్నాయి. వాటిని రాబట్టుకునేందుకు బోలెడు లంచం పోయవలసి ఉంటుంది. కాబట్టి తమకు వచ్చే నష్టమేమీ లేదని మరో ప్రశ్నకు సమాధానమిచ్చాడు."

(ఈనాడు - 28-7-81)

హిందూ సమాజమే పుణ్యం కట్టుకుంది!

కేంద్రమంత్రి యోగేంద్ర మక్వానా వ్యాఖ్య

"హరిజనులు హిందూమతాన్ని కాదని మరో మతం స్వీకరించారంటే, ఆ "ఘనత" హిందూ సమాజానిదే. అది మీనాక్షిపురం సంఘటన

కానివ్వండి. మరోటి కానివ్వండి." "తమిళనాడులోని మీనాక్షిపురంలో జరిగిన మూకుమ్మడి మతం మార్పిడి సంఘటనలో, విదేశీధనం పనిచేసిందా?"

"ప్రశ్న - ఏ ధనం పని చేసింది అన్నదికాదు. హిందూ సమాజం హరిజనులను ఏ విధంగా చూచింది అన్నదే నిజమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు కూడా నేనే చెబుతాను. మీనాక్షిపురంలో హరిజనులను అగ్రవర్ణాల వారు హింసించారు. కొట్టారు. దుర్భాషలాడారు. వారి ఆస్తులను తగలపెట్టారు."

ఈ జవాబులు చెప్పినవారు, దేశ వ్యవహారాల సహాయమంత్రి యోగేంద్రమక్వానా. పృచ్ఛకులు పత్రికా విలేఖరులు.

"మీనాక్షిపురంలో హరిజనులు ఇస్లాంమతం పుచ్చుకున్న తరువాత, గుండెల మీద చెయ్యివేసుకుని నిశ్చింతగా నిద్ర పోతున్నారు."

"మేము ఇస్లాం మతం పుచ్చుకోక పూర్వం మమ్మల్ని బస్సులలో ప్రయాణం చేయనివ్వలేదు. అధవా బస్సు ఎక్కినా కొట్టి దించేసే వారు. ఇస్లాం మతం స్వీకరించిన తరువాత, మమ్మల్ని "లే" అనడానికి ఎవరికీ ధైర్యం చాలడం లేదు. మమ్మల్ని ఈసడించి చూసి రుసరుస లాడుతూ కూర్చుంటున్నారు. కొంచొకచో మాచే తిట్లు తింటున్నారు" అని మీనాక్షిపురం హరిజనులు ఇస్లాం మతం పుచ్చుకున్న తరువాత తనతో చెప్పారని మంత్రి అన్నారు.

"మా హరిజన కులస్థులు చనిపోతే, శవాలను ధేవర్స్ (అగ్రవర్ణాల వారు) నివసించే వీధులగుండా శ్మశానానికి తీసుకపోనిచ్చే వారుకాదు. మతం మార్చుకున్న తరువాత, మా గూడెంలో ముసలమ్మ చనిపోతే పొరుగూళ్ళ నుంచి ముస్లింలువచ్చి ఆమె శవాన్ని ఊరేగింపుగా మసీదుకు తీసుకవెళ్ళి ఖననం చేశారు. మేము లిన్న కంచాలలోనే వారూ భోజనం చేశారు. ఇది హిందువులు చేసేవారా?" అని వారు ప్రశ్నించారని మక్వానా చెప్పారు.

"మీరు తిరిగి హిందూమతం స్వీకరిస్తారా" అని నేను అడిగాను. దానిపై మళ్ళీ మమ్మల్ని హరిజనులు కమ్మంటారా అనివారు ఎదురు ప్రశ్న వేశారు అని మంత్రి చెప్పారు.

గతంలో మీనాక్షిపురం హరిజనులపై అత్యాచారం జరిగితే, అయ్యో పాపం, అనడం తప్ప ఏమీ జరిగేది కాదని, ఇప్పుడు మాపై చేయి చేసుకుంటే, అది మతకలహంగా మారి విపరీత పరిణామాలకు దారితీస్తుంది అని వారన్నట్లు మంత్రి చెప్పారు. ఈ మతం మార్పిడి మీరు ఆమోదించారా అని విలేకరులు ప్రశ్నించగా "నేను హిందువును. అయితే రాజ్యాంగం మత స్వేచ్ఛను, హక్కును ప్రసాదించింది" అని ఆయన జవాబిచ్చారు." (ఈనాడు - 27-7-81)

"నార్తు ఆర్కాట్ జిల్లా కోనాలానికి చెందిన పదమూడు హరిజన కుటుంబాలు, నిస్సహాయులై యితర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. సవర్ణ హిందువులైన వన్నియ రెడ్డియార్లు, యాభయిమంది హరిజనులు, యిటీవలి వరకు ఒకే పాఠశాలను ఉమ్మడిగా ఉపయోగించు కుంటున్నప్పటికీ, స్మశానాలు మంచినీటి బావులు ఎవరివి వారికే వున్నాయి. గత సెప్టెంబరులో ఏర్పాటైన ఒక కొత్త స్మశానాన్ని ఉపయోగించుకొనే సంచర్భంలో, రెండు వర్గాల మధ్య చిచ్చు పుట్టింది. హరిజనులు ఒక వృద్ధ కళేబరాన్ని పాతి పెట్టడాన్ని సవర్ణ హిందువులు వ్యతిరేకించగా, హరిజనులు తాసిల్దారు సహాయాన్ని, పోలీసుల సహాయాన్ని తీసుకొని పని పూర్తి చేసుకున్నారు. అప్పటి నుంచి రెండువర్గాల మధ్య వైషమ్యాలు ప్రబలాయి."

(ఈనాడు - 1-3-82)

దేశానికి స్వరాజ్యం వొచ్చి 34 ఏళ్ళు గడిచినా, హరిజనులు కనీసం మానవ మాత్రులుగా బతికేందుకి సైతం, ఈ స్వతంత్ర భారతంలో నోచుకోలేదు. స్మశానంలో హరిజనుల శవాల్ని పాతిపెట్టేందుకు గూడా, ఈ అగ్రకులాలవారు నిరాకరిస్తోన్నారంటే, ఈ స్వరాజ్యం ఎవరి కొరకో ఎందుకొరకో అర్థంగాకుండా వుంది.

ఈ బాధల్ని భరించలేక పంచములు ఇస్లాం మతం పుచ్చుకొంటే, దేశంలోని బాబాలూ - హింమూ ధర్మానికి గుత్తదారులైన రకరకాల మతాధిపతులూ, ముతాధిపతులూ, విశ్వహిందూ పరిషత్తువారూ, లబోదిబోమని గుండెలు బాదుకొంటున్నారు. ఈ ఏడ్పులూ - పెడబొబ్బలూ దేనికి ? వేల ఏళ్ళనించి పంచముల గోడు ఎన్నడూ పట్టించుకోని వీరు, ఎందుకీ గోల పెడుతోన్నారు?! ఇస్లాంలో జేరితే, గ్రామాల్లో అగ్రకులాలవారికి పంచములు జేసే ఓడిగం పోతుందని భయమా?! ఇండియన్ యూనియన్‌లో ముస్లింల సంఖ్య అధికమవుతుందని గుండెదడా?! ఇస్లాంలో జేరిన హరిజనుల్ని, గతంలోవలె యిప్పుడు గూడా హింసించి అవమానిస్తే, ముస్లింల అండదండల్తో ఈ అగ్రవర్ణ దురహంకారుల పక్కలిరగదంతారనే అనుమానమా?!

కొమ్ములు పొడుచుకొచ్చిన "పెద్ద కులాల"వారు, గ్రామాల్లో పాటించే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేయడం సాధ్యంగాదా? చాకలి - మంగలి - యిత్యాది "హీన" కులాలవారిని అత్యంత నీచంగా చూసే ధోరణిని అంతం జేయడానికి మార్గాలే లేవా? మాదిగ పుల్లాయ్ - మాల రావాయ్ - సాకలి సూరీ - మంగలి యారీ - గవళ్ళ ఎల్లీ - వీనాది పుల్లీ - వొడ్డిరి నాగీ - ఎరకల పోరీ - అంటూ, ఈ కొమ్ములు మొలిచిన కులాలవారూ వీరి భార్యలూ గ్రామాల్లో వీరిని పిలుస్తుంటారు. అంతటితో ఆగితే బాగుండును. మాల లం ...కొడకా అంటూ "అత్యంత గౌరవమైన భాషలో" ప్రతినిత్యం ఈబిసినకులాలవాళ్ళు వీరిని "సత్కరిస్తుంటారు." దేశంలో సోషలిజం వొచ్చేంత వరకూ, ఈ పరమ దుర్మార్గాలూ, ఈ సాంఘిక అవమానాలూ, వీరిని తిట్టే పచ్చిబూతులూ, నిరాఘాటంగా కొనసాగవలసిందేనా? దీనికి తరుణోపాయమే లేదా?! ఇంటిపనుల్తో పాటు ఒంటిపనులు సైతం వీరిచే చేయించుకొనే యీ అగ్ర

కులాలవారు, హరిజనుల్ని ఎంచేత యింత నీచంగా చూస్తోన్నారు ? ఎన్ని శతాబ్దాలు గతించినా, వందేమాతరం - మనదే రాజ్యం - అని సింహగర్జనలు చేసి ఎన్ని స్వరాజ్యపోరాటాలు గావించినా, ఇండియాలోని యీ అమెరికన్ నీగ్రోల సాంఘిక ప్రతిపత్తిలో ఏమాత్రం మార్పురాలేదు. అంచేత పురుగులకన్న హీనమైన బతుకులు యీడుస్తున్న యీ కోట్లాది పంచముల సమస్యను గూర్చి సీరియస్‌గా ఆలోచించవలసిన అవసరంలేదా?

మనమంతా హిందువులం
ధర్మగంగ సింధువులం

ఈ మధ్య కొందరు సనాతన ధర్మోద్ధారకులు "బృహత్ హిందూ సమ్మేళనం" నిర్వహించి, "హిందూ సింహగర్జన" గావించారు. ఈ సందర్భంగా, తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన హిందూ ధర్మరక్షణ సంస్థవారూ, విశ్వహిందూ పరిషత్‌వారూ జమిలి నేతగా కలిసిపోయి, గోడలపై వాల్‌పోస్టర్లు గూడా అంటించారు.

"మన ధర్మం గంగనీరు
పరధర్మం ఎండమావి
హిందువులంతా ఒకటే సంఘం
హిందూ ధర్మం అందరిదీ
హిందువు లంగా జన్మించాం
హిందువు లుగా జీవిద్దాం"

అనే రకరకాల నినాదాల్ని రంగు రంగుల వాల్ పోస్టర్లలో ప్రింట్ జేసి, గోడలకి అంటించారు.

ఎంతటి అందమైన కవిత్వం ? మరెంతటి సుందర ముదరష్టమైన సత్యం ?

మనమంతా "హిందువుల"మని, యీ హిందూధర్మ గంగసింధువులు అంటున్నారు. యీ సత్యాన్ని మనల్ని నమ్మమని వీరు కోరుకొంటున్నారు!

బాగానే వుంది! ఆది శంకరుడు నెలకొల్పిన శృంగేరి - ద్వారక - పూరి - బదరి - పీఠాలకు అధిపతులుగా, బ్రాహ్మల్ని గాకుండా యీ హిందూ మతోద్ధారకులు హరిజనుల్ని నియమించడానికి సిద్ధంగా వున్నారా?! ఎబ్బే - అక్కడ కొచ్చేప్పటికి బ్రాహ్మణ - బ్రాహ్మణుడే. హరిజనుడు - హరిజనుడే! హిందువులంతా ఒకటేనని బూటకపు నినాదాలిస్తోన్న యీ పెద్దలు, తమ తమ జంధేల్ని పక్కగా తెంచివేసి, అగ్ర - అధమ - కులాల మధ్యనున్న కృత్రిమ భేదాల్ని అంత మొందించడం ద్వారా, "హిందూ సమానత్వాన్ని" నిరూపించడానికి సిద్ధంగా వున్నారా?! అమ్మో - పరమపవిత్రమైన యజ్ఞోపవీతాన్ని (జంధేన్ని) తెంచడమే? హతోస్మి - హతోస్మి - పాపం శమించుగాక! ప్రచారానికి మాత్రం "మనమంతా హిందువులం." అంతే!

ఎవర్ని మోసగించేందుకి
ఈ పోసుకోలు గ్యాసు కబుర్లు

తమిళనాడులోని హరిజనులు ఇస్లాం మతం స్వీకరించినందుకు, దేశంలోని శృంగేరి - కంచి కామకోటి - పూరీ - యిత్యాది మఠాలకి చెందిన పీఠాధిపతులూ, సాధులూ, సంత్‌లూ, దేశంలో ప్రళయం వొచ్చినట్లు గగ్గోలు పెడుతున్నారు.

"అంటరానితనం ధర్మవిరుద్ధం
అనైక్యత జాతికి శాపం
మతం మార్చిడిల నిరోధిద్దాం
మారిన తమ్ముల స్వాగతిద్దాం"

అనే రొల్లుగొల్లు నినాదాల్ని వీరిస్తోన్నారు. అంటరానితనం ధర్మవిరుద్ధమని నినదిస్తోన్న యీ పీఠాధిపతులు, హరిజనవాడల్లో మకాం చేయడానికీ, హరిజన స్త్రీ వండిన భోజనాన్ని తినడానికీ, సిద్ధంగావున్నారా?! "మారిన తమ్ముల స్వాగతిద్దాం" అని జాగృత హిందూ సింహగర్జన

గావిస్తోన్న వీరు, తమ యిళ్ళలోని బావుల్లోంచి, హరిజనులు మంచినీళ్ళు తోడుకోడానికి అనుమతిస్తారా ?!

బంగారు పల్లకీల్లో ఊరేగుతూ వొచ్చే యీ పీఠాధిపతులు, బ్రాహ్మణాగ్రహారాల్లోనూ, హిందూ దేవాలయాల్లోనూ మకాం చేస్తారు కాని, హరిజనవాడల్లో విడిది చేస్తారా ?! అయ్యో - అలా చేస్తే, తమ పరమపవిత్రమైన బ్రాహ్మణత్వం భ్రష్టుపట్టిపోదూ? అంటరాని స్త్రీ వండిన వంటకాల్ని భోంచేస్తే, తమ అగ్రవర్ణం మంటగలిసిపోదూ? తమ బావుల్లోంచి హరిజనులు మంచినీళ్ళు చేదుకొంటే, తామూ తమ నీళ్ళూ మైల పడిపోవూ ? అప్పుడు, గంగాజలంతో శుద్ధిజేసుకొని, నారికలపై బంగారు కట్టలో వాతలు పెట్టించుకో వొచ్చూ ?!

"అంటరానితనం ఒక పాపం, ఒక శాపం
ఆ పాపాన్ని మాపేద్దాం, ఆ శాపాన్ని కడిగేద్దాం"

అనే బూటకపు నినాదాలివ్వడం ఎవరి కళ్ళల్లో పబ్లిగ్గా దుమ్ముగొట్టేందుకి? ఇన్ని శతాబ్దాలుగా శూద్ర - పంచమున్ని పోసుకోలు గ్యాసు కబుర్లతో మోసగించినట్లు, ఇంకా వంచించడం మాత్రం సాధ్యం గాదు!

మత సంస్కృతిని నిషేధించాలి

హిందూ అగ్రవర్ణాలవారు అనుసరించిన అమానుషమైన కులం కట్టుబాట్లను తట్టుకోలేకనే, వేల ఏళ్ళుగా తాము అనుభవించిన అనేకానేక అవమాన పరంపరల్ని భరించలేకనే, కోట్లాది శూద్ర - పంచములు, మహమ్మదీయ నవాబుల పాలనలో ముస్లింలుగానూ, బ్రిటిష్ పాలనలో క్రైస్తవులుగానూ మారిపోయారు. బ్రిటిష్‌వారి హయాంలో అగ్రకులాల వల్ల అష్టకష్టాలు పడిన పంచములు, ఆ బాధల్ని భరించలేకనే క్రైస్తవ మతం స్వీకరించారు. క్రిస్టియన్ మిషనరీలు వీరికి చదువు చెప్పి, కనీస మానవులుగా వీరిని తీర్చిదిద్దేందుకు శక్తికొద్దీ కృషి జేశారు.

అగ్రవర్ణ దురహంకారులు, హరిజనుల్ని పెట్టిన బాధల్ని భరించ లేకనే, నేడు వారు ముస్లింలుగా మారుతున్నారు. అలా గాని పక్షంలో, 1971 జనాభా లెక్కల నాటికి, భారత ఉపఖండంలో 21 కోట్లమంది ముస్లింలు ఎక్కడ నించి అవతరించారు ? ఇండియన్ యూనియన్‌లో 7 కోట్లమంది, బంగ్లాదేశ్‌లో 7.5 కోట్లమంది, పాకిస్థాన్‌లో 6.5 కోట్ల మంది, ముస్లిములున్నారు. ఈ 21 కోట్ల మంది మహమ్మదీయులూ, నేరుగా అరబ్బు దేశాలనించి సరఫరా అయినవారు కాదే ?! తమిళనాడు హరిజనులు తప పతం మార్చుకోవడానికి, అరబ్బు దేశాల నించి వొస్తోన్న డబ్బే కారణమని, యీ హిందూ మతోద్ధారకులు అంటున్నారు. అదే నిజమైతే, యీ డబ్బునే యిచ్చి, బ్రాహ్మలూ - రెడ్లనీ, కమ్మా - కాపుల్నీ, రాజూ - వెలమల్నీ, ముస్లిములుగా ఎందుకు మార్చగూడదు? హిందూ సంఘంలో హరిజనులు పొందే పరమ భయంకరమైన అవమానాలు వీరు పొందడంలేదు గాబట్టి, వీరికి తమ మతం మార్చుకో వాల్సిన అవసరం లేదు.

"మతస్వేచ్ఛ సభ్యతకు ఢోపిరి
మతం మార్పిడి సభ్యతకు ఉరి"

అని వీరు నినాదమిస్తోన్నారు! ఏ వేపున మతస్వేచ్ఛ, సభ్యతకు ఢోపిరి - అని లేతలేత సొరకాయికోతలా ? హరిజనులు తమ మతం మార్చుకొన్నందుకు, గుండెలు పగిలేట్లు కేకలూ - బొబ్బలా ? భారత రాజ్యాంగం ప్రకారం ఏ వ్యక్తికైనా తన మతాన్ని మార్చుకొనే హక్కుంది. ఆ హక్కునే నేడు తమిళనాడు హరిజనులు వినియోగించు కొంటే తప్పేముంది ? ఆత్మగౌరవం కోసం తహతహలాడిన యీ పంచ ములు, నేడు ఇస్లాంలో జేరారు.

ఇండియా నుండి అమెరికాకుపోయి, "హరేరామ - హరేకృష్ణ" అంటూ హిందూమత ప్రచారం జేస్తూ అక్కడున్న అమెరికన్ యువకులకి

గుండు సున్నగా గొరిగి, పంగనామాలూ పిలక పెట్టి, ఆ దిష్టిబొమ్మల్ని ఇండియాలో దింపితే ఫర్వాలేదా ?! అమెరికన్ యువకుల్ని హిందువులుగా మతం మార్పిడి చేస్తే నేరం గాదా ?! ఈ విధమైన మతంమార్పిడి సభ్యతకు ఉరిగాదా ?!

తరతరాల భారతదేశ చరిత్రలో మతంమార్పిడి, అంతర్భాగంగా వుందనే విషయం చారిత్రక సత్యం. ఈ హిందూ పురోహితులు, గతంలో ఎందరు జైన - బౌద్ధుల్ని నానా హింసల పాల్జేయలేదు? ఆదిశంకరుడు జైన - బౌద్ధ - చార్వాకుల - చెవుల్లో సీసం కరిగించి పోయలేదా? ఎన్ని జైన - బౌద్ధ - ఆలయాల్ని, ఈ పెద్ద మనుషులు హిందూ దేవాలయాల్లా దారుణ దౌర్జన్య కాండతో మార్చలేదు? రామానుజాచార్యులు ఎందరు శైవుల్ని దౌర్జన్యంగా వైష్ణవ మతంలోకి మార్చలేదు? ఈ విధంగా మధ్య యుగాల భారత చరిత్రలో జరిగిన యీ మతంమార్పిడి అంతా, విశ్వ హిందూ పరిషత్‌వారికి సమ్మగానే వుందా? మనుషుల మతం మార్చడంతో పాటు, గుళ్ళనీ - గుళ్ళలోని దేవుళ్ళ మతాల్నీ - ఆఖరికి వాళ్ళ మొహాల్ని సైతం యీ హిందూ పురోహితులు మార్చివేశారే? తిరపతి లోని నేటి గుడి, మొట్ట మొదట జైన ఆలయం గాదా? అమరావతి లోని నేటి గుడి, ఆదిలో బౌద్ధ ఆలయం గాదా? అంచేత, వైదిక పురోహితులు చార్వాకాన్నీ, బౌద్ధ - జైన - మతాల్నీ నాశనం చేసినట్లు, పాలక వర్గాల అండదండల్ని ఆసరాగా చేసుకొని, ఒక మతానికి చెందిన వారు, మరో మతానికి చెందినవారిని అత్యంత కిరాతకంగా హింసించి ధ్వంసించిన సంఘటనలూ - సమయాలూ, భారత చరిత్రలో వేలాదిగా మనకి కన్పిస్తాయి. క్రీ. శ. 12వ శతాబ్దంలో ప్రారంభమైన వీరశైవం, జైన మతాన్ని పూర్తిగా తుడిచి పెట్టేందుకు యత్నించింది. వీరశైవానికీ జైన మతానికీ మధ్య జరిగిన మతకలహాలు, దారుణమైన రక్తపాతానికి దారితీసి, మానవరుధిరం ఏరులై పారిందని మధ్యయుగాల నాటి చరిత్ర మనకు

చెబుతోంది. అంధమత విశ్వాసం, అన్యమత ద్వేషం, పరమత నాశనం అనే ప్రాతిపదికలపై వీరశైవం అత్యంత భయంకరమైన అంతఃకల హాల్ని రెచ్చగొట్టి, ఆంధ్ర - కన్నడ దేశాల్ని పీనుగు పెంటల్తో నింపి వేసింది. ఈ పరమత నాశనం, దేవాలయాల ధ్వంసం, పుస్తక దహనం, వొక్క హిందూ పురోహిత వర్గమే కార్యక్రమంగా పెట్టుకోలేదు. భారత దేశంలో పుట్టిన ప్రతిమతమూ, ప్రక్కనున్న మరో మతాన్ని నాశనం జేయ యత్నించింది.

ఈ విధానాన్నే ఇండియాలో 11 వ శతాబ్దం నుండి పరిపాలించిన ముస్లిం సుల్తానులు సైతం అనుసరించారు. మహమ్మద్ ప్రవక్త పేరిట, ఇస్లాం మతం పేరిట, మహమ్మద్ ఘజనీ సల్పిన హత్యాకాండ, భారత చరిత్రలో యింకో చెరిగిపోలేదు. క్రీ. శ. 1026లో (గుజరాత్‌లోని) సోమనాధ దేవాలయంపై జరిగిన దాడిలో, మహమ్మద్ గజనీ, గుడిలోని శివలింగాన్ని ముక్కలు జేసి, వాటిలో కొన్ని ముక్కల్ని తన రాజధాని ఐన గజనీలో మసీదు ముందు పరిపించాడు. ఇంతటి "దారుణం" జరుగు తోన్నా, మూడు కన్నులున్న ఆ పరమశివుడు మాత్రం తన మూడోకన్ను తెరిచి, "మ్లేచ్ఛుడైన" యీ సుల్తాన్‌ను భస్మీపటలం జేయలేదు! ఈ విధంగా నాటి ముస్లిం సుల్తానులు, ఎంచలో హిందువుల్ని ఇస్లాంలోకి మార్చి వేశారు.

అంతా హిందువులైనా ఎందుకీ కొట్లాట?

అంతేగాదు. మధ్యయుగాల్లోని విభిన్న హిందూ మతశాఖల మధ్య రగిలిన మతకలహం, దావాగ్నిలా రగిలి, హిందూ సంఘంలోని ప్రజల్ని, కుక్కలు చింపిన విస్తరిలా చీల్చివేసింది. ఈ శైవ - వైష్ణవ - మత శాఖల మధ్య రగిలిన ద్వేషం వల్ల, వొకరి యింట్లో వొకరు భోంచేయడం గానీ, వొకరితో వొకరు వియ్యమొందడం గానీ, వొకరి నొకరు అంటు కోవడంగానీ, కనీసం చూసుకోవడంగానీ వుండేది గాదు! "మీ శివుడు

ఎద్దునెక్కుతాడంటే," "మీ విష్ణువు గద్దనెక్కుడా?" అని యీ ఉభయ శాఖలకి చెందిన హిందువులు పరస్పరం ఎద్దేవా చేసుకొన్నారు. "మీ శివుడు వల్లకాల్లో తిరుగుతాడంటే," "మీ విష్ణువు అడ్డమైన రంకు ముండల్తో రాసక్రీడ లాడతేదా?" అని యీ హిందువులే వొకరి దేవుడిని మరొకరు నానా బూతులూ తిట్టుకొన్నారు! శివాలయంలో గంట మోగితే వైష్ణవుడు అమాంతం చెవులు మూసుకునేవాడు. అలాగే విష్ణు ఆలయంలో గంట మోగిన తక్షణం, శైవుడు చెవులు మూసుకునే వాడు. "నువ్వు శ్వపచుడవు" (కుక్క మాంసం తిన్నవాడవు) అని వొకడు మరొకణ్ణి తిట్టగా, "నువ్వు పంది మాంసం తిన్నవాడవు" అని రెండోవాడు తిట్టే వాడు. ఈ విధంగా త్వం శుంఠా - అంటే - త్వం శుంఠా అనీ, నువ్వు లుచ్చావంటే - నువ్వు పరపలుచ్చావు - అనీ, యీ రెండు మత శాఖలకి చెందిన హిందువులూ మహా కమ్మగా తిట్టుకొన్నారు. ఈ కమ్మని తిట్లతో, మధ్యయుగాల్లో రాయబడిన శైవ-వైష్ణవ-మత గ్రంథాలన్నీ నిండిపోయాయి!

అంతేగాదు - మరో విచిత్రం గూడా వుంది. రామానుజాచార్యుని అనుయాయులైన రామానుజ మత స్థులకీ, మధ్వాచార్యులు అనుయాయు లైన మాధ్వులకీ, దేవుడు-విష్ణువే. ఈ రెండు మతశాఖలకి చెందినవారూ, పంగనామాలే పెట్టుకొంటారు. తాము పెట్టుకునే పంగనామాల్ని, తమ దేవుడికి గూడా పెట్టేవారు! అయితే యిక్కడ వొహ చిక్కు వుంది! తమ ఉమ్మడి దేవుడైన విష్ణుమూర్తికి, మధ్వులు పంగనామాల్ని గోపీ చందనంతో పెట్టగా, రామానుజ మతస్థులు యిదే దేవునికి పంగనామాలు తిరుమణితో పెట్టేవారు! ఈ విధంగా గోపీ చందనం - తిరుమణి - మధ్యగల భేదం, వీరిద్దరి మధ్య దారుణమైన మతకలహానికి దారితీసింది! ఇది మరింత ముదిరి పాకానబడి, దేవుడికిపెట్టే పంగనామం, దేనితో పెట్టాలనే విషయం తేల్చు కొనేందుకు, వీరిద్దరూ సిగ్గూ లజ్జా విడిచి, బ్రిటిష్ కోర్టులకి సైతమెక్కి వ్యాజ్యాలాడుకొన్నారు!

వైష్ణవుల్లో వడగలై - తెంగలై - అనే రెండు ఉపశాఖలున్నాయి. వడగలై వారి పంగనామానికి అడుగున వుండే బొట్టు - U ఆకారంలో వుంటుంది. తెంగలై వారి పంగనామానికి దిగువన వొక పుక్క విడ్డబడి Y ఆకారంలో వుంటుంది. వీరిద్దరికీ దేవుడు - విష్ణుమూర్తే అయినా, పంగనామాల దగ్గరే పోట్లాట! తమిళనాడుకి చెందిన కంచిలో, దేవరాజస్వామి ఆలయానికి వొక ఏనుగు వుంది. ఈ ఏనుగు పంగనామం U ఆకారంలో పెట్టాలా, కాక Y ఆకారంలో పెట్టాలా అనే అంశంపై వీరిద్దరూ 1827లో కోర్టు కెక్కారు. దాదాపు 150 ఏళ్ళ పాటు ఈ ఉభయులూ రకరకాల కోర్టుల్లో కొట్లాడుకొని, వాద ప్రతివాదాలూ - సాక్ష్యాలూ - బళ్ళ కొద్దీ డాక్యుమెంట్లూ - ఇంజక్షన్లూ - ఇంటరిమ్ స్టేలూ - తీర్పులూ - వాటిపై అప్పీళ్ళూ జరిగి, చివరికి 1980 లో సుప్రీంకోర్టులో ఈ కేసు పరిష్కార మైంది. మరి - అందరూ హిందువులే అయినా, యీ విభిన్న మతశాఖల మధ్య ఎంచేత యీ కొట్లాట వొచ్చినట్లు?!

"హిందువులం మనమంతా
మీ కెందుకు ఇక చింత?"

అని - యీ హిందూమతోద్ధారకులు నేడు నినాదాలిస్తోన్నారు!

"డబ్బు కోసమా చింత?
మార్గదర్శి వున్నది మీచెంత"

అనే ఎడ్వర్టైజ్‌మెంటుకి, పై ఎంగిలి నినాదం ప్రతిబింబమా?!

అంచేత మతం - మానవుని నరరూప రాక్షసునిగా చేస్తుంది. పైవ భావానికి బానిసగా మలుస్తుంది. పురోహితవర్గానికి మానవుని గులాంగా మారుస్తుంది. మనుషుల్ని కుక్కలు చింపిన విస్తరిముక్కల్లా చీల్చివేస్తుంది. కాబట్టి, మన దేశంలో మరిన్ని పాకిస్థాన్‌లూ, సిక్కుల ఖలిస్థాన్‌లూ, క్రిస్టియన్ స్థాన్‌లూ ఏర్పడకుండా వుండాలంటే, మత సంస్కృతిని నిషేధించాలి. అప్పుడే మానవతకి అంతిమ విజయం లభిస్తుంది.

బౌద్ధాన్ని స్వీకరించిన అంబేడ్కర్

జీవితాంతం హిందూమతంతో, ఆ మతంలో అంతర్ భాగమైన వర్ణ వ్యవస్థతో విసిగి వేసారి పోయిన అంబేడ్కర్, జీవిత చరమదశలో బౌద్ధాన్ని స్వీకరించాడు. అంటరానివారుగా, ఊరిబయట మాల - మాదిగ-గూడెల్లో నివసించే నిష్ఠ దరిద్రులకి; సమాజంలోని సమస్త ధనికవర్గాలకూ రాత్రింబవళ్ళూ చాకిరీ జేసి వారికి ఆస్తిని సమకూర్చే అశేష హరిజన శ్రామికులకి, డాక్టర్ అంబేడ్కర్ యిచ్చిన బాధానివారణ సందేశమేమిటి? హిందూమతాన్ని విడిచి బౌద్ధాన్ని స్వీకరించమని ఆయన చెప్పాడు.

అయితే, బౌద్ధ ధర్మం నేటి దళిత ప్రజల్ని ఉద్ధరించగలదా? వాస్తవానికి బుద్ధుని సిద్ధాంతాలు, పాలకవర్గ ప్రయోజనాలకి ఏ విధంగానూ ప్రమాదకరమైనవి గావు. అంచేతనే, అజాతశత్రులాంటి రాజులూ, అనాధ పిండకుని వంటి కోట్లకి పడగలెత్తిన వణిక్ ప్రముఖులూ, ఆయన్ని పిలిచి, కోరినవి యిచ్చి ప్రేమ పూర్వకంగా సత్కరించారు! రాజులూ వ్యాపారస్తులూ యిచ్చిన ఆస్తిని స్వీకరించి, ఆ ఆస్తిపాస్తుల్ని బౌద్ధసంఘం ఉమ్మడిగా అనుభవించాలని ఆయన ఆదేశించాడు. మగధరాజైన బింబిసారుడు తన వినోదం కోసం కూర్చుకొన్న "వేలు" వనాన్ని, బుద్ధుడికి ప్రేమతో దానమిచ్చాడు. అనాధపిండకుడు, బుద్ధుడికి చాలా ప్రీతికరమైన తన "జేత" వనాన్ని యిచ్చివేశాడు. రాజులూ వ్యాపారుల్లాంటి బోపిడీదార్లు సొంత ఆస్తిని మేరుపర్వతాల్లా పోగువేసుకొంటూంటే, బౌద్ధ ఆరామాల్లోని భిక్షువులకి మాత్రమే సొంత ఆస్తి వుండ గూడదని ఆయన నిషేధించాడు. తినే కంచమూ, తింటానికి వాడే గంటె, పడుకొనే పడక గూడా సొంతఆస్తిగా వుండగూడదని ఆయన నిర్దేశించాడు. (వినయ పిటక) సాధారణ ప్రజలు మాత్రం తమ కోరికలు చంపుకోవాలనీ కోరికలే దుఃఖానికి హేతువులనీ ఆయన ప్రబోధించాడు. నాటి పాలక- పురోహిత-వర్గాల మూకుమ్మడి దోపిడీని ఎదుర్కోవానికి, ఆయన ఏ మార్గాల్ని సూచించలేదు.

దోపిడీదార్లు "ప్రేమ"తో యిచ్చిన దానాన్ని స్వీకరించి, వాటితో బౌద్ధసంఘాన్ని - వ్యక్తిగత ఆస్తిలేని ఆవశ్యకూటంగా నడపాలని కలలు గన్నాడు. భ్రమలు పెంచాడు. వర్ణ వ్యవస్థను నిశితంగా విమర్శించిన బుద్ధుడు, ఆ వ్యవస్థను నిర్మూలించమని మాత్రం చెప్పలేదు! అంతేగాదు, బౌద్ధ సంఘంలో దానిసలు జేరడానికి సైతం బుద్ధుడు అంగీకరించలేదు.

బౌద్ధాన్ని స్వీకరించిన డాక్టర్ అంబేడ్కర్, బుద్ధుణ్ణి గూర్చి ఎంత గొప్పగా పొగిడినా, బౌద్ధ ధర్మాన్ని గూర్చి ఎంత గొప్పగా రాసినా, దళిత ప్రజలకి ఆయన ప్రతిపాదించిన నియో (కొత్త) బౌద్ధం, హీనయాన బౌద్ధం కన్న ఏ విధంగానూ-ఎట్టి పరిస్థితుల్లోనూ-కొత్త ఫలితాల్ని యివ్వ లేదు. హరిజనవాడల్ని - నూత్న బౌద్ధ ఆరామాలుగా - రూపొందించాలని అంబేడ్కర్ ఎంత తీవ్రంగా కలలుగన్నా, ఈ "మాల-మాదిగ గూడేలు" సొంత ఆస్తిపై నిల్చిన దోపిడీ వ్యవస్థకి వ్యతిరేకంగా వజ్ర సంకల్పంతో పోరాడనిదే, ఈ దోపిడీ వ్యవస్థను సమూలంగా కూల దోయనిదే, అంబేడ్కర్ మొక్క నియోబౌద్ధులకి గోరంత ప్రయోజనం సైతముండదు. పేదలు - హిందూ మాలలైనా, బౌద్ధ మాలలైనా, క్రైస్తవ మాలలైనా, ముస్లిం మాలలైనా, ఎన్ని మతాలుమారినా, నిజంగా వారికి వొరిగేదేమీలేదు!

అంచేత వారి వారి కులాలు ఏవైనా, పీడిత ప్రజల్లో సాంఘిక చైతన్యం కలిగించాలి. దోపిడీకి - సాంఘిక దురన్యాయానికి వ్యతిరేకంగా ఏకమై, తమ తమ హక్కుల సాధన కోసం, వారు ఐక్య పోరాటాన్ని కొనసాగించాలి. ఇది జరగనినాడు, ఈ అణగారిన కులాలవారంతా ఆర్థికంగా పేదలుగానే, సాంఘికంగా హీనులుగానే మిగిలి పోతారు. వీరి కులాల నాయకులు మాత్రం, పాలకవర్గాల పల్లకీలు మోసే బోయీలుగా - పొలిటికల్ బ్రోకర్లుగా-వ్యవహరించి, కులం పేరిట పేదప్రజల్లో చిలికలూ వైషమ్యాలూ సృష్టించి, తమ పబ్బం మాత్రం గడుపుకోగల్గుతారు! అంచేత, కుల - మత - భేదాల్తో మనిషినీ మనిషినీ వేరుజేయని సమ సమాజ స్థాపన కోసం, సమస్త కులాలకి చెందిన పేదలూ పోరాడాలి.

8. కుల నిర్మూలన

కులతత్వం నరనరానా జీర్ణించుకపోయిన ఈ దేశంలో, అగ్ర వర్ణాలవారు తమ యిళ్ళలో (యిళ్ళలో మాత్రమే సుమా - హోటళ్ళలో కాదు!) "అధమ" వర్ణాల వారితో కలిసి భోజనం చేయడం కష్టమే. అంతేగాదు - అణగారిన కులాలకి చెందినవారు (ప్రత్యేకంగా హరిజనులు) తమలో తాము కలిసి కూర్చుని భోజనం చేయడం మరింత కష్టం. యీ విధంగా సాంఘిక వ్యవస్థకి చెందిన ప్రతీ స్థాయిలో, డౌని మురికివాలవలా అస్పృశ్యత కరుడుగట్టిన మనదేశంలో, కుల నిర్మూలన సాధించేందుకు వీలుగా కొందరు సమిష్టి భోజన కార్యక్రమాన్ని సూచిస్తోన్నారు. ఇట్టి వారిలో గోరాగారు అగ్రగణ్యుడు. తనను ఆహ్వానించినప్పుడు, ఆ గ్రామ హరిజనవాడలోనే తనకు బస ఏర్పాటు చేయాలనీ, అక్కడే సమిష్టి భోజన కార్యక్రమం సైతం నిర్వహించాలనీ ఆయన కోరేవాడు. ఈ కార్యక్రమాన్ని తూచా తప్పకుండా ఆయన జీవితాంతం ఆచరించాడు.

కుల నిర్మూలనకు కులాంతర - మతాంతర వివాహాల్ని గూడా కొందరు సూచిస్తోన్నారు. ఈ రకం పెళ్ళిళ్ళను గోరాగారు తన

కుటుంబంలో స్వయంగా చేయించడమేగాక, వందలాది వివాహాల్ని ఆయన చేశారు. ఈయనేగాక 1940 ప్రాంతాల్లో చాలామంది కమ్యూనిస్టులూ, కమ్యూనిస్టు సానుభూతిపరులూ, యీ విధమైన కులాంతర వివాహాలు చేసుకొన్నారు; చేశారు.

క్రీ.శ. 12 వ శతాబ్దంలో జీవించిన బసవయ్య వొక వర్ణాంతర వివాహం స్వయంగా చేయించాడు. కర్నాటకలో వీరశైవమత స్థాపకుడైన యీతడు, కుల నిర్మూలన కోసం ఎనిమిది వందల ఏళ్ళ క్రితమే యీ మార్గాన్ని అనుసరించాడు. హరిజన యువకునికీ, బ్రాహ్మణ కన్యకీ మధ్య వివాహం చేయించిన బసవయ్య, మధ్యయుగాల భారత చరిత్రలో అత్యంత సాహసోపేతమైన సాంఘిక విరుగుబాటుదారుడు. అయితే యీ పెళ్ళి జరిగిన తర్వాత, కర్నాటకలోని పురోహితవర్గం తోకతొక్కిన తాచులా ఆగ్రహోదగ్రమై అమాంతం నిప్పులు చెరిగింది. యీ వివాహానికి అంగీకరించిన వధూవరుల తల్లిదండ్రుల్ని, నాటి పురోహితులు రాజుగారి పట్టపు ఏనుగ కాళ్ళకింద పచ్చడి పచ్చడిగా తొక్కించేయించారు!

తమిళనాడులో కులాంతర వివాహాలు

వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించడానికి, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తోన్నాయి.ప్రత్యేకంగా తమిళనాడులోని ఎ.డి.యం.కె. ప్రభుత్వం, యీరకమైన వివాహాల్ని బాగా ప్రోత్సహిస్తోంది. ఇది తప్ప కుండా హర్షించదగిన - అభినందించదగిన -,అంశం. యీ వివాహాల్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నోరకాల Incentives ను ప్రవేశపెట్టాయి. యీ విషయంలో మూడో తమిళనాడు ప్రభుత్వం పురి కొత్త ముందడుగు వేసి, వర్ణాంతర వివాహాలు చేసుకొనేవారికి, గణనీయమైన ఆర్థిక సహాయం అందించే పథకానికి నాంది పల్కింది. ఇందుకోసం నాల్గువేల రూపాయల ప్రోత్సాహక బహుమతిని, ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టింది. యీ నగదును అయిదేళ్ళ తర్వాత, దంపతులు తీసుకొనే

విధంగా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేస్తారు. యీ బహుమతితో పాటు పెళ్ళి ఖర్చులకు 300 రూపాయలు గూడా యిస్తారు. వధూవరుల సంవత్సర ఆదాయం ఆరువేల రూపాయల కన్న తక్కువగా వున్న సందర్భంలో మాత్రమే, వాళ్ళకీ పారితోషికాలు లభిస్తాయి.

ఎనిమిది గ్రాముల బరువుతూగే ఒక బంగారు పతకాన్నీ, ప్రశంసా పత్రంతో పాటు యీ ప్రోత్సాహక బహుమతినీ, వాళ్ళకి ప్రభుత్వం యిస్తుంది. బంగారు పతకం యిచ్చే పథకాన్ని, ప్రభుత్వం 1968 లో ప్రవేశ పెట్టింది.

తమిళనాడులో సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబాలకి చెందిన యిద్దరు యువతులు, తమ కుటుంబాలపై తిరగబడి, ఇద్దరు హరిజన యువకుల్ని ధైర్యంగా వివాహం చేసుకున్నారు. 21 ఏళ్ళ వయస్సున్న వసీని, నరసింహన్‌ను పెళ్ళాడింది. 21 సంవత్సరాల ప్రాయంలోవున్న సుందరమ్మాళ్, కృష్ణన్‌ను వివాహమాడింది. పల్లువర్ కొట్టంలో ఈ రెండు పెళ్ళిళ్ళేగాక, మరో 89 జంటలు గూడా కులాంతర వివాహాలు చేసుకొన్నారు. యీ జంటలకి చెందినవారిలో, వరుడుగానీ - వధువుగానీ - హరిజన కులానికి చెందినవాళే. వర్కింగ్ ఉమెన్స్ హోరం ఆధ్వర్యాన జరిగిన యీ వర్ణాంతర వివాహాలకి, తమిళనాడు గవర్నర్‌తో పాటు కేంద్ర - రాష్ట్ర - మంత్రులు సైతం హాజరై, వధూవరుల్ని ఆశీర్వదించారు.

అనుకూల - ప్రతికూల అంశాలు

కులాంతర వివాహాలు విరివిగా జరిగితే, మనదేశంలో అనతికాలంలోనే ఒక కొత్త సమాజం అవతరిస్తుంది - అని కొందరు చెబుతున్నారు. కులాంతర వివాహమనేది వ్యక్తిగత అభిరుచికీ, వ్యక్తిగత జీవితానికీ సంబంధించిన వ్యవహారం అని కొందరు కులాంతర వివాహాలకు అడ్డు

చెప్పడం అవివేకం. అయితే, స్వకులమైనా, కులాంతర వివాహమైనా దాంపత్య జీవితానికి అడ్డురావు - అని, వయోమీడియాగా గోడమీది పిల్లి వాటంగా కొందరు అంటోన్నారు. కుల నిర్మూలన కోసమే కులాంతర వివాహాలు చేసుకోవాలంటే అంగీకరించం - అని మరి కొందరు అంటోన్నారు!

కులాంతర వివాహాల మూలంగా, విభిన్న కులాల మధ్య రక్త సంబంధం ఏర్పడినప్పుడు, రెండు - మూడు - తరాల తర్వాత, తమ కులమేదో ఎవరూ చెప్పలేరనీ, ఆ విధంగా కులనిర్మూలనను సాధించ వొచ్చునని కొందరు అభిప్రాయపడుతోన్నారు.

పరస్పర ఆకర్షణ వల్ల ప్రేమలో పడి, కులాంతర వివాహం చేసుకున్న తర్వాత ఎన్నో సమస్యలు ఎదురౌతాయి. "కులం తక్కువ వాడిని" తాను చేసుకొంటే, తన చెల్లెళ్ళకి పెళ్ళి కావడం చాలా కష్టమనే భావంతో, చాలామంది యువతులు యీ వివాహాలకి దూరంగా వుండోన్నారు. యీ వివాహం చేసుకొన్న వారికి పెద్దలూ ప్రభుత్వం నించి ఎట్టి సహకారమూ అందనందువల్ల, ఎన్నో యిబ్బందులు పడవొలసివొస్తోంది. ఇలా ఏవేపు నించీ సహాయం అందనందువల్లనే, ఈ పెళ్ళిళ్ళు చాలావరకు విఫలమవుతోన్నాయి. పాతసమాజం దృష్టిలో యీ వివాహం చాలా చులకనగా చూడబడుతోంది. పెద్దలు అరేంజ్ చేసిన పెళ్ళి విఫలమైనా, అంతగా పట్టించుకోరు. కులాంతర వివాహం చేసుకొన్న తర్వాత ఏ పొర పొచ్చ మొచ్చినా అది రచ్చకెక్కుతుంది - అని, బ్రాహ్మణ యువతిని పెళ్ళి చేసుకొని బాధలు పడ్డ ఒక హరిజన యువకుడు ఆవేదన వెలిబుచ్చాడు. (ఎస్. రామారావు - ప్రభుత్వోద్యోగి - హైద్రాబాదు - ఈనాడు - 11-12-1978)

"మాది కులాంతర వివాహం. కులాలు పోవాలనే ఆశయంతోనే పెళ్ళి చేసుకున్నాం. మా కిద్దరు పిల్లలు. కులం ఛాయలు లేకుండా వారికి

"నాగతిక" "మనోజ్" అని పేర్లు పెట్టాం. మీ కులమేదంటే - వాళ్ళు "మాకు కులంలేదు-మతంలేదు" అంటారు."

"ఇప్పటికి మేము రెండు వేల కులాంతర వివాహాలు చేయించాము. అయితే అందులో 80 శాతం, కులవ్యవస్థను నిర్మూలించాలనే ఆశయంతో కాక, పరస్పరాకర్షణ వల్లనే పెళ్ళి చేసుకున్నారు. వారిలో సైద్ధాంతిక బలం వుండదు. ఒక వ్యక్తిమీదే దృష్టి కేంద్రీకరించినవారు, తమ వ్యక్తి గత సమస్య తీరాక, కుల నిర్మూలన గురించి పట్టించుకోరు. వారి పిల్లలూ-వారిలో ఎవరిది అగ్రకులమైతే, వారి పిల్లలుగానే చెలామణీ అవుతారు. ఇది హానికరం. వారిలో జీర్ణించిన భావాలు అంతరించవు. పాత వ్యవస్థలో పోతారు - పెళ్ళి తర్వాత! ఈ ఆశయ సాఫల్యాన్ని అంకెలవల్ల అంచనా వెయ్యకూడదు. పెద్ద పన్లన్నీ స్వల్పంగానే మొదలైనాయి. కులాంతరం చేసుకున్నవారి పిల్లలు కులరహితులు. వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. 1974 జులైలో ప్రభుత్వం కులాంతరాలకు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించినప్పుడు, జిల్లాకు సంవత్సరానికి అయిదు లక్షలు కేటాయించారు. మొదటి సంవత్సరం ఒక్కో జిల్లాలో నాలుగు లక్షలు ఖర్చే కాలేదు. మిగిలింది." (శ్రీ నాగేశ్వర్ - జనరల్ సెక్రటరి-కుల నిర్మూలన సంఘం)

"కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ ప్రోత్సాహక బహుమతులను ఇస్తున్నది. అయితే వధూ వరులలో ఒకరు షెడ్యూల్డ్ కులానికి కానీ, వెనకబడిన తరగతికి కానీ చెందినవారై వుండాలి. అయితే ఇతర కులాలవారు కులాంతర వివాహం చేసుకున్నట్లయితే, ఇవేవీ వుండవు.

రాష్ట్ర ప్రభుత్వం 1974 లో కులాంతర వివాహాలు చేసుకొనేవారికి, ప్రోత్సాహక బహుమతులను ప్రకటించింది. నాటి నుంచీ ఈ వివాహాల సంఖ్య ఎక్కువయిందనే చెప్పవచ్చును. 1975లో 57 కులాంతర వివాహాలు జరిగాయి. 1976 లో 273 - 1977 లో 696 - 1978 లో యింతవరకు

434 కులాంతర వివాహాలు జరిగాయి. అంటే గత నాలుగు సంవత్సరాల్లో దాదాపు 1500 కులాంతర వివాహాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. ప్రోత్సాహక బహుమతుల కోసం ఇంతవరకూ 34 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా వున్నాయి."
(శ్రీ మునివెంకటప్ప - డైరెక్టర్ - సోషల్ వెల్ఫేర్ - హైద్రాబాదు - ఈనాడు - 11-12-1978)

ముస్లిం చట్టమైన షరియత్ ప్రకారం, ఏ ముస్లిం యువకుడూ యితర మతాలకు చెందిన యువతిని పెళ్ళాడరాదనీ, ఆ విధంగా జరిగితే అది అక్రమ సంబంధమవుతుందనీ, అలాగే ముస్లిం యువతి గూడా యితర మతస్తుల్ని వివాహమాడగూడదనీ, సున్నీ మతగురువైన మౌలానా హమీరుద్దీన్ ఆఖిల్‌గారు సెలవిచ్చారు. (పై పత్రిక)

వేదకాలానికి మళ్ళడమే శ్రేయస్కరం

బండిని ముందూ, గుర్రాన్ని వెనకా పెట్టడం లాంటిదే కులాంతర వివాహమని, కొందరు విమర్శిస్తోన్నారు. "ప్రస్తుత కులవ్యవస్థను నిర్మూలించామనుకోండి. మరో కులవ్యవస్థ అంకురిస్తుంది. ఇక దీనికి అంతేది? ఈపరిస్థితుల్లో వేదకాలానికి మళ్ళడమే శ్రేయస్కరమనిపిస్తుంది."
(డాక్టర్ బోయి భీమన్న - హైదరాబాద్ - ఈనాడు - 11-12-1978)

"ప్రతి హిందువూ ధర్మశాస్త్రాలను కాపాడాలి. అవి చెప్పినట్టు నడుచుకోవాలి..... సంఘం క్రమబద్ధంగా పురోగమించాలన్న ఉద్దేశంతోనే, కొన్ని నియమ నిబంధనలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ చట్టాన్ని ఉల్లంఘిస్తే శిక్ష పడుతుంది. ధర్మశాస్త్రాల మాట కాదంటే, ఎవరు శిక్షిస్తారు ? ఎవరూ లేరు! అందుకే దైవభయం ప్రజల్లో పాదుకొల్పారు. అడపా దడపా కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. అందుచేత వాటికి

పవిత్రతని ఆపాదించడమంటే ఎలా? శాస్త్రాలు చెప్పినట్లు నడుచుకోవడమే మన కర్తవ్యం." (కె. వి. సంతాన గోపాలాచార్ - వేదాంతి - ఈనాడు - 11-12-1978)

"ఒక జాతి స్త్రీకి మరొక జాతి పురుషునికి, ఒక వర్ణపు స్త్రీకి మరొక వర్ణపు పురుషునికి కలిగిన సంతాన మేమవుతున్నది? మిశ్ర లక్షణ సమన్విత మవుతున్నది. ఉభయ వ్యక్తులకు కాక పోతున్నాడు వాడు. కాకుండా విప్లవకారి అవుతున్నాడు. స్థితికి భంగము కలిగిస్తున్నాడు. తల్లిదండ్రుల కెదురు తిరుగుతున్నాడు. జాతి సంప్రదాయములను నాశనము జేయటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇటువంటి విపరీత లక్షణాలు కలవాళ్ళు పుడితే, జగత్ క్షేమానికి భంగమని, పూర్వులు వర్ణాంతర - మతాంతర - వివాహాలు కూడవన్నారు."

"వర్ణాంతర వివాహాలు దేశాన్ని బాగుచేస్తవి అనుకునే వాళ్ళు, కత్తులతో నరికి తమ మతాల్లోకి ఇతర మతాలవాళ్ళని చేర్చుకొనే వాళ్ళ కన్న ఏమి మహాకార్యం చేస్తున్నారు? వాళ్ళది క్రూరత్వం. వీళ్ళది మోసం. వాళ్ళది దౌర్జన్యం. వీళ్ళది అహంకారం." (విశ్వనాధ సత్యనారాయణ - "ఆరు నదులు" నవల.)

ఈ హిందూ-ముస్లిం - ఘాందసుల ధోరణి, ఈ విధంగా వుండడం ఏ మాత్రం ఆశ్చర్యకరం గాదు. అణుయుగంలో జీవిస్తోన్న మనకు, మాంధాత కాలం నాటి ఆచారాలూ, మహమ్మద్ ప్రవక్త నాటి ధర్మ శాస్త్రాలూ సుతరామూ పనికి రావు. ఒక కులంలోగానీ, లేదా ఒక మతంలో గానీ జన్మించడమనేది, కేవలమొక యాదృచ్ఛిక సంఘటన మాత్రమే. అలాగే అగ్ర - అధమ - కులంలో జన్మించడమూ ఒక యాదృచ్ఛిక సంఘటన మాత్రమే. ఈ నగ్నసత్యాన్ని గుర్తించని పాత రాతియుగం నాటి సనాతనులు, కుల - మతాల గొప్పతనం గూర్చి విర్ర వీగడం, బుద్ధితక్కువతనం తప్ప వేరుకాదు.

కులాంతర వివాహం చేసుకొన్నవారి పిల్లల యొక్క కుల మేమిటి? హిందూ సంఘంలోని అగ్రవర్ణ దురహంకారులు ఈ పిల్లల్ని "కుల హీనులు" గా పరిగణిస్తారు. తల్లిదండ్రుల్లో ఎవరిది - అగ్రకులమైతే - ఆ కులాన్నే మళ్ళీ ఆ పిల్లలకి నేడు తగిలిస్తోన్నారు.

ఇద్దరు యువతీ యువకులు కులాంతర వివాహానికి సిద్ధపడినా, తమకు పుట్టే పిల్లల్ని భవిష్యత్తులో ఎవరు పెళ్ళి చేసుకుంటారు - అనే భీతి వీరిలో తీవ్రంగా కన్పిస్తోంది. కులంకుష్టుతో నరనరానా కుళ్ళిన ఈ సంఘంలో, తమ పిల్లల్ని సంకర సంతానంగా పరిగణిస్తారేమో ననే అనుమానమూ, వారి భవిష్యత్తు చీకటిలా మారుతుందేమోననే భయమూ వీరిలో కొందరికి వుంది. అంతేగాదు. నిత్యజీవితానికి చెందిన ఆచార వ్యవహారాలూ - ఆహార అలవాట్లూ యిత్యాది విషయాల గూర్చి వధూవరులకు మనస్పర్థలు రావటానికి అవకాశమున్న దృష్ట్యా, కొందరు ఈ రకం పెళ్ళిళ్ళకి అంగీకరించడం లేదు. ఉదాహరణకి హరిజన యువకుణ్ణి పెళ్ళాడిన బ్రాహ్మణ యువతి, తనచేత్తో మాంసం వండలేదు. తాను తిన లేదు. అలాగే క్రిస్టియన్ని మతాంతర వివాహం చేసుకొన్న ముస్లిం యువతి, పంది మాంసాన్ని తినలేదు. వండలేదు! అయితే యిలాంటి అలవాట్లను పరస్పర అవగాహనతో సర్దుబాటు చేసుకోవచ్చు. వాస్తవానికి. కుల మతాల పుట్టు పూర్వోత్తరాల్ని గూర్చి శాస్త్రీయమైన అవగాహన లేకుండా, ప్రేమలో పడి, పెళ్ళి జేసుకొన్న ఫలితంగా వొచ్చే అరిష్టాలే - ఈ గందరగోళాని కంతటికీ మూలకారణం. అంచేతనే, ప్రొఫెసర్ ధర్మలింగం ఈ విధంగా అన్నాడు:

"కుల మతాల్లో నిమిత్తం లేకుండా, అప్పుడప్పుడు "ప్రేమ" వివాహాలు జరుగుతుండడం మనం చూస్తోన్నాం. కాని అవి కుల నిర్మూలనకు వొక సాధనంగా తోడ్పడం లేదు. అందుకు కారణం - అట్టి వివాహాల్లో, కుల నిర్మూలన ప్రధాన లక్ష్యంగాదు. అంచేతనే, వాటి వల్ల

ఆశించినంత ఫలితం రావడం లేదు." (ప్రొఫెసర్ ఎ. ఎం. ధర్మలింగం- 26-7-1978 - గోరా వర్ధంతి సభ - విజయవాడ)

హిందూ ధర్మశాస్త్రాల

బానిసత్వం నించి బయటపడాలి

వర్ణాంతర వివాహాలు గూర్చి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం జేస్తోన్నా, అలాంటి పెళ్ళిళ్ళు చేసుకొన్న వారికి నగదు బహూమతులూ - బంగారు పతకాలూ యిస్తోన్నా, వాస్తవానికి యీ వివాహాలు అతి స్వల్పంగానే జరుగుతోన్నాయి. ధనహీనంలో ప్రభుత్వమిచ్చే పారితోషికాలని ఆశించి, బ్రాహ్మణ యువతిని ప్రేమించి పెళ్ళిచేసుకోవాలని వాంఛించి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించబడ్తాయని భ్రమించి, వర్ణాంతర వివాహాలు చేసుకొనేవారు - వట్టి దురాశాపరులు. కులవ్యవస్థ మానవ కల్పితమనీ, అది - కొంచెం స్వార్థపరుల సృష్టియనీ హేతు బద్ధంగా విశ్వసించి, ఈ కుష్ఠు వ్యవస్థను నాశనం జేయాలనే వజ్ర సంకల్పంతో, భారత సాంస్కృతిక విప్లవానికి చెందిన ప్రాథమిక కర్తవ్యాన్ని నిర్వర్తించాలనే దృఢనీక్షతో నేటి యువతీ యువకులు ముందు కొచ్చిన నాడే, వర్ణాంతర వివాహాలు విరివిగా జరుగుతాయి. అలాంటి వివాహాల ద్వారానే, కుల నిర్మూలన నిజంగా జరగడానికి అవకాశ ముంటుంది.

"సహపంక్తి భోజనాల కోసం ప్రచారం జేయడమూ, వాటిని నిర్వహించడమూ, అత్యంత కృత్రిమమైన పద్ధతుల ద్వారా బలవంతపు భోజనాలు (Forced feeding) పెట్టడం లాంటిది! హిందూధర్మశాస్త్రాల భయంకర బానిసత్వం నుండి, ప్రతి స్త్రీ - పురుషుడూ బయట పడేందుకు ప్రయత్నించండి. ఈ ధర్మశాస్త్రాల వల్ల వారిలో పేరుకపోయిన ప్రమాద కర భావాల నుండి, వారి మనస్సుల్ని శుభ్రపర్చండి. అప్పుడు మీరు చెప్ప

కుంటానే, వారికి వారే, కులాంతర వివాహాలకీ - సహపంక్తి భోజనాలకీ, సంసిద్ధ మవుతారు" అని అంబేడ్కర్ చెప్పాడు.

శాస్త్రీయ విద్యావిధానం ఆవశ్యకత

విద్యార్థినీ విద్యార్థులు తమ జీవితకాలంలో ఎంతో విలువైన సమయాన్ని స్కూళ్ళు - కాలేజీలూ - యూనివర్సిటీల్లో గడుపుతారు. వీరి భవిష్యత్ జీవిత స్వరూపానికీ, వీరి ఆలోచనా ధోరణికీ, విద్యా విధానం స్పష్టమైన రూపురేఖలు దిద్దుతుంది. అంచేత, సామాజిక పరివర్తనను సాధించడంలో విద్య అత్యంత ప్రధానమైన పాత్ర నిర్వహిస్తుంది. అయితే ప్రస్తుత విద్యా విధానం మాంధాత కాలంనాటి భావాల్ని, విద్యార్థుల్లో పనిగట్టుక నూరిపోస్తోంది. తిరపతిలోని గుండు గొరుగుడు స్వామి గూర్చి, కుల - మతాలకి చెందిన పచ్చి దగుల్బాజీ విషయాల గూర్చి, పాఠ్య పుస్తకాల ద్వారా విద్యార్థుల నరనరాల్లో విషం చొక్కించడానికి శతథా ప్రయత్నిస్తోంది. యాటమిక్ యుగం దిక్కుగా నేటి ప్రపంచం పురోగమిస్తోంటే, మన విద్యా విధానం ఆటవిక యుగం వేపుగా పురోగమిస్తోంది. ఇది అమాయకంగా జరుగుతున్న వ్యవహారం మాత్రం కాదు. ఇది ఉద్దేశ పూర్వకంగా పన్నిన కుట్ర. సమాజంలో మాత్స్య వివేకం సృష్టించడానికీ, కుల - మతతత్వం లేకుండా మనిషి మనిషిగా జీవించడానికీ, మూఢనమ్మకాల్నీ అంధమత విశ్వాసాల్నీ అంతంచేసి, శాస్త్రీయ సత్యాలవైపు పురోగమించేందుకు అనువుగా ప్రస్తుత విద్యా విధానం లేదు. కనీసం సెక్యులర్ భావాల్ని ప్రచారం చేసేందుకు సైతం నేటి విద్యావిధానం దోహదం చేయడం లేదు. ప్రస్తుత విద్యా విధానంలో ప్రధానమైన మార్పులు వొచ్చినప్పుడే కుల నిర్మూలనకి వీలు కలుగుతుంది.

కుల - మతతత్వాన్ని సమూలంగా నిర్మూలించాల్సిన మన విద్యా విధాన నిర్మాతలు, కాలసర్పం లాంటి విద్యావిధానానికి ఉద్దేశపూర్వకంగా

రూపకల్పన జేస్తోన్నారు. పిల్లలు వొకటో తరగతిలో జేరగానే, వారికి కుల - మత - తత్వం నూరిపోయబడుతోంది. బడిపిల్లల ఏ పాఠ్య పుస్తకం తెరిచినా, కుల - మత ప్రసక్తిలేని పాఠం కన్పించదు. అంత దాకా చెందుకు ? స్కూలు అప్లికేషన్ ఫారంలోనే, విద్యార్థి కులమూ మతమూ రాయాలికదా ?! ఇందువల్ల, లోకమంటే ఏమిటో తెలిసే నాటికే పసిపిల్లలకి కుల - మతాలు, విరగడగాని శనిలా చుట్టుకొంటున్నాయి. బడిపిల్లలు సాంఘికంగా ఎదగడం ప్రారంభం కాగానే, ఈ కుల-మతాల్ని తరతరాలుగా ఆశ్రయించుకొని బతుకుతోన్న పూర్వజన్మ - పునర్జన్మలూ, పుణ్యాపాపాలూ, స్వర్గనరకాలూ, హెచ్చు - తగ్గు - కులాల్లాంటి ఎన్నో విషప్పురుగులు వారిని బడిలోనే కాటేస్తోన్నాయి. యీ విషప్పురుగులు నేడు తిరపతి సంస్కృతిని ఆధారం జేసుక దినదినాభివృద్ధి జెందు తోన్నాయి. ఇట్టి పరిస్థితిలో, బడిపిల్లలు కుల - మతాలకి అతీతంగా యెలా పెరగగలరు ?

స్త్రీల పాత్ర

అంచేత, వేల సంవత్సరాలుగా యీ కుల - మతాలవల్ల మన దేశానికి సంభవించిన ఘోరమైన ఉపద్రవాన్ని గూర్చి విరివిగా ప్రచారం జరగాలి. తల్లిదండ్రులు - ప్రత్యేకంగా తల్లులు - మారాలి. వారు మారినప్పుడే పిల్లల్ని గూడా మార్చడానికి వీలుంది. కుల - మతాల విష ప్రభావానికి లోనుగాకుండా, తల్లులు తమ బిడ్డల్ని పెంచాలి. సమాజంలో సగభాగమైన స్త్రీల అండదండలు లేనిదే, ఏ సాంఘిక మార్పూ జరగదు. అది అసంభవం - అసాధ్యం. అంతేగాము. మన ప్రాథమిక విద్యాలయాల్లో మన పిల్లల పాఠ్యపుస్తకాల్లో, ఎక్కడా కుల - మత - ప్రసక్తి రాకుండా శ్రద్ధవహించాలి. మనది మతాతీత - సెక్యులర్ స్టేట్ - అనే విషయాన్ని మాటల్లోగాక చేతల్లో రుజువు చేయాలి.

కుల నిర్మూలన ఆషామాషీ వ్యవహారం గాదు. సమాజంలో సగభాగమైన స్త్రీలలో, బిడ్డల్ని తీర్చి దిద్దే స్త్రీలలో, మార్పురానంత

వరకూ, పురుషుల్లో వొచ్చిన సాంఘికమైన మార్పు స్థిరంగా నిలవడం అసాధ్యం. అంచేత, కుటుంబం మారాలంటే, స్త్రీలు మనస్ఫూర్తిగా ముందడుగు వేసినప్పుడే యీ విధమైన సామాజిక మార్పుకు అవకాశ ముంటుంది. అంతదాకా హళ్ళికి హళ్ళ - సున్నకి సున్నా!

పేర్ల చివర కులంతోకలు

కుల నిర్మూలనకి చెందిన మరికొన్ని మార్గాల్ని, కొందరు యీ విధంగా సూచిస్తోన్నారు:

ప్రతివాడూ తన కులాన్ని గూర్చి యితర్లకి చెప్పడం మానివేస్తే, యితరుల కులాన్నిగూర్చి మిగతావారు ఎంక్వయరీ చేయడం మానివేస్తే, అప్లికేషన్లలో కులాలకి చెందిన వివరాలు ఫిలప్ చేయడం మానివేస్తే, అంటే - నిత్య జీవితానికి చెందిన సమస్త రంగాల్లో కులాన్ని గూర్చి పట్టించుకోవడం పూర్తిగా మానివేస్తే, అప్పుడు యీ వ్యవస్థ కొంతవరకు దెబ్బతినడానికి వీలుందని వీరు సూచిస్తోన్నారు.

అలాగే కులాల చివరవుండే చౌదరి - రెడ్డి - నాయుడు - శాస్త్రి - శర్మ - పంతులు - సోమయాజులు - యాదవ - పండిట్ - ఠాకూర్ - సిన్హా - సింగ్ - అయ్యర్ - అయ్యంగార్ - ఆచారి - పిళ్ళై - మొదలియార్ - నాడార్ - నాయకర్ - యిత్యాది తోకల్ని పీకివేస్తే, కులం దెబ్బతినడానికి అవకాశముందని మరికొందరు సూచిస్తోన్నారు. రెడ్డి కులానికి చెందిన శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు, పేరు చివర వుండే "రెడ్డి"ని ఎన్నో ఏళ్ళ క్రితమే తీసివేసి, "అయ్య" అని వొచ్చేట్లు తన పేరు పెట్టుకొన్నారు. అలాగే సుప్రసిద్ధ తమిళ మహాకవియైన సుబ్రమణ్యం, కులానికి బ్రాహ్మడు. అయితే ఆయన స్వయంగా తన కులాన్ని వొదులుకుని, జంధెం తెంచివేసి, "భారతి" (Indian) అనే పేరును మాత్రమే పెట్టుకొన్నాడు. ఆ విధంగా ఎవరికివారు తమ కులాన్ని

వొదులుకుంటే, యీ కుల వ్యవస్థకి కాలదోషం పట్టవొచ్చునని వీరు సూచిస్తోన్నారు. యీ విధంగా జరిగినప్పుడు, దేశంలో బ్రాహ్మలూ - హరిజనులూ; అష్రాఫ్‌లూ - కమీన్లూ; రాజపుత్రులూ - అహీర్లూ; అనేవారు వుండడానికి ఆస్కారముండదని వీరు అభిప్రాయపడుతోన్నారు.

ఇండియాలోని అగ్రవర్ణాలవారు కులచిహ్నాలుగా (Caste marks) వున్న తమ జందేల్ని తెంచివేయాలనీ, పిలకల్ని పెంచరాదనీ జయప్రకాష్ నారాయణ్ చెప్పినప్పుడు, ఈయన రెండవ ఔరంగజేబ్‌లాంటి వాడనీ, శిఖ - సూత్రములపై (పిలక - జంధెం) భయంకరమైన యుద్ధం ప్రకటించాడనీ, అగ్రవర్ణాలకి చెందిన కొందరు "పెద్ద మనుషులు" గగ్గోలు పెట్టారు! అలాగే వ్యక్తుల పేర్ల చివరవుండే కులంతోకలు తీసివేయాలని, శ్రీ జగ్జీవన్‌రాం సూచించినప్పుడు, దేశంలో వర్ణసంకరాన్ని సృష్టించేందుకి ఈయన బ్రహ్మాండమైన కుట్రపన్నాడని, మరికొందరు గోముఖవ్యాఘ్రాలు భూమ్యాకాశాలు బద్దలయ్యేట్లు నానాగోల జేశారు!

పెట్టుబడిదారీ ఉత్పత్తి : కులవృత్తులు

ఇండియాపై బ్రిటిష్‌వారి విజయం, యంత్రాల్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని ప్రవేశపెట్టేందుకి దోహదం జేసింది. పాత ఉత్పత్తి విధానాన్ని, ఉత్పత్తి సంబంధాల్ని, బ్రిటిషువారు నాశనం జేశారు. కాని నూత్న ఉత్పత్తి శక్తుల్ని మన నేలపై నాటడంలో వారు విఫలమయ్యారు. వాటిని తమదేశంలోనే వుంచుకొని, వారి సరుకుల్ని మాత్రం యిక్కడికి ఎగుమతి జేశారు. తద్వారా మన ఆర్థిక వ్యవస్థనీ, మన సాంఘిక జీవితాన్ని మన మనుగడనీ నాశనం జేసి, మన శ్రమ ఫలితాలపై వారు బాగుపడ్డారు. మన ఉత్పత్తిశక్తులు ధ్వంసం జేయబడడం వల్ల, లక్షలాది ప్రజలు కరువు కాటకాలకి గురియై, దుర్మరణం పాలయ్యారు. బ్రిటిష్ మరమగ్గాలూ, జెన్నీ రాట్నాలూ ఉత్పత్తి జేసిన సరుకుల్ని అమ్ముకోడానికి అనువుగా, మన నేతపనివారి వేళ్ళను నరికి వేయడం, భారత

ప్రజల అధఃపతన గాధనూ, ఇండియాలో పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుకనూ తెలియ జేస్తుంది.

సూత్ర ఉత్పత్తి సంబంధాలకు మూలమైన ఈ కొత్త యంత్రం, కుల వ్యవస్థలోని సాంకేతిక ప్రాతిపదికను మాత్రం కొలగించింది. కాని, మృతప్రాయమై దుర్గంధ పూరితమైన నిషేధాలతో, కుల బహిష్కరణలతో అస్పృశ్యతతో కుతకుతలాడేట్లు, ఈ కుల వ్యవస్థను మిగిల్చి వేసింది. తత్ఫలితంగా పాత ప్యూడల్ ఆర్థిక పునాది ఊగిసలాడి పోతోంటే, పాత భావాలు మాత్రం మిగిలిపోయాయి.

కొత్త ఉత్పత్తి శక్తులూ, కొత్త యంత్రమూ, కుల సంబంధాల్ని కూలదోసే విప్లవాత్మకమైన శక్తులని కొందరు అభిప్రాయపడుతోన్నారు. యంత్ర సహాయంతో, ఫ్యాక్టరీలో శ్రామికుడు ఎంతోమంది తోటిపని వారితో కలిసి పనిచేస్తాడు. ఫ్యాక్టరీలో ప్రతి కార్మికుడూ, వస్తువుకి చెందిన కొంత భాగం మాత్రమే తయారు జేస్తాడు. కాని పూర్వం యిలా కాదు; వొక చీరగానీ లేదా పంచెగానీ, వొకే సారె తయారు జేసేవాడు. అదే మగ్గంపై - అదే కులవృత్తిపై ఆధారపడి, తరతరాలుగా ఆతడూ ఆతని కుటుంబ సభ్యులూ ఈ పనినే జేసేవారు. ఈ విధంగా భారత ప్రజల పురోగతిని, ఈ కులవ్యవస్థ అడ్డగించింది. ఈ అంశంపై వ్యాఖ్యానిస్తో, నంబూద్రిపాద్ యిలా అన్నాడు :

"The institution of caste created conditions for social stagnation. The uninterrupted repetition of social economic and cultural life as embodied in the nature of caste organisation led to an absence of vigour and continuous change, so that, when Europe began to undergo its transition from feudalism to capitalism, India

with its caste hierarchy was unable to catch up with it."
(E. M. S. Namboodiripad - Castes classes and parties in Modern Political Development - Social Scientist - 1977 November)

యాంత్రికీకరణ : కుల నిర్మూలన

"యంత్రాలు వృద్ధిజెందే కొద్దీ, కుల వ్యవస్థకీ, దాని ముద్దుబిడ్డలైన అస్పృశ్యతకీ, కాళ్ళ కింది నేల తొలుచుకపోతూనే వుంది. భారతభూమిపై లేచే ప్రతి చొక్కా ఫ్యాక్టరీ, కులవ్యవస్థకి సమాధి కడుతుంది. నూతన మానవుణ్ణీ, ఆధునిక శ్రామికుణ్ణీ, యీ కర్మాగారం సృష్టిస్తుంది. యీ శ్రామికుడు కోటీశ్వరులచే - నూత్న పాలకవర్గాలచే - అనునిత్యం దోపిడీ చేయబడుతోన్నా, ఈ దోపిడీవర్గాల్ని కూలదోసి, దోపిడీ - దారిద్ర్యం లేని - మానవత్వం సమానత్వం ప్రజాస్వామ్యాన్ని వికసింపజేసే నూత్న సమాజాన్ని సమకూర్చే సాధనాల్ని, ఈ ఆధునిక శ్రామికుడు నేడు ఫ్యాక్టరీలో నడుపుతోన్నాడు." (డాంగే - చరిత్ర చోదకశక్తులు - పేజి 33)

"కులం లేని మనిషి ఆవిర్భావాన్ని వివరించాలంటే, బాటా వంటి చెప్పుల ఫ్యాక్టరీని చూడవచ్చు. బాటా ఫ్యాక్టరీలో వేలాది కార్మికులు పని జేసి, రోజూ వేలాది చెప్పులు ఉత్పత్తి జేస్తున్నారు. నీళ్ళతరబడీ వారూ, బహుశా వారి పిల్లలూ యిక్కడ పనిజేసినా, ఈ చెప్పులు తయారు జేస్తున్నవారిని చర్మకారులని ఎవ్వరూ పిలవరు; చర్మకార కులస్థులుగా వారిని చూడరు. ఎందేతనంటే, యీ చెప్పులు తయారుజేసే వారిలో - బ్రాహ్మలూ - రాజపుత్రులూ - ఠాకూర్లూ - చర్మకారులూ- యాదవులూ- మహారాష్ట్రులూ - యిత్యాది వారంతా వున్నారు. వీరిలో డిగ్రీలు పుచ్చుకున్నవారూ, నిరానీరాయుళ్ళూ వున్నారు. హిందువులు - ముస్లిములు - బౌద్ధులు - క్రైస్తవులున్నారు. అయినా బాటా కంపెనీ, చర్మకార వ్యవస్థను తయారు చేయదు సరిగదా, ఆ వ్యవస్థను కూలదోయడానికే

దోహదం జేస్తుంది. వీరిలో ప్రతి వ్యక్తీ చెప్పులు తోసి, కుట్టి, మేకులు కొట్టి, వాటన్నిటినీ సమీకరించే వాడే కాని, వీరిలో ఏ వొక్కడూ చర్మకారుడు కాదు. చెప్పుల ఉత్పత్తికి చెందిన కులధర్మం, మనిషినించి యంత్రానికి బదిలీజేయబడింది. యంత్రసాయంతో కులం అదృశ్యమైంది." (డాంగే - చరిత్ర శోధక శక్తులు - పేజి 33)

"అస్పృశ్యుడు తన మచ్చను, ఫ్యాక్టరీలోనియంత్రం వొద్ద పోగొట్టుకుంటాడు. ఫ్యాక్టరీ పరిసరాల్లో భోజనానికి సంబంధించినంత వరకూ, అక్కడి క్యాంటీన్ అంటరానితనాన్ని నిర్మూలిస్తున్నట్టుగా వుంటుంది. అంతేగాదు; వొక్కోసారి అంతా కలిసి సమ్మె చేస్తారు; అంతా కలిసి పని ఆపివేస్తారు; కలిసి పోరాడతారు; కలిసి తుపాకులకీ లాఠీలకీ గురౌవుతారు. అంతా వొకే వొక్క మనిషిలా ఐక్యమవుతారు. వారంతా శ్రామికులు; వారిది శ్రామికవర్గం. ఈ విధంగా పాతవ్యవస్థకి చెందిన సమస్త చిహ్నాలూ, పాత ఆలోచనలూ కూలిపోతాయి; కులవ్యవస్థతో, దాని భావజాలంతో, అస్పృశ్యతతో పోరాడడానికి యిదీ మార్గం" అని డాంగే వంటి వారు సూచిస్తోన్నారు. (చరిత్ర శోధకశక్తులు - పేజి 33)

అయితే యిక్కడ వొక చిక్కు సమస్య వుంది. బాటా కంపెనీలో పనిజేసే బ్రాహ్మడూ, శూద్రుడూ, హరిజనుడూ, పనివేళల్లో అంతా కలిసి అక్కడే పని చేయవొచ్చు. కాని బైనందిన జీవితంలో, బ్రాహ్మడు - బ్రాహ్మణ కన్యనే; కమ్మ - కమ్మకన్యనే; రెడ్డి - రెడ్డిపిల్లనే; మాల - మాలపిల్లనే; మాదిగ - మాదిగపిల్లనే పెళ్ళాడు తున్నారుగాని, వేరే కులాలకి చెందిన వారిని వివాహం చేసుకోవడం లేదు! అంతేగాదు - బాటా కంపెనీలో పనిజేసే వైష్ణవుడు పంగనామాల్నీ, శైవుడు వీబూది రేఖల్నీ ధరిస్తో, ఎవడి కులమత ఆచార వ్యవహారాల్ని వాడే నిర్విఘ్నంగా కొనసాగిస్తోన్నాడు. గుడిపూడి జంగాల్లా జీవనోపాది కోసం వీరంతా ఫ్యాక్టరీలో జేరారేగాని, ఫ్యాక్టరీలోని సామూహిక జీవనం, వారి కుల-మత

విశ్వాసాల్లో, వారి ఆహార వ్యవహారాల్లో, వారి పెళ్ళి పేరంటాల్లో, వారి భావాల్లో, వారి ఆలోచనా ధోరణుల్లో ఏ విధమైన మార్పునూ తీసుక రావడం లేదు!

కుల వృత్తుల్ని కులధర్మాల్ని పెట్టుబడిదారీ విధానం నాశనం జేయ వొచ్చుగాక. కులవ్యవస్థలో విప్లవాన్ని తెచ్చే ఈ విధానంలో గూడా, కొన్ని కులాల హీనస్థితిని ఆసరాగా తీసుకొని, ఆ కులాలవారి కూలి రేట్లని తెగ్గోయడానికి ప్రయత్నం జరుగుతుంది. అంతేగాక ఉద్యోగ నియామకాల్లో, హక్కులూ హోదాల విషయంలో కులానికీ కులానికీ మధ్య అంతరమూ - వివక్ష చూపబడుతుంది.తరతరాలుగా అగ్రవర్ణాలుగా చలామణీ అయినవారూ, సామ్యవర్గాలకి చెందిన ముద్దుబిడ్డలూ, ఈ పెట్టు బడిదారీ వ్యవస్థలో సైతం పై ఉద్యోగాలు సంపాయించుకోవడానికి అవకాశ ముంటుంది. ఎంచేతనంటే, ఈ వ్యవస్థ గూడా తన భద్రత కోసం యీ కులవిభజనను యథాతథంగా వుంచడానికీ, కులమల వైషమ్యాల్ని బాగా రెచ్చగొట్టి తన పబ్బం గడుపు కోవడానికీ, నిరంతరం ప్రయత్నిస్తుంది!

బట్టల మిల్లులో అంటరానితనం

బొంబాయిలోని కొన్ని బట్టల మిల్లుల్లో విచిత్రమైన అస్పృశ్యత పాటించబడుతోంది. యీ బట్టల మిల్లులకి చెందిన నేతశాఖలో (Weaving department) పనిజేసే కార్మికులు, నూలు తెగినప్పుడు దాన్ని తమ పళ్ళ మధ్యన అదిమిపట్టి పట్టుకోవాలి. హరిజనులు యీపని చేస్తే బట్ట "మైల" పడిపోతుందనే భావంతో, నేతశాఖలో పనిజేయడానికి హరిజనుల్ని నియమించడం మానివేశారు! బొంబాయి బట్టలమిల్లు కార్మికులకి, వీరోచిత పోరాటాలు నిర్వహించిన 50 సంవత్సరాల చరిత్ర వున్నా యీ రకమైన అస్పృశ్యతను మిల్లులో పాటించగూడదని

వారు తమ డిమాండ్లలో పెట్టినా, నేటికీ యీ అంటరానితనం పాటించ బడుతోనే వుంది!

ఈ విధంగానే పూనాలోని కూరగాయల మార్కెట్లులోనూ, ప్రభుత్వ ధాన్య గిడ్డంగిలోనూ అస్పృశ్యత పాటించబడుతోంది! పూనా కూరగాయల మార్కెట్‌లోని కూరగాయల్నీ, గవర్నమెంట్ గోదాము ల్లోని ధాన్యాన్ని హరిజనులు తాకితే, అవి మైల పడతాయనే భావంతో, ఈ మార్కెట్‌లోనూ గోడౌన్‌లోనూ హరిజనుల్ని హమాలీలుగా నియ మించడానికి నిరాకరిస్తోన్నారు. అంచేత వీటిలో హరిజనేతరులు మాత్రమే పనిచేస్తోన్నారు! పూనాలోని కలప అడితిల్లో, రైల్వే యార్డుల్లో మాత్రమే హరిజనులు పనిచేస్తారు. వీటిలో రెక్కలు ముక్కలయ్యే గొడ్డుచాకిరీ జేసినా, వీరికిచ్చే కూలిమాత్రం చాలా స్వల్పమే. కుల నిర్మూలనకి అంకిత మైన సుప్రసిద్ధ సోషలిస్టు నాయకుని ఆధ్వర్యాన పూనా హమాలీ యూని యన్ నడపబడుతోన్నా, పూనాలోని కార్మిక సంఘాల్లో అస్పృశ్యత నేటికీ పాటింపబడుతోనే వుందని, గెయిల్ ఓమ్‌వెట్ రాశాడు.

"For the hamals and textile workers, caste is intimately a part of their work relations and opportunities to get work, not simply a matter of cultural degradation or inability to marry freely and socialize freely with other workers. And both examples which have continued in the presence of militant and secular leadership, show how deep rooted the aspect of caste is." (Gail Omved - Social Scientist - Page - 74 - 1978 June)

ఎంత చదువు చదువుకొన్నా
సొంత కులంలోనే పెళ్ళిళ్ళు

అమెరికా అత్యున్నత దశకి చేరిన పారిశ్రామిక దేశం. డాలర్లు సంపాదించి అమాంతం కొత్త ధనవంతులుగా మారడానికి ఇండియా

నుండి అనేకమంది డాక్టర్లు, ఇంజనీర్లు, టెక్నీషియన్లు, లెక్చరర్లు, నర్సులు యిత్యాది వారంతా మిడతల దండులా వలస పోతోన్నారు. అక్కడికి వెళ్ళి రెండు చేతులా సంపాయించి, జీవితంలో స్థిరపడ్డ తర్వాత వీరి వివాహాల కోసం తెలుగు - ఇంగ్లీషు - దిన పత్రికల్లో విచిత్రమైన ఎడ్వాటైజ్ మెంట్లు పడుతుంటాయి.

"జీవితంలో స్థిరపడి నెలకి వెయ్యి డాలర్లు సంపాదించే కమ్మ యువకునికి, గౌరవనీయమైన కుటుంబానికి చెందిన కమ్మయువతి కావలెను. జన్మ నక్షత్రమూ జాతక చక్రమూ పంపవలెను. వివరాలకి పోస్టుబాక్స్ నెం....." అలాగే, "ఆరువేల నియోగి శాఖకి చెందిన బ్రాహ్మణ యువకునికి, ఆరువేల నియోగి శాఖకి చెందిన బ్రాహ్మణ యువతి కావలెను. వివరాలకి..... పోస్టుబాక్స్ నెంబరుకి వ్రాయవలెను." "విదేశంలో ఉద్యోగం చేస్తున్న కాపు కులజునికి, అందమూ సంస్కారమూ కలిగిన కాపు యువతి కావలెను. పోస్టు బాక్స్ నెం .....కి వివరములు వ్రాయ వలెను." ఈ ప్రకటనలు ఏమి తెలియ జేస్తోన్నవి? పారిశ్రామికీకరణ గానీ, ఆధునిక జీవిత విధానం గానీ, కుల పరిధిని కించిత్తు సైతం నేటికీ దాటలేదు. ఫ్యాక్టరీలోని సామూహిక జీవన విధానం, కులాంతర వివాహాలకీ, కుల రహితమైన జీవిత విధానానికీ, ఏ మాత్రం దారితీయలేదు. అమెరికన్ పెట్టుబడిదారీ నాగరికత, అక్కడికి వెళ్ళిన మన విద్యాధికుల ఫ్యూడల్ మనస్తత్వాన్ని నాశనం చేయలేదు సరిగదా, నడమంత్రపు సిరితో మిడిసిపడే "అమెరికన్ నవాబుల్ని" సృష్టించడానికే దోహదంజేసింది.

కాఫీ హోటళ్ళలో బ్రాహ్మడు మొదలుకొని హరిజనుడు వరకూ, అంతా ప్రక్క-ప్రక్కనే కూర్చుని కాఫీ తాగుతున్నారు. భోజన హోటళ్ళలో అష్టాది వర్ణాలవారూ ప్రక్క ప్రక్కనే కూర్చుని భోంచేస్తున్నారు. అయినా కులవ్యవస్థ పోలేదు! సినిమాహాల్ బుకింగ్ వొద్ద అంతా తొక్కిసలాడుతో, వొక్కోసారి రద్దీ మెక్కువై నప్పుడు అంతా కలిసి పోలీసు

లచే విరగదన్నించు కొంచోన్నారు. సినిమా హాళ్ళ - క్లైళ్ళలో - బస్సుల్లో - అంతా రాసుకు పూసుకు తిరుగుతో, అన్ని కులాల వారూ కలిసి ప్రయాణం జేస్తోనే వున్నారు. అయినా ఎవరి కులం వారిదే! గవర్న మెంట్ ఆఫీసుల్లో, కృష్ణశాస్త్రి ప్రక్కనే ఏసుపాదం కూర్చున్నా, సుబ్రమణ్య శర్మ ప్రక్కనే డేనియల్ ప్రభాకర్ కూర్చున్నా, శ్రోత్రియ బ్రాహ్మడైన సత్యనారాయణ శాస్త్రి ప్రక్కన మ్లేచ్ఛుడైన అబ్దుల్ రహీం కూర్చున్నా, రామయ్య చౌదరి ప్రక్కనే హరిజన రామదాసు కూర్చున్నా, ఎవరి కుల-మతాల్ని ఎవరూ వొదిలి పెట్టలేదు! ఉదయం ఆఫీసుకు రాగానే, ఆఫీసర్ దేవదానానికి మాత్రం అంతాకలిసి నమస్కారంపెడుతోనేవున్నారు. ఆఫీస్ రొటీన్‌లో, ఈ నమస్కారం పెట్టడం గూడా వొక భాగమే!

గవర్నమెంట్ ఆఫీసుల్లో గుద్దులాటల్లు

సీనియారిటీ లిస్టులో ఎంతో కింద వున్న హరిజన రామదాసు, షెడ్యూల్ కులం పేరిట అలాగ్గా ఉద్యోగం సంపాదించి, పట్టుమని నాలు గేళ్ళు తిరక్కపోయినా, కమ్యూనల్ జి. వొ. రొటేషన్ ప్రకారం, శాస్త్రినీ శర్మనీ రెడ్డినీ చౌదరినీ, ఆఖరికి రాఘవరావునాయుణ్ణీ, అందర్నీ అధిగ మించి, లిస్టులో అంచరి నెత్తిమీద కెక్కాడనీ, సీనియర్ మోస్ట్ గుమా స్తాల కన్న ముందే ప్రమోషన్ సంపాయించాడనీ, అంతా కలిసి కారాలు మిరియాలు నూరుతో, పళ్ళు పట పట కొరుకుతోన్నారు! అంచేత, ఫ్యాక్టరీలోని సామూహిక జీవితమూ, క్లైళ్ళూ - బస్సులూ - హోటళ్ళూ - ప్రభుత్వ ఆఫీసుల్లో అమల్లో వున్న సమిష్టి జీవనమూ, నేటికీ ఈ కులవ్యవస్థ పునాదుల్ని గోరంత సైతం కదల్చలేదు సరిగదా, రాను రాను ఈ కుష్టు వ్యవస్థ బలపడుతో, రిజర్వేషన్లూ యిత్యాది వాటి పేరిట నేడు వెర్రితలలు సైతం వేస్తోంది.

మానవుడు చంద్ర మండలానికి పయనించిన యీ ఇరవయ్యో శతాబ్దంలో, వొక హరిజనుడు - తాను హరిజనుణ్ణని నిజం చెప్పితే, పట్ట

ణాల్లో నేటికీ అద్దె యిల్లు దొరకడం లేదంటే, ఈ దేశం యాటమిక్ యుగంలో వుందా - కాక ఆటవికదశలో వుందా అనే అనుమానం, ఇంగితజ్ఞానమున్న ప్రతివానికీ రాకమానదు. అంతదాకా యెందుకు?

కులాలవారిగా కాలేజీలు : కులాలవారిగా ఉద్యోగాలు

స్కూళ్ళూ కాలేజీలూ యూనివర్సిటీల్లో డాక్టర్లనీ ఇంజనీర్లనీ తయారుజేసే ప్రొఫెషనల్ కాలేజీల్లో, స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికలు జరిగినప్పుడు, బ్రాహ్మన్ - యాంటీ బ్రాహ్మన్ ; కమ్మ-యాంటీ కమ్మా; రాయలసీమ ప్రాంతాల్లో రెడ్డి - యాంటీ రెడ్డి; తెలంగాణా వీరియాలో రావు (బ్రాహ్మణ) - రెడ్డి - శత్రు ముఠాల్లా చీలిపోయి, కొట్ల కుక్కల్లా తన్నుకొని, ఊళ్ళోని రౌడీ గ్యాంగులకి డబ్బిచ్చి, రాగబోయించి, తలకాయిలు బద్దల గొట్టు కొంటోన్నారు! తత్ఫలితంగా విద్యాలయాలు, కీకాయి గూండాల క్రైర విహార కేంద్రాల్లా మారిపోయాయి! స్కూళ్ళు - కాలేజీలు - యూనివర్సిటీలు - ప్రైవేటు కంపెనీలు - పత్రికా కార్యాలయాలు - ఆలిండియా రేడియో కేంద్రాలు - గవర్నమెంట్ ఆఫీసులు - పంచాయితీ - కోఆపరేటివ్ - ఎసెంబ్లీలకీ జరిగే ఎన్నికలు - వేయేల సమస్త సాంఘిక జీవిత రంగాల్లో, కుల పిశాచి ప్రళయ భీకరంగా తాండవిస్తోంది. కమ్మ కాలేజీలో కమ్మవారికే; క్రైస్తవ కాలేజీలో క్రైస్తవులకే; బ్రాహ్మణకాలేజీలో బ్రాహ్మలకే; రెడ్డికాలేజీలో రెడ్లకే; ఉద్యోగాలివ్వడంలో అధికతర ప్రాధాన్య మివ్వబడుతోంది. చాకలి-మంగలి-గౌడ - మేదర - యిత్యాది కులాల వారికి స్కూళ్ళూ కాలేజీలూ పెట్టే ఆర్థిక స్థోమత లేదు గాబట్టి, వాళ్ళకి "సీతాపతీ - చిప్పేగతి."

అంచేత ఫ్యాక్టరీలోని సామూహిక జీవితమూ, బయట కన్పించే పైపై కలుపుగోలుతనమూ, కుల వ్యవస్థను మట్టుబెట్టగలవని తలచడం వాస్తవ విరుద్ధం; వొట్టి భ్రమ. కాబట్టి ఈ రొచ్చుగుంట సాంఘిక వ్యవస్థను సమూల విధ్వంసం గావించడానికి, దేశంలో బ్రహ్మాండమైన

సాంస్కృతిక పునర్వికాస మహోద్యమం రావాలి. దైవభావం పచ్చి అబద్ధమనీ, మతం-పచ్చి మోసమనీ, కులం - కుష్టురోగమనే ప్రచారం విస్తృతంగా జరగాలి. ఆనాడే, ఈ కులవ్యవస్థ పునాదుల్ని కూకటి వేళ్ళతో సైతం పెకలించి, ఈ కులనాగును దుంపనాశనం జేయడం సాధ్యమవుతుంది. అంతదాకా ఈ ఫ్యాక్టరీలోని జీవితాలూ, ఈ కలుపు గోలుతనాలూ, యీ అమెరికా యాత్రలూ, చేదు మాత్రపై వున్న పంచదార పూతలు గానే మిగిలిపోతాయి!

కులవ్యవస్థను అసహ్యించుకొంటున్నట్లు నటిస్తో, అభ్యుదయం గూర్చి తెగ కోతలు కోస్తో, గోడమీద పిల్లివాటంలా అంతర్నాటక మాడే ప్రబుద్ధులు నేడు అవతరించారు. వైదిక కర్మకాండలో కించిత్తు విశ్వాసం లేదని బాకాలూదేవారే, అర్ధరాత్రి మట్టెలచరువు లగ్గాలు పెట్టించి, మంత్ర తంత్రాల్తో తమ బిడ్డలకి పెళ్ళిళ్ళు జేయిస్తోన్నారు! అంధ విశ్వాసాలు ప్రమాదకరమని బాజాలు వాయించేవాడే, తమ పిల్లలకి ఒడుగు జేయించి జందేలు వేయిస్తోన్నారు. బయట - సాంఘిక అభ్యుదయం గూర్చి, తెగ బారెడు కోతలు. ఇంట్లో - అత్యంత జుగుప్సాకరమైన చేతలు. మాటల్లో-మధ్యందిన మార్తాండులైన వీరు, ఆచరణలో మాత్రం పచ్చి వదరు బోతులు. సాంఘిక ప్రగతి గూర్చి పెదవులపై తేనె లొలుకు పలుకులు. హృదయాల్లోమాత్రం వర్ణ దురహంకార జ్వాలలు. అగ్రవర్ణాల నించి దిగుమతై, వివిధ సంస్థల్లో అధినాయక స్థానాలాక్రమించిన ఈ ప్రబుద్ధులే, నేటి ఈ అధోగతికి ప్రధాన కారకులు. విద్యాధికులమని విర్రవీగే యీ పెద్దమనుషులకే శాస్త్రీయ పద్ధతిలో తిరిగి విద్య నేర్పాలి!

5-12-70 నాటి "ఆర్గనైజర్" పత్రికలో శ్రీ ప్రకాష్‌గారు "caste is good - Casteism is bad" అనే శీర్షికతో వొక వ్యాసం రాశారు. కులం మంచిదే - కాని - కులతత్వం చెడ్డది అనేదే వీరి వాదన.

కులం మంచిది - కాని కులతత్వమే చెడ్డది

చింతపండు మంచిదే - కాని - చింతపులుసు చెడ్డది,
నిమ్మకాయ మంచిదే - కాని - నిమ్మపులుసు చెడ్డది,
వేప ఆకు మంచిదే - కాని - వేపయిగురు చెడ్డది - అనే తర్కం, ఎంత సుందర ముదరష్టమైనదో, ఈ వాదన గూడా అంత బుద్ధి తక్కువైనదే. వస్తువు యొక్క లక్షణం, వస్తువులోనే అంతర్గతంగా, అవిభాజ్యంగా వుంటుందనే కనీస ఇంగితజ్ఞానం సైతంలేని వాదన యొక్క ఫలితమే. ఈ వ్యాస సారాంశం. చింతపండు లేకండా చింతపులుసు వుండనట్లే, కులం లేకండా కులతత్వమనేది వేరేగా వుండడానికి వీల్లేదు. అయితే యింత చిన్న విషయం తెలియకుండా, అమాయకత్వంతోనే శ్రీ ప్రకాష్ ఈ వాదన చేశారా? కాదు కాదు - ఇలాంటి "తర్క శాస్త్ర పాండిత్యం" తోనే, కంటికి కన్పించే వాస్తవిక జగత్తును నిరాకరించి, కంటికి కన్పించని-మరిదేనికీ అందని-పరబ్రహ్మని కల్పించి, ఆదిశంకరులవారు "జగన్మిథ్యా" సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు!

ఈ గండభేరుండ తర్కశాస్త్ర పాండితీ శౌండీర్యంతోనే యాజ్ఞవల్క్య "మహర్షి", జనకుని ఆస్థానంలో గార్గి యొక్క నోరు మూయించి "బ్రహ్మవాదాన్ని" నోటి బుకాయింపుతో నిరూపించాడు! ఈ దగుల్బాజీ తర్కంతోనే మనువుగారు వర్ణ వ్యవస్థనీ - శూద్ర పంచమ బానిసత్వాన్నీ-సమర్థించాడు. అంచేత, తరతరాలుగా ఈ సరికొత్త పాత తర్కాన్ని ఆసరా జేసుకొని, కులవ్యవస్థను సమర్థించ యత్నిస్తోన్న శ్రీ ప్రకాషుగారి తర్కకౌశల్యాన్ని చూసి, జనం బోర్లబొక్కలా పడి నమస్కరిస్తారని ఈయన భావిస్తోన్నాడా?! నంది అంటే నంది - పంది అంటే పంది -అని నమ్మే పాతకాలపు రోజులు పోయాయనీ, అరిగిపోయిన పాత గ్రామఫోన్ రికార్డు లాంటి ఈ కుతర్కంతో కాలసర్పం లాంటి కుల వ్యవస్థను సమర్థించడం అవివేకమనీ, నేటికైనా శ్రీ ప్రకాషూ, ఆయనలా ఆలో

చించేవారూ గుర్తించడం అన్ని విధాలా శ్రేయస్కరం! అయితే ఇలాంటి వాదనల ద్వారా, చేదు మాత్రలకి పంచదార పూత పూయడమూ, తేనె పూసిన కత్తితో గొంతులు కోయడమూ, హింసా పురోహిత వర్గానికి వెన్నతో పెట్టిన విద్యయే.

శంబుకుడు దగ్గర నుండి అంబేద్కర్ వరకు

శ్రీ ప్రకాష్ వాదిస్తోన్నట్లు, వృత్తి ప్రకారమే కులం ఏర్పడ్డం నిజమైతే, ద్రోణాచార్యులూ - కృపాచార్యులూ - అశ్వత్థామ - ఇత్యాది భారతం లోని "బ్రాహ్మలు," తమ కులవృత్తియైన బ్రాహ్మణ వృత్తినే అనుసరించారా? కాక ఆ బ్రాహ్మణ వృత్తికి సున్నా చుట్టారా? ద్రోణుని కులం - ఆతని గొప్పని బట్టి నిర్ణయించారా? కాక ఆతడు పుట్టిన దొప్పని (ద్రోణమును) బట్టి నిర్ణయించారా?

బ్రాహ్మలైన శాతవాహనులు తమ కులవృత్తిని విసర్జించి, రాజ్యా లెలా ఏలారు?

శూద్రులైన రెడ్డి - కమ్మ - వెలమలు, అగ్రవర్ణాలకి చాకిరీ జేసే తమ కులవృత్తిని విసర్జించి, ఆంధ్రదేశాన్ని ఎలా పాలించారు? ఈ శూద్ర ప్రభువులకి సలాం గొడుతో, వారి అడుగులకి మడుగు లొత్తిన పురోహిత వర్గ కవి - పండిత - మంత్రిసత్తములు, వారు విసిరిన ఉప్పు పులుసుల్ని ఏ విధంగా మేశారు?

నూటికి నూరుపాళ్ళు శూద్రుడైన రాజరాజనరేంద్రుడు, ఏవిధంగా చంద్రవంశపు క్షత్రియు డయ్యాడు?

పురోహితవర్గం రాసి - ప్రచారం జేసిందే పరమ సత్యమా?!

కులమతాల సంస్కృతి

కులాచారాలు - కులం కట్టుబాట్లు - కులంవెలి - కులంభాష - కులసాహిత్యం-కులసంస్కృతి-కులంఫిలాసఫీ - మాత్రమే మనకున్నాయి.

మనకున్న కులంభాష - సంస్కృతం. దానికి మరో పేరు దేవభాష. పంధొనిమిదవ శతాబ్దం వరకూ, శూద్ర - పంచములకి చెందిన ఎవ్వడూ ఈ దేవభాషను నేర్చుకోరాదనే పైశాచిక ఆంక్షలుండెవి. మనకున్న కులంఫిలాసఫీ - బ్రాహ్మణమతం. దానికి మరోపేరు - వేదాంతం. మనకున్న కుల చట్టం - మనుధర్మశాస్త్రం. ఇదే - వేల ఏళ్ళుగా మన భౌతిక మానసిక జీవితాన్ని నిర్దాక్షిణ్యంగా శాసిస్తో వొచ్చింది. "వేదం విన్న శూద్రుని చెవిలో సీసం కాసి పోయాలనీ, వేదమంత్రాలు ఉచ్చరించిన శూద్రుని నాలికను ముక్కలకింద కోయాలనీ, వేదమంత్రాలు జ్ఞాపకం పెట్టుకొన్న శూద్రుని దేహాన్ని కండకండలుగా నరకాలనీ" రాసిన గౌతమ ధర్మసూత్రాలు, యీ కుల చట్టాల్లో అంతర్భాగమే! ఈ కుల సంస్కృతికి చెందిన కలికితురాయి మాత్రమే! మనల్ని నరలోకంలో ఉద్ధరించి పరలోకానికి పంపడానికి, మనకి దేవుని ఏజెంట్లు వున్నారు. వారికి మరోపేరు భూదేవులు-లేదా - భూసురోత్తములు. "భూసురోత్తమ సేవజేసిన స్వర్గమే ప్రాప్తించురా" అని వీరే మన తాత ముత్తాతలకి తరతరాలుగా నూరి పోశారు. మాలకాకి - శూద్ర వెధవ - మూదిగ పీనుగ - వెర్రి గొల్ల లాంటి నానుడులూ, సాలినేత - మాలనేత - లాంటి సామెతలూ మన భాషలో మనకుండనే వున్నాయి. అంచేత మనది - జాతీయ సంస్కృతి - అనడం కన్న పచ్చిమోసం మరొహటి లేదు. వాస్తవానికి మనది కుల - మతాల సంస్కృతి.

సూర్యకాంతినీ, పీల్చే గాలినీ, ఈ కుల - మతాల సంస్కృతి విషపూరితం గావించింది. తరతరాల మానవ మేధస్సుకి మేకులు గొట్టిన యీ సంస్కృతి, భారత ప్రజల ప్రగతికి శిలువ వేసింది. వారి మేధో గోత్రాలితనానికి, యీ సంస్కృతి ఎంతగా హేతు భూతమైందో వివరించడానికి వందలాది పేజీలు కావాలి.

మధ్యయుగాలనాటి యూరప్‌లో కేథలిక్ మత గురువులు, "దైవ ద్రోహానికి" "మతద్రోహానికి" పాల్పడిన వారిని, ప్రత్యేకంగా

నాటి శాస్త్రవేత్తల్ని, ఇంక్విజిషన్ అనే "పవిత్ర" మత న్యాయస్థానంలో విచారించి, వారికి పరమ భీకరమైన శిక్షలు విధించేవారు. ఈ ఇంక్విజిషన్ సంస్థ సిగ్గుతో తలవొంచుకొనేంత కిరాతకంగా ఇండియాలో కులా చారాలు అమలు జేయబడ్డాయని కె. యం. పణిక్కర్ చెప్పాడు. (కేస్ట్ అండ్ డెమోక్రసి - నివ పేజి) అంచేతనే, "అత్యంత నిర్దాక్షిణ్యమైన అణచివేతకి వుపయోగపడే బ్రహ్మాండమైన సంస్థ" అని రవీంద్రనాధ టాగూర్ కులాన్ని గర్హించాడు. ("A gigantic system of cold - blooded repression.")

తపస్సు జేసుకొనే శూద్ర శంబుకుణ్ణి, రాముని కత్తికి బలిజేసింది - ఈ కులమే. శూద్రుడనే (సూతుడనే) నెపంతో కర్ణుణ్ణి నానా అవమానాల పాల్జేసింది - ఈ కులమే. ఏకలవ్యుని బొటనవేలును నరికివేయించింది - యీ కులమే. వీధుల్లో నడిచేప్పుడు, రొమ్ముకు ముంత - వీపుకు తాటాకు - వేలాడగట్టుక, ఆధునికయుగ ప్రారంభం వరకూ పంచముల్ని నడిపించింది ఈ కులమే. అంచేత, కులవ్యవస్థలో వోవేపు సాంఘిక - ఆర్థిక- దుస్థితీ, పరోవేపు అగ్రవర్ణాల నిరంకుశాధికారమూ, మనుషుల్ని చేల వీళ్ళుగా కాల్చుక తిన్నాయి. శ్రీ ప్రకాష్ వ్యాసాన్ని "ప్రభంజనం" పత్రికలో పరామర్శించిన శ్రీ యం.వి. రమణారెడ్డి ఈ విధంగా రాశాడు.

కూలిపోతున్న కులవ్యవస్థకి
జీవంపోస్తున్న ఆర్. యస్. యస్.

"జాతి నరనరాన్నీ నమిలివేస్తున్న కులాన్ని తిరిగి పునరుద్ధరించాలనే ఆర్. యస్. యస్. జనసంఘంల కోరికలో అంతరార్థమేమిటి? వర్ణాశ్రమధర్మాల పేరుతో అగ్రవర్ణాల ఆధిక్యం నెలకొల్పి, సనాతనాచారం పేరుతో తక్కువ కులాలైన వైశ్య - శూద్ర - పంచములను నిరంకుశంగా అణగదొక్కాలని కాదా?"

"రాజకీయాల్లో తమతో పాటున్న ఇతర కులాలవారిని, మోకొట్టి నిద్రపుచ్చకపోతే పథకమంతా చిన్నాభిన్నమవుతుంది. బ్రాహ్మణుల అధికారం కోసం శ్రమపడి నిర్మించుకొన్న జనసంఘం - ఆర్.యస్.యస్. వంటి సంస్థలు ఒక్కసారి కూలిపోతాయ్. 'మీమీద మేం పెత్తనం చేయడం న్యాయం. రండి చేస్తాం'- అంటే మానసికంగా బానిసైనవాడు తప్ప ఎవ్వడూ ఒప్పుకోడు. అధిక సంఖ్యాకులను బలవంతంగా కిందికి తోయడానికి, ప్రభుత్వం చేతిలో లేకుండా ఒక్కసారిగా సాధ్యంకాదు. అందుకే వర్ణాశ్రమ ధర్మాల్లోని నైచ్యాన్ని నిరంకుశత్వాన్ని మరుగుపరిచి, దాంట్లో ఏదో గొప్పతనం ఉందని చూపిస్తూ, ఆ వ్యవస్థ మంచిదనే ఉద్దేశం మెల్లిగా కలిగిస్తూ, తక్కువ కులాల సభ్యుల్లో యీ కులవ్యవస్థ నిర్మాణం పట్ల వ్యతిరేకత రాకుండా ముందు జాగ్రత్త పడాలి. మతం పేరుతో కూడగట్టి, సనాతనధర్మం పేరుతో శూద్రులకు - వైశ్యులకు - మత్తెక్కిస్తూ, అధికారాన్ని హస్తగతం చేసుకొంటే, ఆ తరువాత వర్ణాధిక్యత స్థాపించటం చిటికెలో పని. ఒక్క కలంపోటు చాలు. ఈ కిటుకు అగ్రనాయక బ్రాహ్మణేతరులు పసిగట్టినందువల్లే, జనసంఘంలో చీలికలు పొడసూపుతున్నాయి."

వీరికి చెందిన చాలామందికి "సనాతనధర్మం, హిందూ సంస్కృతి వంటి కొన్ని పైపై పదాలు అర్థం తెలీకుండా వాడటంతప్ప, ఆ ధర్మాల లోతుగానీ, సంస్కృతి అంటే ఏమిటనిగానీ, వారి మతం ఎత్తిన అవతారాలుగానీ తెలుసుకొనే అవసరమే వున్నట్లు కనపడదు. గుడ్డి విశ్వాసంతో నడిచే గొర్రెలమంద వున్నప్పుడు - తీసిందేబాట."

"కాబట్టి ఇదంతా బూటకమనీ, జనసంఘం - ఆర్. యస్. యస్. ద్వారా అగ్రవర్ణాలవారు తిరిగి తమ పైశాచిక అధికారం ఇతరులపై నెలకొల్పటానికి జాతీయత అనీ - మతమనీ - సంస్కృతి అనీ - ముసుగులు తొడిగి ముందుకు వస్తున్నారని, ఈ నినాదాల చాటున మెల్లగా

ఇప్పుడిప్పుడు అసలు మత్తు ఎక్కించటానికి చేసే ప్రయత్నాలలో వీరంగు బయటపడుతూందని, ఆలోచించగలిగిన ప్రతివాడూ సులభంగా గ్రహించవచ్చు." (యం. వి. రమణారెడ్డి - ప్రభంజనం పత్రిక - 1-2-1971)

కులవ్యవస్థను కూకటివేళ్ళతో నిర్మూలించాలి

"ఆ రోజుల్లో (1925 లో) ప్రజ్వరిల్లిన పచ్చి హిందూమతోన్మాదం యొక్క శిఖరే - ఈ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం అన్నమాటను, చారిత్రక సత్యంపట్ల అభిమానమున్న వారెవరూ కాదనలేరు. ఆనాటినుండి హిందూ మతోన్మాదుల సంఘంగా, ఆర్.యస్.యస్. ప్రఖ్యాతి గాంచింది. అప్పటినుండి మైనారిటీ మతాలవారిపై ననేగాక, వారిలాగా మతోన్మాదం లేకుండా సెక్యులర్ దృష్టి గల హిందువులపై గూడా అనేకసార్లు మతోన్మాదంతో యీ సంస్థ దాడి జేసింది. మహాత్మాగాంధి సైతం వీరి మతోన్మాదానికే బలైనాడు. ఆర్. యస్. యస్. కు రెండవనాయకుడూ - ఆర్గనైజరూ అయిన గురు గోల్వాల్కర్, "హిందూ రాష్ట్ర" అనే నినాదాన్ని యివ్వడమేగాక, వర్ణాశ్రమ వ్యవస్థకి గట్టి సంరక్షకుడుగా ముందు కొచ్చాడు."

"జాతీయభావం ఏర్పడాలంటే మొట్టమొదట జరగవలసింది, సెక్యులరిజానికి విధేయతను కలిగివుండడమే. అంటే - ప్రభుత్వాన్నుండి, రాజకీయాల నుండి, మతాన్ని పూర్తిగా వేరుచేయడం."

"శతాబ్దాల తరబడిగా హిందూ సమాజంలో వున్న కులవ్యవస్థను, కూకటి వేళ్ళతో నిర్మూలించడం గూడా సెక్యులరిజం కిందకే వస్తుంది. సమాజాన్ని అగ్ర - అధమ - కులాలుగా విభజించి వుంచడమంటే, వర్ణాశ్రమ ధర్మాన్ని కొనసాగించడమే కాగలదు. కాని ఈ వర్ణాశ్రమ ధర్మాన్ని ఆర్.యస్.యస్. యొక్క అధిపతియైన గురు గోల్వాల్కర్ పూర్తిగా సమర్థించాడు. సమాజంలో యీ వర్ణాశ్రమధర్మాన్ని పాటించడ

మంచే, ఇండియాకి ముప్పుతేవడమే కాగలదు. ఆధునిక సెక్యులర్ సమాజం అభివృద్ధి చెందడానికి యీ వర్ణాశ్రమధర్మం పెద్ద అవరోధం."
(నంబూద్రిపాద్ - "దేశసమైక్యతకు చిచ్చుపెట్టే ఆర్. యస్. యస్. - ప్రజాశక్తి - 25-3-1979)

"ఆర్. యస్. యస్. స్థాపించకోరేది హిందూరాజ్యమే కాదు - బ్రాహ్మణరాజ్యం - కూడా అని చెబుతూ, ఆయన యీ సందర్భంలో సర్దార్ వల్లభాయిపటేల్, గాంధీజీ, జయప్రకాశ్ నారాయణ్‌లను ఉటంకించారు. "రాజకీయ స్మృతులు" అనే పేరుతో డాక్టర్ యస్. బి. ఖరే రాసిన ఆత్మకథ నుంచి ఉటంకిస్తూ, "గాంధీని చపడంతోనే తృప్తిపడని వర్గమొకటి యీ దేశంలో వుంది. దీన్ని ఎవరికైనా రుజువు చేయడానికి సిద్ధంగా వున్నాను. హిందూ రాజ్యాన్ని మాత్రమేకాక బ్రాహ్మణ రాజ్యాన్నే వారు స్థాపించ గోరుతున్నారని నా అభిప్రాయం. కనుక యీ ఉద్దేశాలున్నవారిని కటకటాల వెనక ఉంచడం మనందరి పవిత్ర కర్తవ్యం" అని సర్దార్ పటేల్ అన్నారంటూ శ్రీ రాజ్‌నారాయణ్ గోష్టిని ముగించారు." (ఈనాడు - 16-5-79)

"సిక్కులూ - జైనులూ - బౌద్ధులూ - వీరంతా హిందువులేననీ, అగ్ర - అధమ - కులాలనేవి అసలు సమస్య కానేకాదనీ, ఏ కులానికి చెందినా సంస్కారం (?) అవసరమనీ, ఆర్. యస్. యస్ - దాని రాజకీయ విభాగమైన జనసంఘమూ చెబుతున్నాయి. కులమనేది కేవలం కల్పిత భూతమనీ, బద్ధశత్రువైన పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించడానికీ, ప్రధాన సమస్యను పక్కదార్లుపట్టించడానికే, బూర్జువావర్గంచే డెలిబరేట్‌గా సృష్టించబడిన అంశమనీ, కొంచరు వాదిస్తారు. కాని యీ రెండు ఓవర్ సింప్లిఫికేషన్లూ, కులవ్యవస్థకు జవాబు కానేకావు."
(Caste and privilege - Dr. Prabhakar Machwe - Mirror monthly - 1978 June)

ఆర్. యస్. యస్. - జనసంఘమూ కులవ్యవస్థకి మసిపూసి మారేడుకాయ జేసి, అతి తెలివితో వాస్తవాల్ని తల్లకిందులు జేయచానికి ఎంతగా ప్రయత్నించినా, భారతీయ సమాజం - ప్రత్యేకంగా హిందూ సంఘం - కులం మహమ్మారిచే నేటికీ పీడింపబడుతుండడం-నగ్నసత్యం! మానవులంతా సమానంగానే జన్మించారనీ, తమ జీవితాల్ని బాగుపరుచు కోవడానికి అందరికీ సమాన అవకాశాలుండాలనే అంశం - బూర్జువా డెమోక్రసీకి చెందిన వొక విశ్వాసం మాత్రమే. భారత రాజ్యాంగంలో యీ రకమైన చిలకపలుకులు కోకొల్లలుగా కన్పిస్తాయి. ఈ సమాన అవకాశాల్ని కులం కుష్టుతో కుళ్ళిన యీ అసమాన సమాజంలో ఏ విధంగా అమలుజేయాలి - అనేదే - నేడు మౌలికమైన సమస్య. అంచేతనే కాబోలు, "హిందూమతమూ ప్రజాతంత్రమూ వొకదాని సరసన మరొహటి మనలేవు" అని అంబేడ్కర్ అన్నాడు.
(Hinduism and democracy can not go to - gether.)

కులం పిరమిడ్ అధోభాగాన వున్న హరిజనులు తరతరాలుగా ఈ పిరమిడ్ పునాదిగా తయారై, యావత్ సమాజ భారాన్నీ గతిలేక మోయడమూ, వీరి భుజాలపై నిల్చున్న శూద్రులు, అనేక రకాలైన పనులు చేయడమూ, ఈపిరమిడ్ అగ్రభాగాన అధిష్ఠించిన బ్రాహ్మలు, అందరిపై అత్తపెత్తనం చలాయించడమూ - యిదే - కులవ్యవస్థ సారాంశం. అంచెలంచెలుగా వుండే ఈ కులం పిరమిడ్ లాంటిది - నిజంగా అసాధారణమైంది. ప్రాచీన ప్రపంచ చరిత్రకి చెందిన ఏ దేశంలోనూ, యిలాంటి అమానుష వ్యవస్థ లేనేలేదు. వైదికార్యుల ఈవిల్ జీనియస్‌కి, ఈ వ్యవస్థయే ఎదురులేని సాక్ష్యం. యీ కులం పిరమిడ్‌ను అధిరోహించిన కొద్దీ, (అధిరోహణ) గౌరవమర్యాదలు అధికమవుతాయి. యీ పిరమిడ్ నించి కిందికి దిగిన కొద్దీ, (అవరోహణ) అవమాన

పరంపరలు మితిమీరుతాయి! యీ అధిరోహణ - అవరోహణల - మూల సారాంశమే - కులవ్యవస్థ పరమార్థం!

కులవ్యవస్థ హిందూమతానికి పునాది. కులం పిరమిడ్‌కి బేస్‌గా (Base) వున్న కోట్లాది పంచములు, నేలా నింగీ కదిలేట్లు ప్రళయ భీకరంగా వొక్కసారి తమ భుజాల్ని ఊపితే ఏమవుతుంది?! యావత్ హిందూ సంఘమూ గజగజలాడి ఆమాంతం కుప్పకూలిపోదా? ఈ వ్యవస్థ కూలిపోయినప్పుడు, యీ కులం పిరమిడ్ శిఖరాగ్రాన కూర్చున్నవారు అత్యంత దారుణంగా బాధపడ్తారు. మిగతావారు తీవ్రంగా గాయపడ్తారు. అంచేతనే, వేల సంవత్సరాల తర్వాత గూడా, ప్రపంచంలో యిన్ని సాంఘిక - వైజ్ఞానిక - సాంస్కృతిక - పరిణామాలు వొచ్చిన తర్వాత గూడా, చివరికి మానవుడు చంద్రమండలానికి వెళ్ళి తిరిగి వొచ్చిన తర్వాత గూడా, ఇండియాలోని అధిక సంఖ్యాకులు ఈ కుల వ్యవస్థను పట్టుక నేటికీ గబ్బిలాల్లా వేలాడుతోనే వున్నారు! గోకర్ణ గజకర్ణ ఠక్కుర తమార విద్యల్తో, రకరకాల అతితెలివి వాదనల్తో, యీ వ్యవస్థ ప్రయోజనాన్ని నేటికీ జనానికి వివరించ ప్రయత్నిస్తోనే వున్నారు! యీ వ్యవస్థ కుప్పకూలిపోవడాన్ని, వారు నేటికీ వ్యతిరేకిస్తోనే వున్నారు. అంచేతనే, ఈ పిరమిడ్ అధోభాగాన వున్న పంచములు, యీ కులాన్ని కలికంలోకి కూడా దొరక్కుండా నాశనం జేయడానికి సిద్ధమైతే, అట్టి ప్రయత్నాన్ని పాలకవర్గాలుగా వున్న అగ్రకులాలవారు తమ సమస్త శక్తులూ వినియోగించి తప్పక ప్రతిఘటిస్తారు. ఆ విధంగా గతచరిత్రలో ప్రతి ఘటించి, కులవ్యవస్థపై తిరగబడిన చార్వాకుల్ని బూడిద పాల్జేశారు.

హిందూమతం యిన్నివేల సంవత్సరాలు ఎలా బతికింది? యీ మతాన్ని ప్రధానంగా బతికించ గల్గింది - కులమే. కులం లేని హిందువు ఇండియాలో లేనే లేడు. ఛస్తే కన్పించడు! కులాన్ని మైనస్ జేస్తే హిందూమతం కుక్కచావు చస్తుంది. హిందూమతానికి పునాది

రాయితైన యీ కులాన్ని నాశనం జేస్తే, దేశం నలుమూలలా వున్న జగద్గురువులూ వారి శిష్యులూ సహిస్తారా? భారత పీడిత ప్రజలే యీ ప్రశ్నకి అంతిమంగా జవాబివ్వవలసినవారు!

హిందూ మతమంటే ఏమిటి?

అంచేత కులవ్యవస్థకి మూలం హిందూమతమే. హిందూమత మంటే ఏమిటి?

వేదాలు - ఉపనిషత్తులు - పురాణాలు - ధర్మశాస్త్రాలు - వీటికి అర్థతాత్పర్య సహితంగా సొంత వ్యాఖ్యానాలు జెప్పే ఋషులు - వారి జుంటేలు - మడి మైలలు - కులం కట్టుబాట్లు - కులనిషేధాలు - పూర్ఛానికి అసాధ్యమైన ఆచార వ్యవహారాలు - జీవచ్ఛవాల్లాంటి ఆలవాట్లు సాంప్రదాయాలు - అడ్డబొట్లు నిలువుబొట్లు - వాటికి చెందిన కట్టుకథలు - కర్మ - పూర్వజన్మ పునర్జన్మలు - పాపపుణ్యాలు - స్వర్గ నరకాలు - జగత్ మిథ్యా సిద్ధాంతం - 33 కోట్లమంది దేవతలు - లింగపూజలు - దొంగపూజలు - చెట్టుకీ పుట్టకీ పూజా పునస్కారాలు - వ్రతాలు - నోములు - అంధవిశ్వాసాలు - పుట్టిన దగ్గరనించి చచ్చేంత దాకా కర్మకాండలు - దినాలు - తద్దినాలు - శకునాలు - జ్యోతిష్యం - హస్త సాముద్రికం - దెయ్యాలు - భూతాలు - మంత్ర తంత్రాలు - చాతబళ్ళు - ఎర్రనీళ్ళు - జగద్గురువులు - వారి పీఠాలు - స్వామీజీలు - వారి శిష్యులు - బాబాలు - అమ్మలు - వారి వారి రంకు ఆశ్రమాలు - లక్షలాది గుళ్ళు - ఈ గుళ్ళ ఆదాయాన్ని పనీపాటా లేకుండా భోంచేసే లక్షోపలక్షల పూజార్లు - యివన్నీ కలిసిన పంచకూళ్ళ కషాయమే - మన హిందూమతం! "స్వల్ప సంఖ్యలో వున్న హిందూ పురోహితవర్గం, అత్యధిక సంఖ్యాకుల ఆలోచనా విధానాన్ని అదుపులో పెట్టిందనీ, మతాన్ని నల్లమందుగా ఎక్కడైనా సామాన్య ప్రజల కొరకు వాడివుంటే, అది -

ఇండియాలోనే జరిగిందనీ, భారత ప్రభుత్వంచే నియమించబడిన మండల్ కమిషన్ యిటీవల వెలువరించిన తన నివేదికలో పేర్కొన్నది.

హిందూమతమూ - హిందూ ధర్మమూ నానాటికీ అడుగంటు తోన్నాయనీ, కూడూ గుడ్డా యిల్లూ చాకిరీ యిత్యాది క్షుద్రమైన భౌతిక వాంఛలకి బానిసలైన విషయలంపటులు దేశంలో విపరీతంగా పెరిగి పోతోన్నారనీ, ఆధ్యాత్మిక చింతనకి ప్రధాన కేంద్రమైన యీ పవిత్ర హిందూదేశంలో (భారతదేశం కాదు!) హేతువాదం - నాస్తికత్వం - భౌతికవాదం - హద్దులు మీరుతున్నాయనీ వ్యధజెందిన పితాధిపతులంతా "భగవన్నిర్మితమైన మంగళప్రదమైన దివ్యసంస్కృతిని, సర్వోన్నతమైన హిందూ ధర్మాన్ని" కాపాడేందుకు నేడు గోసీలు బిగించి సంఘటిత పడు తున్నారు. గుత్త వ్యాపారుల - కళ్లీలేని భూస్వాముల - ధనిక వైతుల - అభం శుభం తెలియని చిల్లరకొట్టు వర్తకుల - అండదండల్తో, హిందూ ధర్మ సంస్థాపనకోసం వీరు దీక్ష బూనుతున్నారు. పాత సిద్ధాంతాల సారాన్ని బాగా పిండి వడగట్టి, కొత్త సీసాల్లో పట్టి, హిందూధర్మం పేరిట నరపీడన సమర్థించే పురోహితవర్గ పెనువేపవిత్తుల వెనక దేశంలోని కొందరు కువేరులు నేడు జేరుతోన్నారు. తరతరాలుగా పాలక - పురోహిత వర్గాలు, దిక్కూ మొక్కూలేని సామాన్య ప్రజల్ని దుభ్యపెట్టి, మాటువేసి కాటువేసేందుకి వాడిన తుప్పు పట్టిన ఆయుధాలే, కర్మసిద్ధాంతం - నొసటి రాత - పూర్వజన్మ - వైవభక్తి - యిత్యాదులు. ఎందుకూ కొరగాని యీ పాత సిద్ధాంతాలకి పసందుగా ముస్తాబుజేసి, లేబల్స్ మార్చి, సూడో సైంటిఫిక్ పదజాలంతో నూత్న "ఆధ్యాత్మిక జ్ఞానోదయం" కలగ జేసేందుకు నేడు వీరు శతథా యత్నిస్తోన్నారు.

ప్రాచీన హిందూ సంస్కృతీ పునరుజ్జీవనం ద్వారా, వీరు సాధించ దలచిన దేమిటి? మనుధర్మశాస్త్రం కాలం నాటికి అత్యంత "విజయ వంతంగా" తిరోగమించడం ద్వారా అగ్ర - అధమ - వర్ణాల పునరుద్ధ

రణకి నేరుగా రహదారి వేయడమే, వీరి ప్రధానోద్దేశం. ఇంతకీ వీరు చెప్ప దలచుకొన్న పరమ సత్యం ఏమిటి? కూడూ గుడ్డల కోసం పాకులాడ వొద్దు. ఎందుకంటే, ఇహలోక సుఖాలు వ్యర్థం! ఈ జన్మలో బాధలనుభ విస్తే, వొచ్చే జన్మలో తప్పకుండా సుఖాలనుభవిస్తావు. కూటికోసం తిరగ బడ్డం మహాపాపం. ఆ పాప ఫలితమే - నరకం. అంచేత, ఉన్నదాంతోనే తృప్తిచెందు. లేనిదాని కోసం పాకులాడకు. దేవుడు అంతే యిచ్చాడు. దాంతోనే తృప్తిపడు. కోరికల్లేకుండా కాలం వెళ్ళబుచ్చు. ఆకలేస్తే కేక లేయకుండా, కడుపులో కాళ్ళుచెట్టుక రాంభజన చెయ్యి. నీ కర్మ యింతే - నీ నొసటి రాతని ఎవ్వడూ తప్పించలేడు - అంటూ - సిగ్గూ శెరమూ లేని "మహోజ్వల ఆధ్యాత్మిక సత్యాల్ని" మేకతోలు కప్పుకొన్న యీ పెద్ద పులులు బోధించడానికి నేడు సిద్ధమయ్యారు.

పూర్వజన్మలో చేసిన పాపాలకి, యీ జన్మలో అనుభవించే భయంకర బాధలే ఫలితాలని కర్మసిద్ధాంతం చెబుతుంది. కాబట్టి దారిద్ర్యానికి మూలకారణం - నేటి ఆర్థిక విధానంలోని దోపిడీ మాత్రం కాదు! కష్ట జీవుల దరిద్రానికి తప్పు - ఎవ్వరిదీ గాదు - వారిదే! పూర్వజన్మలో చేసిన పాపాలే, నేటి వారి దుస్థితికీ - దుర్గతికీ - ఏకైక కారణం! ఎవరు జేసిన కర్మ, వారనుభవించకుండా ఎవరికైనా తప్పదు. ఇదే - కర్మ సిద్ధాంత సారాంశం. నిరుపేదల్ని తమ నిరంకుశ పిడికిలిలో బిగించి, వారిని మరింత కిరాతకంగా దోచుకునేందుకు యీ బూటకపు కర్మ సిద్ధాంతాన్ని వీరు నేటికీ ప్రచారం జేస్తోనే వున్నారు.

పిల్లికీ - బిచ్చానికీ, పూర్వజన్మకర్మ - నొసటిరాత - అదృష్టం - నసీబ్ - భగవన్నిర్ణయం - అని అనుకున్నంత వరకూ, మంత్రగబ్బల్లాంటి మన జీవిత సమస్యలు ఏ మాత్రం పరిష్కారం కావు. ఈ నొసటిరాత - యీ నసీబ్ - యీ దైవ నిర్ణయం - లాంటివి కష్టజీవుల సమస్యలకిచ్చే పరిష్కారం ఏమీ లేకపోగా, వారిని చైతన్య రహితులుగా - మూఢ మత

విశ్వాసాల చేతుల్లో కీలుబొమ్మలుగా - దోపిడీని బేషరతుగా అంగీకరించే వాజమ్మలుగా - నిరాశాజీవులుగా తయారు జేసేందుకే ఖచ్చితంగా తోడ్పడతాయి. అలా గతంలో తోడ్పడ్డాయి - అనేందుకు - వేల సంవత్సరాల ప్రాచీన భారత చరిత్రయే తిరుగులేని నిదర్శనం. శివుని ఆజ్ఞ లేందే చీమైనా కుట్టదు - అనే మనస్తత్వం వెనక, ఎంతటి నిష్క్రియా పరత్వం - ఎంతటి మానసిక దివాళాకోరుతనం - ఎంతటి బానిసభావం - ముసురుకొన్నవో స్పష్టం. ఈ బానిస భావాలన్నీ, మనిషిని మట్టిబెడ్డలా- విధి చేతిలోని కీలుబొమ్మలా - వెధవలా - నాపలా - మార్చేందుకు గతంలో తోడ్పడ్డాయి. ఇప్పుడూ తోడ్పడుతున్నాయి. అంచేత, సామాన్య ప్రజల మెదళ్ళ చుట్టూ జైళ్ళు నిర్మించిన ఈ బానిస భావాల్ని ఎంత త్వరగా నాశనం చేస్తే, మానవ జీవిత ప్రగతికి అంత మంచిది.


కాలే కడుపుతో, చింపిరి పాతలైనా గతిలేక, పందుల గూడేల కన్న నికృష్టమైన కొంపల్లో వుంటూ, ఎండా వానలకీ - రోగం రొష్టులకీ - ఆహుతై పోతోన్న కోట్లాది ప్రజలకి, దైవభక్తి - సనాతన ధర్మం - గీతా పారాయణం - రుషులు - వేదాలు - యిత్యాది బోధలు చేసి, వారి కడుపులు యింకా మాడ్చి యత్నించడం, ఈ దేశ క్షేమానికే మహోప ద్రవకరమని యిప్పటికైనా వీరు గుర్తించడం శ్రేయస్కరం.

హిందూ సంస్కృతీ పునరుజ్జీవనం పేరిట, అంధమత విశ్వాసాలూ- అర్థం చెల్లిన ఆచారాలూ - వేదమంత్ర పారాయణాలూ - తిరిగి మొగ్గ తొడుగుతున్నాయి. ఈ తిరోగమనానికి ప్రధానంగా నేటి రేడియో, కొన్ని పత్రికలూ, కొన్ని సంస్థలూ, కొందరు ఘరానా పెద్దలూ ఆసరా యిస్తు న్నారు. అమాయక ప్రజల అంధ విశ్వాసాల్ని, కులమత భేదాల్ని, కొందరు నాయకమ్మన్యులు తమ స్వార్థ సంకుచిత ప్రయోజనాల సాధనకు వాడుకొంటున్నారు. ఈ ప్రమాదకరమైన ధోరణుల్ని దెబ్బ తీయకపోతే,

మతాధిపతులకీ - మతాధిపతులకీ చేజేతులా దేశాన్ని సమీప భవిష్యత్తులోనే అప్పగించవలసి వొస్తుంది. ఆనాడు సాంఘిక - సాంస్కృతిక - చైతన్యం మొలబంటి లోతు దాకా పూడ్చబడుతుంది. అంచేత యీ ఫాసిస్ట్ ధోరణుల్ని గూర్చి ప్రతి హేతువాదీ - ప్రతి ప్రజాతంత్రవాదీ - ప్రతి అభ్యుదయవాదీ తీవ్రంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

వైజ్ఞానిక దృష్టికి బదులు అంధమత విశ్వాసం, హేతుబద్ధమైన ఆచరణకి బదులు నిర్జీవ కర్మకాండ, మానవ సహజమైన జిజ్ఞాసకి బదులు గొర్రెదాటుడు తత్వం, భావ స్వాతంత్ర్య రాహిత్యం, అవినీతి, నైతిక విశృంఖలత్వం, దేశంలో పైశాచిక తాండవం జేస్తున్నాయి.

మధ్యయుగాల్లోకి మళ్ళీ వెళ్ళి మనం జీవిస్తున్నామా - అనేంతటి తీవ్రమైన సందేహం నేడు కలుగుతోంది. వీరేశలింగం, గురజాడ అప్పారావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, త్రిపురనేని రామస్వామి, తాపీ ధర్మారావు యిత్యాది మహామహులు రాత్రింబవళ్ళు శ్రమించి వ్యాప్తిలోకి తెచ్చిన హేతుబద్ధమైన చింతన, కలికానికి గూడా కనపడకుండా కనుమరుగవుతోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల మధ్య జీవిస్తున్న మనకు, మానవత - హేతుబద్ధమైన ఆలోచన - ప్రాతిపదికగా, అత్యంత శక్తివంతమైన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం నేడు అవసరం.


సుందరయ్య గ్రంథాలయ
A C No. 74,730
హైదరాబాద్-500

రిఫరెన్స్ పత్రికలు

1. Social Scientist (1977 November)
2. The Age of Atheism (Jaya Gopal - Visakhapatnam)
3. Nastika Yugam (Jaya Gopal)
4. Perspective Monthly
5. Free Thought Monthly
6. Eenadu Daily

రిఫరెన్స్ గ్రంథాలు

1. Rural India in Transition - Douglas Ensminger
2. Caste and Class in India - D. N. Ghurye
3. The Politics of Cultural Nationalism in South India - Marguerite Ross Barnett
4. Annihilation of Caste - Dr. Ambedkar
5. Gandhi and Gandhism - Dr. Ambedkar
6. Caste and Democracy - K. M. Panikkar

BCi

BL

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	PJSB102B135
పుస్తకం పేరు	ఆధునిక రసాయనంలో ...
తారీఖు	29 April 2025
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	